అందుకోండి
అచ్చతెలుగు వైకుంఠపాళి

తొలి సంచిక

తెలుగు వెలుగు

అ

తొలకరి సందళ్లకు మొలకేసిన పొలాలు...
సిరులొసగిన దేవుళ్లకు కానుకగా బోనాలు

తెలుగు వెలుగు కోసం...

అమ్మభాష ఎంతో తియ్యన. అది ప్రేమ చెమ్మ తగిలిన రుచులూరే గోరుముద్దల బువ్వ. తేనెకన్నా జున్నుకన్నా కలకండకన్నా మధురమైనదని విదేశీయులు సైతం ప్రస్తుతించిన తెలుగు, నేడు వన్నె తరిగి మన్నన కొరవడి చిన్నబోతుండటం భాషాభిమానులందరినీ ఖిన్నుల్ని చేస్తోంది. 'తెలుగదేలయన్న దేశంబు తెలుగు' అంటూ ఒకప్పుడు కైమోడ్పులందుకున్న భాషకు సేద తీర్చి సాంత్వన కూర్చి గత ప్రాభవ పునరుద్ధరణకు శాయశక్తులా పాటుపడటం మన తక్షణ కర్తవ్యం. కదలబారుతున్న భాషా పునాదులను గట్టి పరచి, మకరందాల ఊటను రేపటితరాలు కోల్పోకుండా చూసేందుకు- తెలుగువారి ఇంటింటి ఆత్మబంధువు 'ఈనాడు' నిష్ఠగా చేపట్టిన నిబద్ధ కృషి 'తెలుగు వెలుగు'.

'మరో జన్మంటూ ఉంటే మళ్లీ తెలుగు మాతృభాషగా కావాలి, ఉండాలి' అని కోరుకున్నారు రాయప్రోలువారు. ఆ రుచి తెలియక, అంతటి అనురక్తి లేక నేటితరం విద్యార్థుల్లో అత్యధికులు మాతృభాషలో రాయలేని, పట్టుమని పది వాక్యాలు మాట్లాడలేని దుస్థితిలోకి కూరుకుపోతున్నారు. ఇళ్లలో అమ్మ, నాన్న పిలుపులే కాదు- అత్తయ్య, బాబాయి, మావయ్య, పెదనాన్నలాంటి వరసలూ వినిపించడం లేదు. ఈ దుస్థితికి తెలుగు వర్ణమాల బిత్తరపోతోంది! మాతృభాషలో ప్రాథమిక విద్య నేర్వని ఏ పిల్లవాడైనా మేధావిగా ఎదగలేడన్నది ప్రామాణిక సత్యం. ఈ యథార్థాన్నీ గ్రహించలేని స్థితికి తల్లిదండ్రుల్ని నెట్టుకుపోతున్న సంక్లిష్ట వాతావరణంలో తెలుగు జిలుగులు విరజిమ్మేందుకు దోహదపడటం- ఏటికి ఎదురీత, కత్తి మీద సాము. అలాగని తటపటాయించడానికి, చేతులు కట్టుకు కూర్చోవడానికి ఇక ఎంతమాత్రం వీల్లేదు. మన భాషను సంస్కృతిని నిలబెట్టుకోవడంలో నిర్లక్ష్యం, జాప్యం, అలసత్వం- తెలుగు జాతి ఉనికికీ మనికికీ పెను ప్రమాదం.

ఆరులక్షల పదాలున్న తెలుగు, తమిళం వంటివి రెండున్నర లక్షల పదాలు కలిగిన ఆంగ్లంకంటే సంపన్న భాషలనేవారు రామ్‌మనోహర్ లోహియా. కేవలం వాడుకలో లేకపోవడంవల్లే మన మాటలు, భాషలు వెనకబడుతున్నాయన్నది ఆయన ఫిర్యాదు. కొన్నేళ్ళుగా ఈ పతనవేగం పెరగడం చూస్తూనే ఉన్నాం. ఆ జోరుకు అడ్డుకట్ట వేయడమే 'తెలుగు వెలుగు' తొలి లక్ష్యం.

కర్ణాటక, మహారాష్ట్రలకన్నా ముందే స్వభాషా ఉద్యమం మొగ్గతొడిగిన గడ్డ ఇది. నాటి ఉద్యమ స్ఫూర్తిని తిరిగి పొంగులు వారించేలా చేయగల అపార పదసంపద, ప్రాభవ చరిత మనకున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరమూ ప్రతిష్ఠాత్మక పత్రికలెన్నో మన ప్రాచీన, ఆధునిక భాషాసాహిత్యాలను పరిపుష్టీకరించడంలో కీలకమయ్యాయి. ఆ కోవలోనే... భాషాభిమానులందరికీ వేదికగా నిలవాల్సిన బృహత్తర బాధ్యతను ఇప్పుడు 'తెలుగు వెలుగు' స్వీకరిస్తోంది.

అన్నమయ్య రాసిన 32వేల కీర్తనలు చెక్కిన రాగిరేకులు తిరుమలవాసుడి చేరువన ఒక చీకటికొట్లో పడి ఉన్న సంగతి ఏడు దశాబ్దాల క్రితం వరకు ఎవరికీ తెలియదు. తేటతెలుగు తీయందనాన్ని చవులూరించేలా అక్షరీకరించిన అలాంటి మరుగున పడ్డ మాణిక్యాల వెలికితీతా నిరంతర యజ్ఞంగా సాగాలి. 'బావా ఎప్పుడు వచ్చితీవు...' లాంటి పద్యాలు జనం నాలుకల మీద కదలాడేవి. అలా చేసిన తిరుపతి వేంకట కవుల వంటి ప్రతిభామూర్తుల రచనలతోపాటు త్యాగయ్య పంచరత్నాలు, కదిరీపతి శుకసప్తతి, క్షేత్రయ్య మువ్వగోపాల పదాలు, రంగాజమ్మ యక్షగానం, ఎన్నెన్నో నీతి శతకాలు... తెలుగు భాషను సుసంపన్నం చేశాయి. సౌష్ఠవం చేకూర్చాయి. అంతటి విలువైన సంపదను చేజార్చుకోకూడదు. తల్లినుడిపై స్పానిష్ ప్రజల విశేష అభిమానమే ఆ భాషాభివృద్ధికి అమేయంగా దోహదపడుతున్నట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. అంతకు మించిన పట్టుదలతో తెలుగువారందరం కంకణ బద్ధులం కావాల్సిన తరుణమిది.

మన భాషా సాహిత్యాలను నిలబెట్టుకోవడానికి 'తెలుగు వెలుగు' తలపెట్టిన బృహత్ యజ్ఞానికి- 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను...' అంటూ విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరూ కలిసి వస్తారని దృఢంగా విశ్వసిస్తున్నాము.



రామోజీరావు

8 తెలుగు తోటలో పండిన విక్రమకేళి వైకుంఠ పాళి

38 బండెనక బండిగట్టీ...

50 బోనాలు మన సంస్కృతికి ప్రాణాలు

70 కన్నడమే రాజ్యలక్ష్మి

90 చరితార్థులు... ఈ తెలుగు బిడ్డలు

అమ్మ భాష కాదు కానీ... అన్నంపెట్టిన భాష 24

పారిస్ నుంచి తందాన తాన 32

కథలు

గిల్లిపాడిన జోల	18	వెనక్కి వెళ్ళే రైలు	62
బలిదానం	28	దగడు	72
హృదయానందం	42	కల్యాణి	82

'పోటీ'కిరాని తెలుగు 16

ఉమ్మనీరులో... అమ్మ భాష 54

రాజకీయ ఒత్తిడితోనే భాషకు రక్షణ 86

మాతృభూమికి హారతి ప్రవాస భారతి 66

భాషకు విలువ... గురువు చలువ 96

10 కాలానికి ముందుమాట గురజాడ బాట

తెలుగు వెలుగు

సంపాదకుడు: **రామోజీరావు**

సంపుటి : 1, సంచిక : 1

సెప్టెంబరు 2012

పుటలు : 100, **విడి సంచిక :** రూ. 20

పత్రాలంకరణ : రవిశంకర్

సహకారం : రామోజీ విజ్ఞానకేంద్రం

ప్రకటనల కోసం : +91 80081 51599, +91 90001 80608

వివరాలకు : సంపాదకుడు, తెలుగు వెలుగు, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, రంగారెడ్డి - 501 512.

ఫోను: +91 8415 246 999

ఫ్యాక్సు: +91 8415 305 018

ముఖచిత్రం: పవిత్ర (శ్రీదేవి నృత్యాలయ, చెన్నై సౌజన్యంతో)

Telugu Velugu
Owned, Printed, published and Edited by Ramoji Rao on behalf of Ramoji Foundation, Ramoji Film City, Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh. Printed at Eenadu Press, D.No.7-134/1&2, Moosapet Village, Balanagar Mandal, Kukatpally, Rangareddy District -500 072.
RNI-APTEL 12988/01/1/2012-TC.

విన్నపం: తెలుగు భాషాభివృద్ధి, పరిరక్షణ, మేధోమథనం 'తెలుగు వెలుగు' ఆశయాలు. మన భాషకు పుష్టి చేకూర్చే రచనలకు పత్రికలో అగ్రతాంబూలం లభిస్తుంది. ఈ రచనల్లో వెల్లడయ్యే రచయితల అభిప్రాయాలు మాత్రమేనని మనవి. ఇవన్నీ పత్రిక యాజమాన్యం, సంపాదకవర్గ అభిప్రాయాలే కానక్కర్లేదు. ఈ పత్రిక భిన్న భావజాలాలకు నిష్పక్షపాత వేదిక మాత్రమే.

తెలుగదేలయన్న...

స్వాతంత్ర్యానంతరం ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు పెరిగిపోయాయి. మన అశక్తత ఆధారంగా ఆంగ్లం సశక్తమైంది. ఆర్థిక ప్రయోజనం, సామాజిక స్థాయి కారణంగా బలమైన మాధ్యమంగా రూపుదాల్చింది. ఆంగ్లం చదివితే విదేశాల్లో అవకాశాలు రావడం దానిపట్ల మక్కువకు ఆలంబనగా నిలిచింది. మండల స్థాయిలోనూ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు వెలిశాయి. తెలుగు వారిలో ఒక లౌల్యం (బలహీనత) ఉంది. ఆంగ్లం వల్ల ఏదో ఒనగూరుతుందనే ఆశ... నిజానికి డాలర్ గడ్డ (అమెరికా)కు వెళ్లడానికి కావాల్సిన ఆంగ్లమెంత? దాని కోసం మాతృభాషను నిర్లక్ష్యం చేయనవసరం లేదు. కానీ అదే జరుగుతోంది. గతంలోనూ కొన్ని భాషలు ఇలానే రాజ్యం చేశాయి.

పొరుగును చూసి నేర్చుకోవాలి

హిందీ ప్రాంత రాష్ట్రాలలో హిందీని తప్పనిసరిగా నేర్చుకోవాలి. తమిళ, కన్నడ దేశాలలో వారు మాతృభాషను విస్మరించరు. ఆ రాష్ట్రాల్లో భాషాభివృద్ధికి మంత్రివర్గంలో ప్రత్యేక శాఖే ఉంది. మహారాష్ట్రలో ఆ ప్రాంతానికి సంబంధించిన కార్యకలాపాలు మరాఠీలోనే సాగుతున్నాయి. బ్యాంకులలోనూ అంతే. మరి మనమో? ఆంగ్ల మోజులో కొట్టుకు పోతున్నాం. దీన్ని నియంత్రించుకోవాలి.

మనమే తేల్చుకోవాలి

'నాగరిక జాతి మాతృభాషలోనే మాట్లాడుతుంది...' అని ప్రముఖ ఆంగ్ల కవి డబ్ల్యూబీ ఈట్స్ వ్యాఖ్యానించాడు. దీన్ని బట్టి మనది నాగరిక జాతి అవునో కాదో మనమే నిర్ణయించుకోవాలి.

అంతరిస్తుందన్న భయం లేదు

తెలుగు భాష అంతరిస్తుందన్న భయం అక్కర్లేదు. ఒక జాతి సజీవంగా, చైతన్యవంతంగా ఉన్నంత కాలం, కొన్ని ప్రలోభాలకు లోబడినంత మాత్రాన భాష అంతరించదు. మా చిన్నతనంలో తెలంగాణలో ఉర్దూ మాధ్యమం మాత్రమే ఉండేది. వైద్య విద్య కూడా అందులోనే. ఆలానే చదివేవారు. ఆలాంటి పరిస్థితుల్లోనే తెలుగు అంతరించలేదు. ఇప్పుడు ఆ ప్రశ్నే లేదు.

తాత్కాలికంగా ఏర్పడే పరిణామాలు తెలుగును ఏమాత్రం దెబ్బ తీయలేవు. కొంచెం మందగించవచ్చు తప్పితే అంతరించదు. ఇప్పటికైనా మనం కళ్ళు తెరవడం అవసరం.

భాషకు మడి... శ్వాసకు ముడి

అన్య భాషా పదాలను కలుపుకునే భాషే సుసంపన్నంగా ఉంటుంది. తెలుగు దీనికి మంచి ఉదాహరణ. సంస్కృత పదాలను జీర్ణించుకున్న ఘనత తెలుగుది. 14వ శతాబ్దిలోనే శ్రీనాథుడు 20-30 పార్సీ పదాలు వాడాడు. ఖుసీ (ఖుషీ), దుకాణం, బజార్, తలవారి వంటివి ఇప్పటికీ కొన్ని వాడుకలో ఉన్నాయి. ఇస్త్రీ (పోర్చుగీస్), అల్మారీ, బొత్తాం (ఉర్దూ, అరబ్బీ) పదాలనూ తెలుగు తనలో ఇముడ్చుకుంది. **భాషకు మడి... శ్వాసకు ముడి లాంటిది. మడి కట్టుక్కూర్చుంటే ఏ భాషా బతకలేదు. కాలానుగుణంగా అన్యభాషా పదాలనూ స్వీకరించాలి. అది తప్పు కాదు.** రాసినట్లే ఉచ్చరించడం, ఉచ్చరించినట్లే రాయడం తెలుగుకు ఉన్న ప్రధాన లక్షణం. ఏ భాషకూ ఈ సౌలభ్యం లేదు.

ఇలా కాపాడుకోవాలి

తెలుగును ద్వితీయ భాషగా గుర్తించాలి. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగునూ నిర్బంధంగా చదివించాలి.

ప్రభుత్వ కార్యాలయాల్లో, న్యాయస్థానాల్లోని వాదోపవాదాలు, దైనందిన కార్యకలాపాలు తెలుగులో సాగాలి. జన వ్యవహారంలో సాధ్యమైనంత వరకూ తెలుగే ఉపయోగించాలి. తెలుగు మాట్లాడుతూ పుంఖానుపుంఖాలుగా ఆంగ్ల పదాలు వాడే దుస్సంస్కృతిని విడనాడాలి. అవధానాల వల్ల భాషకు మేలే జరుగుతుంది. అదో కవితా కేళి.. అందులో కవితా ఉంది, క్రీడా ఉంది. పద్య కవిత్వం పట్ల ప్రజలకు ఆసక్తిని కలిగించడానికి అదో మార్గం.

పద్మభూషణ్ సి.నారాయణరెడ్డి,
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత.

బాపూ బోధను

విని ఉంటే..!

గోవిందరాజు రామకృష్ణారావు

గాంధీజీ ఏ కార్యక్రమాన్నైనా తాను విశ్వసించిన మౌలిక సిద్ధాంతాల పునాదిపైనే ఆవిష్కరించేవారు. భాషల విషయంలోనూ ఆయన ప్రత్యేక శైలినే అనుసరించారు. బాపూ జాతీయ భాషగా హిందీని ఆమోదించినా, ఎవరికి వారు తమ మాతృభాష వికాసానికి కృషి చేయాలని బోధించారు. వైస్రాయ్ ఏర్పాటు చేసిన సమావేశంలో హిందీలో మాట్లాడి అందరినీ ఆశ్చర్యపరిచిన భాషాభిమానం ఆయనది. ఆ సమావేశంలో తిలక్ ఆంగ్లంలో మాట్లాడ్డం నచ్చక "తిలక్ హిందీలో మాట్లాడితే బాగుండేది. ఆయన హిందీ నేర్చుకోవాలి" అన్నారు నిస్సంకోచంగా. మరోమారు కాంగ్రెసు మహాసభలలో ఇంగ్లిషులో మాట్లాడిన మదన్ మోహన్ మాలవ్యానూ వదల్లేదు. "కాంగ్రెసు సభలలో హిందీలో మాట్లాడకపోవడం సబబుగా లేదు. ప్రయత్నిస్తే ఆయన వచ్చే సభల్లో తప్పకుండా హిందీలో మాట్లాడగలరు" అని బాపూ తన అంతరంగాన్ని ఆవిష్కరించారు.

జాతీయ భాషగా హిందీ పట్ల గాంధీ ఎంత అభినివేశాన్ని ప్రదర్శించారో మాతృభాషల పట్ల అంతకుమించి ఆసక్తి చూపారు. దేశ భాషలకు సముచిత స్థానం లభించాలని, అందుకు శ్రమించాలని ప్రబోధించారే కానీ ఇంగ్లిషు పట్ల వైరభావం ప్రకటించలేదు. "ఇంగ్లిషు మీద శత్రుత్వం లేదు. అదో భాండారం. అయినా ప్రతి భారతీయుడూ దాన్ని నేర్వక్కర్లేదని నా అభిప్రాయం. మన వ్యవహారాలన్నీ మాతృ భాషల్లోనే జరగాలి" అని చెప్పారు. 1918లో బీహారు ప్రాంతీయ విద్యార్థి సమ్మేళనంలో అధ్యక్ష ప్రసంగం చేస్తూ గాంధీజీ, "ఈ సమ్మేళనం కార్యకలాపాలన్నీ ప్రాంతీయ భాషలో జరుపుతున్నందుకు అభినందిస్తున్నాను. ఇక్కడ ఒక సంగతి చెప్పాలి. మనం మన మాతృభాషల పట్ల ఆదరణ చూపడం లేదు. ఇది ముమ్మాటికీ అలక్ష్యమే. దీని దుష్ఫలితాలను మనం అనుభవించక తప్పదు. మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తల్లిని అవమానించడంతో సమానం. అలాంటి మాతృద్రోహిని దేశభక్తుడనడానికి వీల్లేదు" అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. దేశభాషల్లో తగిన పదజాలం లేదనే వాదనను గాంధీజీ ఖండించారు. "అన్ని భావాలనూ వ్యక్తం చేయడానికి కావాల్సిన పదజాలం తమ మాతృభాషలో లేదని చాలా మంది అంటూంటారు. ఇది సరికాదు. ఒక దశలో ఇంగ్లిషులోనూ తగిన పదజాలం లేదు. దాన్ని ఆంగ్లేయులు పెంపొందించుకున్నారు. అలానే మనమూ మన భాషలను అభివృద్ధి చేసుకోవాలి. మన భాషల్లో భావప్రకటన శక్తి లేదని ఇంగ్లిషులోనే ఉందని అనుకున్నంత కాలం మనం బానిసలుగానే ఉండిపోతాం" అని హెచ్చరించారు బాపూజీ.

బోధనామాధ్యమంగా...

గాంధీ వాంఛించింది దేశభాషల సమగ్ర వికాసం. ఆయన కోరింది పాలనలో, విద్యలో, ప్రజా వ్యవహారాల్లో ఆ భాషలకు ప్రాధాన్యం. ఆయన వ్యతిరేకించింది బ్రిటిషర్ల సామ్రాజ్యాధికారం, దేశభాషలకు స్థానభ్రంశం కలిగించే వారి ధోరణులనే. బోధన మాధ్యమంగా మాతృభాషలు ఉండాలని గాంధీ అనేక సార్లు చెప్పారు. 1928 జులై 5న 'యంగ్ ఇండియా'లో రాసిన వ్యాసంలో ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు.

> మాట్లాడేవారి సంస్కారానికి, పరిణతికి భాష అద్దం లాంటిది. స్వేచ్ఛా భావనల్ని అర్థం చేసుకోవడానికీ, ఆలోచనల్లో స్పష్టత రావడానికీ ఆంగ్ల భాషా పరిజ్ఞానం తప్పనిసరి అనుకోవడమే మన దేశాన్ని పట్టిపీడిస్తున్న పెద్ద మూఢ నమ్మకం.

అప్పట్లో హైదరాబాద్ సంస్థానంలో విద్యాశాఖ సంచాలకులుగా పని చేస్తున్న నవాబ్ మసూర్ జంగ్ బహదూర్, కార్వే మహిళా విశ్వవిద్యాలయంలో మాట్లాడుతూ ప్రాంతీయ భాషల్లోనే విద్యాబోధన జరగాలని కోరారు. దానిపై 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పాఠకుడొకరు స్పందిస్తూ రాజా రామ్మోహన్ రాయ్ నుంచీ గాంధీ వరకూ భారతీయులు సాధించిన ఔన్నత్యానికి పాశ్చాత్య సంస్కృతి ప్రభావమే కారణమని రాశాడు. దానికి గాంధీ ఇలా సమాధానమిచ్చారు:

"ఈ పాఠకుడు పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన్ని ప్రస్తావించాడు తప్ప ఉన్నత విద్యలో బోధనా మాధ్యమంగా ఇంగ్లిషు గురించి



చెప్పలేదు. నవాబ్ గానీ, నేను గానీ పాశ్చాత్య సంస్కృతి ప్రభావం లేదని అనడం లేదు. మేం నిరసించేది పాశ్చాత్య సంస్కృతి వల్ల భారతీయ వేద ప్రాచ్య సంస్కృతి ప్రభావం కావడాన్నే. నాపై పాశ్చాత్య సంస్కృతి ప్రభావం ఉందని నేనిదివరకే అంగీకరించాను. కానీ నేను నా దేశ ప్రజలకు ఏ మాత్రమైనా సేవ చేశానంటే అందుకు నాలో అంతర్భాగంగా ఉన్న ప్రాచ్య సంస్కృతే కారణమని గట్టిగా చెప్పగలను. జాతీయత సన్నగిల్లి నేను ఆంగ్ల మానసపుత్రుడిగా మారి ఉంటే ప్రజల ముందు నిష్ప్రయోజకుడిగా మిగిలే వాడిని. చైతన్య, కబీర్, నానక్, తులసీదాస్ వంటి మహాపురుషులు ఇంగ్లిషు పాఠశాలల్లో చదివి ఉంటే ఏం సాధించేవారో ఊహించవచ్చు. ప్రస్తుతాంశం బోధనా మాధ్యమం. యువతరం ఒక జాతిగా పరిఢవిల్లాలంటే అన్ని స్థాయిల్లోనూ విద్యాబోధన దేశభాషల్లోనే జరగాలన్నది నా నిశ్చితాభిప్రాయం.

ప్రజలకు అర్థమయ్యే భాషల్లో వారు విద్యార్జన చేయకపోతే ప్రజానీకంతో సన్నిహిత సంబంధాలు పెట్టుకోలేరు. విదేశీ భాషలో ప్రవేశం పొందడం వల్ల, ఆ నుడికారం నేర్వడం వల్ల దైనందిన జీవితంలో ఒనగూరే ప్రయోజనం శూన్యం. తమ సాహిత్యాన్ని అలక్ష్యం చేసి, ఇవి నేర్వడం కోసం యువత కాలాన్ని ఎంత వృథా చేస్తోందో చెప్పక్కర్లేదు. మాతృభాషలో శాస్త్ర విషయాలనో, మరో అంశాన్నో అభివ్యక్తం చేయలేము అనడం కన్నా వేరే మౌఢ్యం ఉండదు. ఒక భాష దాన్ని మాట్లాడే ప్రజల స్వభావానికీ, వికాసానికీ ప్రతిబింబంగా ఉంటుంది. విదేశీ భాషా మాధ్యమాన్ని మన దేశ యువతపై రుద్దడం విదేశీ పాలన మూలంగా ఏర్పడిన అనర్థం. దీని వల్ల ఎంత హాని జరిగిందో ముున్ముందు చరిత్రే చెబుతుంది. ఈ విదేశీ మాధ్యమం జాతి శక్తియుక్తుల్ని పీల్చి వేసింది. విద్యార్థుల విద్యాకాలాన్ని హరించింది. వారిని జన బాహుళ్యానికి దూరం చేసింది. విద్యార్జనను వ్యయంతో కూడుకున్నదిగా మార్చేసింది. మాతృ భాషల పట్ల శ్రద్ధ వహించకపోతే, ఈ ప్రక్రియ ఇలాగే సాగితే, కొంత కాలానికి జాతి ఆత్మనే పోగొట్టుకునే దౌర్భాగ్యం పట్టవచ్చు. అందుచేత విద్యావంతులు విదేశీభాషావ్యామోహం నుంచి ఎంత శీఘ్రంగా విముక్తం అయితే దేశానికీ, ప్రజానీకానికీ అంత శ్రేయోదాయకం."

దశాబ్దాలకు పూర్వమే జాతీయ భాష, మాతృభాషలు, బోధనా మాధ్యమాలపై బాపూజీ వెలిబుచ్చిన భావాలివి. ఆయన ఆందోళన నిజమేనని ప్రస్తుత పరిస్థితులను చూస్తే అర్థం అవుతుంది. అప్పుడే ఆయన మాటలు చెవికెక్కించుకుని ఉంటే ఇప్పుడు మాతృభాషలకూ, సంస్కృతులకూ ఈ దుర్గతి పట్టి ఉండేది కాదు. కనీసం ఇప్పటికైనా నేటి పరిస్థితులకు అనువైన భాషా విధానాన్ని రూపొందించుకుని, కట్టుదిట్టంగా అమలు చేసుకోవాలి. ఈ విషయంలో బాపూ బోధనలే మార్గదర్శకాలుగా ఉపకరిస్తాయి. ■

తల్లి స్తన్యమే ఇది

"విదేశీ భాషామాధ్యమంలోని చదువులు మన పిల్లలపై తీవ్ర ఒత్తిడిని కలుగజేస్తున్నాయి. మేధోపరమైన శ్రమకు గురి చేస్తున్నాయి. ఇతరులను అనుకరించే వాళ్ళుగా, సొంత ఆలోచనలకు అనర్హులుగా మారుస్తున్నాయి. మన మాతృ భూమిలోనే మన చిన్నారులను విదేశీయులుగా మార్చింది విదేశీ భాషామాధ్యమం. అంతే కాదు, మన భాషల అభివృద్ధిని నిరోధించింది. నాకే గనుక తగినన్ని అధికారాలుంటే విదేశీ భాషా మాధ్యమ చదువుల్ని ఆపేసే వాణ్ని. రాష్ట్ర ప్రభుత్వాలకు గనుక న్యాయస్థానాలను ప్రభావితం చేసే శక్తి లేదా అధికారం ఉంటే న్యాయస్థానాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రాంతీయ భాషలను ప్రవేశపెట్టాలి. మార్పు కావాలని మనం బలంగా నమ్మితే తక్కువ సమయంలోనే దాన్ని సాధించగలం. మాతృభాషలో ఎన్ని లొసుగులు ఉన్నా, తల్లి స్తన్యం మీద ఆధార పడినట్లుగానే మాతృభాషకు కట్టుబడి ఉండాలి. అదొక్కటే మనకు జీవధార."

అరువక్కర్లేదు!

"మాతృభాషలో సాంకేతిక విద్యా బోధన జరగాలంటే చాలా పరిశోధన జరగాలనే వారి వాదనల్లో నిజం లేదు. గ్రామీణ మాండలికాల్లోని అద్భుతమైన భావ వ్యక్తీకరణలు, జాతీయాలను వారు తెలుసుకోలేక పోతున్నారు. భావాలను వ్యక్తీకరించడానికి సంస్కృతం, పర్షియన్ భాషల వైపు చూడక్కర్లేదు. ఒకసారి చంపారన్‌కు వెళ్లినప్పుడు అక్కడి గ్రామీణులను పరిశీలించా. విదేశీ భాష నుంచి ఒక్క భావ వ్యక్తీకరణ పదాన్ని కానీ, జాతీయాన్ని కానీ అరువు తీసుకోకుండానే వారు చాలా సులువుగా, తమదైన భాషలో పూర్తి స్థాయిలో తమ భావాలను వ్యక్తీకరిస్తున్నారు. వారి భాషా వనరులకు ఓ ఉదాహరణ మోటర్ కార్‌కు వారు పెట్టుకున్న పేరే. అదేమిటంటే... హవా గాడీ."

మాజీ డైరెక్టర్, రాష్ట్రప్రభుత్వ అనువాద శాఖ; మాజీ ప్రత్యేక అధికారి, అంబేద్కర్, తెలుగు విశ్వవిద్యాలయాలు.
హైదరాబాద్. 040-24549773

తెలుగు తోటలో పండిన విక్రమకేళి

వైకుంఠ పాళి



గరికిపాటి నరసింహారావు

కేవలం నాలుగు గవ్వలతో మూడో నాలుగో చింత పిక్కలతో (ఆడేవాళ్ల సంఖ్యను బట్టి) జీవితాన్ని ఆస్వాదించగలిగే, అనుభవించగలిగే, ఎదిరించగలిగే ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చే ఈ ఆట తెలుగు వారి సృష్టి. తెలుగు సంస్కృతిలో పుత్రకామేష్టి.

ఇందులో 11 వరుసలుంటాయి. ఒక్కో వరుసలో 11 గడులుంటాయి. మొత్తం 121 గడులు పూర్తయ్యాక 11 గడులలో 'పరమపద సోపాన పటము' అని 11 అక్షరాలు రాసి ఉంటాయి. ఆపైన **"ధరసింహాసనమై నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై... సిరి భార్యామణియై"** అన్నట్లుగా పదిమంది దివ్య పురుషుల మధ్యలో శ్రీమహావిష్ణువు కొలువై ఉంటాడు. చివరకు చేరుకోవాల్సిన స్థానం అది. అక్కడకు చేరుకొనే వరకు (జీవితమనే) ఆట ఆడుతూ ఉండవలసిందే. ఈలోగా ఒకటి నుంచి 121 వరకు ఎక్కుతూ దిగుతూనే ఉండాలి. పడుతూ లేస్తూనే ఉండాలి. అంటే పరమపదాన్ని చేరుకొనే వరకు ఈ జనన మరణ సంసార చక్రంలో పడుతూ లేస్తూ ఉండటం తప్పదని హెచ్చరిక.

పదకొండు అంటే సంస్కృతంలో ఏకాదశి. ఏకాదశీవ్రతం భారతీయులందరికీ ఆచరణీయం. ఏకాదశి మహా పర్వదినం. ఆ రోజు ఉపవాసం, జాగరణం, దైవస్మరణ అనే మూడూ తప్పని సరి. అలా 11 ఏళ్ళు వరుసగా ఏకాదశీ వ్రతం చేస్తే పరమపదం చేరుకోవచ్చనేది పురాణ కథనం. అయితే ఇదంతా ఆధ్యాత్మికం.

గెలుపోటములు మానసికానుభూతులు. పరమపదం చేరుకోవడం ఆధ్యాత్మిక పరమార్థం. ఇదొక రకంగా అరచేతిలో వైకుంఠం. ఇందులో గొప్ప వ్యక్తిత్వ వికాస సూత్రాలున్నాయి. నీ ఉన్నతి నీ చేతిలోనే ఉందని చెప్పడం. గవ్వలతో గెలవగలిగిన జీవితం కోసం 'రవ్వ' పెట్టుకోవద్దని ఉపదేశం.

ఇందులో చాలా గళ్ళలో ఏదో ఒక బొమ్మ, దానికో పేరు కచ్చితంగా ఉంటాయి. కొన్ని గళ్ళు అడ్డంగా దాటేస్తూ నిచ్చెనలు ఊరిస్తాయి. కొన్ని గళ్ళు అమాంతం దించేస్తూ పాములు బెదిరిస్తాయి. అంతలో ఉత్సాహం అంతలోనే నిరుత్సాహం. అంతిమంగా ద్వంద్వాతీతమైన పరమశాంతి. ఇదీ ఆట నడిచే తీరు.

ఈ ఆటలో పాములు, నిచ్చెనల గడుల్లోని పేర్లను నిశితంగా పరిశీలిస్తే అద్భుత జీవన మార్గాలు, అపూర్వ ఆధ్యాత్మిక రహస్యాలు కనిపిస్తాయి. ఉదాహరణకు 75వ గడిలో ఒక పాము తల దగ్గర 'కర్కోటకుడు' అని రాసి ఉంటుంది. దాని తోక 10వ గడిలోకి పాకుతుంది. అక్కడ పంది బొమ్మ ఉంటుంది. పాము కరవడం వల్ల కిందికి రావడం అనేది పైకి కనిపించే విషయం. జీవితంలో కర్కోటకంగా వ్యవహరిస్తే వచ్చే జన్మలో పందై పుడతావనేది ఆధ్యాత్మిక హెచ్చరిక. పందిలా హీనంగా

కొన్ని వేల పద్యాలు, పాటలు, మాటలు అందించగలిగే వికాసం ఒక్క తెలుగు ఆట అందిస్తుంది. అదే వైకుంఠపాళి. దీన్నే ఆధ్యాత్మిక భాషలో 'పరమపద సోపాన పటం' అంటారు. కొన్ని ప్రాంతాల్లో 'పాముపటం' అంటారు. జీవన సారాన్నీ, స్థైర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ, క్రీడాస్ఫూర్తినీ, నైతిక విలువల్నీ, రంగరించే అపురూప వ్యక్తిత్వ వికాస గ్రంథం వైకుంఠపాళి.

చూస్తారన్నది వ్యక్తిత్వ పాఠం.

అలాగే 55వ గడిలో ఒక పాము తల ఉండి 'దుర్యోధనుడు' అని రాసి ఉంటుంది. దాని తోక 12వ గడిలోకి పాకుతుంది. 43 గడులు కిందికి జారిపోవడం పైకి కనిపించే ఓటమి. దుర్యోధనుడు అసూయకు ప్రతిరూపం. దాని వల్లే కురు వంశ క్షయం. అలానే... మనమూ అసూయపడితే జీవితం నరకప్రాయమవుతుందని, సుఖ శాంతులు నశిస్తాయని హెచ్చరిక.

పాముల అమరిక ఇంత అర్థవంతంగా ఉంటే నిచ్చెనల ఏర్పాటు మరింత పరమార్థ బోధకంగా ఉంటుంది. 63వ గడిలో ఒక నిచ్చెన అడుగు భాగం ఉంటుంది. అక్కడ 'భక్తి' అని రాసి ఉంటుంది. ఒక భక్తుని బొమ్మ ఉంటుంది. దాని కొస 83వ గడి వరకూ సాగుతుంది. అక్కడ 'బ్రహ్మలోకం' అని ఉంటుంది. బ్రహ్మదేవుని చిత్రం ఉంటుంది. భక్తిగా ఉండటమే బ్రహ్మలోకానికి చేరే ఉపాయమన్నది పరమైతే... ఏ పనైనా దాని మీద భక్తితో చేస్తేనే మంచి ఫలితాలొస్తాయన్నది ఇహం.

అలాగే 65వ గడిలో ఒక నిచ్చెన మొదలు ఉంటుంది. అక్కడ 'చిత్తశుద్ధి' అని ఉంటుంది. దాని కొస 105వ గడిలో ఉంటుంది. అక్కడ 'మహాలోకం' అని ఉంటుంది. మొత్తం వైకుంఠపాళిలో ఇదే పెద్ద నిచ్చెన. 40 గడులు అమాంతం ఎగబాకవచ్చు. ఇదంతా పైకి ఆశ పెట్టే విధానం. చిత్తశుద్ధి ఉంటే మహాలోకాలు నీకోసం ఎదురుచూస్తూ ఉంటాయని అంతరార్థం. లోకంలో మహానుభావుడిగా కీర్తి పొందుతారని విశేషార్థం. ఏ చిత్తశుద్ధి కొరవడటం వల్ల ఇవాళ దేశం అవినీతి ఊబిలో కూరుకుపోయిందో అటువంటి చిత్తశుద్ధి ప్రాధాన్యాన్ని చిన్నతనంలోనే పిల్లలకు ఆటల రూపంలో నేర్పిన ఏకైక జాతి మన తెలుగుజాతి.

ఇంత గొప్ప విషయాన్ని చెబుతూనే చెంతనే పొంచి ఉన్న ముప్పును గుర్తించి జాగ్రత్త పడమనడం ఈ ఆట ప్రత్యేకత. సాధారణంగా 105వ గడి వరకు రాగానే

తెలుగు ఆటయె చూపించు వెలుగు బాట
తెలుగు మాటయె చెవినించు తేటి పాట
తెలుగు పాటయె రుచిమించు తేనె ఊట
తెలుగు పద్యమ్మె గెలిపించు తెలుగు బాల

ఆటగాడికి కొంచెం గర్వం వస్తుంది. ఇంక 16 గడులు దాటితే పండిపోయినట్లే కదా అనుకొంటాడు. అక్కడే ఎదురవుతుంది పెద్ద ప్రమాదం. 106వ గడిలో 'అరుకాషుడు' అనే అతి పెద్ద సర్పం ఉంటుంది. దాని నోట్లో పడితే అమాంతం కిందికి జారి మొదటి గడిలోకి - అంటే 'కోతి' లోకి వచ్చి పడతాడు. అంటే ప్రముఖుణ్ణి (సెలబ్రిటీ) అయ్యాను కదా అని గర్వించి ఒక్క పొరపాటు (ఒకటి వెయ్యడం) చేసినా మళ్లీ ఆట మొదటికి రావడం ఖాయం అని హెచ్చరించడం అన్నమాట. పైగా వైకుంఠపాళి పరిభాషలో ఒకటిని 'గుడ్డి' అంటారు. అంటే ఎంత పెద్ద స్థానంలో ఉన్నా గర్వించి ఒక్క గుడ్డి పని చేసినా మళ్లీ కిందికి జారిపోవడం తప్పదని చెప్పడం.

ఇంత జరిగినా ఆట మానకూడని పరిస్థితి ఇందులో విచిత్రమైన విషయం. ఒకడు పెద్దపాము నోట్లో పడినా ఇంకొకడు ఇంకా పడలేదు కాబట్టి అతను ఇతన్ని ఆడమని ప్రోత్సహిస్తాడు. ప్రత్యర్థిని సైతం బాగా ఆడమని ప్రోత్సహించే ఏకైక క్రీడ బహుశా వైకుంఠపాళీయే నేమో!

ఇంతకీ చివరిదైనా చిన్నది కాని విషయం మరొకటుంది. చివర 121వ గడిలో కూడా ఒక పాము ఉంటుంది. దానిపేరు 'అహంకారం'. దానితోక 99వ గడిలోకి ఉంటుంది. అక్కడ రాక్షసుని బొమ్మ ఉంటుంది. అంటే 106లో అరుకాషుణ్ణి దాటినా, 115లో వైకుంఠంలో ప్రవేశించినా, 117లో కైలాసంలో దివ్యానుభూతి పొందినా చివరలో 121లో అహంకారానికి లోనయితే తిరిగి రాక్షస జన్మ తప్పదు అని హెచ్చరిక. బ్రహ్మరుద్రాది దేవతల్ని తపస్సులతో ప్రసన్నం చేసుకొని మహాభోగాలు అనుభవించి లోకాలన్నీ జయించిన హిరణ్యకశిప, రావణాసురాది వీరులు చివరకు రాక్షసులై దుర్మరణం పాలుకావడానికి ఈ 'అహంకారమే' కారణం కదా!

అంతిమంగా అహంకారం, మమకారం అనే రెంటినీ జయించినవాడే పరమపదం చేరుకోగలడని సారాంశం.

జీవితమే ఒక వైకుంఠపాళి
నిజం తెలుసుకో భాయి!
ఎగరేసే నిచ్చెనలే కాదు
పడదోసే పాములు ఉంటాయి
చిరునవ్వులతో విష వలయాలను
ఛేదించి ముందుకు పోవోయి

- ఈ చలనచిత్ర గీతం ఒక ప్రాచీన శ్లోకంలా, ఒక ప్రబంధ పద్యంలా, ఒక భావ కవితలా, ఒక అభ్యుదయ గేయంలా ఎప్పుడూ తెలుగువారి చెవుల్లో మారుమోగుతూ గెలుపు కోసం వెన్ను తడుతూనే ఉంటుంది.

సుప్రసిద్ధ సహస్రావధాని,
'సాగరఘోష' గ్రంథకర్త,
హైదరాబాద్.
98482 53135.

కాలానికి ముందుమాట
గురజాడ బాట

"కవీ ప్రవక్తా ఎల్లప్పుడూ కాలం కంటే ముందు ఉంటారు". తన అసంపూర్ణ నవల 'సౌదామిని'లో కవి పాత్రతో గురజాడ చెప్పించిన ఈ వాక్యం గురజాడకే చక్కగా అన్వయిస్తుంది. గురజాడ కాలం సమాజం చలనశీలమవుతున్న దశ. ఆ చలనాన్ని రచయితగా గురజాడ వేగవంతం చేయటానికి కృషి చేశారు. పాతకు వీడ్కోలు చెబుతూ కొత్తకు ఆహ్వానం పలికే ప్రయత్నమే ఆయన "కొత్త పాతల మేలు కలయిక". ఈ భావం భాషకు భావుకతకు సంబంధించింది మాత్రమే కాదు. వ్యవస్థకు కూడా సంబంధించినది. అందుకే గురజాడ జన్మించి ఈ సెప్టెంబరు 21కి నూటయాభై సంవత్సరాలు గడిచినా ఆయనింకా తెలుగు సాహిత్యంలో, సమాజంలో చిరంజీవిగా ఉన్నారు.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

'గురజాడ'గా ప్రసిద్ధుడైన గురజాడ వేంకట అప్పారావు 150 ఏళ్ళ క్రితం 1862 సెప్టెంబర్ 21న పుట్టారు. 97 ఏళ్ళ క్రితం 1915 నవంబర్ 30న మరణించారు. ఆయన జీవించింది 53 ఏళ్ళే. భారతదేశాన్ని ఆధునిక దేశంగా రూపొందించడానికి అవసరమైన మేధావులు, కళాకారులు, ఉద్యమకారులు పందొమ్మిదో శతాబ్దంలో పుట్టారు. వాళ్ళే రాజారామమోహనరాయ్, మహాదేవ గోవింద రనడే, మహాత్మాపూలే, నారాయణగురు, బి.ఆర్. అంబేద్కర్, కందుకూరి వీరేశలింగం పంతులు, సామినేని ముద్దునరసింహంనాయుడు, భాగ్యరెడ్డివర్మ, రవీంద్రనాథ్ టాగూర్, హరినారాయణ ఆప్టే, బంకించంద్ర చటర్జీ వంటి వాళ్ళు. వీళ్ళతో పాటే మన దగ్గర గురజాడ అప్పారావు కూడా పుట్టారు. పుట్టిన కొన్నాళ్ళకే తండ్రిని పోగొట్టుకున్న గురజాడ ఇతరుల పెంపకంలో పెరిగి, చదువుకొని, విజయనగరం జమీన్‌దారీలో అనేక రకాల ఉద్యోగాలు చేస్తూ రచయితగా ఎదిగారు. జమీన్‌దారీలో ఉద్యోగం, అనారోగ్యం, వీటి మధ్య పరిమితంగానే రాయగలిగారు.

గురజాడ రాసింది మూడు నాటకాలు. కన్యాశుల్కం, కొండుభట్టీయం, బిల్హణీయం. వీటిలో చివరిరెండూ అసంపూర్ణాలు. అయిదు కథలు: దిద్దుబాటు, మెటిల్డా, పెద్దమసీదు, మీపేరేమిటి?, సంస్కర్త హృదయం. కొన్ని కవితలు: ముత్యాల సరాలు, పూర్ణమ్మ, కన్యక, కాసులు, ధామస్ పితియస్, లవణరాజుకల, దేశభక్తి, మనిషి, దించులంగరు, లంగరెత్తుము మొదలైనవి. వాటిలో సుభద్ర, సారంగధర వంటివి ఉన్నాయి. గురజాడ ఒక నవల రాయాలని కూడా సంకల్పించారు. దానిపేరు 'సౌదామిని'. రాయలేదు. మద్రాసు విశ్వవిద్యాలయంలో సెనెట్ సభ్యుడిగా ఉంటూ, విద్యార్థులు పరీక్షలు రాయడంలో వ్యావహారిక భాషను అమోదించనందుకు నిరసనగా 'అసమ్మతి పత్రం' రాశారు. కొన్ని వ్యాసాలు వెలువరించారు.

మూఢ నమ్మకాలకు, మూఢాచారాలకు వ్యతిరేకంగా ఆంగ్ల విద్య చదువుకున్న రాజా రామమోహనరాయ్, మహాత్మాపూలే వంటి వాళ్ళు నడుపుతున్న సంఘసంస్కరణోద్యమాన్ని సమర్థిస్తూ రచనలు చేశారు గురజాడ. స్త్రీలకు చదువు లేకపోవడం, బాల్య

వివాహాలు, వితంతు వ్యవస్థ, కాలం చెల్లిపోయిన విద్యా వ్యవస్థ, అర్థం కోల్పోయిన వివాహ వ్యవస్థ, సారం కోల్పోయిన మత వ్యవస్థ, శాస్త్రీయత లోపించిన సాంఘిక వ్యవస్థ, అస్పృశ్యతా దురాచారం, మత వైషమ్యాలు, వేశ్యా సమస్య వంటి అనేక సామాజిక రుగ్మతలను ఖండిస్తూ, వాటి నిర్మూలనావశ్యకతను నొక్కి చెబుతూ గురజాడ సాహిత్యాన్ని సృష్టించారు.

పురాణ కథలనే మళ్ళీ మళ్ళీ రాస్తూ సాహిత్యమంటే అక్షరాల గారడీగా మారిపోయిన సమయం అది. అప్పుడు సాహిత్యంలో సమకాలీన జీవితాన్ని ప్రతిబింబించాలని, సమాజం మారడానికి సాహిత్యం తోడ్పడాలని గురజాడ భావించారు. "వాస్తవిక జీవితం నుంచి సమకాలిక ఇతివృత్తాన్ని స్వీకరించి దానిని తెలుగున వాడుక భాషలో నాటకంగా రూపొందించాను" అని ఆయనే రాసుకున్నారు. సామినేని ముద్దు నరసింహం నాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులు సాగిస్తున్న సంఘ సంస్కరణోద్యమానికి సమానంగా తాను సాహిత్య సంస్కరణను ప్రారంభించారు. నూతన భావాల వ్యాప్తికి నూతన ప్రక్రియలు అవసరమని భావించి కథానికా ప్రక్రియకు, నాటక లక్షణానికీ ఆధునికత జోడించారు. కవితా రచనలోనూ నూతన ఒరవడిని ప్రవేశపెట్టారు. పూర్తి చేసి ఉన్నట్లయితే 'సౌదామిని' అనే ఆధునిక నవల తెలుగు సాహిత్యానికి లభించి ఉండేది.

గిడుగు రామమూర్తి పంతులు నడిపే వ్యావహారిక భాషోద్యమాన్ని గురజాడవారు సమన్వయించుకున్నారు. సమకాలీన ప్రజల జీవితాన్ని వస్తువుగా చేసుకొని, వాళ్ళ భాషలో, వాళ్ళ బాణీలో వాళ్ళ కోసమే సాహిత్యాన్ని సృష్టించారు. తొలినాళ్ళలో గురజాడ ఆంగ్లంలో రాయడం ప్రారంభిస్తే శంభుచంద్ర ముఖర్జీ అనే ఆంగ్ల పత్రిక సంపాదకుడు తెలుగులో రాయమని సలహా ఇచ్చారు. దీంతో ఆయన తెలుగులో రచనకు పూనుకొని ప్రజా రచయిత అయ్యారు. మొదట్లో పద్యాలు రాసినా, తర్వాత ఆయన 'ముత్యాలసరాలు' గేయ ఛందస్సును తన కవిత్వానికి వాహికగా చేసుకున్నారు. 3+4 మాత్రల నిర్మాణంగల ముత్యాలసరం పాడటానికి, చదువుకోడానికి లయాత్మకంగా ఉంటూ, పాఠకులను బాగా ఆకర్షిస్తుంది. గురజాడ ప్రారంభించిన ముత్యాలసరాలను తెలుగు కవులు అనేక ప్రయోగాలతో ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్నారు.

విజయనగర ప్రాంతానికి చెందిన గురజాడ అక్కడ విభిన్న సామాజిక వర్గాలు మాట్లాడే భాషలో నాటకాలు, కథానికలు రాశారు. ఎవరు ఎలా మాట్లాడితే వాళ్ళ సంభాషణలను అలా రాశారు. 'కన్యాశుల్కం' నాటకంలో బయట సమాజంతో సంబంధం

గురజాడ తన కాలంకన్నా ముందు నిలబడిన రచయిత. 'ఆధునిక మహిళలు చరిత్రను తిరిగి రచిస్తారు' అని చెప్పారు గురజాడ. అప్పటి నుంచి మహిళలు ఆ ఉద్యమంలోనే ఉన్నారు. మధ్య యుగానికి చెందిన వేమన, వీరబ్రహ్మం వంటి వాళ్ళు ఏర్పరచిన పూర్వ రంగాన్ని స్వీకరించి, ఆధునిక విద్య ద్వారా లభించిన నూతన సంస్కారానికి అన్వయించుకొని, విజ్ఞానాత్మకమైన శాస్త్రీయమైన భారతదేశ నిర్మాణానికి గురజాడ సాహిత్య పునాది వేశారు. ఆయన కోరుకున్న ఆధునిక భారత దేశం ఇంకా పుట్టవలసే ఉంది కాబట్టి ఆయన సాహిత్యాన్ని మనం ఇంకా ఇంకా చదవాలి.

లేని వెంకమ్మ, బుచ్చమ్మ వంటి వాళ్ళకు ఒక భాషను, బయటి సమాజంతో సంబంధం గల వెంకటేశానికి మరో భాషను ఉపయోగించారు. అలాగే మునసబు, పోలిశెట్టి, అసిరిగాడు వంటి బ్రాహ్మణేతర పాత్రలకు ఇతర రకాల భాషను ఉపయోగించారు.

ప్రజల భాషకు సాహిత్య గౌరవం కల్పించిన ఘనత గురజాడదే. ఆ ఒరవడిలో నేటి రచయితలు తమ తమ ప్రాంతాల భాషను సాహిత్యంలో ధారాళంగా ఉపయోగిస్తున్నారు. తన వ్యావహారిక తెలుగును చదివితే రైతులు మేల్కొంటారని ధైర్యంగా చెప్పారు గురజాడ. మాతృభాషను మన జీవిత చిత్రణకు ఎంత శక్తిమంతంగా ఉపయోగించుకోవచ్చో గురజాడ రుజువు చేశారు. కన్యాశుల్కం నాటకంలో, కథానికల్లో గురజాడ రత్నాల వంటి తెలుగు మాటలను ఉపయోగించి మన భాష శక్తి సామర్థ్యాలను జాతికి చాటి చెప్పారు. తెలుగు భాషలోని సౌందర్యాన్ని విభిన్న భావాభివ్యక్తిని ఆ భాషలో గల అవకాశాలను ఆయన ప్రదర్శించారు. ఏ ప్రాంతం వాళ్ళైనా గురజాడ ఉపయోగించిన తెలుగు భాషను చదివి అదే విధంగా భాషను తమ రచనల్లో ఉపయోగించుకుందామని ఉబలాట పడకమానరు. వస్తువులో, భాషలో, శైలిలో 12వ శతాబ్దంలోనే విప్లవం ప్రకటించిన కవి పాల్కురికి సోమనాథుడైతే, 19 - 20 శతాబ్దాలలో ఆ పని చేసింది గురజాడ.

సమాజంలో 98 శాతం ప్రజలకు చదువు లేని కాలంలో నాటకమైతే అందరికీ అర్థమౌతుందని గురజాడ నాటకాలు రాశారు. జాతికి తలవంపులు తెచ్చే కన్యాశుల్కం వివాహాల దుష్ఫలితాలను ఎండగడుతూ కన్యాశుల్కం నాటకం రాశారు. అందులోనూ వేశ్యా వ్యతిరేక ఉద్యమకారుల అశాస్త్రీయ ఆలోచనలను ఎత్తి చూపుతూ మధురవాణి పాత్రను సృష్టించారు. ఆంగ్లవిద్య అందించిన మంచికి ప్రతినిధిగా సౌజన్యారావు పంతులును, చెడుకు ప్రతినిధిగా గిరీశాన్ని సృష్టించారు. సమాజంలోని విభిన్న వాస్తవాలకు ప్రతినిధులుగా పాత్రలను సృష్టించారు. నూరేళ్ళు దాటినా ఆ నాటకానికి నేటికీ ప్రాసంగికత ఉండటానికి కారణం అదే.

శృంగార రసపోషణకు వ్యావహారిక భాష సరిపోదని వాదించే సంప్రదాయవాదులకు సమాధానంగా బిల్హణీయం రాశాడు. బాల్య వివాహ దురాచారాన్ని కళ్ళకు కడుతూ పూర్ణమ్మను, స్త్రీ పురుష సంబంధాలలో డబ్బును, పురుషుల పెత్తనాన్ని నిరసిస్తూ 'కాసులు'నూ, స్త్రీలపై పురుషులు చేసే దౌర్జన్యాన్ని విమర్శిస్తూ 'కన్యక'నూ రచించారు. తోకచుక్క కనిపిస్తే దేశానికి అరిష్టం అనే అంధ విశ్వాసాన్ని పూర్వపక్షం చేస్తూ 'ముత్యాలసరాలు' రాశారు. మనిషిని విస్మరించి మనిషి చెక్కిన శిల్పాలను పూజించడాన్ని అధిక్షేపిస్తూ 'మనిషి' కవిత రాశారు. నిజమైన స్నేహాన్ని 'డామన్ పితియస్' కవితలో ఆవిష్కరించారు. కులాంతర, స్థాయీ అంతర వివాహాల్ని ప్రోత్సహిస్తూ 'లవణరాజు కల' రాశారు. సమాజంలో మంచి చెడులను తప్ప సుఖాలను చూడరాదని నూరేళ్ల క్రితం ప్రబోధించారు. అస్పృశ్యతను

'అధర్మ ధర్మం' అన్నారు.

స్త్రీలు చదువుకుంటే చెడిపోరని, చెడిపో తున్న, తప్పుడు బాట పట్టిన మగవాళ్ళను సరిదిద్దుకొని, కుటుంబంలో వచ్చే సమస్య లను నాగరికంగా పరిష్కరించుకుంటారని ప్రతిపాదిస్తూ 'దిద్దుబాటు' కథనూ, పురుషుడు స్త్రీని ఎంత క్రూరంగా మానసికంగా హింసి స్తాడో చూపెడుతూ 'మెటిల్డా' కథనూ రాశారు. మనిషికి మతం కన్నా భౌతిక జీవి తమే ముఖ్యమంటూ 'పెద్దమసీదు' కథను, మతం భక్తి పరిధిని దాటి స్వార్థ పరుల కవిత. దేశభక్తి అంటే ప్రకృతిని, ప్రకృతిలో మతాన్ని కలిపి మనల్ని మనం పొగడుకోవ డంకాదని, దేశభక్తి అంటే మనిషిని మనిషి ప్రేమించడం, మంచిని పెంచడమని గుర జాడ ప్రబోధించారు. మనిషి శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు దేశం బాగుంటుందని, అన్ని మూలల నుంచి జ్ఞానాన్ని సంపాదించి దేశి సరుకులతో దేశాన్ని సుసంపన్నం చేయమన్నారు. జాతులు మతాలతో సంబంధం లేకుండా ప్రజలు అన్న దమ్ముల్లా కలిసి జీవించాలన్నారు. ప్రజలు

విజయనగరంలోని గురజాడ ఇల్లు

చేతిలో ఆయుధంగా మారిన వైనాన్ని 'మీపే రేమిటి' కథగాను రాశారు. వేశ్యా సమస్య నిర్మూలన కోసం వేశ్యలనే నిర్మూలించే అశా స్త్రీయతను ఎత్తి చూపుతూ 'సంస్కర్త హృదయం' కథను రాశారు. నిజానికి గురజాడ ఈ కథను 'స్టూపింగ్ టు రైజెస్' పేరున ఇంగ్లిషులో రాశారు. ఆయన మరణానంతరం అవసరాల సూర్యారావు 'సంస్కర్త హృదయం'గా తెనిగించారు.

గురజాడ సాహిత్యమంతా ఒక ఎత్తయితే ఆయన రాసిన 'దేశభక్తి' కవిత ఒక్కటే ఒకెత్తు. గురజాడ రాసిందంతా సంఘ సంస్క రణ సాహిత్యమైతే 'దేశభక్తి'మాత్రం రాజకీయ సాటి మనిషి కోసం సొంతలాభాన్ని కొంత త్యాగం చెయ్యమన్నారు. శ్రమతో దేశం సుభిక్షం కావాలన్నారు. ఇదీ గురజాడ ప్రబో ధించిన ప్రతిపాదించిన 'దేశభక్తి'. భారతీయుల దేశభక్తి గీతాల్లోకెల్లా గురజాడ 'దేశభక్తి' ఉదాత్తమైంది, ఉన్నతమైంది.

రచయిత ఒక సమస్యను తీసుకొని రచన చేస్తే, కొంతకాలానికి ఆ సమస్య పరి ష్కారమైనా ఆ రచనకు విలువ నిలిచేట్టు ఎలా రాయాలో గురజాడను చూసి నేర్చుకో వాలి. 'కన్యాశుల్కం' సమస్య ఇవాళ లేకపో యినా, ఆ నాటకానికి ఇంకా విలువ ఉండటా నికి కారణం గురజాడ రచనావిధానం, చేసిన వ్యాఖ్యలే కారణం.

గతంలో కూరుకు పోకుండా గతంలోని కొంచెం మంచిని స్వీకరించి అడుగు ముందుకు వెయ్యాలని ప్రబోధించారు గుర జాడ. ఆయన ముందుచూపునకు ప్రతి తెలుగు వ్యక్తీ నమస్కరించాలి. చీకట్లోంచి వెలుగులోకి నడవాలంటే గురజాడ సాహి త్యాన్ని కూలంకషంగా చదవాలి. ▪

జీవితంలో ఎంత వైవిధ్యం వుంది!
ఎంతటి తీవ్రగమనం వుంది! నేటి
జీవితం పుష్కలమైన అనంతమైన
గాథలతో నిండి వుంది. అయినా,
దానిని మన రచయితలు దర్శించరు.
అభిరుచి, గుణదోష నిశ్చయ జ్ఞానము
వున్న రచయిత ఒక కావ్యాన్ని
రచియిస్తున్నప్పుడు అతని సృజన,
విమర్శనాత్మక శక్తులు రెండూ కుడి
ఎడమలుగా ఆ కావ్యసృష్టిని
కొనసాగిస్తాయి. భావ, భావోద్వేగ
పాత్ర సన్నివేశాదులను మేధ
సృష్టిస్తూవుంటే వాటికి విమర్శనాత్మక
శక్తి గీటుపెట్టి కొన్నిటిని స్వీకరిస్తుంది.
కొన్నిటిని తిరస్కరిస్తుంది.
ప్రతిభాక్షేత్రం ఒక టంకసాల వంటిది.
రచయిత సృష్టించేవి, అందు
తయారయే నాణెముల వంటివి.
టంకసాల తయారుచేసిన నాణెములు
చెల్లునో చెల్లవో మోగించి చూసినట్లు
వీటిని విమర్శనాత్మక శక్తి
ఉపాదేయములగునో కావో
పరీక్షిస్తుంది.

– గురజాడ

విమర్శకులు, పరిశోధకులు.
ఆచార్యులు, యోగివేమన
విశ్వవిద్యాలయం, కడప.
94402 22117

శ్రీనాథుని ప్రేమ లేఖ!

డా. సంగనభట్ల నరసయ్య

శ్రీమదసత్యమధ్యకును, చిన్ని వయారికి, ముద్దులాడికిన్
సామజయానకున్, మిగుల చక్కని ఇంతికి! మేలు కావలెన్
మేమిట క్షేమ మీవరకు, మీ శుభవార్తలు వ్రాసి పంపుమీ,
నామది నీదు మోహము క్షణంబును దీరదు, స్నేహబాంధవీ!

శ్రీనాథుని పద్యాలనేకం స్త్రీ అంగాంగ వర్ణనలతో కావ్యాల్లోనూ, చాటువుల్లోనూ ఉన్నాయి. చాటు పద్యాల్లో అధికం ఆయన శృంగారాసక్తిని, భోగలాలసను సూచిస్తాయి. అందుకే ఆయన్ను శృంగార శ్రీనాథుడంటారు. ఆహార, ఆహార్య, విహారాల్లో ఆయన భోగజీవితేచ్ఛ అడుగడుగునా కనిపిస్తుంది. ఆయన సంచార జీవనం, నానారాజ సందర్శనం, అంకితోత్సవాలు, వాగ్విజయ సభలు, రాజసన్మానాలు, శృంగార జీవనం చాటువుల నిండా పరుచుకొన్నాయి. స్త్రీ శృంగారాన్ని వర్ణించే ఇతర కవులవి కూడా శ్రీనాథునికి అంటగట్టినవి ఉన్నాయి. కానీ ఒడుపు, ఎత్తుగడ, పదబంధాలు, సంస్కృత సమాసాలు శ్రీనాథుని శైలితో మెరుస్తూ ఆయనవిగానే ఋజువు చేస్తాయి. పై పద్యం శ్రీనాథుని ఇతర పద్యాల్లా అన్యకాంతామోహం, పర స్త్రీ సౌందర్య వర్ణనతోగాక, సభ్య వర్ణనతో భార్యను ఉద్దేశించిన లేఖగా కనబడుతుంది.

శ్రీమత్= సంపదలతో లేదా సౌభాగ్యముతో కూడింది. ఈ సంబోధన పుణ్య/గౌరవ స్త్రీలకు వేసే విశేషణం. పైగా లేఖా సంప్రదాయంలో తొలిపదం. ఈ ప్రారంభ పదమే 'లేఖ' అనడానికి గుర్తు. అసత్య మధ్యకు= సన్నని నడుము కలదని, చిన్ని వయారికి= చిన్న వయసులోనిదని, ముద్దులాడికిన్= ముద్దుమురిపాలిస్తున్న శ్రీమతికి అని. అసత్య మధ్య అంటేనే నడుం పెరగలేదని, మధ్య వయస్క, ప్రౌఢకాదని తెలుస్తోంది. ఈ విశేషణాల్లో సభ్యత వల్ల భార్యకు వేసిన విశేషణాలుగా భావించవచ్చు.

మేలు కావలెన్= ఆశీస్సులందిస్తున్నాడు. తొలి పదం లేఖ ప్రారంభంగా, తొలి వాక్యాంత క్రియ ఆశీస్సుగా లేఖగా ధ్రువీకరిస్తూ లేదా?

మేమిట క్షేమము= తన క్షేమం తెలుపుతున్నాడు. 'ఇట' అంటే తన ఊరి నుంచి భార్యను వదిలి బయల్దేరి, చాలా దూరంగా వచ్చి ఈ పద్యం రాసిన ఊరికి వచ్చేవరకు క్షేమంగా ఉన్నానంటున్నాడు.

మీ శుభవార్తలు= మీరంటే తన భార్య ఒక్కతే ఐతే ఏకవచనం ఉండేది. భార్యతో బాటు శిశువైన తన సంతానమో లేక తన 'మదేక పుత్ర' తల్లి లేదా తండ్రి (జీవితులుగా ఉంటే), అంటే కుటుంబం అంతా అని బహువచనం వాడాడు. వ్రాసి పంపుమీ= ఈ లేఖ తెస్తున్న శిష్యుని ద్వారా తిరుగులేఖ పంపమంటున్నాడు. అయ్యో! ఇప్పటికైనా ఈ పద్యం ఉత్తరం అని ఒప్పుకుంటారుగా!

నీదు మోహము= నీపై అనురాగం. నామది క్షణంబు దీరదు = ఎంత పనుల ఒత్తిడిలో ఉన్నా నువ్వే గుర్తుకు వస్తున్నావని, స్నేహబాంధవీ! = స్నేహ బాంధవ్యాలు (అనురాగం, భార్యత్వం) కల్గినదానా!

ఇది శ్రీనాథుని రచనే అని చెప్పడానికి పై విశేషణాలే సాక్ష్యమిస్తున్నాయి. అసత్యమధ్య, వయారి, ముద్దులాడి, సామజయాన వంటివి ఆయన తరచూ వాడే పదాలే. ప్రతి కవికీ కొన్ని పదబంధాలు పడికట్టుగా ఉంటాయి. శ్రీనాథుడు 'దీనారటంకాల...' పద్యంలో రావుసింగమహీపాలుని రాచకొండ రాజ్యసభలో ఎటుల మెప్పించెదో అంటూ 'సరస సద్గుణ నికురంబ శారదాంబ' అని సంబోధించాడు. తానే తిరిగి ఫిరంగిపుర శాసనాన్ని రాస్తూ 'సరస సద్గుణ నికురంబ సూరమాంబ' అని శాసనకర్త(దాత) పేరును అదే పదబంధాలతో సూచించాడు. 'శ్రీనాథో విద్యాధికారీ శ్రీ వీరవేమ భూపతేః' అని శాసనం చివర్లో తన పేరును, తన 'విద్యాధికారి' హోదాను సూచించాడు. (ఇక్కడ యతి భంగం. సరసకు బదులు సురస అని ఉంటే యతి కుదురుతుంది.)

శ్రీనాథుడు భార్యకు లేఖ రాయడానికి వచనం వాడాలి. కాని పద్యం రాస్తాడా? అని అడిగే వీల్లేదు. ఆయన జీవితంలో ప్రతి సంఘటనను ఛందోబద్ధం చేశాడు. ఆఖరుకు తన ఆత్మహత్యను కూడా 'అరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి' అని పద్యంలో రాసుకున్న జీవకవి.

ఆయనవి దొరికినన్ని చాటువులు మరెవరివీ దొరకలేదు.

భార్యకు పద్యలేఖ రాయడంలో తప్పేం లేదు. ఆవిడా కవయిత్రి కావచ్చు. లేదా పద్య సౌగంధ్యాన్ని పరవశించే పడతి కావచ్చు. శ్రీనాథుని శ్రీమతా మజాకా? తెలుగు కవులు తమ భార్యల గూర్చి, వారి వైదుష్యం సంగతి (వారిజ భవుడెరుగు) పేరైనా చెప్పరైరి (కృష్ణరాయని కావ్యాల్లో తప్ప).

(డా॥కోడూరి ప్రభాకరరెడ్డి సంకలనం 'శ్రీనాథుని చాటువులు'లోని ఓ పద్యం ఆధారంగా)

ప్రముఖ భాషా పరిశోధకులు. విశ్రాంత ఆచార్యులు,
ధర్మపురి (కరీంనగర్ జిల్లా) ప్రభుత్వ కళాశాల.
హైదరాబాద్. 94400 73124

పరభాషా పరాయణత్వం

"సతియును గుణవతియు బ్రజా
పతియు ననువ్రతయు నైన వనిత నవజ్ఞా
న్వితదృష్టి జూచు నతి దు
ర్మతి కిహముం బరము గలదె? మతి బరికింపన్"

"అటజని కాంచె భూమిసురు డంబర చుంబి శిరస్సరజ్ఝరీ
పటల ముహుర్ముహుర్లుఠ దభంగ తరంగ మృదంగ నిస్వన
స్ఫుట నటనానుకూల పరిఫుల్ల కలాప కలాపి జాలమున్
కటక చరత్కరేణు కరకంపిత సాలము శీత శైలమున్"

శ్రీధర్

పై రెండు పద్యాలూ తెలుగు గ్రంథాల్లో ఉన్నవే, తెలుగు పద్యాలుగా చలామణి అవుతోన్నవే. కాని వాటిలో అచ్చ తెలుగు మాటలు ఎన్ని? అసలున్నాయా? మొదటి పద్యంలో 'అయిన', 'చూచు', 'కలదె', 'పరికింప' అనే నాలుగు మాటలు మాత్రమే తెలుగు. రెండో పద్యంలో 'అటజని' వరకే తెలుగు.

ఆయా దశల్లో రాజభాషో, గౌరవభాషగా చలామణీ అవుతున్న భాషో తెలుగు మీద చాలా ప్రభావాన్ని చూపాయి. అరబ్బీ, పార్శీ, ఉర్దూ, ఆంగ్లం, చాలా ఎక్కువగా సంస్కృతం తెలుగును ఆక్రమించేశాయి. 'భాష' అనే మాట సంస్కృతం. మరి దాన్ని తెలుగులో ఏమనాలి? 'రైతు' అనేది మన మాట కాదు. మన పలుకులో దాన్నేమంటాం?

అంతెందుకు 'దేవుడు', 'దేవత' దైవ సంబంధ మాటలన్నీ సంస్కృతానివే. తెలుగువాళ్లకి దేవుడు లేడా? (అయ్యో దేవుడా) ఏమని పిలవాలి? ఎలా కొలవాలి? దేవుడికి అన్ని భాషలు అర్థమవుతాయి కనుక సరిపోయింది. తెలుగు మాత్రమే వచ్చి ఉంటే మన గతేమయ్యేది? తెలుగులో ఆయన పేరు మనకి తెలియదు. మరో భాషలో పిలిస్తే తనకి తెలిసే పరిస్థితి ఉండదు. (తెలుగులో అనాలంటే 'వేలుపు', 'ఎల్లడు', 'ఎల్లి' అనాల్లెండి) దేవుడి సంగతి వదిలేస్తే తెలుగు వాళ్లకి దిక్కులు కూడా లేవు. ఉత్తర దక్షిణాలు, ఈశాన్యం, నైరుతి, వాయువ్యం, ఆగ్నేయం అన్నీ సంస్కృతాలే. దిక్కున్నచోట చెప్పుకొమ్మని తెలుగువాడితో అంటే పాపం ఎక్కడికెళ్లి చెప్పుకొంటాడు. అందుకే ఎక్కువ సార్లు దిక్కున్న చోటికెళ్లమని తెలుగులో సునాయాసంగా తిట్టేస్తాం.

'ముఖాన్ని' తెలుగులో ఏమనాలి? ముఖానికి తెలుగేంటంటే ఏం ముఖం పెట్టుకుని సమాధానం ఇస్తాం?

కొంచెం చాదస్తం ఉన్న పాతతరం వాళ్లంతా ఆడపిల్లలు లంగా ఓణీల్లో చక్కగా ఉంటారనీ తెలుగమ్మాయిలా వెలిగిపోతుంటారనీ అంటారు. లంగా ఓణీలు జాకెట్టు తెలుగు మాటలని చాలా మంది నిజంగానే నమ్ముతారు కూడా. 'లంగా' అసలు రూపం 'లెహంగా'. ఇది హిందీ శబ్దం. 'ఓణీ' 'ఓఢ్నీ' నుంచి వచ్చింది. ఇది హిందూస్థానీ మాటే. తెలుగు కానే కాదు. జాకెట్, గౌన్ ఇంగ్లిషు మాటలు, 'ధోతి' హిందీ మాటే. ఇలా చెబుతూపోతే నాలుగులో మూడొంతులు ఇతరేతర భాషా పదాలే తెలుగును శాసిస్తున్నాయి.

దినం దినం ఆ శాతం అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. ఎందుకలా? మరి తెలుగులో మాటలు లేవా? లేకుండానే శతాబ్దాలుగా భాషగా చలామణీ అవుతోందా. అలా కొనసాగటం అసాధ్యం. చుట్టూరా ఉన్న వస్తు సంచయానికీ, మనిషిలో ఉండే ప్రతి భావానికీ, ప్రతి దైనందిన చర్యకూ

మాటంటూ లేకపోతే అది భాషే కాదు. ఇతరేతర కారణాల వల్ల ఇతరేతర భాషా పదాలు తెలుగులోకి చొచ్చుకున్నాయి. వస్తున్నాయి. తెస్తున్నాం. అలా తెచ్చుకోవటం ఎంతో సులభం. అదే తెలుగు మాట కోసం వెదకాలంటే అదో యజ్ఞం చేసినంత పని. అందిన మాట దొరకబుచ్చుకొని వెళ్లిపోవటమే సులభమనిపిస్తుంది.

తెలుగు రాయటం, మాట్లాడటం ఒక రకమైన తక్కువతనంగా భావిస్తున్నారు తెలుగు వాళ్ళు. చాలాకాలం కిందట హైదరాబాద్ పాత బస్ డిపోలో కర్నూలు వైపు వెళ్తున్న ఒక పెద్దావిడ “సేపెంత నాయనా” అని ఒక యువకుణ్ని అడిగింది. (హైదరాబాద్‌లో యాపిల్ పళ్లని సేపులంటారు) బిత్తరపోయాడా యువకుడు. “నేనేం సేపులమ్మట్లేకదా పెద్దమ్మా! సేపుల ధర నాకు తెలీదు, బయటకెళ్లి అడగండి” అన్నాడు.

“కర్నూలు బస్సు రావటానికి ఇంకెంత ‘సేపు’ పడుతుందని” మళ్లీ అడిగిందావిడ.

“కాసేపట్లో వచ్చేస్తుం”దన్నాడతను. ఈసారి ‘సేపు’ అనే తెలుగు మాటకి అర్థం బోధపడి ఉంటుంది. ఇలాంటి పదాలు వాడటం మనకిప్పుడు నామోషీ. కనుక అవి చచ్చిపోతాయి. కాని కొన్ని మాత్రం సామెతల్లోనూ, నానుడుల్లోనూ మిగిలే ఉంటాయి.

గ్రామీణుల వాడకంలోనే కాకుండా, ప్రాచీన సాహిత్యంలోనూ, పోతన భాగవతంలోనూ, శ్రీనాథుని కావ్యాల్లోనూ, వేమన శతకంలోనూ, అన్నమయ సంకీర్తనల్లోనూ అచ్చతెలుగు పదాలు అచ్చుగుద్దినట్టుంటాయి... పాత తెలుగు పాటల్లోనూ తెలుగు నుడికారాల్నీ తేట తెలుగు మాటల్నీ విరివిగా వాడారు. అచ్చ తెలుగు కావ్యాల్లో సరే సరి.

‘...చెలువములన్నీ చిత్ర రచనలే...’లోని ‘చెలువం’ ఇందుకు మంచి ఉదాహరణ. ఇదే మాట అన్నమయ సంకీర్తనలో “... ఇంతి చెలువపు రాశి” (అందాల రాశి) అని ఉంది.

ఇవాళ పత్రికలు ఆంగ్ల భాషా పదాల స్థానంలో తెలుగు మాటల కోసం వెదకక సంస్కృత, ఉర్దూ మాటలతో భర్తీ చేస్తున్నాయి. (‘భర్తీ’ కూడా మన పలుకు కాదు). దొరికితే తెలుగు మాటలు తీసుకురావాలి. లేదా అన్య భాష పదాన్ని అలాగే కొనసాగించాలి. తద్వారా తెలుగు పరిపుష్టమవటమే కాకుండా అందరికీ తెలిసిన పదం వాడటం అవుతోంది. ‘ఇంటర్‌నెట్’ అనే మాట అందరికీ సుపరిచితం. సులభగ్రాహ్యం. అంతర్జాలం అనేది తెలుగేం కాదు.

పరిస్థితుల మూలంగా, కాలం మార్పిడి మూలంగా, పట్టణీకరణ మూలంగా, అవసరార్థం ఆంగ్ల విద్య మూలంగా, అభివృద్ధి మూలంగా తెలుగు మాటలు మూలబడుతున్నాయి. ‘రాచిప్ప’ ఇప్పుడు ఎవరికీ తెలియదు. అక్కర్లేదు. శిబ్బెం (చూ. కన్యాశుల్కం), గోకర్ణం, స్త్రాళీ, చెంబు, బిందె, జాంబు లాంటి వస్తువులూ వాటి వాడకం అంతరించిపోయింది. పొయ్యీ, రోలురోకలీ కూడా అంతరించటానికి అడుగులేస్తున్నాయి. విసుర్రాయి (తిరగలి), రుబ్బురాయి పోతున్నాయి. ఇలా అవసరం లేకుండా అంతరించే వాటిని ఎవరూ ఏ భాషలోనూ ఆపజాలరు. అవి నిఘంటువులకే పరిమితమయిపోతాయి. కానీ దైనందిన జీవితంలో అక్కరకొచ్చే అచ్చ తెలుగు పదాల్ని అంతరింపజేసుకోవటం సరి కాదు. మనసుపెట్టి వెదికితే, వివిధ ప్రాంతాల నుడికారాల్ని పరిశీలిస్తూ అర్థం చేసుకుంటూపోతే కోకొల్లలుగా తెలుగు మాటలు దొరుకుతాయి.

కార్టూన్ ఎడిటర్,
ఈనాడు, హైదరాబాద్.
91770 04848.

మూలం



గడ్డపెరుగు రుచిలో
ఘనత నాదంటేను,
చుక్క చేమిరిబొట్టు*
ఒక్క పెట్టున నవ్వె.

కడివెడును పాలెల్ల
వడివడిగ నే కుదప
ఆర్ద్రమగు ఆ మేను
అలసి ‘ముద్దాయె’ననె.

★ ★ ★

బుడ్డిదీపము బలము
ఒడ్డితని కడునీల్గ
చిమ్మచీకటి మొగము
చిటిలించి నవ్వుకొనె.

పుడమిపై వెలుగున్న
పుటుక నీకుండునే?
నాబలిమి దట్టమై
నిను ‘కొండ’ జేసెననె.

★ ★ ★

తుది మొదలు కానకయె
తుళ్ళిపడు సంద్రమును
వాగు వంకయు, నోరు
వెళ్ళబెట్టియు చూసె.

వెక్కసంబగు జలము
వేలముఖముల తోడ
ఉరికి మోయగ తాము
ఉదధి గొనె ఖ్యాతిననె.

★ ★ ★

పోటెత్తు మతములను
కోట్లాది వేషములను
ఆడంబరము జూసి
అంతర్మాతయు నవ్వె.

ప్రాణిలో దాగున్న
పరమాత్మ రూపమును
కనెడు మతమరయుమదె
‘కరుణ’ గాకేదనెను.

★ ★ ★

విశ్వ ద్వారమ్మునని
వింత వాదన చేయు
ఆంగ్ల విపరీతమ్మున
కాంధ్రమ్ము నవ్వుకొనె;

పై పలుకులే నీవి
హృదయ భావము నాది
ద్వారమేదైన, నే
తెరచు తాళమ్మునె.

* పాలల్లో తోడుకు వేసే పెరుగు

డా॥ దండెబోయిన పార్వతీదేవి, కర్నూలు, 94408 34017

'పోటీ'కి రాని తెలుగు

మనిషి సుఖంగానూ సంతృప్తి గానూ జీవించడానికి 'ఉపాధి' అవసరం. ఏ ఉపాధికైనా భాషా నైపుణ్యం తోడ్పడుతుంది. పక్క రాష్ట్రాల్లో ప్రయివేటు రంగాల్నీ భాష విషయంలో నిర్దేశిస్తోంటే... మన రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో తెలుగు పరిస్థితి నానాటికీ తీసికట్టు చందంగా మారుతోంది. ఉపాధి కల్పించలేకపోతే భాష బతికేదెలా?

డా. ద్వా.నా.శాస్త్రి

తెలుగు మన రాష్ట్రంలో అధికార భాష. పరిపాలనా నిర్వహణగానీ, ఉత్తర ప్రత్యుత్తరాలుగానీ తెలుగులోనే జరగాలన్న ఉత్తర్వు ఉంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలన్నిటిలోను తెలుగు తప్పనిసరి. మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో ఏ ప్రభుత్వ ఉద్యోగానికైనా అక్కడి మాతృభాషలో యోగ్యతాపరీక్షలో కనీస మార్కులు పొందవలసి ఉంటుంది. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే మన రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడానికి తెలుగు రానక్కరలేదు. తెలుగు రాయటం (కొండొకచో మాట్లాడటం) రాకున్నా ప్రభుత్వ ఉద్యోగం వచ్చేస్తుంది. మన పాఠశాలల్లో, కళాశాలల్లో కూడా తెలుగు ప్రథమ భాషకాదు - ద్వితీయ భాష. ఈ తెలుగు స్థానంలో మరొక భాషను తీసుకోవచ్చు. అంటే తెలుగు ఐచ్ఛికం అన్నమాట! ఈ దుస్థితి ఏ రాష్ట్రంలోనూ లేదు. త్రిభాషా సూత్రాన్ని పాటించే రాష్ట్రమూ మనదే.

> తెలుగు పండితులు, అధ్యాపకులకోసం నిర్వహించే పరీక్షలలో తెలుగు తప్పనిసరి గదా (డి.ఎస్సీ, జె.ఎల్., డి.ఎల్)
>
> ఇటీవల కొత్తగా "ఉపాధి అర్హత పరీక్ష" (టెట్) నిర్వహిస్తూ తెలుగు భాషాసాహిత్యాలకి 30 మార్కులు కేటాయించింది.
>
> ఎస్.ఐ. ఆఫ్ పోలీస్ పరీక్షలో 100 మార్కులకి 'తెలుగు భాషా సామర్థ్యం' అంశం ఉంది.
>
> సివిల్స్‌కి అర్హత పరీక్షగానూ ఐచ్ఛికంగాగాను తెలుగు ఉంది.
>
> గ్రూప్ I, గ్రూప్ II పరీక్షలు ఎ.పి.పి.యస్.సి. నిర్వహిస్తుంది. వీటిల్లో ప్రస్తుతం తెలుగు నామమాత్రంగా, తూతూమంత్రంగానే ఉంది.

2004 పూర్వం కొంత తెలుగు వెలుగు ఉండేది. ఆ తరువాతి పాలకుల హయాంలో కనుమరుగైపోయింది. గ్రూప్-I, గ్రూప్-II పరీక్షలలో ఆప్షనల్స్ పద్ధతి ఉండేది. చాలామంది గ్రామీణ ప్రాంతాల తెలుగు మీడియం వాళ్ళు, వెనుకబడిన కులాల వాళ్ళు ఈ ఐచ్ఛికాలలో ఒకటిగా తెలుగు ఎంచుకొని ఉద్యోగాలు సంపాదించారు. తెలుగు విస్తృత ఆదరణ పొందిన ఐచ్ఛికాంశంగా నిలుస్తోంది. 2004 తరువాత దీనికి స్వస్తి పలికారు. తెలుగు, చరిత్ర, భౌతిక శాస్త్రం తీసుకొన్న వారే ఉద్యోగాలు సంపాదిస్తున్నారు తప్ప మిగిలిన వాళ్ళు సంపాదించలేకపోతున్నారన్నది వారి వాదన. ఏది ఎంచుకోవాలన్న స్వేచ్ఛ అభ్యర్థికి ఉండటం ప్రజాస్వామ్యం! ఇవే చదవాలని ఆదేశించటం నియంతృత్వ లక్షణం!

సరే ఐచ్ఛిక పద్ధతే రద్దయింది కాబట్టి కొంతమేరకు అర్థం చేసుకోవచ్చు. అయితే ఇక్కడొక అసంబద్ధమైన పని జరిగింది. ఆంగ్ల భాషా సామర్థ్యం అనే పాఠ్యాంశం అందరికీ తప్పనిసరిగా నిర్ణయించారు. తెలుగును నెట్టి పారేశారు. తెలుగులో పరిపాలన, కార్యనిర్వహణ చేయవలసిన ఈ అధికారులకి తెలుగులో సామర్థ్యం లేకున్నా ఫరవాలేదట! ఇది వింతగా ఉంది. ఎందుకంటే సివిల్స్ పరీక్షలో ఆయా అభ్యర్థులకి తమ మాతృభాషలో అర్హత పరీక్ష తప్పనిసరి! అది కేంద్ర ఉద్యోగాల పరీక్ష! అయినా మాతృభాషకి ప్రాధాన్యం! మనది రాష్ట్రంలో పరీక్షయినా మాతృ భాషపై నిర్లక్ష్యం! ఈ పరిస్థితి పట్టించుకునే పాలకులే కరవయ్యారు.

ఎన్. టి. ఆర్. పాలనలో తెలుగు మాధ్యమంలో చదివిన వాళ్ళకి ఉద్యోగాల్లో ఐదు మార్కులు అదనంగా కలిపి ప్రోత్సహించారు. తర్వాత అది రద్దయింది. తెలుగు మాధ్యమంలో చదివినవారిని ఏదో ఒక అదనపు ప్రయోజనంతో ప్రోత్సహిస్తే మంచి రోజులు వస్తాయి.

ఎస్.ఐ. ఆఫ్ పోలీస్ ఉద్యోగానికి నిర్వహించే పరీక్షలో తెలుగు భాషా సామర్థ్యం అనే అంశం ఉంది. ఇందులో సాహిత్యానికి ప్రాముఖ్యం లేదు. భాషా నైపుణ్యానికి, భాషా వినియోగానికే ప్రాధాన్యం. తెలుగు ఉండాలి అంటే సాహిత్యమే ఉండాలన్నది సరికాదు. తెలుగు అంటే సామాన్యులకు దైనందిన వ్యవహారాల్లో ఉపయోగపడే తెలుగు అని అర్థం!

తమిళనాడు ప్రభుత్వం కేంద్రం నిర్వహించే స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఉద్యోగాలకు పరీక్షలు తమిళంలోనూ నిర్వహించాలని ఒత్తిడి తీసుకువస్తుంటే మనం ఉన్నదే రద్దు చేసి నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నాం.

సివిల్స్‌లో అర్హత పరీక్షగా ఆంగ్లం ఉంది. అయితే మిజోరాం, నాగాలాండ్ వంటి రాష్ట్రాల వారికి మాత్రం ఆంగ్లానికి బదులుగా వారి మాతృభాషలను ఎంచుకునే వీలుంది. ఈ పద్ధతిని అన్ని రాష్ట్రాలకూ వర్తింపజెయ్యాలి. పరీక్షలు మాతృభాషలో రాయవచ్చన్నపుడు అర్హత పరీక్షను కూడా మాతృభాషలో రాయవచ్చు కదా.

సివిల్స్‌లో తెలుగును ఐచ్ఛికాంశంగా తీసుకొని ఇంతకుముందు ర్యాంకులు సాధించారు. ఇప్పుడా పరిస్థితి మారబోతోంది. కారణాలు రెండు:

1. సివిల్స్ తెలుగు ప్రశ్నపత్రం రూపొందించే వారు తమ పాండిత్యాన్ని, పైత్యాన్ని ప్రదర్శించటం.
2. ఈ సంవత్సరం నుంచి పద్య వ్యాఖ్యానాలలో ఎంపిక అవకాశం లేకుండా చేయటం.

సివిల్స్‌లో తెలుగును ఎంచుకొంటున్న వాళ్ళు పండితులూ, భాషానిపుణులూ కాదు. ఎం.బి.ఎ., బి.టెక్., ఎం.టెక్., పి.జి. చదివినవారు! వీళ్లేమీ తెలుగు అధ్యాపకుల కోసం పరీక్ష రాయటం లేదు. ఉన్నత ఉద్యోగాల పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించటం కోసం తెలుగును ఎంచుకుంటున్నారు. మరి వీళ్ళకి విశ్వవిద్యాలయ స్థాయికి మించిన ప్రశ్నలివ్వటం సమంజసమా? "ఋషి వంటి నన్నయ్య రెండవ వాల్మీకి - సమర్థించండి? " అనే ప్రశ్నకి సమాధానం ఆ ప్రశ్న ఇచ్చినవారిని రాయమనండి. హేమాహేమీలకే అది సాధ్యం కాదు. మామూలుగా దానిని వ్యాఖ్యానించమంటే వ్యాఖ్యానిస్తాం. కానీ అరవై మార్కుల ప్రశ్నగా ఇస్తే - అది సముచితమా? ఇటువంటి ప్రశ్నలు తెలుగు అధ్యాపకులుగా నియమితులయ్యే ఎం.ఎ. విద్యార్థులకి ఇవ్వాలి! వాళ్ళకి ఇలా ఇవ్వరు. పద్యవ్యాఖ్యానాలు అనే అంశం సివిల్స్‌లో ఉంది. ఇది తమిళ, కన్నడ భాషలలో తప్పనిసరి కాదనీ, ఎంచుకునే అవకాశం ఉందనీ తెలిసింది. మన తెలుగులో దీనిని తప్పనిసరి చేశారు విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యులు! ఇలాంటప్పుడు మన తెలుగు ప్రాధాన్యం కోల్పోవడానికి పోటీ పరీక్షలలో తెలుగు భాషా సాహిత్యాలపై ప్రశ్నపత్రం రూపొందించే ఈ ఆచార్యులే కారణం అనాలి. ఓసారి ఈ ప్రశ్న ఇచ్చారు:

జైమినీ భారతం రాసినది

1. పిల్లలమర్రి పినవీరభద్రుడు
2. కళువె వీరరాజు
3. సముఖము వేంకటకృష్ణప్ప నాయకుడు
4. చేమకూర వేంకటకవి

ఇది అసంబద్ధ ప్రశ్న. ఎందుకంటే 'జైమిని భారతం' పద్య కావ్యంగానూ రాశారు, వచన కావ్యంగానూ రాశారు. ఈ వివరణ లేకుండా ప్రశ్న ఇచ్చారు. కానీ అభ్యర్థి దృష్ట్యా ఇది మార్కుల సమస్య! 'జైమినిభారతం' కావ్యం రాసింది పిల్లలమర్రి పినవీరభద్రుడు! 'జైమినిభారతం' వచన కావ్యం రాసింది సముఖము వేంకటకృష్ణప్ప నాయకుడు!

ఇటీవల ఉపాధ్యాయులందరికీ అర్హత పరీక్షగా 'టెట్' (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) అమలులోకి వచ్చింది. ఇందులో అర్హులైన వారే డి.ఎస్.సి. పరీక్షకి యోగ్యులు. ఇందులో ముప్పయి మార్కులకి తెలుగు అందరికీ తప్పనిసరిగా నిర్ణయించారు. అభినందించదగినదే. కానీ- ఆశ ఆకాశమంత నోరు సూది బెజ్జమంత అన్న చందంగా తెలుగు సిలబస్ ఉంది. సిలబస్ బాగా ఎక్కువ నిర్ణయించి మార్కులు తక్కువగా ఉండటం అనుచితం. సిలబస్ నిర్ణయించటంలో ఆబ్జెక్టివ్ పద్ధతి, అభ్యర్థికి అనుగుణంగా లేదు. తెలుగు బోధనా పద్ధతులు అందరికీ ఎందుకు? పద్యబోధన, వ్యాకరణ బోధన వంటివి తెలుగు పండితులకి తప్ప మిగిలినవారికి ఎందుకు? దీనితో చాలామందికి తెలుగు పట్ల అనాసక్తి ఏర్పడుతోంది. కాబట్టి తెలుగు భాషను కాపాడుకోవాలంటే పోటీ పరీక్షల్లో మార్పులు రావాలి...

ఇవి జరగాలి

1. రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి ఉద్యోగాలకోసం నిర్వహించే పరీక్షలలో తెలుగును తప్పనిసరి చేయాలి (తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లోలా)
2. పోటీ పరీక్షలలో తెలుగు అంటే తెలుగు సాహిత్యం కాదనీ, కవిత్వం కాదనీ అర్థం చేసుకోవాలి.
3. భాషా వినియోగం, అనువాదం, లేఖారచన, భాషా విశేషాలపై శ్రద్ధ వహించాలి.
4. సాహిత్యాన్ని సంగ్రహంగానే పరిచయం చేయాలి.
5. మాండలికాలపై అవగాహన కల్పించాలి.

పోటీ పరీక్షలలో తెలుగు అంటే సాహిత్యం కన్నా భాషా ప్రయోగాలకి (ఎస్.ఐ. ఆఫ్ పోలీస్‌లో, సివిల్స్ అర్హత పరీక్షలోలాగా) ప్రాధాన్యం ఇవ్వాలి. 'తెలుగు నేర్చుకొంటే నాకు ఉద్యోగం వస్తుంది' అనే ధీమా, ఆత్మవిశ్వాసం కలిగే పరీక్షాపద్ధతి రావాలని ఆశిద్దాం.

ప్రముఖ రచయిత,
సాహితీ విమర్శకులు,
హైదరాబాద్. 98492 93376

గిల్లిపాడిన జోల

రమాదేవి జాస్తి



"నిన్ను చంపేద్దాం అనుకుంటున్నా పేరిశాస్త్రీ!" హోటల్‌కి వచ్చి గంటయింది. అప్పట్నుంచీ ఒక దాని తర్వాత మరొకటి తెప్పించుకుంటూ, వాటి రుచులు వర్ణించుకుంటూ అదే పనిగా మింగడమే సరిపోతోంది కాని, మాట్లాడే అవకాశమే ఇవ్వని పేరిశాస్త్రిని చూసి చూసి కడుపుమండి కసిగా చెప్పేడు రంగబాబు.

"నీతో తక్షణం మాట్లాడాలి, రావయ్యా", అని ఫోన్ చేస్తే ఈ హోటల్లో కలవమన్నాడు, ఇట్లా కడుప్పగిలేట్టు తినడాని క్కాబోలు. తనేమో కనీసం మంచినీళ్లయినా తాగలేదు. "పిచ్చి రంగబాబూ, కనీసం వారానికిద్దరు ముగ్గురైనా యిట్లా చెప్తూనే ఉంటారు నాకు. చావుకి భయపడితే మేమీ వృత్తి లోకి రాగలమా? వచ్చినా యిన్ని తరాలుగా విజయవంతంగా నెగ్గుకు రాగలమా?!" పేరిశాస్త్రి గొప్ప హాస్యోక్తి విన్నట్టు నవ్వుతూ చెప్పేడు

"మొండికెత్తిన దాన్ని మొగుడేం చేస్తాడు? రచ్చ కెక్కిన దాన్ని రాజేం చేస్తాడు?" అన్నట్టు చావు భయం లేనివాడిని ఎవరేం చేస్తారు? నిమ్మకు నీరెత్తినట్టు చక్కగా గజం పొడుగున్న గాజు కప్పులోంచి రంగు రంగుల స్పెషల్ ఐస్క్రీం చప్పరిస్తూ బ్రహ్మానందంలో మునిగిపోయి, స్వర్గానికి బెత్తెడు దూరంలో ఉన్న పేరిశాస్త్రిని నిస్సహాయంగా చూసేడు రంగబాబు.

బయటికొచ్చాక "మనం టాంక్‌బండ్‌కెళ్లి కూర్చుని మాట్లాడుకుందాం. అక్కడయితే నా బాధంతా చెప్పుకున్నాక, నిన్నా చెరువులోకి తోసేసి నేనింటికెళ్ళిపోవచ్చు" రంగబాబు బండి మీద కూర్చుంటూ చెప్పేడు.

"అట్లాగైతే గండిపేట వెళ్దాం రంగబాబూ. బొత్తిగా మురికి, కంపు నీళ్లల్లో మునిగి చచ్చేదానికన్నా మంచి నీళ్ళయితే కాస్త నయం కదా?" వెనక ఎక్కి కూచుంటూ కిచకిచ నవ్వేడు పేరిశాస్త్రి.

"దొంగ చచ్చినాడా, మాయమాటలు చెప్పి, జనాన్నిట్లా పెళ్ళనే గోదాట్లోకి తోసి, వాళ్ళు ఊపిరాడక కొట్టుకు చస్తుంటే నీకు నవ్వులాటగా ఉందా? ముదనష్టపు వెధవా! నీ మొహం మండ! నీకు పోయేకాలం రానూ! నీ కొడుక్కి పదేళ్లకే

"పెళ్లయిపోయి దేశాలు పట్టిపోనూ!" దారి పొడవునా వైనాలు వైనాలుగా తిట్టిపోస్తూనే ఉన్నాడు రంగబాబు. చిన్నప్పుడు వాళ్ల నాయనమ్మ దగ్గర పెరగడంతో చక్కగా అన్నీ ఆ(వి)డ తిట్లే నేర్చుకున్నాడు. కొందరు మగపురుగుల్లాగా స్త్రీ సంబంధిత తిట్ల జోలికిపోడు. అసలు తన తిట్లకి పేరిశాస్త్రి మధ్యలోనే బండి మీంచి దూకి పారిపోతాడేమో అనుకున్నాడు. కాని, ఈ ప్రమాదాన్ని శంకించే చక్కగా సెల్ హెడ్ ఫోన్లు రెండు చెవుల్లోనూ తగిలించుకుని 'మన్నేల తింటివిరా కృష్ణా', 'ఓరోరి యోగి నన్ కొరికైరో, నవిలైరో' లాంటి పాటలు వింటూ ముమైత్ ఖాన్‌తో మరోలోకంలో విహరిస్తున్న పేరిశాస్త్రి, టాంక్‌బండ్ దగ్గర చెదరని చిరునవ్వుతో బండి దిగడం చూసి ఆశ్చర్యపోయేడు.

వేమన విగ్రహం దగ్గర బట్టలేసుకున్న వేమనలా కూర్చుని నిర్వేదంగా తన ముఖంలోకే చూస్తున్న రంగబాబు కళ్లలో అతని పెళ్లి తాలూకూ బీభత్సమంతా కన్పించింది పేరిశాస్త్రికి.

పెళ్లి కాక ముందు రంగబాబు ఎలా ఉండేవాడు? రెక్కలు విప్పుకొని ఆకాశంలో ఎగిరే విహంగంలా స్వేచ్ఛగా ఉండేవాడు. పిల్ల తెమ్మెరలా హాయిగా ఉండేవాడు. చిరుజల్లులా చల్లగా ఉండేవాడు. ఎందుకో తెలీకుండానే ఎప్పుడూ ఎంతో సంతోషంగా ఉండేవాడు.



అట్లాంటి రంగబాబుకి పేరిశాస్త్రి పెళ్లి సంబంధం తెచ్చేడు.

రంగబాబు, పేరిశాస్త్రి కుటుంబాలది మూణ్నాలుగు తరాల బంధం. ఈ కుటుంబంలో వాళ్లకి ఆ కుటుంబంలో వాళ్లు పెళ్లిళ్లు కుదర్చడం ఆనవాయితీ. అందువల్ల ఇప్పుడు రంగబాబుకి సంబంధం కుదర్చడం పేరిశాస్త్రి వంతయింది.

"ఇది అట్లాంటిట్లాంటి లాకాయి లూకాయి సంబంధం కాదు, బ్రహ్మాండమైంది. పిల్ల చక్కగా, సంసారపక్షంగా బాపు సినిమాలో దివ్యవాణికి మల్లే ఉంటుంది. వాళ్ల తాతయ్య భానుమతికి వీరాభిమాని. అందుకే మల్లీశ్వరి అని పేరు పెట్టాడు. పిల్ల అమ్మానాన్నలు కూడ సినీ నటుల మల్లేనే ఉంటారు. వాళ్ల నాన్నయితే ఒకప్పుడు వాళ్ల ఊర్లోనే తీసిన రెండు సిన్మాల్లో వేషాలు వేసేట్ట" అని గొప్పగా చెప్పి చెప్పి చంపేడు యింటిల్లిపాదినీ. ఆ యింటి అల్లుడిగా అరగంట బతికినా రంగబాబు జన్మ ధన్యమేనన్నాడు.

అప్పటిదాకా రంగబాబు పెళ్లి గురించి కావాలని కలవరించిందీ లేదు, వొద్దని మూలిగిందీ లేదు. కాబట్టి సిన్మా అనే రెండక్షరాలమాట యావత్ కుటుంబాన్నీ మంత్రముగ్ధుల్ని చేయడంతో పేరిశాస్త్రి వెనకే పెళ్లి చూపులకి తరలివెళ్లేరు. అమ్మాయి వాళ్లింటి గేటుకి 'వల్లభనేని పుల్లారావు, సినీ నటుడు' అన్న నామఫలకం చూసి, అన్నపూర్ణా స్టూడియోలోకి అడుగు పెడ్తున్నంతగా పొంగిపోయారు. తీరా లోపలికెళ్ళాక యింట్లో వాళ్ళని చూస్తే వాళ్ళలో ఏ నటులూ కన్పించలేదు. పైగా పిల్ల తల్లి అంతెత్తున, యింతలావున గుండెలదిరిపోయేలా ఉంది. పిల్ల, తల్లిలో మూడోవంతుంది. ముగ్గురూ ముఖాలు చూసుకుని, తర్వాత పేరిశాస్త్రి ముఖంలోకి చూసేరు. పేరిశాస్త్రి చిరునవ్వు నవ్వి రహస్యంగా అభయ హస్తం చూపించేడు.

ఇంటికొచ్చాక, "వాళ్ళల్లో ఏ నటులయ్యా నీక్కనపడింది? " అని ఆశ్చర్యపడ్డ రంగబాబు తండ్రిని తీక్షణంగా అడిగేడు పేరిశాస్త్రి, "మీరు నర్తనశాల చూసేరా? " అని.

అప్పటికి నాల్రోజుల క్రితమే ఓ ఛానెల్‌లో రాత్రి పూట ప్రకటనల మధ్య మధ్యలో ఆ సిన్మాని వెయ్యిన్నొకటోసారి తెల్లవారురూము దాకా కూర్చుని మరీ చూసి ఉండటంతో ముగ్గురూ తలలూపేరు.

"సరిగ్గా గుర్తు తెచ్చుకోండి. అమ్మాయి తల్లి అచ్చం ఆ సిన్మాలో భీముడి వేషం వేసినాయనకుమల్లే లేదూ? తండ్రేమో అచ్చు కన్నాంబలా ఉంటాడు. అమ్మాయి 'పెళ్ళిపుస్తకం'లో దివ్యవాణికి ఎక్కువ, 'రాధాగోపాళం'లో దివ్యవాణికి తక్కువా అన్నట్లుంటుంది. రెండూ బాపు సిన్మాలే. నేనేమీ అబద్ధాలు చెప్పలేదే? వాళ్ళు సిన్మా నటులేగా? పిల్ల తండ్రి మంచి నటుడు. మొదట్లో అడపాదడపా నాటకాల్లో వేసేవాట్ట. కానీ, ఒకసారి సినిమాలో వేషం కట్టాక మళ్ళీ నాటకాల్లో వేస్తే చిన్నతనంగా ఉంటుందని మానేసేట్ట. సిన్మా రంగంలో కూడా రాజకీయాల్లోలానే కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్లూ ఎక్కువట. లేకపోతేనా, మనమీరోజున ఆ మహానటుడి తర్వాతనే ఇప్పుడు హేమాహేమీలు అనుకునే వాళ్ళ పేర్లు చెప్పుకుని ఉండేవాళ్ళం," పేరిశాస్త్రి బాధతో కూడిన ఆవేశంతో చెప్పేడు. అందరూ కాబోలు అనుకున్నారు.

"పిల్ల కాస్త లా..." అంటూ గొణగాలనుకున్న తల్లిని "అమ్మాయిలు అందంగా ఉంటే అస్సలు పట్టుకోలేం ఏ కాలంలోనూ. 'ఇల్లు యిరకటం - ఆలి మరకటం' అని ఊరికే చెప్పలేదు పెద్దవాళ్ళు. కాస్త 'మందం'గా ఉంటే మాత్రం ఏం? మల్లీశ్వరి వొక్కతే పిల్ల, అంచేత వొద్దన్నా వాళ్ళోకెక్కించుకుని అల్లుడిని ముద్దు చేస్తూనే ఉంటారు". అంటూ మురిపించేడు. "ఎట్లానూ మీ అమ్మానాన్నలు పాపం, వానపాముల్లాంటి వాళ్ళు. అటువంటప్పుడు అత్తగారు వాళ్ళైనా అనకొండలా ఉంటే నీకు అండాదండా. ఇంక అమ్మాయి విషయాని కొస్తే, అందాన్ని కొరుక్కుతింటామా ఏం? ఐశ్వర్యారాయ్‌నైనా యిరవైనాలుగ్గంటలూ యింట్లో చూస్తుంటే, ఆర్నెల్లలో అప్పలమ్మలా క(అ)న్పిస్తుంది. వంట చేయించి, అంట్లు తోమిస్తాం తప్పించి, అందగత్తె కదా అని ఆసనం వేసి అర్చనలు చెయ్యం. అంచేత అందచందాల గురించి ఆరాటపడొద్దు", అని అయోమయంగా చూస్తున్న రంగబాబుకి హితవు చెప్పేడు. సౌందర్యారాధన లాంటి హృదయ సంబంధిత బలహీనతలేవీ పెట్టుకోకుండా రంగబాబుని బుర్రపెట్టి ఆలోచించమన్నాడు. పైగా పిల్ల తరపు

వాళ్ళకి వీళ్ళ సంబంధం పిచ్చి పిచ్చిగా నచ్చేసిందన్నాడు.

రంగబాబు ఇంట్లో వాళ్ళు అటూ యిటూ డోలాయమానంలో ఉండగానే, "తొలిచూపులోనే మీకు మనసిచ్చాను. మీరే జన్మజన్మలకీ నా భర్త," అంటూ మల్లీశ్వరి నుంచీ ఫోనొచ్చింది రంగబాబుకి (అదీ పేరిశాస్త్రి సలహానే). అంతే! వెన్నపూస మనసున్న రంగబాబు కరిగిపోయి కళ్యాణరాముడయ్యేడు. మల్లీశ్వరి మెడలో తాళికడ్తూ చిరునవ్వుతో అత్తగారి ముఖంలోకి చూసేడు, వీడియో వాడు గోలపెడ్తున్నా పట్టించుకోకుండా. నోరూ వాయీ లేని తల్లి మాదిరిగా కాకవాయంత నోరున్న కొండంత అత్తగార్ని చూస్తుంటే ఎంతో ధైర్యంగా తోచి. 'అండా దండా' అన్న పేరిశాస్త్రి మాటలు నిజమేనన్పించింది.



ఆ క్షణంలో అతడు అణుమాత్రం ఊహించలేక పోయేడు అదే అతని ఆఖరి చిరునవ్వని, ఆ 'కొండ' తనపై విరుచుకుపడి తన జీవితం 'పిండి' కాబోతున్నదని! మరి అదే కదా జీవితమంటే!?

పెళ్ళి చేసిన పేరిశాస్త్రి తనకు రావల్సినవి రాబట్టుకుని, చేతులు దులుపుకుని వెళ్ళిపోయేడు. తర్వాతర్వాత అతడి మాటల మాయాజాలం రంగబాబుకి అర్థమవుతూ వచ్చింది.

మూడు నిద్రలకి వెళ్ళినపుడు వాళ్ళ మామగారు నటించిన సిన్మాలంటూ రెండు పరమపాత సిన్మాల కాసెట్లు పెట్టి చూపించేరు రంగబాబుకి. సినిమా మొత్తం అయిపోయినా, అందులో ఆయనెక్కడున్నాడో అర్థమైచావలేదు. అదే చెప్పేడు బిక్కమొహంతో. మామగారు గొల్లున నవ్వి, మళ్ళీ కేసెట్ పెట్టి బరబరా ముందుకు నడిపి మధ్యలో వొకచోట టక్కున ఆపి, వేలితో తెరమీద చూపిస్తూ చెప్పేడు, కోలాటం పాటలో రెండో చరణం మూడోవాక్యమప్పుడు వొకడు భూమి మీదికి చేతులాన్చి బోర్లా వొంగితే, కథానాయకుడు చొక్కాలేని వాడి వీపు మీద కూర్చుంటాడు కాలుమీద కాలేస్కుని. ఆ వీపు ఎవరిదో కాదుట, ఈయనదే. వీపు మీద పుట్టుమచ్చే అందుకు సాక్ష్యం. ఆ తర్వాత కథానాయకుడు ఎగిరి వీపు మీద నిలబడి రెండు, మూడు స్టెప్స్ కూడా వేశాడు. భగవంతుడి వేషాలేసే ఆయన గారి పృష్ఠ మరియు పాదస్పర్శతో పునీతమైన ఈయన గారి వీపుని ఊళ్ళో వాళ్ళంతా 'వామనుడు తొక్కిన బలి చక్రవర్తి శిరస్సు' కన్నా పవిత్రంగా భావించి పోటీలు పడి మరీ తాకి తాకి తరించేరట ఆ తర్వాత. అసలట్లా చెట్టంత మనిషి మన వీపు మీదెక్కి తైతక్కలాడుతోంటే కదలక, మెదలక వొంగి ఉండటమనేది అల్లాటప్పా పని కాదట, ఆ కష్టమేమిటో పడ్డవాళ్ళకే తెలుస్తుందట. పైగా కాళ్ళకి, చేతులకి చీమలు కూడ కుట్టి చచ్చినయ్యంట మట్టిలో. ఇంక రెండో సినిమాలో నాయిక గుడిమెట్లు ఎక్కుతూ అటూ యిటూ కూర్చున్న బిచ్చగాళ్ళకి డబ్బులు ధర్మం చేస్తుంటుంది. వాళ్ళలో నల్ల కంబళీ కప్పుకు కూచున్నది ఈయనేట. ఈయన కన్పించడు కాని, బొచ్చె మాత్రం క్లోజప్‌లో తళతళ్ళాడుతూ కన్పించింది. అది స్టీలుది, ఆయనే పట్టుకెళ్ళేట్ట యింటి నుంచి, తనని గుర్తుపట్టడం కోసమని.

మామగారి ఈ ఘనతంతా కళ్ళారా చూసేక, చెవులార విన్నాక కూడ, అబద్ధం చెప్పాడని పేరిశాస్త్రి మీద కోపం రాలేదు రంగబాబుకి. నలుగురి నోటా విన్నది తనూ చెప్పి ఉంటాళ్ళే అనుకున్నాడు జాలిగా.

"ఒక్కతే పిల్లాయె, వొదిలి ఉండలేం," అంటూ అప్పుడప్పుడూ కాకుండా ఎప్పుడూ అదేపనిగా వచ్చి అత్త మామలిక్కడే అతుక్కు పోతుంటే, "పోనీలే మా అమ్మా నాన్నలైతే ఉండరా? " అనుకున్నాడు కాని అదేమని అడగలేదు రంగబాబు. వంటంటే కాసిని కూరముక్కలు పోపులో వేసి యింత ఉప్పు, కారం పడేసి ఓ లోటాడు నీళ్ళు పోస్తే టీవీలో ధారావాహికం వొకటి అయ్యేప్పటికి అదే చచ్చినట్లు ఉడికి ఉంటుందన్న తల్లీ కూతుళ్ళ అభిప్రాయంతో రంగబాబు విభేదించేడు. అంచేత పూర్తిగా తనకి నచ్చినట్లు వండుకు తిని, వాళ్ళకి కూడ యింత పెట్టగలిగిన స్వేచ్ఛని ప్రసాదించేరు. 'ఇల్లు చక్కగా సర్ది, అందంగా, శుభ్రంగా ఉంచుకోవాలి' అన్న రంగబాబు ఆకాంక్షకి కూడ వాళ్ళు అడ్డుపడలేదు, పాపం! "నీ యిష్టం, నీకు నచ్చినట్లు చేస్కోపో"మ్మన్నారు. దానిక్కూడా రంగబాబు నొచ్చుకోలేదు. 'ఎంతమంది ఆడవాళ్ళు అటు ఉద్యోగమూ, యిటు యింటిపనీ చేసుకోవడం లేదూ? ' అని సరిపుచ్చుకున్నాడు.

ఆ విధంగా పెళ్ళి తర్వాత కూడా చేపల కూర వండటం దగ్గర్నుంచీ చీపురుకట్ట ఎక్కడ పెట్టాలి అన్న విషయం వరకూ రంగబాబు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకేమీ భంగం వాటిల్లలేదు. కాకుంటే మరో ముగ్గురి కోసం అదనంగా పని చేయాల్సివస్తోంది, అంతే! రోజులిలానే గడిచిపోయినా బాగానే ఉండేది. రంగబాబుకి పేరిశాస్త్రిని చంపేయాలన్నంత కోపమూ, కోరికా పుట్టుకొచ్చేవి కావు. కాని ఓ దురదృష్ట ఘడియల్లో ఏం జరిగిందంటే...

అనుకోకుండా వచ్చిన ఓ సెలవురోజు మధ్యాహ్నం పూట రంగబాబు హాల్లో కూర్చుని టి.వి పెట్టేడు. పొడుగు కాళ్ళు, పొడుగు జుట్టు ఉన్న ఓ పడుచు పిల్ల చిన్నప్పటి బుల్లి నిక్కరు, చేతుల్లేని పొట్టి జాకెట్టూ వేస్కుని అదేదో షాంపూతో తలస్నానం చేసిందట, వచ్చి గడ్డి మీద వాలిందో లేదో, క్లోజప్‌లో బురదనీరల్లే తెరనిండా ప్రవహిస్తోన్న ఆ ఎర్రటి జుట్టుకేసి కంపరంగా చూస్తుండగా, హడావిడిగా వచ్చింది అత్తగారు. "కోడికూరలో కొత్తిమీర వేయడం మర్చిపోయా వల్లే ఉంది రంగబాబూ, పొయ్యి పక్కన ప్లేటులో అట్లానే ఉంది. వెళ్ళివేసిరా. నేను 'మూన్' టీవీలో 'బంగారక్క' కార్యక్రమం చూడాలిప్పుడు. ఈ రోజు వచ్చే అమ్మలక్కల్లో మా తోడికోడలు కూడ ఉందట. తప్పకుండా చూడమని ఫోనులో మరీ మరీ చెప్పింది. నువ్వు కూడ వచ్చి

"చూడు" అంటూ రిమోట్ తీసుకుంది.

దాన్తో రంగబాబు కూడా చూడక తప్పలేదు. ఆ తోడికోడలు తెర మీద కన్పించినప్పుడల్లా మల్లీశ్వరి "పిన్ని అదుగో, అదుగో" అని అరుస్తూనే ఉంది. ఆటలు, పాటలు, మధ్య మధ్య ప్రశ్నలు, చిందులు, శివాల్తో సాగిన ఆ గంట కార్యక్రమంలోనూ ఓ ప్రశ్నకి జవాబుగా తోడికోడలు, కిట్టీపార్టీలు, షాపింగ్‌లు, టీవీ చూడ్డమూ తన అభిరుచులుగా వెల్లడించింది. వారంలో కనీసం ఏడుసార్లన్నా షాపింగ్‌కి వెళ్ళకపోతే తనకి తోచదంది. వింటున్న రంగబాబు అత్తగారికి ఆగ్రహంతో ముక్కు పుటాలదిరినయ్. అసలట్లా తోడికోడలు మాంచి చెమ్కీ చెమ్కీల చీర కట్టుకుని, చంద్రహారంతో సహా నగలన్నీ దిగేస్కుని, పళ్ళికిలించుకుంటూ, యాంకరమ్మకన్నా ఎక్కువగా తుళ్ళిపడ్తూ టీవీలో కన్పిస్తుంటేనే కడుపుమంటతో కంపరమెత్తిపోయింది. టీవీ ఆపేసేదే కాని, ఆవిడింకేం వేషాలు పోతుందో చూడాలని ఆగింది, అంతే! కొద్ది సేపు విరామం అన్నప్పుడల్లా అత్తింటికి రాకమునుపు ఆవిడ బీదరికపు పాట్లు, వచ్చిం తర్వాత కూడ అంతంత మాత్రపు ఆదాయమూ, స్థితిగతుల గురించీ తవ్విపోస్తూనే ఉంది.

"దీని బడాయి పాడుగాను. ఏదో, కొడుక్కాస్త ఇంజనీరై నెలకో లక్షసంపాయిస్తున్నాడని ఎన్నెన్ని కోతలు కోస్తోందో? చిన్నప్పుడు చీటీ పరికిణీ మోకాళ్ళపైకి ఎత్తి దోపుకుని సీసాలు పుచ్చుకుని కొట్లంట తిరిగి పావలాకి, అర్ధకి నూనెలు, పప్పులు కొనుక్కొచ్చిన రోజులు మర్చిపోయిందల్లే ఉంది," అంతా చూసేక ఆఖర్న అత్తగారు ఈసడించి పడేసింది. అంతేకాదు. ఆవిడ వారానికి ఏడుసార్లు షాపింగ్ కెళ్తే తాను ఏడేడు పద్నాలుగు సార్లు వెళ్తానని శపథం చేసింది కూతురు, అల్లుడూ సాక్షిగా. చేస్తే చేసింది ఆవిడ నోరు, ఆవిడిష్టం.

కాని, 'ఉరుమురిమి మంగలం మీద పడినట్లు' అసలు కష్టమంతా రంగబాబు కొచ్చి పడిందిప్పుడు. ఆ తర్వాతనుంచీ తల్లీ బిడ్డలు యింటి పట్టున ఉండటం మానేసేరు. అత్తగారు శపథం చేసిన సాయంత్రమే మామగారు ఊరెళ్ళిపోయేరు 'అనుకోని పని' గుర్తుకొచ్చి. తల్లి, కూతుర్ని సాయంగా తీసుకువెళ్తోంది. కూతురు, మొగుడి పర్స్‌లోంచి డబ్బులు, ఎందుకైనా మంచిదని క్రెడిట్ కార్డులు కూడ తీసుకెళ్తోంది. ఇప్పుడు వాళ్ళకి షాపింగ్ అనేది పేకాట, తాగుడు మాదిరి వదిలించు కోలేని వ్యసనమై కూచుంది. ఇదీ, అదీ అని లేదు. ఉచితం, తగ్గింపు ధరలు, అదనం వంటి పదాలు కంటబడితే చాలు ఏవైనా కొనేస్తుంటారు. అవసరం ఉన్నా, లేకపోయినా. అందువల్ల అట్లా తెచ్చిపడేసిన వాటితో యిల్లంతా ఫుల్లు, రంగబాబు జేబుకేమో ఆకాశమంత చిల్లు. క్రెడిట్ కార్డుల అప్పులు తీర్చడానికి యిప్పటికే అరెకరం పొలం బేరం పెట్టేడు తల్లి తండ్రి లబలబలాడుతున్నా లక్ష్యపెట్టకుండా. అప్పు తీర్చడం కన్నా, తల్లీ కూతుళ్ళు యింటినిండా నింపుతున్నవాటిని సర్దడమే గొప్ప చావుగా ఉంది రంగబాబుకి. ఇది ఉచితం, అది ఉచితం అని సూపర్ మార్కెట్‌ల్లోంచి తెచ్చిన గోధుమలు, చక్కెర, పప్పులు, వగైరా మూటల్తో వంటగది కిటకిటలాడిపోతోంది. వాటిని చీమలు, ఎలుకలు వంటి క్షుద్ర ప్రాణుల బారిని పడకుండా కాపాడ్డానికి రంగబాబుకి తల ప్రాణం తోక్కొస్తోంది. బట్టలూ అంతే... బీరువాలు, సూట్‌కేస్‌లు నిండిపోయి యిప్పుడు అటకల కెక్కేస్తున్నాయ్. షాపింగ్ అన్న పదం వింటేచాలు, రంగబాబు గుండె 'డప్పు'లా కొట్టుకుంటోంది. ఇప్పటికి రంగబాబుకి పెళ్ళిమీద, జీవితం మీద విసుగు, విరక్తిలాంటివి బయలుదేరి భవిష్యత్తుని తల్చుకుని బెంబేలెత్తి పోసాగేడు. దారీ తెన్నూ తోచక కొట్టుకుంటుండగా గుర్తొచ్చేడు తన బతుకునిట్లా పెళ్ళి పేరుతో 'బండ'కేసి బాదిన పేరిశాస్త్రి. అతడి పళ్ళు పీకి, కళ్ళు పొడిచి, కాళ్ళు విరిచి, యింకా రకరకాల చిత్రహింసలు పెట్టి మరీ చంపెయ్యాలన్నంత కసి పుట్టుకొచ్చింది పరమ సాధువు, శాంతమూర్తీ అయిన రంగబాబుకి. వెంటనే ఫోన్ చేసేడు అర్జంటుగా కలవమని. అదీ జరిగింది!

***

రంగబాబు గోడంతా తాపీగా విన్నాడు పేరిశాస్త్రి పళ్ళలో యిరుక్కున సోంపు అవశేషాల్ని సూదిపుల్లతో లాఘవంగా పెకలించి పారేస్తూ. "అసలు ఈ మనుషులే చిత్రమైనవాళ్ళు. పెళ్ళి కుదిర్చేదాకా బాబ్బాబు అని నెత్తిన పెట్టుకుని రాచమర్యాదలు చేస్తారు. పెళ్ళి కుదిరిపోగానే ఉభయవర్గాలు కలిసి వొకటైపోయి, కుదిర్చిన వాళ్ళని 'తూనాబొడ్డు' అన్నట్లు తీసి అవతల పారేస్తారు. చాలమంది బిల్లు కూడ ఎగ్గొట్టేస్తారు. కనీసం పెళ్ళికన్నా పిలవరు. అంతా బాగుండి కాపురం లక్షణంగా సాగుతుంటే 'ఫలానా ఆయన కుదిర్చాడు' అని మాటవరసకైనా తల్చుకోరు. బెడిసికొట్టినపుడు మాత్రం యిదిగో, యిట్లా పిలక పుచ్చుకోడానికి తయారవుతారు అనుకున్నాడు మనసులో".

"అన్నీ అబద్ధాలే చెప్పి నాకీ గతి తెచ్చిపెట్టింది నువ్వే. నిజంగా నిన్ను చంపెయ్యాలని ఉంది పేరిశాస్త్రీ" రంగబాబు మొదటిపాటే మళ్ళీ పాడేడు నిజాయితీగా.

"చాల్లేవూరుకో రంగబాబూ. నేనూ పెళ్ళయినవాడినే. పెళ్ళైన మగాడు పెళ్ళానికి తప్ప ఈ ప్రపంచంలో చావుతో సహా దేనికీ భయపడడు. అంచేత నీ బెదిరింపులకి నేనేం వూరిడిచి పారిపోన్లే. నీ కంత ధైర్యమే ఉంటే మీ అత్తగారికే నువ్వొండే కోడికూరలోనో, రొయ్యల వేపుడులోనో ఏ ఎలుకల మందో, నల్లులమందో కలిపి పెట్టుండేవా

సందెలక్ష్మి వచ్చె

సందెలక్ష్మి వచ్చె ఉయ్యాలో
కుంకుమ రోలుకు ఉయ్యాలో
దంచుతు పాడుతు ఉయ్యాలో
పాటలచప్పుడుకు ఉయ్యాలో
ఆడుకోరపాపాయి ఉయ్యాలో
పడుకోని పాపనికి ఉయ్యాలో
కూచోని పాపానికి ఉయ్యాలో
ఆడుకో పాపాయి ఉయ్యాలో
అమ్మరోఓయమ్మ ఉయ్యాలో

చంద్రబింబం వచ్చె ఉయ్యాలో
బంగారు పొన్ను ఉయ్యాలో
తరుణీలిద్దరు ఉయ్యాలో
పాపడులేచిండు ఉయ్యాలో
బబ్బాలుపోతు ఉయ్యాలో
పాపటే తీసింది ఉయ్యాలో
కురులు దిద్దింది ఉయ్యాలో
వాడవాడలకు ఉయ్యాలో
వడ్లు దంచెదామ ఉయ్యాలో

డి.వి. సర్లే అది మీ మామగారు చూసుకుంటారు. నువ్వొదిలెయ్ కాని, ప్రస్తుత సమస్యకి పరిష్కారం కనుక్కోవాలి తెలివైనవాడు. రోడ్డు మీద అడ్డొస్తున్న బస్సులు, ఆటోలు, కార్లు వగైరాల్ని వొడుపుగా తప్పించుకుంటూ బండి మీద హోటల్ నుంచి ఇక్కడి దాకా వచ్చామా, లేదా? అట్లానే జీవితపు బండిని కూడా నడుపుకుపోవాలోయ్ వెర్రినాగన్నా! నన్ను చంపితే ఏమొస్తుంది నీకు, బ్రహ్మహత్యా పాతకం తప్ప. పైగా వెళ్ళి చర్లపల్లి జైల్లో మీ అత్తగారి కన్నా నాలుగాకులెక్కువ చదివిన మామల చేతుల్లో పడతావ్. అప్పుడు మీ వాళ్ళు కొనుక్కొస్తే, ఇప్పుడు నువ్వు కొట్టుకు రావాల్సి వస్తుంది". పేరిశాస్త్రి చిద్విలాసంగా నవ్వేడు. రంగబాబుకి దుఃఖం వచ్చింది.

"అయినా పెళ్ళి తర్వాత మీ జీవితాల్లోని ప్రతి మలుపునకూ, మీ నెత్తిమీద ప్రతి బుడిపెకూ మాదేనటయ్యా పూచీ? మేం 'దూకూ, దూకూ' అనగానే గోదాట్లోకి దూకేస్తారా? మీకూ ఇష్టమయ్యే కదా దూకేది? పైగా మీ నుదుటన కష్టాలు రాసి ఉన్నపుడు ఈ ఎల్లమ్మ కాకపోతే మరో మల్లమ్మ వొచ్చినా మీ కర్మమిట్లాగే ఉంటుంది. అందరికీ చెంచాల్లాంటి భార్యలే కావాలని ఉంటుంది. కానీ ఎక్కువ మందికి దొరికేది 'ముళ్ల చెంచా' (ఫోర్క్) లాంటి వాళ్ళే. ఏం చేస్తాం? జాగ్రత్తగా నిభాయించుకోవాలి" పేరిశాస్త్రి చురకలేసేడు. రంగబాబు దుఃఖాన్ని కొనసాగించేడు జవాబు చెప్పలేక.

"వీళ్ళమ్మ కడుపుమాడా, వీళ్ళకి అన్నీ కొనుక్కొచ్చి పడేసి కొంపని గోదాంలా మార్చడమే తప్పించి, అవి వాడుకోవాలనే ధ్యాస, తాపత్రయమే ఉండవయ్యా అసలు!" రంగబాబు విచిత్రపోతూ చెప్పేడు.

"ఏమిటీ, ఏమన్నావూ?" పేరిశాస్త్రి చురుక్కున చూస్తూ రెట్టించేడు. రంగబాబు మళ్ళీ చెప్పేడు.

"అయిడియా! నీ జీవితాన్నే మార్చేస్తుంది," పేరిశాస్త్రి హుషారుగా చిటికేసేడు. "ఎట్లాగూ అరెకరం పొలం అమ్మాలంటున్నావు. పన్లోపనిగా రెండెకరాలు అమ్మేసెయ్. శుభ్రంగా మీ ఏరియాలోనే 'ప్యార్' అనో, 'చీర్' అనో ఓ మినీ సూపర్ మార్కెట్ పెట్టు. మీ వాళ్ళు కొనుక్కొచ్చి పడేస్తున్న సరుకునంతా అందులోకి మార్చు. ఇంకా యింకా కొనుక్కురమ్మను. అన్నీవొక్క సారిగా కాకుండా రోజూ కొన్ని వాళ్ళతోనే తెప్పించుకో. షాపులో మీ మామగార్ని కూర్చోబెట్టు. వాళ్ళకి కొనే సరదా తీరుతుంటుంది. మీ మామగారికీ కాలక్షేపం. అమ్మకాల ద్వారా నీ డబ్బులు మళ్ళీ నీ జేబులోకి చేరుతుంటాయి. ఏమంటావు?"

రంగబాబు సంభ్రమంగా చూసేడు పేరిశాస్త్రి వైపు. "ఒక్క దెబ్బకి అన్ని పిట్టలూ హుష్! బ్రహ్మాండంగా ఉంది పేరిశాస్త్రీ"... ఆ అద్భుతమైన ఆలోచనతో రంగబాబులో కొత్త ఉత్సాహం, శక్తి, జీవమూ ప్రవేశించి నిలువెల్లా ప్రవహించసాగినయ్. "నాకు, నిన్ను కౌగిలించుకుని ముద్దులు పెట్టుకోవాలని పిస్తోంది పేరిశాస్త్రీ" ఆప్యాయంగా చెప్పేడు రంగబాబు.

"మరీ అంతపని వొద్దులే రంగబాబూ. ఆ పక్కనున్న పోలీసాయనా, దారిన పోయే జనం అపార్థం చేసుకోగలరు. కష్టాలొచ్చినపుడు కారకుల కోసం కాక, బయటపడే మార్గం కోసం వెతకాలి రంగబాబూ. శతకోటి దరిద్రాలకీ అనంతకోటి ఉపాయాలంటారు. ఇక సూపర్ మార్కెట్ ప్రయత్నాలు మొదలెట్టు. ప్రారంభోత్సవానికి పిలవడం మర్చిపోకేం? మరి నేను వెళ్ళొస్తాను," అంటూ పేరిశాస్త్రి ఆటో ఆపి ఎక్కి కూర్చున్నాడు.

వెలిగిపోతున్న ముఖంతో రంగబాబు తలవూపేడు. "అది సర్లేగానీ రంగబాబూ! నీకో నిజం చెప్పాలనిపిస్తోందోయ్! బోలెడు అబద్ధాలాడి నీకు పెళ్ళి జరిపించి నా పగ తీర్చుకున్నాను. పగ ఎందుకంటావా? మీ నాన్నకు పెళ్ళి కుదిర్చినపుడు మీ తాతయ్య డబ్బులు ఎగ్గొట్టాడట మా నాన్నకి. అదీ విషయం. కానీ నీ మంచితనాన్ని చూసి, చెయ్యని తప్పుకి నీకు శిక్షపడిందన్న జాలితో యిప్పుడు నీకీ సలహా యిచ్చేను. నేను బతికున్నంత వరకు నీకే సమస్యవొచ్చినా నాకు ఫోన్ చెయ్యి. మై హూఁనా! విష్ యూ ఆల్‌ది బెస్ట్" పేరిశాస్త్రి ప్రేమగా చూస్తూ చెయ్యి ఊపేడు.

రంగబాబు నిర్ఘాంతపోయేడు.

"ఓరి దుర్మార్గుడా! గిల్లి జోల పాడుతున్నావా?" అన్న అతని ఆక్రోశపు ఆర్తనాదం, ఆటో శబ్దంలో కలిసిపోయింది.

వేషం వెనుక రహస్యం

మొట్టమొదటిగా ఆచంట జానకీరామ్ కృష్ణశాస్త్రిని చెన్నైలో కలిశారు. ఆ రోజు పాత కోటు వేసుకుని అతిదీనంగా ఉన్న కృష్ణశాస్త్రిని చూసి, పరిస్థితి అర్థం కాకపోయినా దగ్గరకెళ్ళి పరిచయం చేసుకున్నారు జానకీరామ్.

మర్నాడు వారిద్దరూ మరో కవి శేఖరుడు మల్లంపల్లి చంద్రశేఖర్‌గారి ఇంట్లో కలుసుకున్నారు. అయితే అప్పుడు కృష్ణశాస్త్రి నిన్నటి పాతకోటులో లేరు. చక్కని మల్లెపువ్వులాంటి తెల్లని లాల్చీతో అచ్చం భావకవిలా వెలిగిపోతున్నారు.

నిన్నటికీ నేటికీ ఎంత తేడా అని ఆశ్చర్యపోతూ, "నిన్న మీరు ట్రామ్‌లో, వెలసిపోయిన కోటులో.." అని జానకీరామ్ ఆగిపోయారు. దానికి శాస్త్రిగారు, "అదా.. ఎవరో ఉద్యోగం ఇస్తాం రమ్మన్నారు. అన్నంత పనిచేస్తారేమోనని జడిసి ఆ కోటు తొడుక్కుని వెళ్లాను. అదృష్టవశాత్తు ఉద్యోగం రాలేదు." అన్నారు.

రంభతో క్రీడ

ఓ రోజున పొరుగూర్లో ఉన్న తెలిసిన మిత్రుడింటికి వెళ్లారు విశ్వనాథ. ఆ మిత్రుడికి కొడుకు వాకిట్లో ఉన్న అరటి చెట్టుతో ఆడుకుంటున్నాడు. ఆయన లోనికి వెళ్లి మిత్రుడితో, "ఏమిటో మీవాడు రంభతో క్రీడిస్తున్నాడు?" అన్నారు సరదాగా. క్రీడించడం అంటే సరససల్లాపాలు అని అర్థం.. దాంతో తెల్లబోయిన మిత్రుడిని బయటకు తీసుకువచ్చి, "కావాలంటే నువ్వేచూడు" అని పసివాడిని చూపారు కొంటెగా. అరటి చెట్టుని రంభ అనడాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన ఇలా చమత్కరించారని గ్రహించి మిత్రుడు పగలబడి నవ్వాడు.

ప్రముఖ కథా రచయిత్రి. వృత్తిరీత్యా సీనియర్ అకౌంటెంట్, అకౌంటెంట్ జనరల్ కార్యాలయం, హైదరాబాద్. 99593 82223

తెలుగువాడా కళ్ళు తెరు!

తెలుగు అంతరించి పోవడం అంటే తెలుగుతో ఉన్న అవసరం తగ్గిపోవడం. దీన్ని అరికట్టాలి. నీ ఇంట్లో మాట్లాడే భాషను నీ జీవిత భాషగా చేసుకో... ఉద్యోగ భాష పరిభాష ఏదైనా ఉండనీ... నువ్వు ఏ భాష మాట్లాడే ఇంట్లో పుట్టావో అదే భాషను నీ సొంత భాషగా చేసుకోవాలి. అవసరమైతే అందరూ కలసి భాషా రక్షణకు ఉద్యమం చేపట్టాలి.

సాంకేతిక విప్లవం... ఈ ఇంటర్నెట్, సెల్‌ఫోన్‌లు... ఇవన్నీ ప్రగతి, విజ్ఞానం అంటూ మనిషి ప్రకృతిని పట్టించుకోవడం లేదు. ఆస్వాదించడం లేదు. మా కాలంలో మేం జీవితంలోని అన్నిదశలనూ అనుభవించాం, ఆస్వాదించాం. ఇప్పుడో... కొద్దిపాటి అక్షర జ్ఞానం, వయసు వచ్చినప్పటి నుంచీ కుర్రవాడు తలుపులు

మూసుకుని నెట్ ముందు కూర్చుంటున్నాడు. వాడికి రుతువులూ, యౌవ్వనం, చదువు, వినోదం అన్నీ అదే... అందులోనే!! అంటే బింబంతో పని లేదు. ప్రకృతితో పని లేదు. మలయానిలంతో పని లేదు. మహీమండలంతో పని లేదు. సూర్య చంద్రాదులతో పని లేదు. అబాస... అబద్ధం అదే అనుభవం అవుతోంది. ఇవి ప్రతిబింబ జీవితాలు. సహజత్వం లేదు. ఎయిర్ కండిషన్‌లో గాలి తప్ప ఏటి గాలి, పైరగాలి ఎరగడు. పట్టణాల్లో సర్వకాలుష్యాలతో కూడిన గాలులతో మనిషి జీవితం మరకలు పడిపోతోంది. పల్లెలూ అలానే తయారయ్యాయి. అందమైన ప్రదేశాలన్నీ పోతున్నాయి. ఆత్మవినాశనానికి దారి తీసే పద్ధతుల్ని ప్రగతి అని మురిసి పోతున్నాం. జనాభాను నియంత్రించుకోవడం చేతకాక ప్రకృతిని ధ్వంసం చేస్తున్నాం. భూమికి పరిమితి ఉంది. దాటి పోతున్నాం. బంగారు బాతుగుడ్డు కథగా మారిపోతోంది. ఈ సునామీలు, భూకంపాలు ఇవన్నీ ప్రకృతి విధ్వంస ఫలితాలే!

ఇక భాష! తెలుగు వాళ్ళు తెలుగు మర్చిపోతున్నారు. ఫోన్‌లు వచ్చి ఉత్తరాలు రాసే అలవాటు తప్పింది. అక్కడ రచనకు తొలిదెబ్బ తగిలింది. భాషను సాంకేతికంగా అభివృద్ధి చేసుకోవడం చేతకాక, ఏం చేస్తే ఇంగ్లిషులా నలుగురికీ ఎక్కుతుందో తెలియక భాషను తిడుతూ కూర్చున్నాం. రోడ్డు, రైలు, టైము వగైరాలు భాషలో కలసిపోయాయి. వీటిని ఇవ్వాళ తొలగిస్తామంటే సెల్‌ఫోన్‌కు తెలుగేంటి? కన్నడిగులు వీటిని కూడా కన్నడంలోనే మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసును వారు వేగదూత అంటున్నారు. క్రాస్‌రోడ్స్‌ను 'అడ్డరస్తా' అని, టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను 'తాంత్రిక విద్య' అని పిలుస్తున్నారు. అయితే సాంకేతిక పదాలను యథాతథంగా వాడటం మంచిది. కంప్యూటర్‌ను మరో పేరుతో పిలిస్తే ఎందరికి అర్థం అవుతుంది?

భాష అంతరించకుండా అనేక రకాలుగా కనబడుతుంది. భాషను బలహీనం చేసుకోవడం వల్ల అనేక దుష్ఫలితాలు తలెత్తుతాయి. దీనికి ముందు భాషపై మక్కువ పెంచుకోవడం. తాత, తండ్రుల నుంచి తెచ్చుకున్న సంస్కృతి... తరతరాలకూ ప్రవహించాలి. భాష పేరుతో దేశంలో తొలిసారిగా ఏర్పడ్డ రాష్ట్రం మనది. అలాంటి తెలుగునాట నేడు భాషను మర్చిపోయారు. భాషంటే మాటలే కాదు. అలవాట్లు, వేషభాషలు అన్నీ. ప్రాంతీయ యాసలు వగైరాలన్నీ కనుమరుగైపోతున్నాయి. రాజకీయ సంస్కరణల వల్ల కొంత భాష దెబ్బతింటోంది. బయటి నుంచి కొత్త పదాలను తెచ్చుకోవచ్చు. కానీ ఉన్నవి తీసేయడం తప్పు. మన వాళ్ళు అదే చేస్తున్నారు. సాంకేతిక విప్లవాన్ని ఎవ్వరూ కాదనరు. ఆ పేరుతో పరభాషపై మోజు వద్దు. అది స్వభాషపై మోజుగా మారాలి. ఆహార విహారాలూ భాషను దెబ్బతీశాయి. వేషభాషలు అంటారు. వేషాన్ని బట్టి భాష. పిజ్జాలు, బర్గర్లు తినాలంటే బిళ్లగోచి పెట్టుకుంటే ఎలా? అందుకే ఆ తిండికి తగ్గట్లే ఆడ, మగ ఇవ్వాళ దుస్తులు ధరిస్తున్నారు. భాషనూ మార్చేసుకుంటున్నారు.

ఈనాటి అవధానాల వల్ల భాషకు ఒరిగేదేమీ లేదు. ఆయా వ్యక్తుల ప్రాచుర్యానికి తప్ప. అవధానాలంటే తిరుపతి వేంకట కవులవి. మహాభారతంలోని పద్యాలను పశువుల కాపర్లు కూడా పాడుకునేలా వాడుక భాషలో నాటకాలు రాశారు వాళ్ళు. 'బావా ఎప్పుడు వచ్చితీవు' వంటి పద్యాలు నోటికి రాని తెలుగు వాడు పాతిక ముప్ఫై ఏళ్ల క్రితం ఎక్కడా కనిపించే వాడు కాదు. ఇదంతా ఆ మహానుభావుల చలవ. అదీ భాషాసేవంటే. తక్కువ అక్షరాస్యత ఉన్న రోజుల్లోనే వారీ ఖ్యాతి సాధించగలిగారంటే అదీ ప్రతిభ. ఇప్పటికైనా తెలుగు వాడు కళ్ళు తెరవాలి, చేవతెచ్చుకోవాలి అప్పుడే భాషా పరిరక్షణ సుసాధ్యం.

(వేటూరితో చివరి ముఖాముఖి)

అమ్మ భాష కాదు కానీ... అన్నంపెట్టిన భాష

ప్రకాష్‌రాజ్

ప్రత్యేక పరిచయం అక్కర్లేని పేరు. ప్రస్తుతం మన దేశ అగ్రగామి నటుల్లో ఒకరిగా సినీ విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్నారాయన. ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకుడిగా మాత్రమే అందరికీ తెలిసిన ఆయనలో సాహితీ పిపాసి, బహుభాషా ప్రేమికుడు, తాత్వికుడు, భావుకుడు ఉన్నారు. ఏ అంశంమీదనైనా సూటిగా మాట్లాడటం ఆయన నైజం. ఏడు భాషలపై పట్టు ఉన్న ఆయనతో 'తెలుగు వెలుగు' ముచ్చటించింది. ఎంతో పని ఒత్తిడిలో ఉండి కూడా భాష గురించి, ముఖ్యంగా మాతృభాష గురించి అనగానే ప్రకాష్‌రాజ్ తన మనోభావాలను ఉత్సాహంగా పంచుకున్నారు. ఆయన ఏం చెప్పారో చదవండి...

తెలుగు గురించి మాట్లాడటమంటే అది నాకిచ్చిన గౌరవంగా భావిస్తాను. తెలుగు నాకు అమ్మ భాష కాదు... అన్నం పెట్టిన భాష. జీవితంలో నాకు ఎక్కువ ఇచ్చింది తెలుగే. ఇక్కడి వాళ్ళు మొదట్నించీ నన్ను తమవాడిగా చేసుకున్నారు. నాకు ఇది పరాయి అన్న భావన ఎప్పుడూ కలగలేదు. తెలుగులో చేసినన్ని వైవిధ్యమైన పాత్రలు మరే భాషలో చెయ్యలేదు. తెలుగువాళ్ళు నువ్వేది చేసినా మాకిష్టమే అన్నారు, ఏం చేసినా ఆదరించారు. నటుడిగా తెలుగు నాకో లైసెన్స్ ఇచ్చింది. ఇటువంటి ప్రేమ ఇంతకుముందు ఎస్వీ రంగారావు, నగేష్ వంటి కొద్ది మందికే దక్కాయి. అందువల్లే ఇప్పుడు ఏ ప్రాంత చిత్రాల్లో నటించినా అక్కడి వాళ్లూ నన్ను తమ వాడిగానే భావిస్తున్నారు. ఇక్కడ మరో విషయాన్నీ చెప్పాలి. ఎవరైనా ఒక వృత్తితో జీవితం ప్రారంభిస్తారు. తరువాత కొన్నాళ్లకు వృత్తి కన్నా ఎక్కువగా వ్యక్తిత్వమే మనిషిని నిలబెడుతుంది.

భాష విషయానికి వస్తే... అది శబ్దం మాత్రమే. మనిషి భావాల్ని, అవగాహనను అభివ్యక్తీకరించే మాధ్యమం భాష. ఆ క్షణానికి మన భావాలు భాష ద్వారా గుబాళించాలి. రచయిత లేదా వక్త ఏం తెలుసుకున్నాడు, ఏం చేశాడు, ఏం చెప్పాలనుకుంటున్నాడు అన్నవి తెలియజేయడమే భాషకున్న ప్రయోజనం. అంతే కాదు, మన సంస్కృతిని, ఆచారాల్ని, వ్యవహారాల్ని, సాంప్రదాయాల్ని, సామాజిక పరిస్థితుల్ని, ఉద్వేగాల్ని వ్యక్తీకరించుకోవడం. ఆ క్రమంలోనే అమ్మ భాషను నేర్చుకుంటాం. అలానే ముందు తరాల వారికీ దాన్ని తప్పక అందించాలి.

అందం భావనల్లో!

నా దృష్టిలో భాషకు ప్రత్యేక సౌందర్యం ఉండదు. ఒకే తెలుగు శ్రీశ్రీ చేతుల్లో ఒక రకంగా, ఆత్రేయ చేతుల్లో ఇంకో రకంగా, చలం చేతుల్లో ఒకలా, తిలక్ చేతిలో ఇంకోలా, సిరివెన్నెల సీతారామశాస్త్రి చేతిలో మరో రకంగా ఉంటుంది. ఆ భాషను ప్రయోగించిన విధానాల్లో వాళ్ల అవగాహన, భావనలు, ఉద్వేగాలు వ్యక్తమవుతాయి. అందువల్ల విషయం, శిల్పం, శైలి వేర్వేరుగా ఉన్నా రచయిత వల్లే భాషకు అందం! ఉదాహరణకు సినిమానే తీసుకుందాం. రాజ్‌కపూర్, బాలచందర్, విశ్వనాథ్, మణిరత్నం, బాపు, పుట్టణ్ణ వీళ్లందరి మాధ్యమమూ సినిమాయే. ఒక్కొక్కరిదీ ఒక్కో శైలి. ఒక్కో దర్శకుడి చిత్రంలోనూ ఒక్కో తరహా గొప్పదనం.

ఒక భాషను నేర్చుకోవడమంటే ఆ ప్రాంత ప్రజల్ని, సంస్కృతిని ప్రేమించడం, గౌరవించడం. నేను ఏ ప్రాంత చిత్రాల్లో నటిస్తే ఆ భాషల్ని నేర్చుకున్నాను. ఆ సాహిత్యాన్ని చదివాను. నేను ఎవరితో మాట్లాడుతున్నానో వాళ్లకు నేనేంటో తెలిస్తేనే నాకో గుర్తింపు. అందుకు వాళ్ల భాషలోనే మాట్లాడాలి. అప్పుడే నన్ను సొంతం చేసుకుంటారు.

భాషకి ఒక సంగీతం ఉంటుంది. దాన్ని వింటాను. పలికించడానికి ప్రయత్నిస్తాను. ఈ క్రమంలో తప్పులు చెయ్యడానికి వెనుకాడను. దాంతో ఆ భాష వచ్చేస్తుంది. చెప్పింది విని వల్లించడం నాకు నచ్చదు. అందుకే సంభాషణలను రాసి ఇమ్మంటాను. ఒక సారి వాళ్ళు పలికింది విన్నాక, చదివి ఆకళింపు చేసుకుని, నా శైలిలో తిరిగి చెబుతాను.

నిజానికి నాకు భాష మీదకన్నా జీవితం మీద ప్రేమ ఎక్కువ. మనుషుల్ని అర్థం చేసుకోవడానికి భాష ఒక సాధనం. దృశ్యాల్ని చూడటానికి కళ్ళు, శబ్దాల్ని వినడానికి చెవులు సాధనాలు మాత్రమే. చూసినవి, విన్నవి ఆకళింపు చేసుకుని అర్థం చేసుకోవడంలో జ్ఞాన, అవగాహన స్థాయి ఉంటాయి. మనిషికి శరీరం ఎంత ముఖ్యమో, భాషా అంతే ముఖ్యం. రాయలసీమ, లేదా గోదావరి జిల్లాల పాత్రను పోషిస్తున్నప్పుడు, ఆ పాత్ర మాట్లాడే భాషలో ఆ ప్రాంత పరిసరాలు, సంస్కృతి, ఆచారాలు, వ్యవహారాలూ అన్నీ ప్రతిఫలిస్తాయి. గోదావరి వంటి సస్యశ్యామల ప్రాంతంలో "నీ పాపం పండిన రోజు పడిపోతావురా" అంటారు. అదే రాయలసీమ వంటి దుర్భిక్ష ప్రాంతాల్లో అయితే "పాపంతో నీ పొట్ట పగిలిపోతుందిరా" అంటారు. అక్కడి సామాజిక పరిస్థితులు భాషలో వ్యక్తం అవుతాయి. ప్రజలు వాళ్ల పరిసరాల నుంచే మెటఫర్స్ తీసుకుంటారు. నివాస ప్రాంతాన్ని బట్టి భాష కూడా మారుతుంది. తమిళనాడు వెళ్ళి స్థిరపడ్డ వాళ్ల తెలుగు, మహారాష్ట్ర వెళ్ళిన వారి తెలుగు ఒకలా ఉండవు. స్థానిక పదాలు వారి మాటల్లో చేరతాయి. వృత్తుల్ని బట్టీ భాష మారుతూ ఉంటుంది. ఒక ఆటోడ్రైవర్‌తో మాట్లాడండి. అతని మాటల్లో తిన్నగా వెళ్లడం, కుడి వైపునకు మరలడం, వెనక్కి రావడం అన్నవి వాడతాడు. మిగిలిన వారు ఇవే భావాలకు వేరే పదాల్ని వాడతారు.

ఉపయోగించే భాషను బట్టి ఆ వ్యక్తి రుచులు కూడా తెలుస్తాయి. ఎంత తియ్యగా ఉందిరా అన్నారనుకోండి. ఆ వ్యక్తికి తీపి అంటే ఇష్టం అనుకోవచ్చు. మసాలాలు తినేవారు భలే ఘాటుగా చెప్పావ్రా అంటారు. నాలిక ఒకటే. కానీ ఆ మనిషి ఎంపికలో భాష దాగి ఉంటుంది. ప్రతిదీ వ్యక్తి సంస్కారంతో ముడిపడి ఉంటుంది.

భాషలు కొత్త ప్రపంచానికి ద్వారాలు

నాకు ఏడు భాషలు (కన్నడ, తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లిషు, మలయాళం, తుళు) చదవడం, రాయడం వచ్చు. వాటి సాహిత్యాన్నీ చదివాను. మరో భాషను నేర్చుకుంటే కొత్త ప్రపంచానికి ద్వారాలు తెరుచుకుంటాయి. తెలుగులోనూ చాలా చదివాను. నాకు పఠనం విలువ తెలుసు.

'అమృతం కురిసిన రాత్రి' చదవబట్టి అప్పటి మధ్యతరగతి జీవితాల్లో ఆశలు ఎలా ఉండేవో అర్థం అయ్యింది. శ్రీశ్రీని చదవబట్టి ఆ ఆవేశం వెనకనున్న పరిస్థితులేమిటో అర్థమయ్యాయి. ప్రపంచ సాహిత్యమూ చదవబట్టి దాని ప్రభావం వాళ్ల మీద ఎలా ఉందో తెలిసింది. చలం ఈ ప్రపంచం కన్నా వందేళ్ల ముందున్నాడు. బైరన్‌నీ, గిబ్రాన్‌నీ చదవకపోతే చలం ఈ ప్రపంచాన్ని అలా చూసేవాడా? "ఇలా బతకడం వీలవుతుందా?" అనే సవాల్ని చలం మనకు విసురుతాడు. మన పునాదుల్నే ప్రశ్నిస్తాడు. ఆయన్ని చదివి అర్థం చేసుకోవడం, ఆకళింపు చేసుకోవడం సులువు కాదు. మనం జీర్ణించుకోగలమా అని భయం వేస్తుంది. అలా అని పూర్తిగా వదిలెయ్యలేం. మింగలేక గొంతులో పెట్టుకోవడమే. ఒక విచిత్రమైన ఆందోళన మనలో నింపుతాడాయన. ఆయన్ని ప్రేమిస్తూ ద్వేషిస్తాం, ద్వేషిస్తూ ప్రేమిస్తాం. ఒకే కాలంలో రాసిన తిలక్‌కీ, చలానికీ ఆ తేడా ఎందుకుంది? ఆ కోపం, ఆ ఆవేశం శ్రీశ్రీకే ఎందుకొచ్చాయి? ఆత్రేయను చదివినప్పుడు ఆయన వల్ల భాష పునరుజ్జీవనం ఎలా జరిగింది? ఆ ప్రేమ స్పందనలు ఆయనకే

ఎలా కలిగాయి? ఇవన్నీ అర్థం చేసుకోవాల్సిన విషయాలు. తోల్‌స్తోయ్, చెహోవ్, వర్డ్స్‌వర్త్, షేక్స్పియర్, తమిళంలో సుబ్రహ్మణ్య భారతి, కన్నడంలో కె.ఎస్.నర్సింహస్వామి, బషీర్ వీళ్లందరినీ చదివినప్పుడు అప్పటి సామాజిక, ఆర్థిక పరిస్థితులన్నీ మన అవగాహనకు వస్తాయి. మన అభివ్యక్తి పెరుగుతుంది. వీరంతా మనకు చరిత్రకు కిటికీలు వీరి ప్రభావానికి లోనుకాకుండా ఉండటం సాధ్యమయ్యేనా?

నా స్నేహితుల్లో సినీ సాహితీవేత్తల ప్రభావం నా మీద చాలా ఉంది. సిరివెన్నెల, తనికెళ్ల భరణి, బ్రహ్మానందం, ఎం.ఎస్. నారాయణ, త్రివిక్రమ్ శ్రీనివాస్ వీళ్లంతా బాగా చదువుకున్న వారు. ఏ అర్థరాత్రో సిరివెన్నెల ఫోన్ చేస్తారు. ఫలానా పాట రాశాను, విను అని. దాంట్లో పదం పదంపై చర్చతో తెల్లవారిపోతుంది. ఇదంతా నాకు గొప్ప అభ్యాసమే! వీళ్ల భాష, రచనలు, చేసే ప్రయోగాలు, శైలి, వాటి వెనుక కారణాలను నిశితంగా గమనిస్తూ ఉంటాను. ఈ సాంగత్యం నా అదృష్టం. ప్రతి మాట భావగర్భితంగా ఉండాలన్నది వారి నుంచి నేర్చుకున్న సూత్రం.

జ్ఞానం ఉట్టంకింపుల్లో ఉండదు

జీర్ణించుకున్నదే జ్ఞానం. .అది ఉట్టంకింపుల్లో ఉండదు. గుర్తుకుతెచ్చుకోవడం అంతకన్నా కాదు. అది నీ అవగాహన పరిధిని ఎంతగా విస్తరించిందన్న దానిపై ఆధారపడి ఉంటుంది. ఫలానా రచయిత ఇలా అన్నాడు అని ఉట్టంకించడం మీద నాకు నమ్మకం లేదు. ప్రజలే నన్ను ఉట్టంకించాలని కోరుకుంటాను. అది అహంకారం అని అనుకున్నా సరే. ఎందుకంటే ఒకసారి నేనేదైనా సరే చదివి జీర్ణించుకుంటే ఆ తర్వాత అది నేనైపోతా. ఇక ప్రత్యేకంగా చెప్పడం ఎందుకు?

ప్రతి భాషకూ ఉండే సారూప్యతలు నవ్వు, అమ్మ, ఆనందం, గాలి, వర్షం ఇలాంటివే మరికొన్నీ! అనుభూతిలో అంతరాలుండొచ్చు. సాంస్కృతిక భేదాలు తప్ప తేడాలు ఏముంటాయి! భూమ్మీద వేటి సౌందర్యం వాటిదే! దాహం, ఆకలి, నిద్ర, భావోద్వేగాల్లాగే భాష కూడా ఒక అవసరం. అన్నిటి అవసరమూ ఒక్కటే. నదుల్లో నీళ్లన్నీ ఒక్కలా ఉండవు కదా! అలానే భాషలూ! వేటి ప్రత్యేకత, సొగసు వాటిదే. నేను అన్ని రకాల నీళ్లూ తాగాను, అన్ని రకాల భాషల్నీ చూశాను. కొన్ని నేర్చుకున్నాను. ఆస్వాదిస్తున్నాను. నాకు దేని పట్లా ప్రత్యేక ప్రేమ కానీ, విముఖత కానీ ఉండవు. అన్నిటికన్నా ఇష్టమైంది లాంగ్వేజ్ ఆఫ్ హార్ట్, లాంగ్వేజ్ ఆఫ్ ప్యూరిటీ, లాంగ్వేజ్ ఆఫ్ ఇన్నొసెన్స్. మంచి మనిషిగా ఉండటం వీటన్నిటికన్నా ఇష్టం.

కథ, కవిత, పద్యం... తేడాలేమీ లేవు. దొరికిందల్లా చదవడమే. ఇన్ని పనుల మధ్య సమయం ఎలా అంటే, ఆసక్తి ఉంటే అన్నీ కుదురుతాయి అంటాన్నేను. ఇప్పుడు కొత్తతరం రచనల్ని చదవడం కన్నా ఇప్పటి వరకూ చదివినవి పునఃపఠనంలో ఉన్నా. కన్నడ సాహిత్యాన్ని మళ్లీ చదువుతున్నాను.

తొలి ప్రేమ మాతృభాషే

ఇప్పటి తరం మాతృభాషను చదవడం లేదంటే అది వారి తప్పు కాదు. మాతృభాషలో చదవను అనే పిల్లవాడెవ్వడూ ఉండడు. మాతృభాషలో చదివించకపోవడం మన తప్పు. వాళ్లెందుకలా చేస్తున్నారు? కారణాల్ని అన్వేషించాలి. నమ్మకాన్ని కల్పించాలి.

పిల్లలకు చెప్పేదొకటే. ప్రేమించడం నేర్చుకోండి. మిమ్మల్ని ప్రేమించుకోండి. అది అందరినీ ప్రేమించడం నేర్పుతుంది. ప్రేమను పంచండి. బతకడం నేర్చుకోండి. బతికే ప్రతి క్షణం అర్థవంతంగా ఉంచుకోండి. దాన్ని ఇతరులకు చూపండి. అందుకు భాషను ఉపయోగించుకోండి. ప్రేమించడం మన ఇంటి నుంచే మొదలవ్వాలి. ఎన్ని ఆసక్తులున్నా, ఎందరు తారసిల్లినా జీవితంలో మన ప్రేమ అమ్మ నుంచే మొదలవుతుంది. అలానే మాతృ భాష కూడా!

రామోజీరావు చేపట్టిన ఈ 'తెలుగు వెలుగు'తూనే ఉంటుంది. ఎందుకంటే దాని మూలాలు సదుద్దేశంలో ఉన్నాయి. భాష విలువ తెలుసు కాబట్టి, ఎవరో ఒకరు చేయాలి కాబట్టి, తానే ప్రారంభించారు. ఇదే కాదు, అన్నదాత, మార్గదర్శి, ఈనాడు, రామోజీ ఫిల్మ్‌సిటీ... ఆయన దేన్ని చేపట్టినా దాని వెనుకో గొప్ప కారణం, సామాజిక ప్రయోజనం ఉంటాయి. జీవితాన్ని అత్యంత సార్థకంగా మలుచుకున్న ధన్యజీవి. దశాబ్దాల తెలుగు జాతి చరిత్రలో కొన్ని ముఖ్యమైన అధ్యాయాల్ని ఆయన అద్భుతంగా సృష్టించారు. అవి చిరస్థాయిగా నిలుస్తాయి, అలాగే ఆయనా.

సెలవా మరి

మీ

ప్రకాశ్ రాజ్

మన భాష

కొమ్మోజు శ్రీధర్

తేనెలొలికే భాష - తేటైన భాష
మమత పంచే భాష మన మాతృభాష
మేలు బంగారమై మనసు తెలిపే భాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

శాతవాహనుల నాటి శాసనం మనభాష
నన్నయార్యుని ఆదికావ్యమ్ము మనభాష
డిండిముని ఢంకాను పగులగొట్టిన భాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

భువన విజయమ్ములో కవనమ్ము మనభాష
కాకతిరుద్రమ్మ కదనమ్ము మన భాష
సకల సంపదలున్న సదనమ్ము మనభాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

అన్నమయ్య పదకవిత మన భాష
త్యాగయ్య ఘనరాగ కృతులలో మనభాష
కంచర్ల గోపన్న కీర్తనలు మన భాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

తిమ్మక్క భావాల సోయగం మనభాష
ముద్దు పళని ముద్దు పలుకులో మనభాష
క్షేత్రయ్య పదాల పుష్టిలో మనభాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

వీరేశలింగమ్ము సంస్కరణ మనభాష
గురజాడ అడుగులకు బాటచూపిన భాష
గిడుగు పంతులుగారి ఉద్యమం మనభాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

సిద్ధేంద్రుల నాట్యగరిమలో మనభాష
నటరాజ పేరిణీ తాండవం మనభాష
ఆదిభట్ల వారి హరికథను మనభాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

విశ్వనాథుని వేయిపడగలే మనభాష
తిమిరంతో సమరాన దాశరథి మనభాష
జాషువా ఫిరదౌసి, గబ్బిలం మనభాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

గోదారి గలగలల కదలికలు మనభాష
పరుగులిడు కృష్ణమ్మ పరువాలు మనభాష
పెన్నమ్మ పరవళ్ళ పదనిసలు మనభాష
కుంతాల జలపాత అందాలు మనభాష

బాసర పీఠాన గీర్వాణి మనభాష
త్రిలింగ క్షేత్రాల తేజస్సు మనభాష
బెజవాడ దుర్గమ్మ కరుణలో మనభాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

ఎములాడ రాజన్న ఢమరుకం మనభాష
తిరుమలేశుని శంఖుచక్రమ్ము మనభాష
భద్రాద్రి రామన్న బాణమే మనభాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

వేమన్న పద్యాల వేకువను మనభాష
వీరబ్రహ్మం జ్ఞానతత్వాలు మనభాష
మిద్దె రాములు పాడు ఒగ్గుకథ మనభాష
గొల్ల సుద్దులు, కురవంజి మనభాష

మన్యాన అల్లూరి విప్లవం మనభాష

కోడె కుర్రాడి మీసమ్ము మనభాష
పల్లెపడుచుల జడగంట మనభాష
దుక్కిటెద్దుల మెడగంట మనభాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

అమ్మ ఆత్మీయతను అల్లుకున్నది భాష
నాన్న గాంభీర్యతను నిండిఉన్నది భాష
అమ్మమ్మ, నాన్నమ్మ ప్రేమలో మనభాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

చిన్న కవితలోనైన ఇమిడిపోయెడు భాష
ప్రబంధకావ్యమై విస్తరించెడు భాష

ఆంధ్రకేసరి గుండె ధైర్యమ్ము మనభాష
స్వరాష్ట్ర సాధనకు ప్రేరణం మనభాష
స్వతంత్ర భారతికి కేతనం మనభాష

సత్యవీంద్రుల భావవిద్వత్తు మనభాష
అవధాన కళలతో అలరారు మనభాష
శాస్త్రీయ విజ్ఞాన ప్రజ్ఞయే మనభాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

తెలుగువాకిళ్ళలో గొబ్బెమ్మ మనభాష
తెలంగాణా పల్లె బతుకమ్మ మనభాష
తోలుబొమ్మలు, బుర్రకథలలో మనభాష
భాషలన్నిట లెస్స మన తెలుగు భాష

కోడి రామమూర్తి కసరత్తు మనభాష
గోపిచందుని మణికట్టు మనభాష
పట్టాభిరాముని కనికట్టు మనభాష
తెనుగింటిలో నేతిపెసరట్టు మనభాష

సంగీత సాహిత్య సౌరభం మనభాష
నిత్య చైతన్యమై విలసిల్లు మనభాష

తమ్ములారా మీరు మేలుకొనండి
చెల్లెళ్లారా మీరు చేయికలపండి
అమ్మలారా మీరు ఆలకించండి
అయ్యలారా మీరు అవధరించండి

తెలుగువారమె మనం
తెలుగె మాటాడుదాం
తల్లిభాషను కాపాడే
తెగువనే చూపుదాం

ప్రధానోపాధ్యాయులు.
ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
లక్సెట్టిపేట, ఆదిలాబాద్.
99894 64467

బలిదానం...

పాంచజన్య

పచ్చని, మెత్తని తివాచీ పరిచినట్లుగా ఉంది ఆవరణ. మధ్యలో రోడ్డుకిరువైపులా వందనం చేసే సైనికుల్లెక్క సక్కగా పెరిగిన అశోక చెట్లు. ఎంతో మంది శాస్త్రవేత్తలను, విద్యావేత్తలను, నాయకులను తయారు చేశానన్న దర్పంతో మేరునగ గాంభీర్యంతో అప్పుడే పూసిన పువ్వులా మెరుస్తాంది ఆర్ట్స్ కాలేజీ రాతి భవనం.

అచ్చిపోయే పోరగాండ్లతో ఇరాము (విశ్రాంతి) లేకుండా ఉంది లోపల. కాలేజీ బైట దాని నీడలు పాకిన చోటల్లా పిల్లల కోడిల్లెక్కన అక్కడక్కడ కొంత మంది విద్యార్థులు జమగూడిన్రు. (సమూహం) కాకిరిబీకిరిగా మాట్లాడుకుంటున్రు. మరి కొందరు జవుడం బెట్టుకున్నట్టుగనే ముచ్చట్లు ఆడుతన్రు. ఇంకో కాడ ఒకల్నొకలు పరాచికాలు ఆడుకుంటా పళ్ళు ఇగిలుస్తుంటే మరో చోట అదాలత్‌లోని (కోర్టు) తీరున వాడివేడి చర్చ సాగిస్తున్నరు. వాళ్లందరికీ దూరంగా మరికొంత మంది తపం చేస్తున్న మునుల్లెక్కన పుస్తకాల్ల మునిగిన్రు.

ఆ చెట్ల నీడన దీర్ఘాలోచన చేస్తూ కూసున్నడు శేఖర్. నెత్తి మీద అరెకరం జుట్టూడిపోయింది. కళ్లకు అద్దాలు. అక్కడక్కడ ముడుతలు వడ్డ మొఖంలో నైరాశ్యం. కళ్లలో అసంతృప్తి. పూరాగా దివాలా తీసిన మడిసి లెక్కున్నడు. గుంపులుగా మూగిన కాలేజీ పోరగాండ్లను తనే మాత్రం పట్టించుకోవడం లేదు. ఆళ్ల ముచ్చట్లేవీ అతని చెవికెక్కుతలేవ్. ఇనాలనీ లేదు. క్యాంపస్‌లోనే ఐదేళ్ళు సదివిండు. రెండు పీజీలు చేసిండు. రెండేళ్ళుగా గిదే క్యాంపస్‌లా తెలిసిన తనూరు పోరగాండ్లతో చేరి నాన్ బోర్డర్‌గా ఉంటున్నడు. గవన్నీ అతనికి షరా మామూలే. వాటినేవీ పట్టించుకోకుండానే చేతిల పట్టుకున్న వైలును (పుస్తకం) మూసుకుంటా, తెర్సుకుంట ఉన్నడు. సదవ మనసొప్పక ఆ గడ్డిమీద పండుకుని వైలును అట్లనే రొంబొచ్చ (ఛాతీ) మీద పెట్టుకుని కళ్ళు మూసుకున్నడు.

"అన్నా అన్నా" అంటూ చందు పిలుపుతో ఉరుమేదో మీద పడ్డట్లుగా దిగ్గున లేచి కూసున్నడు.

"అన్నా నీ కోసం పొద్దుగాల్నుంచి క్యాంపస్ అంతా తిరుగుతానా. గడిగడికీ మనరూం కాడికి పోయొచ్చిన, ఓసారి కొరియరాఫీసు కాడికీ పోయొచ్చిన. పొద్దున్నుంచి ఏడికి పోయినవ్" అంటూ టీవీల వార్తలు చదివినట్లుగా చదువుతాండు చందు.

"ఏడకి పోలే ఈడనే కూసున్న తమ్మి" అంటూ నిర్లిప్తంగా సమాధానమిచ్చిండు శేఖర్.

"ఈడ్నే కూసోని ఏం చేస్తున్నవ్" అని చందు మళ్లీ ప్రశ్నించిండు.

"మనసెట్లనో ఉందిరా ఇసికియ్యకు" అంటూ బతిలాడినట్టుగా శేఖర్ అనే సరికి..

"సరే సరే నీకో ముచ్చట చెప్పాలే పా అట్లా ఛాయ్ దాక్కుంటా మాట్లాడుకుందాం" అంటూ పైకి లేచాడు చందు. ఆ వెనకే శేఖర్ లేచాడు. ఆ పక్కనే ఉన్న ఛాయ్‌బండి దగ్గరికి పోయిండు.

"ఏంది తమ్మీ ఏదో ముచ్చట చెప్తనన్నవ్" అంటూ అడిగిండు శేఖర్.

"ఏం లేదన్న ఇంటికి పోయిన కదా పనాదెంబడి (రోడ్డు) నడుసుకుంట పొతాంటే మొన్న పెద్దవ్వ కండ్లబడింది. ఇంటిమొఖాన రమ్మని ఒక్కతీరుగా జెప్పితే ఇటచ్చే ముందు పోయిన. నాయినగూడ కలిసిండు" అంటూ చందు ఇంటికాడి ముచ్చట తీయంగనే కళ్లన్నీ

పెద్దగ జేసుకొని ఏదో ఆతురతతోటి "అవ్వ నాయిన ఎట్టున్నరు తమ్మి" అంటూ అడిగిండు శేఖర్.

"అన్నా అవ్వ, నాయిన నీ గురించే చానా రంది (బాధ) బెట్టుకున్నరు. మా ఓడు ఇంటికొచ్చుడే మానేసిండని నాయిన సుత అన్నడు. 'ఆడు ఎట్టున్నడో'ననీ నీ గురించే తండ్లాడతాండ్లు (బాధపడడం). 'నౌకరి

అచ్చేనా రాకపోయేనా' అని అడిగిండు. పెద్దవ్వయితే కండ్ల నీళ్ళు పెట్టుకున్నది. 'నౌకరంటే ఉత్తగనే అత్తదా. సదువద్దా. ఊకే ఇంటిమొఖానే రమ్మంటే ఎట్ల' అని నాయిన్నే గద్మాయించిండు (కసురుకోవడం). దేనికైనా పనికొత్తయని ఇగో ఐదువందలు ఇచ్చిండు." అంటూ విషయాన్ని చెప్పిండు చందు.

'నాయిన' అన్న మాట ఇనంగనే శేఖర్ కండ్ల కొసల్ల నీళ్ళు తిరిగినయ్. పూడుకు పోయిన గొంతుతో "ఇంకేం చెప్పిండు తమ్మీ" అని అడిగిండు శేఖర్.

"అంతా మంచిగనే ఉన్నమని, యాళ్ళకు ఇంత తినమని జెప్పిండు. సదువేది ఏదీ

లేకుంటే ఉగాదికి రమ్మన్నడు" అంటూ చందు చెప్పగానే అక్కడ్నుంచి ఉన్నపళంగా లేచి మళ్ళీ చెట్ల నీడలున్న జాగమొఖాన నడిచిండు.

ఛాయ్ పైసలిచ్చి ఉరుకుతా నడిచిండు చందూ. క్యాంపస్‌ల ఓ మూలకున్న బెంచీపై కూలబడ్డ శేఖర్‌ని పట్టుకుని "అన్న ఏమైందే ఎందుకట్ల ఫికరైతాన్నవ్" అంటూ ధైర్యం జెప్పుతున్నడు చందూ.

"ఏం చెప్పేదిరా తమ్మీ చెప్పడానికి ఏముందని? నౌకరి అంటే దుక్నమా ఏంది అట్లా ఎళ్ళి ఇట్లా పొట్లాం కట్టించుకొని అచ్చినట్లు, ఏం చేద్దాం" నిట్టూర్చాడు శేఖర్.

"మీ నాయనకు నువ్వంటే లవు (చానా) పేమే అన్నా" అని చందు అంటుంటే... శేఖర్ కనుకొనల్లో సుళ్ళు తిరిగిన కన్నీళ్ళు టపటపమంటూ నేలరాలినయ్.

ఒక నిమిషం మౌనం.. మాటల్లో వణుకు. దుఃఖంతో మూసుకుపోతున్న గొంతులోంచి "తమ్మీ ఇంటికి నేను తొలిసూరు బిడ్డను. ఉన్న రెండెకరాల భూమితో యవుసం చేస్తూ నాయిన బొక్కలన్నీ తెల్లబడ్డయ్. తిని తినక, ఓ పొద్దు పస్తులుంటూ పైసా పైసా కూడబెట్టి ముడ్డికిందకి ముప్పై ఏళ్ళు అచ్చేదాకా నన్ను కూకోబెట్టి ఆళ్ళు సాకిన్రు. అప్పులు దెచ్చి సదువుకోమని పట్నానికి పంపిండు. ఇంకా పైసలడగనికి మనసొప్పక ఆ కొరియర్ సెంటర్‌లో గంటలెక్కన పని సేయవడ్తిని. బుద్దెరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు నా కష్టంతో కొని ఆళ్లకు నేనేమీ ఇయ్యలేదు. గీదినం వరకూ నీ నౌకరేమైందిరా అని ఏనాడూ నన్ను అడగలే. ఉన్న ఆ రెండెకరాల భూమినీ చెల్లి పెళ్ళి కోసం, నా సదువుకు చేసిన అప్పుల కోసం పోయినేడే అమ్మిండు. 'భూమమ్మకే... నేను ఊళ్ళనే ఉండి ఏదో పనిచేస్త అప్పులు కడుదమే నాయినా' అంటే 'కడుపు కట్టుకొని నిన్ను సాకింది నా లెక్కన యవుసం చేసేందుకు కాద'ని కండ్లెర్ర చేసిండు. 'భూమమ్మితే ఎట్ల బతుకుతవే' అని నేనంటే 'నువ్ లేవార బిడ్డా..' అని ధైర్యంగా చెప్పిండు. ఉన్న భూమమ్మి ఇప్పుడు ఆ భూమినే మునావుకు (కౌలు) తీసుకుని యవుసం చేస్తుండు. ఎన్నడు పక్క పొలానికి కూడా పోని మా అవ్వ ఇప్పుడు కైకిలికి పోతాంది.

"ఊళ్లో ఉండి అవ్వ అయ్యలను చూసుకుంటున్న నా ఈడు పోరగాండ్లను చూస్త ఆళ్ళ మనసులనే బాద పడ్డరు కానీ నన్నే పొద్దు బాధపెట్టలే. ఆళ్ల తోటోల్లు మనువలు, మనువరాండ్లను సూసుకొని మురిసిపోతాండే ఆళ్ళు కుమిలిపోని దినం లేదు. వాణ్నెందుకు ఇంకా సదువిత్తానవ్ అని ఎవడైనంటే అగ్గిమీది గుగ్గిలం లెక్కనైతడు. అందిన కాడల్లా చేయిసాపి పెడతనంటడు. బొక్కలన్నీ కలికలి చేసుకుంటూ నువ్ మాత్రం సదువు ఆపొద్దు బిడ్డా అంటడు. గీ

సర్టిఫికెట్లను చూసినప్పుడల్లా నాయిన చేసిన అప్పు కాగితాలు, పడ్డ తిప్పలే మదిల మెదుల్తయ్. ఆ గోల్డ్‌మెడల్ చూసినప్పుడల్లా కరిగిపోయిన అవ్వ పుస్తెలతాడే నా కండ్లల్ల మెరుత్తది. ఆళ్ళు చేసే కష్టాన్ని చూడలేక, ఉండి ఉగ్గబట్టలేక ఊరుకి బొవుడే మానిన.

"పోయినేడు ఉగాదికి పోయిన. మళ్లా ఇంటి మొఖం చూడలే. నాకు నౌకరత్తదనే ఆశతోటే గుండె ధైర్యం చెడక బతుకుతుండ్రు. గందుకే మనీడు పోరగాండ్లు కళ్లబడితే చాలు నా కొడుకు పట్నంల సదువుతాండు మీకు ఎప్పుడైన కలుత్తడా, ఆనికి నౌకరెప్పుడొత్తదని ఆరాలు తీస్తాంటడు. మనూరి పోరగాండ్లు కలిస్తే ఎట్లున్నడు. ఏం జెత్తున్నడని నా మంచిచెడ్డ అరుసుకుంటడు (తెలుసుకోవడం). ఊళ్లోకి ఏ గవర్నమెంటు నౌకరిగాడన్న అత్తే చాలు ఆని లెక్కన నన్ను ఊహించుకుంటడు. నాకు నౌకరి అత్తదని పిట్టకు పెట్టినట్లు చూస్తాండు. ఇగ కొరియర్ ఆఫీసుకు కోచింగ్ సెంటర్‌కు తిరుగుట్లనే పట్నంల బతుకు తెల్లారవట్టె. మన సదువులన్నీ ఆనకాలం సదువులేనాయె.

"మనం సదివిన సదువు వేరు గిప్పుడు పరీక్షల వాళ్ళడిగేది వేరు. ఒక్క ఉద్యోగానికి వేయి మందిమి ఉంటిమి. చాట్ల తౌడు బోసి కుక్కల కొట్లాట బెట్టినట్లు చేయవట్టె గవర్నమెంటోడు. లక్ష ఉద్యోగాలని చెప్పబట్టె. ఆఫీసుల చప్రాసీలకు, బందోబస్తుకు, లెక్కలు చూసే, కరెంటు పని చేసే నౌకరీలను సూపిస్తూ తన్నబట్టె. మాటలతోనే మాయ చేయవట్టె. ఈ యేడు ప్రకటన ఈయవట్టే... అచ్చేయేడు పరీక్ష బెట్టవట్టె. మనల్ని ఏదొక్కటి సక్రమంగా సదువకుంట చేయవట్టె. ఉన్నోడు సంవత్సరాల కొద్ది పరీక్షలకు తర్ఫీదు తీసుకోవట్టె. ఇంకా ఉన్నోడు నౌకర్లనే కొనుక్కోవట్టె. తినబోతే తిండికి, పండబోతే మంచానికి కరువన్నట్లుగా మన బతుకులుండే. ఇంకేదన్న పన్జేసుకుందామా అంటే ఇంత సదువు సదివి నువ్ తెచ్చుకున్న నౌకరి గిదేనా అని నలుగుట్ల నవ్వుల పాలైతమని భయమాయే. అదీగాక మళ్లా ఆడెప్పుడు పీకేస్తడో తెల్వదు. అంత చేయించుకుని ఆఖరికి జీతమిస్తడో ఎగ్గొడతడో తెల్వదు. గ తిప్పలేదో ముందుగనే పడితే

అటేంక (తరువాత) బేఫికర్‌గా బతుకొచ్చు గదాని సదువుతాన్న.

"మరోసారి గిన్ని దినాలు ఆళ్లను కట్టపెట్టి గసుమొంటి నౌకరెట్ల చేసేదనిపిస్తది. సదువుకు తగ్గవి కాకున్న ప్యూను నౌకరి కాడ్నుంచి అన్నింటికి అర్జీ పెడ్తున్న. పట్నంల బైట ఉండనీకి, తిననికి పైసల్లేక నీ అసోంటి తెలిసినోళ్ల సాయంతోటి క్యాంపస్‌ల నాన్ బోర్డర్‌గా ఉండవడ్తిని. మెస్‌ల కేర్ టేకర్‌గానికి కనిపించకుండ దొంగలెక్కన బతుకవడ్తిని. పండగ లేదు పబ్బం లేదు. అవ్వ లేదు అయ్య లేదు. దినాము సదువులల్లే మునగవడితి. నౌకరచ్చేదెన్నడు మన బతుకు బతికేదెన్నడు, ఆళ్లను సాకేదెన్నడు" అంటూ గుడ్ల నీళ్ళు కుక్కుకున్నడు శేఖర్.

"ఇంటింటికి మంటిపొయ్యే అన్నట్లుగా క్యాంపస్‌ల ఆ చెట్ల కిందన కూసున్నోళ్లందరి బతుకులు, ఈ యేడు పోతే ఆఖరికి నా బతుకు అంతే," అంటూ నిట్టూర్చిండు చందు.

"అది సరే గీ యాల ఈడ్నే పొద్దూకింది పద పద ఆ మెస్‌లకు ఎవడు రాకముందే పోదాం. మెస్‌టేకర్‌గాడు ఆచ్చిండంటే మన కడుపు మాడుడే," అంటూ శేఖర్‌ను ఏగిరబెట్టిండు చందు. తప్పదన్నట్లుగా ఇంకా ఏదో ఆలోచిస్తనే లేచిన శేఖర్ తనతో పాటు చందు మెస్‌వైపు సాగిపోయిండ్రు.

ఏదో తిన్నమా అంటే తిన్నమన్నట్లుగా కానిచ్చి తమ గదివైపు కదిలిండ్రు. మూలకున్న మడత కుర్సిని తీసి పక్క (మంచం) పక్కనే ఏసుకుని కూకున్నడు. సదివే బుద్దిగాకున్న ఏదో సదవాలన్నట్లు చేతిలకు ఓ వైలును (పుస్తకం) తీస్కున్నడు. వైలు తెరిచిండన్న మాటే గాని కమ్మలైతే (పేజీల) తిరుగుతలేవ్. యావ ఇంటిమీదకి పోయింది. పొద్దుగాల మాట్లాడుకున్న ముచ్చట్లే శేఖర్ మదిల పెండల పురుగు మెసుల్తున్నట్లు మెసుల్తున్నయ్. సదువ బుద్ధిగాక కుర్సిలకెల్లి లేచి పక్కెక్కి కళ్ళు మూసుకున్నడు. అయినా గాముచ్చట్లే యాది కొస్తున్నయ్. నిద్రపట్టక గడికోసారి అటూ ఇటూ బొర్రుతాండు. ఏ నడిజామురాత్రో రవ్వంత సేపు కునుకు పట్టింది.

"అన్న... లే అన్న లే" అన్న చందూ పిలుస్తుంటే "ఏంది తమ్మి అట్ల చెవుగోసిన మేకలెక్కన అరుస్తానవ్" అంటూ విసుక్కుంటూనే పైకి లేచిండు శేఖర్.

చందూ మొగంల ఉన్న సంబురం చూసి "ఏం తమ్మి ఏంది ముచ్చట మాకూ జరంత చెప్పరాదు మేం కూడ సంబురపడతం" అంటూ విషయం అడిగాడు శేఖర్. "అన్నా నీకు నౌకరచ్చిందే, పోయినేడు రాసిన పరీక్షల నువ్ పాసైనవ్. ఎల్లుండి ఇంటర్వ్యూలకు రమ్మన్నడు. గీ దినం నుంచి నీ కష్టాలన్ని పోయినట్టే" అంటూ పెద్ద చెరువు మత్తడి

బడ్డట్లుగా చందు ఇంకా ఏదో జెప్తూనే ఉన్నడు. నౌకరచ్చిందన్న మాట ఒక్కటే శేఖర్ చెవులకెక్కింది. అంతే ఆ మాటతోనే మొఖం ఎన్టీపీసీలా ఎలిగిపోతాంది. జగాన్ని ఏలినంత సంబురం. గర్వంతో పొంగి పోతాండు. నోట్లకెల్లి ఒక్కమాట ఎల్లతలేదు. భూమ్మీద కాళ్ళు నిలుత్తలేవ్. కండ్లల్ల నీళ్ళు ఆగుతలేవ్. తలుగిడిసిన దూడలెక్కన మంచం కింద పెట్టిన సందుగ కాడికి ఉరికి దాన్ని తెరిచిండు. సర్టిఫికెట్లు వర్సలో సదురుడు మొదలు పెట్టిండు. రంగుల ఫొటోలు మంచివి ఉన్నయా లేవా అని పట్టిపట్టి సూత్తాండు. "అన్న ఇంటర్వ్యూ ఇయ్యాలగాదే" అంటూ చందూ పరాచికాలడినా పట్టించుకోక తన పని తను చేసుకుంటున్నడు శేఖర్. దినమంతా ఇంటర్వ్యూ గురించే ఆలోచనలు.

ఇంటర్వ్యూ రోజు రానే వచ్చింది. అప్పటికే తయారై ఉన్న శేఖర్‌ని చూస్తూ "అన్నా సూర్యుడు నడినెత్తిమీద కొచ్చేదాంక పంటవ్. గియాల అప్పుడే ముద్దుగ తయారైనవ్" అని చందు అంటుంటే "తమ్మీ అసలు రాత్రి నిద్రపోతే గదరా పొద్దున్నే లేవనీకి" అని బదులిచ్చిండు శేఖర్.

"ఇంటర్వ్యూ కాంగనే మొట్టమొదట నాయినకు ఫోన్ చేయాలే. నీ కొడుకు నౌకరోడు అయ్యిండని చెప్పాలే. లేదు లేదు అటునుంచి అటే ఇంటికి పోయే చెపుతా" అంటూ చెప్తున్న శేఖర్‌ని చూసి మరేమీ మాట్లాలేదు చందూ.

మెస్ వైపు నడుస్తున్న చందుని "తమ్మీ ఈ పొద్దు బైట తిన్దాం పదరా" అంటూ ఉత్సాహ పరిచాడు. ఇంటర్వ్యూ జరిగే చోటుకు దగ్గర్లో ఉన్న హోటల్‌కి పోయి పూరీ చెప్పిండ్రు. కుక్కలేవో తరుముతున్నట్లుగా ఆదరాబదరాగా నాస్తా (టిఫిన్) చేసిండ్రు. ఇంటర్వ్యూ హాలు వైపు పరుగులు తీసిండ్రు.

"అన్న నాకు జర పనున్నదే ఇక్కడున్నట్లుగనే అస్త. నువ్ ఇంటర్వ్యూకు పో. ఆడనే ఉండు" అంటూ తన పని మీద వెళ్ళిపోయాడు చందు.

హాలు దగ్గర ఎవరూ లేరు. అక్కడే గచ్చును (నేల) సాపు చేస్తున్న చప్రాసీల దగ్గరికి పోయి "ఇంటర్వ్యూలు ఇక్కడ్నే గదా" అని అడిగాడు శేఖర్. 'ఆ' అన్న మాటే మాట్లాడిండు అవతలి మడిషి. "ఒక్క పురుగైన లేరేంది" అని మరోసారి అడిగాడు. "నువ్ ముందొచ్చి ఎవలూ లేరేంది అంటవ్. ఇంకా షానాటైముంది పో పో" కసిరిచ్చుకున్నడు ఆ మనిషి.

ఆ పక్కనే కుర్సీలను జూసి బోయి కూర్చుండు. ఒక్కొక్కరు వచ్చి కూసుంటాంటే చూసి "నౌకరీల కోసం ఎంతమంది తండ్లాడుతాండ్లో" అనుకున్నడు. చిన్న పేపర్ కదిలినా వినబడేంత నిశ్శబ్దంగా ఉందా హాలు. నిముషాలు యుగాలుగా నడుస్తున్నయ్. ఇంటర్వ్యూలు షురూ ఐనయ్. శేఖర్‌లోనూ ఏదో వణుకు మొదలైంది. మనిషికి కూకోను మనసైతలేదు. కాలు నిలుత్తలేదు. గొంతుక ఎండుక పోతాంది. నుదుటన సెమట్లు పోత్తాన్నయ్. లోపలికెళ్ళి వాడిపోయిన మొగాలేసుకుని వచ్చేటోళ్లను చూసినప్పుడల్లా గుండె దడ పెరుగుతాంది. నవ్వు మోగాలు వేసుకొచ్చేటోళ్లను చూస్తుంటే

శేఖర్ మొగంల ఆశల పూలు పూస్తున్నయ్. తన పేరు కోసం ఆత్రంగా చూస్తున్నడు. 'ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు' అంటూ నిముషాలను లెక్కిస్తూ మునేళ్లమీద నిల్చున్నడు. "శేఖర్" అన్న పిలుపు పూర్తి గాకుండనే లోపలికి పోయిండు.

***

చందు వచ్చేసరికి అక్కడెవరూ లేరు. అటూ ఇటూ చూసి అక్కడే ఉన్నతన్ని ఇవరం అడిగిండు. "ఇంటర్వ్యూలైపోయినయ్ కద" అంటూ ఆ మనిషి చెప్పిండు.

'అన్న నౌకరచ్చిన సంబురంల తమ్మిని యాదిమరిచిండు. అయినా జల్దీగా ఇంటికి పోవాల్నని పొద్దుగాల్నే చెప్పిండు. క్యాంపస్ కాడికి గిట్ల పోయిండు గావచ్చు' అని తనలో తనే అనుకుంటూ క్యాంపస్ మొఖాన నడిచిండు చందు. క్యాంపస్ అంతా ఎల్లిపోయిన కొంపలెక్క నిశ్శబ్దంగా ఉంది. పోరగాండ్ల నవ్వులు లేవు.

పుస్తకాల సప్పుడు లేదు. చందుకి అంతా ఇసిత్రంగా ఉంది. అందరూ హాస్టల్‌లోని ఓ గదివైపు నడుస్తుంటే చందు అటేపుగా పోయిండు. ఒక్కొక్కరిని తోసుకుంటూ ముందుకు నడిచిండు. క్లాస్‌రూం దర్వాజా దాంకా వచ్చిండు. అంతే ఒక్క అడుగ్గుడా ముందుకేయలేదు. చేతిల పొట్లం అట్లనే కింద పడ్డది. అది చినిగి అందులోని జిలేబీలన్నీ బైటపడ్డయి. ఆట్ని చూస్తూనే పాతాళగంగాలా గుండెల్లోంచి దుఃఖం పొంగుకస్తుంటే ఆపుకోలేక పోతున్నడు. ఎక్కెక్కి ఏడుస్తూ కన్నీళ్లతో తడిసిముద్దై పోతున్నడు. రెండు చేతులతో గుండెల మీద బాదుకుంటున్నడు. గొంతెండిపోయేలా అరుస్తున్నడు. "తమ్మీ నీ పేరేంది. ఆ పొలగాడు నీకెరుకన" అంటూ అప్పుడే అక్కడికొచ్చిన పోలీస్ అడుగుతుంటే ఎరుకన్నట్లుగా తలూపిండు. గదిలో ఫ్యానుకు ఏలాడుతున్న మనిషిని కిందకి దించిన్రు పోలీసులు. సార్ జేబులో ఏదో చీటీ ఉందని తీసుకొచ్చి ఎస్సైకి ఇచ్చిండు ఓ పోలీస్. దాన్ని సదువుడు మొదలుపెట్టిండు ఎస్సై...

"అవ్వ నాయనకు... మిమ్మల్ని నట్టేట్ల ముంచిపోతున్నందుకు నన్ను మన్నించండి. నేను నౌకరి సంపాయించుకోలేని అసమర్థున్ని కాదే నాయినా. నౌకరీ అత్తదని గియ్యాటిదాంక చూసిన. గియ్యాల్ల ఆశలన్ని సచ్చిపోయినయ్. చప్రాసీ నౌకరీ మొదలు కొని పెద్ద పెద్ద ఉద్యోగాలదాంక పైసల్తోనే పని నడత్తాంది. పరీక్షల ప్రశ్నలడిగితే రాత్తగాని పైసలడిగితే ఏడ తేను. దేవునికి పదో పరక ముడుపు కట్టే శక్తి ఉన్నా నౌకరీ కోసం ఆళ్లడిగే ముడుపులు చెల్లించ శక్తి లేదే నాయిన.

"నువ్వుపడే కష్టం సూసుకుంటనే నిన్నెట్లడగను. నేను పని చేయలేని చేతగానోన్ని కాను. సదివిన సదువుకు తగ్గ పని లేదనే అసంతృప్తున్ని. నిరాశతోనో, అనాలోచితంగానో, ఆవేశంగానో నేనం సత్తలేనే నాయిన. సదివి ఏం సాధించినవని అందరూ అంటుంటే నేనినలేను. అందరి ముందుగల బుడ్డర్‌ఖాన్‌ల బతకలేను. గందుకే మిమ్మిడిసిపోతున్న. నా లెక్కనే నౌకరీ కోసం గబ్బిలాల్ల క్యాంపస్‌ను పట్టుకుని ఏళ్లాడతన్న పోరగాండ్లకు మన ఆశలన్ని దింపుడుకల్లం ఆశలేనని చెప్పేందుకే ఈ పనిజేత్తున్న. ఎస్కార్టులతో, ఏసీ కార్లల్ల తిరుగుతూ నోటికచ్చింది మాట్లాడి పబ్బం గడుపుకునే నాయకులు కళ్ళు తెరుత్తరని, నాలాంటోళ్ల అరిగోసను అప్పుడైనా సూత్తరని ఆశతోనే ఆత్మబలిదానమిచ్చుకుంటున్న. నాయిన మీరైతే నన్ను యాది మరవకండ్రి. బతుకంటూ మళ్లా ఉంటే గప్పుడైనా నౌకరచ్చేట్టు చేయమంటా గ దేవుడ్ని.

ఇట్లు, శేఖర్.

కండ్ల నీళ్ళు తుడుచుకున్నడు ఎస్సై. పెద్దవ్వకు నాయినకు నేనేం చెప్పాలే అని ఏడుస్తూనే ఉన్నడు చందు.

పాత్రికేయులు, వరంగల్.
94929 10065

సానీలు

కొండ
ప్రకృతికి అండదండ
మనిషి స్వార్థం దాన్ని బద్దలు
కొడుతోంది

కోడి
వేకువనే అందరినీ నిద్రలేపింది
వేడి పలావుగా మారిపోయింది

ధనం
ఎప్పటికీ తీరని దాహం
మనిషి మరణమే దానికి పరిష్కారం

గుడి
ఇప్పుడు మనిషి చేతిలో దోపిడి
భయంతోనేమో కూలిపోతోంది

మతం
అర్థాలు తెలియని పాఠ్యగ్రంథం
ఎవరి నిఘంటువు వాళ్ళదే కదా!

కులం
ఎవరు సృష్టించారో ఈ పదం?
లౌకిక రాజ్యానికి ఆసరా అయింది

నిరుద్యోగి
ఎడారిలో ఒంటరి పక్షి
ఒయాసిస్సును వెదుక్కుంటూ

బాల్యం
కాన్వాసుపై చిత్రించిన వర్ణచిత్రం
రంగులు ఒలికిపోతున్నాయి

మార్పు
కాలం ఇచ్చే తీర్పు
దాన్ని ఎదిరిస్తే తప్పదు నిట్టూర్పు

భూతకాలం
దానికి భయపడింది సమాజం
వర్తమానం దయ్యమై పీడిస్తోంది

సానీ
సామాన్యుడి నీతిచంద్రిక
మనిషిని మేల్కొలిపే ప్రభాత విపంచిక

–శ్రీరామదాసు అమరనాథ్
96033 67178

పారిస్ నుంచి తందాన తాన

కొందరి ఆశయాలు ఎల్లలు దాటి పోతాయి. వారినీ వెంట రప్పించుకుంటాయి. ఫ్రాన్సు వాస్తవ్యులు డేనియల్ నెజర్స్ ఆ కోవకు చెందిన వ్యక్తే. ఆయన అపుడపుడు తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో కనిపిస్తుంటారు. అక్కడి జానపద కళాకారుల్తో చెట్టాపట్టాలు వేసుకు తిరుగుతుంటారు. దగ్గరికెళ్ళి పలకరిస్తే, కాస్త పట్టి పట్టి మాట్లాడినా, ముచ్చటగొలిపే తెలుగులోనే జవాబిస్తారు. బుర్రకథ ఏయే ప్రాచీన జానపదకళల్నించి అభివృద్ధి చెందిందో ఆయన చెప్తారు. సంస్కృత పదాల్తో పోలిస్తే అచ్చ తెనుగు పదాల్లోని శ్రావ్యతకు కారణాలనూ చర్చిస్తారు. మన భాష, సంస్కృతులకు సంబంధించి ఎన్నో కొత్త కోణాల్లో విశ్లేషణల్ని మనతో పంచుకుంటారు. ఆయనతో మాట్లాడటమంటే మన గురించి మనం కొత్తగా తెలుసుకోవటమే. అందుకే తెలుగు వెలుగు ప్రతినిధి ఆయనతో మాట్లాడారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి తదితర అంశాలపై ఆయన అభిప్రాయాల్ని తెలుసుకున్నారు.

తెలుగు వెలుగు: వేల మైళ్ళ అవతల ఉన్న మిమ్మల్ని భారతదేశం ఎలా ఆకర్షించింది?

డేనియల్ నెజర్స్: నాకు భారతీయత పట్ల మక్కువ కలగటానికి బాల్యంలోనే పునాదులు పడ్డాయి. నేను 1954లో పారిస్‌లో జన్మించాను. అమ్మ, అమ్మమ్మలిద్దరూ సంస్కృతి సాహిత్యాల పట్ల అభిరుచి కలిగేలా పెంచారు. వారిది వ్యవసాయ కుటుంబం. మొదట్లో పల్లెటూరిలో ఉండేవారు. కానీ రెండో ప్రపంచయుద్ధం వారి జీవితాల్ని ఛిన్నాభిన్నం చేసింది. అమ్మని తీసుకుని వితంతువైన అమ్మమ్మ పారిస్ నగరానికి వచ్చేసింది. ఇక అక్కడే స్థిరపడ్డాం. సెలవుల్లో మాత్రం పల్లెటూరికి వెళ్ళేవాళ్ళం. అక్కడ బంధువులు, తోటి పిల్లలతో గడపడం బాగుండేది. ప్రకృతి ఒడిలోని ఆ పల్లె వాతావరణం స్వర్గ సమానంగా అనిపించేది. పారిస్ నగరం మాత్రం నచ్చేది కాదు. పైగా అమ్మ తరచూ పల్లెటూరిని, అక్కడి అనుభూతుల్నీ స్మరించుకునేది. నాకు చిన్నప్పుడే నగరవాసం పట్ల విముఖత కలిగింది. అక్కడి వ్యాపారమయ ప్రపంచం, కొనుగోలుదారుల సంస్కృతి అసంతృప్తిని కలిగించేవి. అదే నా చదువును మానవ విజ్ఞాన శాస్త్రం (ఆంత్రోపాలజి) వైపు మళ్ళించింది. నన్ను భారతదేశానికీ తీసుకొని వచ్చింది.

తె.వె.: పర భాషీయులెందరో తెలుగును మెచ్చుకున్నారు. ఫ్రెంచి మాతృభాష అయిన మీరు తెలుగు గురించి ఏమంటారు?

నెజర్స్: తెలుగు చాలా శ్రావ్యమైన భాష. వ్యక్తీకరణకు చాలా మధురమైన సాధనం. అందుకే 15వ శతాబ్దంలో నికొలో డి కాంటి (Niccolo de Conti) అనే ఇటాలియన్ పర్యాటకుడు దీన్ని "italian of the east" అని మెచ్చుకున్నాడు. ఈ ప్రశంసను తెలుగు ఇప్పటికీ నిలుపుకోగలిగింది. దీనికి రెండు కారణాలు. ఒకటి, బరువైన ధ్వని గల ఈ పదాల నడక వినసొంపుగా ఉంటుంది. అచ్చ తెనుగు శైలిలో ఇది మరింత ప్రస్ఫుటంగా తెలుస్తుంది. రెండో కారణం మొదటి దాన్ని వివరించేది. తెలుగులో చాలా పదాలు అచ్చుతో అంతమయ్యేవి.

ఎక్కువగా 'ఉ' కారంతో పూర్తవుతాయి. మిగతావి 'అ' 'ఇ' 'ఒ' వంటి అచ్చులతోనూ, వీటి దీర్ఘ రూపాలతోనూ ముగుస్తాయి. సంధులతో ఏర్పడ్డ ఈ పదాల నడక ఎంతో శ్రావ్యంగా ఉంటుంది. కర్నాటక సంగీతానికి స్వరకల్పన చేసేవారు ఎక్కువగా తెలుగు వాడటానికి ఇదే కారణమనుకుంటాను. ఇలా సంగీతానికి అనుకూలం కావడం తెలుగు, ఇటాలియన్ భాషలకున్న మరో పోలిక.

తె.వె.: ప్రత్యేకించి పెద్దాపురాన్ని కార్యక్షేత్రంగా ఎంచుకోవటానికి కారణాలేమిటి?

నెజర్స్: నేను ఇటువైపు రావటానికి ముఖ్య కారణం నా అధ్యాపకుడు ఒలివియెర్ హెరెన్స్మిత్. ఆయన అరవైల్లో విశాఖపట్నం జిల్లా తుని దగ్గర పెంటకోట అనే చిన్న తీర గ్రామంలో పరిశోధన చేశారు. అక్కడి మత్స్యకార జాతిని పరిశోధనాంశంగా ఎంచుకున్నారు. వారి జీవన శైలి, మత సామాజిక విశ్వాసాలపై 'హిందూ దేవతలు గొప్పవాళ్ళు' (Les Meilleurs Dieux sont Hindousee) అనే పుస్తకం కూడా రాశారు. ఆయనకు నా సైద్ధాంతిక ఆసక్తులేమిటో తెలుసు. అప్పట్లో ఏదైనా ఒక ప్రాంతాన్ని ఎంచుకుని అక్కడి సామాజిక నిర్మాణం మీద, అక్కడి ప్రజల జీవనశైలి మీద పరిశోధన చేయాలనుకునేవాణ్ణి. అది మరీ చిన్న పల్లెటూరు కాకూడదు. వైశాల్యం, జనాభాల పరంగా ఇంకా పెద్దదై ఉండాలి. అయినా ఒక్క పరిశీలకుడు దాన్ని అంచనా కట్టగలిగేంత చిన్నదై ఉండాలి. ఒలివియెర్ నన్ను పెద్దాపురం పంపారు. ఇదేమంత ఆలోచించి తీసుకున్న నిర్ణయం కాదు. యాదృచ్ఛికం అని చెప్పాలి. ఆయన అంతకుముందు 1963లో అక్కడికోసారి వెళ్ళారు. ఒక మత్స్యకార మిత్రుడు ఆయన్ని అక్కడి మరిడమ్మ గుడికి తీసుకువెళ్ళాడు. ఒక మానవ శాస్త్రజ్ఞునిగా నాకు ఈ గ్రామదేవతల విషయమై ఇంకా ప్రశ్నలు మిగిలే ఉన్నాయి. మామూలు జనం మరిడమ్మ లాంటి అమ్మవార్లని ఎక్కువగా పూజిస్తారు. బ్రాహ్మణాది వర్ణాలు త్రిమూర్తులు ఇతర దేవతల్ని ఆరాధిస్తారు. ఈ రెండు సంస్కృతులకు గల సంబంధ బాంధవ్యాలపై నాకు పూర్తి అవగాహన రాలేదు.

తె.వె.: పెద్దాపురం వచ్చిన కొత్తల్లో ఏమన్నా ఇబ్బంది పడ్డారా?

నెజర్స్: 1983లో నా భార్యతో కలిసి తొలిసారి ఇక్కడకు వచ్చాను. అసలు ఈ ప్రదేశం ఏ మాత్రం సానుకూలమో చూడటం మా ఉద్దేశం. పరిశోధనకి మాత్రమే కాదు. నివాసానికి కూడా. వచ్చాక అర్థమైంది: రామారావుపేట నుంచి మెయిన్ బజారు దాకా, శివాలయం నుంచి శ్రీ వెంకటేశ్వరాలయం దాకా, మరిడమ్మ చెరువు నుంచి గౌరి చెరువు దాకా పెద్దాపురం మాకు అన్ని విధాలా తగిన ప్రదేశమని. మాకు స్థానికంగా ఎంతో మంది మంచి స్నేహితులయ్యారు. కీర్తిశేషులు ఆత్మూరి కాశి, ఆర్.ఎస్.ఎన్. సోమయాజులు, ఇంకా ఎందరో ఆత్మీయులైన మిత్రుల సాయంతో ఈ చిన్న పట్టణంలో చీకూ చింతా లేకుండా గడపగలిగాం. 1986 నుంచి 1990 మధ్యలో మేం పెద్దాపురంలో ఫ్రెంచి వాసులుగా చాలాకాలం నివసించాం. తర్వాత కూడా ఇండో - ఫ్రెంచి సాంస్కృతిక సంబంధ కార్యక్రమాల వల్ల, విద్యా పరిశోధనలకు లభించే ఇతర ఉపకార వేతనాల ద్వారా ఇక్కడ చాలాకాలం గడిపాం.

తె.వె.: తొలుత చిన్న పట్టణాల్లోని సామాజిక నిర్మాణాన్ని పరిశోధనకు ఎంచుకున్నారు. తరువాత సాంస్కృతిక అంశాల వైపు ఎలా మళ్ళారు?

నెజర్స్: మాకు తొలి పర్యటనలోనే ఒక విషయం అర్థమైంది. పెద్దాపురం సామాజిక నిర్మాణంపై పి.హెచ్.డి. పరిశోధన పూర్తి చేయాలంటే అనుకున్నదానికన్నా ఎక్కువ కాలమే పడుతుంది. దాంతో అక్కడ శాస్త్రీయమైన ఆసక్తిని కలిగించే సాంఘిక, సాంస్కృతిక అంశాల గురించి వాకబు చేశాను. అప్పట్లో నాకు తెలియదు గాని, అలా చేయటం ద్వారా నేను కోస్తా ప్రాంత ప్రజల సాంస్కృతిక జీవన మూలాల్ని తెలుసుకుంటున్నానని తర్వాత అర్థమైంది.

తె.వె.: బుర్రకథపై మీరు విస్తృత పరిశోధన చేశారు. మిమ్మల్ని అందులో ప్రత్యేకించి ఆకట్టుకున్న అంశమేంటి?

నెజర్స్: వచ్చిన ఏడాదే నేను అనేక జానపద కళారూపాల గురించి వాకబు చేశాను. స్థానిక ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులతో కలిసి పెద్దాపురం, కాకినాడ, రాజమండ్రి మొదలైన ప్రాంతాలు తిరిగాను. హరికథ, నాటకం, జముకుల కథ, బుర్రకథ, భామాకలాపం ఇలా అమ్మవారి జాతర్లలో ప్రదర్శించే అనేక కళారూపాల గురించి అప్పుడే తెలుసుకున్నాను. వీటిలో నా పరిశోధనకు సరిపోయే కళారూపం కోసం వెతికాను. తెలుగు దేశపు సంస్కృతి సమాజాల గురించి అవగాహన కల్పించగలిగే ఇతివృత్తమూ, శిల్పమూ, సామాజిక నేపథ్యమూ గల కళారూపం నాకు కావాలి. బుర్రకథ అలాంటిదే. అది వీటన్నింటితోపాటు సాహిత్యం గురించీ, చరిత్ర గురించీ, అప్పుడప్పుడూ రాజకీయాల గురించీ కూడా చాలా విషయాలు తెలియజేసింది.

అందుకే బుర్రకథని ఒక సంపూర్ణ కళారూపంగా భావించాను. ఆసక్తి పెంచుకున్నాను. నిజానికి సంగీతపరంగా, కవిత్వపరంగా నాటకం నన్ను మరింత ఆకట్టుకుంటుంది. వస్తువు పరంగా బుర్రకథ ఇష్టం. ఇందులో ఇతివృత్తం సులభంగా అర్థమవుతుంది. పద్యాలు, గీతాలు, వచనాలు తేలికగా గ్రహించగలం. అప్పట్లో ఎన్ని వీలైతే అన్ని ప్రదర్శనలు చూశాను. పెద్దాపురం, రామచంద్రాపురం, విజయనగరం, కాకినాడల్లో ఎంతోమంది ప్రదర్శకుల్ని, రచయితల్నీ కలుసుకున్నాను. నా గురువులు మల్యాల జయరామయ్య, దేవాదుల బ్రహ్మానందం, అల్లాడ రామారావు నాకు బుర్రకథ పాఠాలు చెప్పేవారు.

తె.వె.: మీ పరిశోధనలో బుర్రకథ గురించి తెలుసుకున్న అంశాలేమిటి?

నెజర్స్: ఆధునిక కళారూపమైన బుర్రకథ నిజానికి అనేక పాత జానపద కళారూపాల నుంచి పుట్టింది. జంగం కథ, భట్రాజు కథ వంటి మౌఖిక కళారూపాల నుంచి ఇది అభివృద్ధి చెందింది. ఈ గమనంలో అందరూ నిమ్నస్థాయి కళారూపంగా పరిగణించే జముకుల కథ లాంటి వాటి నుంచి, ఇతర ఉన్నత స్థాయి పద్య రీతుల నుంచీ అనేక అంశాలని స్వీకరించింది. నేను ముఖ్యంగా రెండు అంశాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే వాణ్ణి. ఇలా వేర్వేరు మూలాల్నించి అభివృద్ధి చెందిన బుర్ర కథ ఇతివృత్తాల శైలిపై, ఛందస్సు అమరికపై ఆ పాత మూలాలు ఎలాంటి ప్రభావం చూపించాయన్నది ఒక అంశం. కవిత్వ ప్రమాణాల ప్రకారం బుర్రకథ స్థాయి ఏమిటన్నది రెండో అంశం. అలాగే బుర్రకథలో తెలుగు సంస్కృతి, సమాజాల గురించి వ్యక్తమయ్యే అంశాలను నిశితంగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నించేవాణ్ణి. నేను బుర్రకథల సాహిత్యాన్ని అధ్యయనం చేయటానికి, అనువదించ పూనుకోవటానికి ఇవే ముఖ్య కారణాలు.

తె.వె.: ఆదరణ మృగ్యమవటం వల్ల జానపద కళారూపాలన్నీ కనుమరుగవుతున్నాయి. దీని వల్ల ఆ కళలకు ప్రాణం పోసిన ప్రాంతాల సాంస్కృతిక చరిత్రలపై ఎలాంటి ప్రభావం ఉంటుంది?

నెజర్స్: నిజానికి జానపద కళారూపాలపై నా ఆసక్తికి ప్రథమ కారణం ఇదే. నా దేశంలో ఇలాంటి కళారూపాలు కనుమరుగై చాలాకాలమవుతోంది. అవి ఎలా ఉండేవో కూడా మాకు తెలియదు. కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లో ఇవి ఇంకా మిగిలి ఉండగానే పరిశీలించాలని, వాటి స్వభావాన్ని నమోదు చేయాలని నా కోరిక. ఎనభైల్లో ఇక్కడ వీటి వ్యాప్తిని బట్టి చూస్తే, ఇంత తొందరగా అంతరిస్తాయని అనుకోలేదు. దీని వల్ల సాంస్కృతిక సంపదకు తీరని నష్టం వాటిల్లుతుంది. ఎందుకంటే ఈ కళారూపాలు ప్రజల నుంచి పుట్టాయి. జన సామాన్యపు సమష్టి సంస్కృతి శతాబ్దాలుగా తనతో తాను జరుపుకొన్న సంభాషణ ఫలితంగా ఇవి ఏర్పడ్డాయి. వీటిని ప్రదర్శించే కళాకారులు ఎక్కువగా సంచార మనస్తత్వం కలవారు. ఒక్కోసారి ఒరిస్సా,

మాదీ పెద్దాపురమే!

పెద్దాపురంతో డేనియల్ నెజర్స్‌కు ఒకటీ రెండూ కాదు, దాదాపు ముప్పైఏళ్ళ అనుబంధం. ఇది ఆయనకు మరో సొంత ఊరిలా అయిపోయింది. ఆయన దాదాపు ప్రతీ ఏడూ పెద్దాపురం వచ్చి కొన్ని నెలలు గడిపి వెళ్తారు. ఇక్కడి జానపద కళాకారుల్లో ఎందరో ఆయనకు గురువులయ్యారు, మరెందరో ఆత్మబంధువులయ్యారు. వారి సాయంతో ఎన్నో అపురూప జానపద కళారూపాల్ని రికార్డు చేశారు. ఇదంతా ప్రవృత్తి అనుకున్నా, ఆయన వృత్తి కూడా తెలుగుతనానికి దూరం కాదు. ప్రస్తుతం పారిస్ విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగం నిలదొక్కుకునేందుకు కృషి చేస్తున్నారు. భార్య ఫ్రాన్సులో ఒక కళాశాలలో ఆంగ్ల బోధకురాలు. యూదు సాహిత్యంలో హాస్యధోరణులపై ఎం.ఫిల్. చేశారు. కుమారుడు వైద్య విద్యార్థి. గత ఏడాదే వివాహమయింది. భార్య, కుమారులు డేనియల్‌తో కలిసి పెద్దాపురం వచ్చారు. అందువల్ల వారికీ ఈ ప్రాంతంతో గాఢమైన అనుబంధమే ఉంది. "మా అబ్బాయి ప్రాపంచిక దృక్పథంపై మా పర్యటనల ప్రభావం చాలా ఉంద"ంటారు డేనియల్.

మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ లాంటి దూర ప్రాంతాలకు కూడా ప్రయాణించేవారు. ఈ కళారూపాలకు ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా బోలెడు అనుకరణలు కూడా ఏర్పడ్డాయి. అవి నిరంతరం మార్పులు, పరిణతి చెందుతూ వచ్చాయి. ఇదివరకు వీధి వీధికీ, పేట పేటకీ కళాకారులు వేర్వేరు కళారూపాల్ని సాధన చేయటం కనిపించేది. చాలా వైవిధ్యం ఉండేది. కానీ ఇప్పుడు జనసామాన్యానికి వినోదం ఒకే ఒక్క మూలం నుంచి వెలువడుతోంది. అది సినిమా అయినా, టీవీ అయినా. ఇదివరకట్లా జానపద సంస్కృతి బాగోగుల్ని నిర్దేశించే అధికారం స్థానిక ప్రజల చేతుల్లో లేదు. ఇపుడు వ్యాపారాత్మక విలువలతో నడిచే ఒక సాంస్కృతిక అధికార వ్యవస్థ దాన్ని నియంత్రిస్తోంది.

తె.వె.: మీరు తెలుగు సాహిత్యాన్ని ఫ్రెంచిలోకి అనువదిస్తున్నారు. జానపద కళారూపాల నుంచి మీ ఆసక్తి తెలుగు సాహిత్యం వైపు ఎలా మళ్ళింది?

నెజర్స్: బుర్రకథపై ఆసక్తి నాలో తెలుగు భాషా సాహిత్యాల పట్ల అభిరుచి పెరగడానికి కూడా దోహదపడింది. బుర్రకథల అధ్యయనం, అనువాదాల ద్వారా, క్రమేణా సులభమైన కవిత్వాన్ని అర్థం చేసుకోగలిగే స్థాయికి చేరుకున్నాను. అయితే నేనేమీ ఫ్రెంచి - తెలుగు పండితుణ్ణి కాదు. తెలుగు విషయంలో నా పరిమితులు నాకు తెలుసు.

నా సిద్ధాంత వ్యాసం చివరి దశల్లో ఉండగా 'లింగమ్మగుంట తిమ్మకవి సులక్షణసారము' చదివాను. ఇందులో ఛందోబద్ధ కవిత్వంతో పాటు, వివిధ జానపద వృత్తాల సూత్రాల్ని నిర్వచించారు. ఇది బుర్రకథ నిర్మాణాన్ని అర్థం చేసుకోవటానికి ఉపకరిస్తుంది. ఈ అధ్యయనాల్లో భాగంగా 1860 నుంచి 1950 దాకా గల అనేక ఆధునిక తెలుగు సాహిత్య ధోరణుల్ని పరిశీలించే అవకాశం కలిగింది. అయితే ఇప్పటికీ నాకు తెలిసింది తక్కువే. నాకు నిర్మాణం (frame) పట్ల అవగాహన ఉంది, కానీ వస్తువు (content) పట్ల ఇంకా లేదు. ఉదాహరణకి, శ్రీశ్రీ కవితలు కొన్ని చదవగలిగాను. కానీ అందులోని కవిత్వాంశ పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను. పలువురితో చర్చించాకనే నాకు కవి చిత్రణలోని సౌందర్యమేమిటో తెలుస్తుంది. అప్పుడు కూడా ఎవరైనా తెలుగు పండితుడు దాన్ని రాగయుక్తంగా పాడితేనే.

ప్రస్తుతం ఉన్న నిఘంటువుల్ని కలుపుకుంటూ ఎన్నో కొత్త నిఘంటువులు వెలువడాల్సిన అవసరం ఉంది. గ్రాంథిక భాషే గాక, ఆధునిక భాషని కూడా వాటి పరిధిలోకి తీసుకోవాలి. పదాలకు సమానార్థకాల్నీ, పర్యాయపదాల్నీ ఇవ్వడం కాదు. వివరణాత్మకమైన నిర్వచనాలివ్వాలి.

తె.వె.: మహాప్రస్థానం కాకుండా ఇతర ఆధునిక రచనలు ఏం చదివారు? మీకు నచ్చిన రచన ఏమిటి?

నెజర్స్: ఒక విదేశీయునిగా అలాంటి రచనల స్వారస్యాన్ని కనీసమాత్రంగా ఆకళింపు చేసుకోవాలన్నా చాలా కష్టపడాలి. నిఘంటువుతో బోలెడు సమయం కుస్తీ పట్టాలి. నేను ఇంకా 'మాలపల్లి', 'సాక్షి సంపుటాలు', 'వేయిపడగలు' లాంటి రచనల్ని చదవాల్సి ఉంది. అయితే ఇపుడు కష్టం లేకుండానే అర్థం చేసుకునే స్థాయికి చేరుకున్నాను. కవిత్వం కన్నా వచనం సులభం. అది ఆధునికమైనా, గ్రాంథికమైనా, జానపదమైనా. అందుకే ఇటీవల 'మహాత్మ భీష్మ, అను భీష్మ చరిత్ర బుర్ర కథ' అనే సంక్లిష్ట ఛందశ్శైలి గల పుస్తకాన్ని అనువదించాలని సంకల్పించాను. శ్రమించి అధ్యయనం చేస్తున్నాను. ఈ రచనను నా గురువు మల్యాల జయరామయ్య అరవైల్లో రాశారు. దీన్ని ఫ్రెంచి సాహితీ శైలిలో అనువదించాలన్నది నా ఆలోచన. భావి ఫ్రెంచి విద్యార్థులు చదవటానికి ఏ ఇబ్బందీ లేకుండా దీనిలో వివరణలు, టీకా తాత్పర్యాలు ఇవ్వాలనుకుంటున్నాను. ఇప్పుడు నేను వేమన పద్యాల్ని పూర్తిగా అర్థం చేసుకుని, అనువదించగలిగే స్థాయికి చేరుకున్నాను. కొన్ని టీకా, భావ, తాత్పర్యాల సాయంతోనే అనుకోండి.
ఒక్క కాల్పనిక సాహిత్యమే కాదు, మిగతా విభాగాల్ని కూడా నేను సాహిత్యంగానే చూస్తాను. ఉదాహరణకి బూదరాజు రాధాకృష్ణ రాసిన 'మాటల వాడుక - వాడుక మాటలు' లాంటి రచనలు నావంటి వారికి అమూల్యమైనవి.

తె.వె.: మూలాల పరంగా తెలుగు, ఫ్రెంచి భాషలకు దగ్గరి సంబంధం ఉందని మీరోసారి అన్నారు. ఈ విషయంలో మీరు గమనించిన ఉమ్మడి అంశాలేమిటి?

నెజర్స్: అభివృద్ధి చెందిన తీరులోనూ, సాహిత్యాల పుట్టుకలోనూ తెలుగు ఫ్రెంచి భాషలకు చాలా పోలికలు ఉన్నాయి. మిగతా విషయాల్లో పోలికలు తక్కువే. చారిత్రక కారణాల వలన కొన్ని పదాలు మాత్రం ఒక భాష నుంచి ఒక భాషకు వచ్చి చేరాయి. ఉదాహరణకు 'palanquin', 'ananas' అనే రెండు ఫ్రెంచి పదాలు తెలుగు నుంచి వచ్చి చేరినవే. వాటి తెలుగు మూలం 'పల్లకి', 'అనాసకాయ'. అప్పట్లో ఇక్కడ ఫ్రెంచి గవర్నరు జనరల్ డుప్లెయిక్స్, బొబ్బిలి బుస్సీల కాలంలో ఇవి వచ్చి చేరి ఉంటాయి. ఈ భాషలు రెంటికీ మరో సామ్యమూ ఉంది: రెండూ గ్రామ్య భాషల్నించి పరిణతి చెందినవే. ఆ క్రమంలో మరో శాస్త్రీయ భాషను కూడా తమలో కలుపుకొన్నాయి. లాటిన్ని ఫ్రెంచి తనలో కలుపుకొంటే, సంస్కృతాన్ని తెలుగు కలుపుకొంది. ఈ రెండు భాషలు ఏర్పడింది కూడా రమారమి ఒక్క కాలంలోనే. 10, 11 శతాబ్దాలు మొదలుకొని 15, 16 శతాబ్దాల మధ్య.

తె.వె.: విదేశీయులు తెలుగు నేర్చుకోవటంలో ఉండే సాధకబాధకాలు ఏమిటి?

నెజర్స్: తెలుగు భాష సౌందర్యం పక్కనపెడితే, అది మాతృభాష కాని వారికి, విదేశీయులకు నేర్చుకునేందుకు చాలా కష్టమైన భాష. ప్రాథమిక స్థాయి వరకూ ఎలాగో తంటాలు పడి నేర్చుకోవచ్చు. అంతకుమించి పైస్థాయికి వెళ్ళాలంటే ఇబ్బంది. దీనికి కారణాలు అనేకం. తెలుగు భాష నుంచి భారతీయేతర భాషలకు కనీసం ఆంగ్లానికైనా అనువాదమైన సాహితీ రచనలు చాలా తక్కువ. పోనీ సాహిత్యాన్ని మినహాయిద్దాం. తెలుగు పాఠ్య పుస్తకాలు, బోధనా పద్ధతుల విషయంలో కూడా సదుపాయాలు తక్కువే. హైదరాబాదులోని సి.పి.బ్రౌను అకాడెమి ఇటీవల విడుదల చేసిన 'తెలుగు లర్నింగ్ కిట్స్' వంటివి కొన్ని ఉన్నాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడెమి వంటి సంస్థలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రచురణల గురించీ నాకు తెలుసు. కానీ తెలుగు సాహిత్యపు గొప్పదనం బయటి ప్రపంచానికి తెలియాలన్నా,

ఈ మధ్య లండన్‌లో తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ ఆధ్వర్యంలో ఓ సాహితీ సభ జరిగింది. రెండు మూడు ప్రసంగాలైపోయాయి. నాలుగో ఉపన్యాసకుడిని వేదిక మీదికి ఆహ్వానించారు అధ్యక్షులు. ఆయన డేనియల్ నెజర్స్. ఫ్రెంచి జాతీయుడు. అందుకని ఆయన్ని ఆంగ్లంలో పరిచయం చేస్తూ వేదిక మీదికి ఆహ్వానించారు. ఆరడుగుల నిండైన విగ్రహం, తెల్లగా మెరిసిపోయే వ్యక్తి. "ఇక్కడున్న తెలుగు వారందరికీ వందనాలు... తందాన తాన" అంటూ చక్కటి తెలుగులో రాగయుక్తంగా ఆలపిస్తూ ఉపన్యాసం ప్రారంభించే సరికి ఆశ్చర్యపోవటం అందరివంతయింది. తర్వాత ఓ అరగంటపాటు ఒక్క ఆంగ్ల పదమూ లేకుండా ఆయన ఉపన్యాసఝరి సాగిపోయింది.

ప్రపంచవ్యాప్తంగా తెలుగు నేర్చుకోవాలనుకునే విద్యార్థులకు సాయపడాలన్నా ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరగాలి.

తె.వె.: మీరు తెలుగు - ఫ్రెంచి నిఘంటువును తయారు చేశారు కదా...

నెజర్స్: అవును. ఇది చిరుప్రయత్నమే. ప్రస్తుతం ఉన్న నిఘంటువుల్ని కలుపుకొంటూ కొత్త నిఘంటువులు వెలువడాల్సిన అవసరం ఉంది. గ్రాంథిక భాషే గాక, ఆధునిక భాషనీ వాటి పరిధిలోకి తీసుకోవాలి. పదాలకు సమానార్థకాల్నీ, పర్యాయపదాల్నీ ఇవ్వడం కాదు. వివరణాత్మక నిర్వచనాలివ్వాలి. ఈ అంశం ప్రస్తావనకు వచ్చినపుడు, అప్పటి తెలుగు అకాడెమి సంచాలకులు డా॥ఎ.మంజులత నన్ను ఒక చిన్న తెలుగు - ఫ్రెంచి నిఘంటువు తయారు చేయమన్నారు. అందులో పదాల జాబితాను కేంద్రీయ విశ్వవిద్యాలయం వారు రూపొందించారు.

తె.వె.: తెలుగువారితో మీ అనుబంధాన్ని పురస్కరించుకుని ఒక ప్రశ్న: తెలుగు ప్రజలపై మీ అభిప్రాయం ఏమిటి?

నెజర్స్: ఇది అడగటానికి సులువైన ప్రశ్నే. కానీ జవాబు మాత్రం పుస్తకంగా రాయాల్సినంత పెద్దది. సహజంగానే భారతీయులు అతిథుల్ని సాదరంగా స్వీకరించే ప్రజలు. ముఖ్యంగా సాంస్కృతిక వైరుధ్యాల్ని పక్కనపెట్టి, భారతీయ సంస్కృతిని గౌరవించగల అతిథి అయితే మరింత ఆదరం చూపుతారు. తెలుగు వారి గురించి చెప్పాలంటే, మృదు శాంత స్వభావులు. పశ్చిమ దేశాల వారికన్నా ఎక్కువ నవ్వుతూంటారు. దీనికి కారణం పశ్చిమ దేశాల్లో యాంత్రికంగా, అమానవీయంగా మారిపోతున్న ప్రజల జీవన శైలి. తెలుగువారు ఉత్సవాల్లో, వేడుకల్లోనూ కలిసి గడపటాన్ని ఇష్టపడతారు. కవిత్వాలు, పాటలు పాడటం కూడా కాలక్షేపానికి ఒక ముఖ్యమైన అవకాశం. అవి భజనలే కానక్కర్లేదు. అయితే, భక్తి ఇక్కడి జీవితాల్లో ఒక అంతర్భాగం. ఐరోపా ప్రజల జీవనశైలితో పోలిస్తే, ఇది చాలా భిన్నమైన అంశం.

తీపి పలుకు



ఏ భాష పోషించుటే భాగ్యమని యెంచి
కేల పల్లకినెత్తె కృష్ణవిభుడు
ఏ భాష మేల్గోరి ఇంగ్లిషు దొర బ్రౌను
తాటాకులకు గ్రంథ దర్పమిచ్చె
ఏ భాషవారల కేక రాష్ట్రము కోర
పొట్టి శ్రీరాములు పుట్టిమునిగె
ఏ భాష గౌరవమ్మినుమడింపగ జేయ
రథమెక్కి చాటించె రామరావు

అట్టి మన భాషనే మీరు నెట్టివేసి
పరుల భాషను పూజింప ఫలము గలదె
తల్లి గాదని పినతల్లి దయకు నేడ్చి
రెంటికిని చెడిపోవుదురేలనయ్య

ఏ భాషలో ధ్వని ఏ భాష రసధుని
కృష్ణరాయలకంత కీర్తితెచ్చె
ఏ భాషలో శక్తి ఏ భాషనురక్తి
వేయేండ్లు పద్యాల విందులిచ్చె
ఏ భాషలో ధాటి ఏ భాష సుమవాటి
అవధాన విద్యయై అవతరించె
ఏ భాషలో నిగ్గు ఏ భాష తెలిమ్రగ్గు
వచనమై కవితలో రుచిరమయ్యె

అట్టి తెలుగైన భాష మీరాదరింప
అట్టి వెలుగైన భాష మీ రాదరింప
కరయుగమ్మును జోడించి కాళ్ళు పట్టి
వేడుకొందును కన్నీళ్ళు తోడుకొందు

భాషయా తెలుగన్న! భావనాంబుధిలో
బంగారు ఓడలో పయనమగును
భావమా తెలుగన్న! భాషా వధూటికి
పాదార్చనము సేయు పద్మమగును
పద్యమా తెలుగన్న! పట్టాభిషిక్తులౌ
తెలుగు మారాజుల తేజమగును
వచనమా తెలుగన్న! బండరాళ్ళనునైన
చెమ్మ పుట్టించెడి సేద్యమగును

అట్టి మనభాష హృదయమ్ము పట్టుకొనుడు
వట్టి పరభాషపై మోజు వదులుకొనుడు
మమ్మి డాడీల మాటలు మానుడింక
అమ్మనాన్నల పూజింప నరుగుడింక

– సాగర ఘోషుడు

కాకా-కూకూ

పాపినేని శివశంకర్

పిల్లవాడైనా సుద్దులు పలకవచ్చు. పిల్లకవి అయినా పెద్ద పద్యం రాయవచ్చు. అదిగో అటువంటివాడే సంకుసాల నృసింహ కవి. నన్నయ తిక్కనాది మహాకవులతో పోల్చుకుంటే పిల్లకవే. 'కవికర్ణ రసాయనము' అనే తగు మాత్రపు ముదురు శృంగార కావ్యం రాశాడు. రాసి ఊరుకోలేదు. తన కావ్యంలో శృంగార వర్ణనలు వింటే యతి కూడా విటుడు కావాల్సిందే; అట్లాగే వైరాగ్య వర్ణనలు వింటే విటుడు కూడా యతి కావాల్సిందేనన్నాడు. తప్పిజారి ఆ వర్ణనల జోలికి పోకుండా రాజనీతి వర్ణనలోని ఒక రసవంతమైన పద్యం విందాం.

కాకేమి తన్ను దిట్టెనె?
కోకిల తనకేమి ధనము కోకొమ్మనెనే?
లోకము పగయగు బరుసని
వాకునఁ జుట్టమగు మధుర వాక్యము వలనన్

ఈ లోకాన్ని కాకేం తిట్టిపోయ్యలేదు. కోకిల ఇంత డబ్బుమూట పుచ్చుకొమ్మని ఇవ్వనూలేదు. పరుషమైన వాక్కు వలన లోకం పగ అవుతుంది; తియ్యని మాట వల్ల చుట్టమవుతోంది.

మాట వైనం గురించి కవి చెపుతున్నాడీ పద్యంలో. పరుషమైన వాక్కు సత్యమైనా పగనే పెంచుతుంది. కనుక ఎప్పుడైనా మాట పెళుసుదనం కూడదు. తియ్యని మాట వల్ల స్నేహభావం పెరుగుతుంది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది గదా!

జీవన సూత్రాలు ఈ పద్యపాదాలు

'మావోచ పరుసం' (పరుషంగా మాట్లాడవద్దు) అంది దమ్మపదం. నోటి దురుసుతనం సప్త వ్యసనాల్లో ఒకటన్నారు. దీనినే 'పలుకు ప్రల్లదము' అని తిక్కన భారతంలో విదుర నీతి చెప్పింది. ఈ నీతికి దృశ్యమానంగా నృసింహకవి కాకి, కోకిల దృష్టాంతాన్ని తన రచనలో తీసుకున్నాడు.

కాకి, కోకిల- రెండూ పక్షులే గదా! రెండు నలుపే గదా! కాని కూతలే వేర్వేరు. కాకి కావు కావుమంటే మనకు గిట్టదు. అవతలకు తోలేస్తాం. కోకిల కుహూ కుహూ అంటే ముచ్చటపడతాం. మళ్లీమళ్లీ విని ముగ్ధులమవుతాం.

ఇక కవుల సంగతైతే చెప్పనే పనిలేదు. 'పాట పాడవె కోకిలా! పాట పాడవె యింపుగా' (బసవరాజు అప్పారావు) అని కొసరి కొసరి అడిగారు. 'మామిడి కొమ్మ మీద కలమంత్ర పరాయణమైన కోకిలస్వామికి' (రాయప్రోలు సుబ్బారావు) మొక్కారు. సత్యభామను కూడా లే మావిచిగుళ్ళు మెక్కిన కోకిల గొంతుతో (బాలపల్లవ గ్రాసకషాయ కంఠ వధూకల కాకలీ ధ్వనిన్- ముక్కు తిమ్మన) ఏడ్పించారు. చివరికి ఆదికవి వాల్మీకిని కూడా కవితావృక్ష శాఖపై కూర్చుని 'రామ రామ' అంటూ కలకూజితం చేస్తున్న కోకిల లాగా (వందే వాల్మీకి కోకిలమ్) వర్ణించారు.

'పరుసని వాకు' అన్న చోట శ్రుతి కటుత్వం, 'మధుర వాక్యము' అనే పదంలో చెవికింపు ధ్వనింప జేశాడు కవి. ఇక లోకము అనే కర్త రెండు వాక్యాలకు సమానంగా అన్వయిస్తుంది.

క్రీ.శ 16వ శతాబ్దికి చెందిన ఈ కవి మాంధాత చరిత్ర వస్తువుగా కవి 'కర్ణరసాయనం' రచించాడు. కథానాయకుడు లేదా ఇతివృత్తాన్ని బట్టి గ్రంథానికి పేరు పెట్టడం సంప్రదాయం. దానికి భిన్నంగా తన కావ్యానికి నామకరణం చేశాడు నృసింహకవి. దానిని శ్రీరంగనాథుడికి అంకితం చేశాడు.

కావ్యం నిండా వర్ణనలే. అందులో భాగంగా -

ఒత్తుకొని వచ్చు కటికుచోద్వృత్తి జూచి
తరుణి తనుమధ్య మెచటికో తరలిపోయె
నుండె నేనియు గనబడకున్నె యహహ!
యుద్ధతుల మధ్య నిరుపేద కుండదరమె?

- అనే పద్యం చెప్పాడు. కృష్ణదేవరాయలతో కూతురు మోహనాంగి చదరంగమాడుతూ ఈ పద్యాన్ని ప్రస్తావించినట్లు ఒక కథ ప్రచారంలో ఉంది. అంత గొప్ప పద్యం చెప్పిన కవి ఎవరూ అని రాయలు అడిగి తెలుసుకోవాలనుకున్నాడట. కానీ అప్పటికే నృసింహకవి రాజదర్శనం లభించక విసిగి వేసారి నగరం వదిలి వెళ్ళిపోయాడు. ఉద్ధతులైన కవుల మధ్య ఉండలేక పోయాడేమో?

ప్రముఖ కవి, కథకుడు, విమర్శకుడు, కథాసంకలనాల సహసంపాదకుడు, గుంటూరు.
89780 12323

బండెనక బండిగట్టీ...

ఉద్యమాలకు, సాహిత్యానికీ విడదీయలేని సంబంధం. జాతీయ ఉద్యమం, సంఘ సంస్కరణోద్యమం, హేతువాద ఉద్యమం, ఇలా వివిధ ఉద్యమాల ప్రభావంతో తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలు సుసంపన్నమయ్యాయి. వెలకట్టలేని ఆణిముత్యాల వంటి రచనలు ఎన్నో తెలుగు భాష సిగలో మొగ్గలయ్యాయి. అలాంటి ఉద్యమాలలో ఎన్నదగినది, సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను ప్రభావితం చేసింది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. దీన్ని నిజాం రాష్ట్ర ఆంధ్రోద్యమం లేదా రజాకార్ వ్యతిరేక ఉద్యమం అనీ అంటారు. 1947 ఆగస్టు 15 భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా తెలంగాణా ప్రాంతం మాత్రం నిజాం పాలనలోనే మగ్గిపోతోంది. ఈ స్థితి 1948 సెప్టెంబరు 17న యూనియన్ సైన్యాల దాడికి తట్టుకోలేక నిజాం లొంగిపోవటం వరకు కొనసాగింది. 1921 నుంచి 1951 వరకు 30 ఏళ్లపాటు మూడు దశల్లో సాగిన ఈ ఉద్యమాన్ని ప్రతిబింబిస్తూ వందలాది పాటలు, గేయాలు, డజన్లకొద్దీ కథలు, నాటికలు, నాటకాలు, నవలలు వెలువడ్డాయి. వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన 'ప్రజల మనిషి, గంగు' వంటి నవలలు, దాశరథి 'అగ్నివీణ', కుందుర్తి 'తెలంగాణ', సోమసుందర్ 'వజ్రాయుధం', ఆరుద్ర 'త్వమేవాహమ్' వంటి కావ్యాలు, సుంకర వాసిరెడ్డి రాసిన 'మాభూమి', 'పోతుగడ్డ' వంటి నాటకాలు, 'నోటీసు', 'సంఘం పంతులు', 'గొల్లరామవ్వ', 'న్యాయం' వంటి కథలు, గంగినేని 'ఎర్రజెండా'లు వంటి జీవిత కథలు– ఇలా ఎంతో సాహిత్యం ఈ కాలంలో వెలువడిందే.

వాసిరెడ్డి నవీన్

తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ ధ్యేయంగా ఏర్పడిన ఒక సంస్థ తెలుగు సమాజాన్ని, జీవితాలను ప్రభావితం చేసే మహాశక్తిగా ఎదగటం, రాచరిక వ్యవస్థకు ఎదురు నిలిచి పోరాడటం ఆశ్చర్యకర పరిణామమే.

1920ల ప్రాంతంలో నిజాం పాలనలో ఉన్న తెలంగాణ ప్రాంతం ఒక ఆరుబయలు జైలు. అక్కడి ప్రజలు గొంతెత్తకూడదు, చదవకూడదు, ప్రశ్నించకూడదు. వీటికితోడు తెలుగు భాష పట్ల పాలకులకు విపరీతమైన ద్వేషం. ఈ నిరాశామయ వాతావరణం నుంచి బయటపడి తెలుగు భాషా సంస్కృతుల రక్షణ కోసం 1921 సంవత్సరంలో నవంబరు 12న హైదరాబాద్‌లో టేక్‌మాల్ రంగారావు ఇంట్లో 11 మంది యువకులు సమావేశమయ్యారు. వారు ఏర్పాటు చేసిన సంస్థే 'ఆంధ్ర జనసంఘం'. ఆ 11 మంది యువకులు తరువాతి కాలంలో ఏకాదశ రుద్రులుగా ఆంధ్రోద్యమ చరిత్రలో నిలిచిపోయారు. మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, మందుముల నరసింగరావు, ఆదిరాజు వీరభద్రరావు, రామస్వామి నాయుడు, టేక్‌మాల్ రంగారావు మొదలైన పదకొండు మందీ మనకు ప్రాతఃస్మరణీయులు. ఈ ఆంధ్ర జనసంఘం తన ప్రణాళికా పత్రంలో గ్రంథాలయ స్థాపన, తెలుగు శాసనప్రతుల సేకరణ, లఘు పుస్తక ప్రచురణ, తెలుగు భాషను నేర్చుకోవటానికి పరీక్షలను నిర్వహించి, ప్రోత్సహించడం లక్ష్యాలుగా నిర్దేశించుకుంది. ఈ పరీక్షలను నిర్వహించడానికి ఏర్పడిందే ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న ప్రాచ్యకళాశాల. 1901లో ఏర్పడిన 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం' హైదరాబాద్ నడిబొడ్డున సుల్తాన్‌బజార్‌లో నేటికీ విరాజిల్లడానికి కారణం 'ఆంధ్ర జనసంఘం' గ్రంథాలయాల నిర్వహణ పట్ల చూపిన ప్రత్యేక శ్రద్ధే.

ఇలా ఏర్పడిన 'ఆంధ్ర జనసంఘం' తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాష వ్యాప్తికి ప్రచారం చేస్తూ నిజాం ప్రభుత్వం పెట్టిన ఆంక్షలను వ్యతిరేకిస్తూ నెమ్మదిగా వెట్టిచాకిరి నిర్మూలన వంటి సామాజిక సమస్యల పట్ల సైతం దృష్టి సారించింది. 1930 నాటికి 'ఆంధ్ర మహాసభ'గా రూపుమార్చుకొంది. సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన తొలి మహాసభలను జోగిపేటలో జరుపుకొంది. అప్పటి నుంచి 1941లో పూర్తిస్థాయిలో రెండుగా చీలిపోయేంత వరకు తెలంగాణ ప్రజలను జాగృతం చేయడానికి ఆంధ్ర మహాసభ చేసిన కృషి అనన్య సామాన్యం. ఇందులో ఒక సంస్థ కమ్యూనిస్టుల నాయకత్వంలో అప్పటి అధ్యక్షులు రావి నారాయణరెడ్డి నాయకత్వంలో ఉద్యమాన్ని చేపట్టింది. మరొక సంస్థ మందుముల నరసింగరావు నాయకత్వాన జాతీయవాద సంస్థగా ప్రచారం పొంది, నెమ్మదిగా నిజాం స్టేట్ కాంగ్రెస్‌లో విలీనం అయిపోయింది. ఇది ఒక రకంగా తెలంగాణ ఉద్యమ తొలిదశ.

ఈ దశలో ప్రధానంగా పాటలు వెలువడ్డాయి. భావవ్యాప్తి కోసం, ప్రచారం కోసం ఆంధ్ర మహాసభ పాటలను ప్రోత్సహించింది. దాశరథి, సుద్దాల హనుమంతు వంటి ప్రముఖ కవులతోపాటు ఎందరో కార్యకర్తలు పాటలు కట్టి ఉద్యమ వ్యాప్తికీ, దీప్తికీ కారకులయ్యారు.

వెట్టిచాకిరీ బాధ
బుట్టలో పెట్టేయ్
గుంపుగా వస్తుంటే
నిన్నెవ్వరాపగలరోయ్ కూలన్నా
నిన్నెవ్వరడ్డగలరోయ్ రైతన్నా... అంటూ దాశరథి రాస్తే,
వెట్టిచాకిరీ విధానమో రైతన్నా
ఎంత చెప్పిన తీరదో కూలన్నా...

అంటూ మాదిగ, మంగలి, చాకలి, వడ్రంగి, వడ్డెర కులాల వాళ్ళు 'దొర'కు చేసే వెట్టిని నిరసిస్తూ, పాటలు రాశారు సుద్దాల హనుమంతు. ఈ కాలంలోనే ఆయన రాసిన

పల్లెటూరి పిల్లగాడా
పసులగాసే మొనగాడా
పాలు మరచి ఎన్నాళ్ళయ్యిందో
ఓ పాలబుగ్గల జీతగాడా
కొలువు కుదిరి ఎన్నాళ్ళయ్యిందో...

పాట ఈనాటికీ ప్రజాదరణ పొందిన పాటగానే నిలిచిపోయింది.

పల్లెబీదలబాది పన్నులాగెదవా!
పోషించువాడవని పూజించు జనుల
పీఠమెక్కిన దాది పీడించుటేనా!

అంటూ కాళోజీ 'నా గొడవ'లో చెప్పుకున్నాడు.

ఈ దశనే చిత్రించింది వట్టికోట ఆళ్వారుస్వామి నవల 'ప్రజల మనిషి'. అయితే, ఈ నవలను ఆళ్వారుస్వామి 1946-53 మధ్యకాలంలో మూడు సంవత్సరాలపాటు జైల్లో ఉన్నప్పుడు ప్రారంభించి, 1952 నాటికి పూర్తిచేసి, 1955 జనవరిలో వెలువరించారు. ఇది నేటికీ ఉత్తమమైన తెలుగు నవలల్లో ప్రథమ స్థానంలో నిలబడింది. 1930ల దశకం నాటి తెలంగాణ అర్థం కావడానికి ఈ నవల ఎంతో దోహదపడుతుంది. ఆంధ్ర మహాసభ సంగంగా రూపొంది, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజాఉద్యమం చేపట్టిన దశ వరకు చిత్రించింది.

ఈ మొదటి దశ తెలంగాణ స్థితిగతులకు అద్దం పట్టిన కథలు- వేనేపల్లి ఆంజనేయులు రాసిన 'పాడియావు', పొట్లపల్లి రామారావు రాసిన 'న్యాయం', పి.వెంకటేశ్వరరావు రాసిన 'అది పంట కాదా!, సంఘం చిట్టీ', ఆవుల పిచ్చయ్య రాసిన 'దొరా'. ఈ రచయితలంతా తెలంగాణ ప్రాంతంవారు. నిజాం రాజ్యంలో అమలవుతున్న నిర్బంధాన్ని, గ్రామాల్లో దేశ్‌ముఖ్ జాగీర్దార్ల దౌష్ట్యాన్ని, దుర్మార్గాన్ని స్వయంగా అనుభవిస్తున్నవారు. తమ అనుభవాల్నే కథలుగా రూపొందించారు. వీరంతా అప్పుడప్పుడే కథలు రాస్తున్న రచయితలు. అడవి బాపిరాజు సంపాదకత్వంలో వెలువడిన 'మీజాన్' దినపత్రికలో ఈ కథలు వెలువడేవి. వీటిని బాపిరాజు ఎంతో ప్రోత్సహించారు.

నరరూప రాక్షసుడిగా పేరుమోసిన విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి అనుచరులు అబ్బాస్ అలీ, కృష్ణారెడ్డి ఆంధ్రమహాసభ జరుపుతున్న ఊరేగింపుపై 1944 జులై 4న కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో దొడ్డి కొమరయ్య మరణించాడు. ఈ మరణంతో కమ్యూనిస్టుల నేతృత్వంలోని ఆంధ్ర మహాసభ 'సంగం'గా అవతరించింది. గ్రామాల్లో తీవ్రమైన నిర్బంధ వాతావరణం. అయినా సంగం నాయకత్వాన ప్రజలు ఆయుధాలు చేపట్టి ఎదురు తిరగటం మొదలుపెట్టారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజలను సాయుధులు కమ్మని పిలుపునిచ్చింది. అనేక మంది కార్యకర్తలు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. పోరాట ఉధృతిని తట్టుకోలేక కొన్ని ప్రాంతాల్లో దొరలు గ్రామాల్ని వదిలి పారిపోయారు. అప్పటి వరకు కేవలం రజాకార్లతోనే దాడి చేయించిన నిజాం ప్రభువు నేరుగా సైన్యాన్నే దింపాడు. ఆంధ్ర మహాసభ, స్టేట్ కమ్యూనిస్టు పార్టీలపై నిషేధాన్ని విధించాడు. ఈ స్థితి 1948 సెప్టెంబరు 17న యూనియన్ సైన్యాలకు నిజాం లొంగిపోయే వరకూ కొన

సాగింది. ఈ మధ్యకాలంలో భారతదేశానికి స్వరాజ్యం వచ్చింది. నిజాం మాత్రం భారత ప్రభుత్వంలో విలీనం కావడానికి అంగీకరించలేదు. 1947 ఆగస్టు 15 నుంచి 1948 సెప్టెంబరు 13 వరకు లొంగిపోతాడని భావించినా నిజాం లొంగకపోవడంతో యూనియన్ ప్రభుత్వం పోలీస్ చర్య జరిపి లొంగదీసుకుంది.

ఈ దశ వరకు సాగిన పోరాటాన్ని రెండవ దశగా భావించవచ్చు. ఈ కాలంలో గ్రామగ్రామాన కమిటీలు ఏర్పడ్డాయి. గెరిల్లా దళాలు ఏర్పడ్డాయి. పోలీసులను, రజాకార్లను ఎదుర్కొన్నాయి. వందలాది మంది కార్యకర్తలు మరణించారు. ఈ పోరాటంలో దాదాపు మూడువేల గ్రామాలు నిజాం ప్రభుత్వం నుంచి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. దేశ్‌ముఖ్ జాగీర్దార్లు అనుభవిస్తూ వచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని గ్రామ కమిటీలు పంచిపెట్టాయి.

ఈ కాలంలోనే ఉత్తమోత్తమమైన తెలంగాణ పోరాట సాహిత్యం ఆవిర్భవించింది. పోరాటం నడుస్తున్న రోజుల్లోనే బొల్లిముంత శివరామకృష్ణ 'మృత్యుంజయుడు' నవల రాశారు. లక్ష్మీకాంత మోహన్ 'సింహగర్జన' నవల రచించారు. పర్చా దుర్గాప్రసాదరావు 'గెలుపు మీదే' కథల సంపుటి, అడ్లూరి అయోధ్య రామకవి 'తెలంగాణ మంటల్లో...' అనే కథా సంపుటాన్ని ప్రచురించారు. 'నైజాం సర్కరోడా...' వంటి ప్రజాదరణ పొందిన పాటల్ని కార్యకర్తలే సృష్టించుకున్నారు. ఈ కాలంలో పోరాటంలో ఉన్న తెలంగాణ ప్రాంత రచయితలకు, కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఆంధ్ర ప్రాంత రచయితలు, కవులు నిలబడ్డారు. తెన్నేటి సూరి, తుమ్మల వెంకట్రామయ్య, కొసరాజు శేషయ్య, శారద, ప్రయాగ వంటి కథకులు పోరాట సమయంలోనే ఎన్నో కథలు రాసి, పోరాట ప్రభావాన్ని ఇతర ప్రాంతాలకు తెలియజెప్పారు.

ఈ దశలో ఉన్న తెలంగాణా స్థితిగతులను కళ్లకు కట్టినట్లు వట్టికోట ఆళ్వారుస్వామి 'గంగు' నవలలోను, దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు', 'మోదుగుపూలు' నవలల్లోను, మహీధర రామమోహనరావు 'ఓనమాలు', 'మృత్యువు నీడల్లో' వంటి నవలల్లోనూ చిత్రించారు. మొత్తంమీద ఈ కల్లోల తెలంగాణను ఆవిష్కరించిన నవలలు పదిహేను. ఒక ఉద్యమంపై ఇన్ని నవలలు రావటం తెలుగు సాహితీ చరిత్రలో అరుదైన విషయం. ప్రఖ్యాత ఉర్దూ రచయిత కిషన్ చందర్ రాసిన ఉర్దూ నవల "జబ్ ఖేత్ జాగ్ ఉఠే" 'జైత్రయాత్ర' పేరుతో తెలుగులోకి అనువాదం అయింది. దీని ఆధారంగానే 1981లో గౌతంఘోష్ దర్శకత్వంలో ప్రముఖ దర్శకుడు నరసింగరావు 'మాభూమి' సినిమా నిర్మించారు. ఈ సినిమాలోనే గద్దర్ పాడిన బండెనుక బండిగట్టి పాట ఎంతో ప్రజాదరణ పొందింది.

నైజాము సర్కరోడా నాజీల మించినోడ
యమబాధలు పెడ్తివి కొడుకో! నైజాము సర్కరోడా...
....
చుట్టుపట్టు సూర్యపేట నట్టనడుమ నల్లగొండ
ఆవల హైద్రబాద తర్వాత గోలకొండ
గోల్కొండ ఖిల్లా కింద
నీ గోరి కడతం కొడుకో నైజాము సర్కరోడా!..

అంటూ సాగిపోయే ఈ పాటను రాసిన యాదగిరి ఓ సామాన్య కార్యకర్త. ఈ పాట అనేక రూపాంతరాలు చెంది తెలంగాణ ప్రాంతమంతా యుద్ధనినాదమై మారుమోగింది. రేణికుంటలో జరిగిన పోరాటంలో అమరుడైన రామిరెడ్డి, తిరుమలగిరి సమీపంలో జరిగిన పోరులో అసువులు బాసిన గొట్టిముక్కల గోపాలరెడ్డి వీరోచిత పోరాటాలను కీర్తిస్తూ ఎన్నో పాటలు వెలువడ్డాయి.

సైసై గోపాలరెడ్డి రెడ్డీ! నీవు
నిలిచావు ప్రాణామొడ్డి సై॥సై॥

అంటూ తిరునగరి రామాంజనేయులు పాట రాయగా రేణికుంట రామిరెడ్డిపై నేటికీ తెలంగాణా ప్రాంతంలో శారద కాండ్రు పాడుకుంటూనే ఉన్నారు.

ప్రజల పాలిట రాక్షసుడైన మోత్కూరు పోలీస్ అమీన్ మీద ప్రజలు కట్టుకున్న

అరెరె మోత్కూరు అమీనోడా
బారెటి గడ్డపోడా
మూరెటి మీసపోడా

అంటూ వ్యంగ్యంగా సాగే పాట ఎంతో ప్రజాదరణ పొందింది.

ఇలా కార్యకర్తలే కవులైతే... అప్పటికే ప్రసిద్ధులైన కవులు దాశరథి, కాళోజి వంటి వారు తెలంగాణ ప్రాంతం నుంచి, ఆరుద్ర (త్వమేవాహమ్), సోమసుందర్ (వజ్రాయుధం), గంగినేని (ఉదయిని) కుందుర్తి (తెలంగాణ) వంటి వారు ఆంధ్రప్రాంతం నుంచి కవితలల్లారు... ఈ కాలంలోనే దాశరథి రాసిన ఈ కవిత... ఎంతో ప్రసిద్ధమైనది.

ప్రాణములొడ్డి ఘోర గహనాటవులన్ బడగొట్టి మంచి మా
గాణములన్ సృజించి ఎముకల్ నుసి జేసి పొలాలు దున్నిభో

షాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే, తెలం
గాణము రైతుదే! ముసలి నక్కకు రాచరికంబు దక్కునే!
ఓ నిజాము పిశాచమా! కానరాడు
నిన్నుబోలిన రాజు మాకెన్నడేని;
తీగెలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ, కోటి రతనాలవీణ

ఈ కాలంలో దాదాపు 50 వరకు కథలు వెలువడ్డాయి. వీటిలో కొన్నయినా కలకాలం నిలిచిపోయే కథలున్నాయి. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు రచించిన 'గొల్లరామవ్వ', సి.వి.కృష్ణారావు 'నోటీసు', ఆవుల పిచ్చయ్య 'ఊరేగింపులు', అట్లూరి పిచ్చేశ్వరరావు 'విముక్తి', భీమిరెడ్డి నరసింహారెడ్డి 'ఆయువుపట్టు', నెల్లూరి కేశవ స్వామి 'యుగాంతం', తుమ్మల వెంకటరామయ్య 'మీరుగెలుస్తారు', వుప్పల లక్ష్మణరావు 'గెరిల్లా'... అలా నిలిచిపోయే కథల్లో కొన్ని. కేవలం రెండు పేజీల కథలో తెలంగాణ ప్రాంత ఉద్యమాన్ని, ఆంధ్ర మహాసభ ప్రభావాన్ని 'నోటీసు' కథలో సి.వి.కృష్ణారావు చిత్రించిన తీరు ఆశ్చర్యం గొలుపుతుంది. రేణికుంట రామిరెడ్డి పోరాటాన్ని ప్రయాగ తన కథ 'నవజాగృతి'లో ఎంతో ఉద్వేగభరితంగా దృశ్యమానం చేశారు. ఈ కాలంలోనే సుంకర (సత్యనారాయణ), వాసిరెడ్డి (భాస్కరరావు) రాసిన 'మాభూమి' నాటకం వేయని ఊరు లేదంటే అతిశయోక్తి కాదు. ఇటు మునగాల పరగణా నుంచి ఉత్తరాంధ్ర, నెల్లూరు వరకు వందలాది ప్రదర్శనలు పొందిన నాటకం 'మాభూమి'. పోరాటంలో అసువులు బాసిన బందగీ, కొమరయ్యలను తల్చుకుంటూ ప్రారంభమయ్యే ఆ నాటకం తెలంగాణ పోరాటంలోని అన్ని ముఖ్య ఘట్టాలను అద్భుతంగా చిత్రించింది. ఈ నాటకాన్ని తెలంగాణలో సైతం రహస్యంగా ప్రదర్శించిన సందర్భాలు అనేకం... ఎక్కడికక్కడ నాటక దళాలు ఏర్పడి ఈ నాటకాన్ని ప్రదర్శించేవి.

ఒకవైపు పోరాటం ఉద్ధృతంగా సాగుతోంది. మరోవైపు నిజాంను లొంగదీసుకోవటానికి భారత సైన్యం 1948 సెప్టెంబరు 13న తెలంగాణలో ప్రవేశించాయి. తొలుత ఎన్ని బీరాలు పలికినా 7వ నిజాం ప్రభువు మూడు రోజుల యుద్ధానంతరం సెప్టెంబరు 17న లొంగిపోయాడు. ఒకరకంగా నిజాం శకం అంతమయింది. ఈ చర్యని నిజాం స్టేట్ కాంగ్రెస్ స్వాగతించింది.

పోరాట రంగంలో ఉన్న కమ్యూనిస్టులకు ఇది మింగుడు పడలేదు... గ్రామాలను వదలిన దొరలు, జాగీర్దారులు, దేశముఖ్‌లు, రూమీటోపీ - షేర్వానీలను వదిలి ఖద్దరు దుస్తులు, టోపీలతో గ్రామాల్లోకి ప్రవేశించి కమ్యూనిస్టుల చేతికి లేదా గ్రామ కమిటీల చేతుల్లోకి పోయిన తమ వేలాది ఎకరాల భూమిని తిరిగి ఆక్రమించుకోవడం మొదలుపెట్టారు. వీరికి మద్దతుగా యూనియన్ సైన్యాలు నిలబడ్డాయి. ఎటూ తోచని స్థితిలో భూమినీ, ఆయుధాలను వదిలేది లేదని కమ్యూనిస్టులు పోరాటం కొనసాగింపునకే నిర్ణయించారు. ఈ స్థితి దాదాపు మూడు సంవత్సరాలు కొనసాగింది. మూడు సంవత్సరాల కాలంలో తెలంగాణ ప్రాంతం అతలాకుతలం అయింది. ప్రజలంతా కమ్యూనిస్టులవైపు, జాగీర్దారులు, దేశముఖులు వారి వత్తాసుదారులు సైన్యం వైపు నిలబడ్డారు. తెలంగాణ గడ్డ రక్తమోడింది. నిలువెల్ల గాయమైంది. సైన్యం ధాటికి కమ్యూనిస్టుల నాటు తుపాకులు ఆగలేకపోయాయి. పైగా పార్టీలో అభిప్రాయ భేదాలు పొడచూపాయి. 1951 అక్టోబరు 21న పోరాటాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించింది కమ్యూనిస్టు పార్టీ. ఇది- పోరాటం మూడో దశ...

ఈ దశలో అటు ఆంధ్ర ప్రాంతంలోనూ, ఇటు తెలంగాణ ప్రాంతంలోనూ కమ్యూనిస్టు పార్టీపై నిషేధం అమలయింది.

కవులు, రచయితలు జైళ్లకో లేదా అజ్ఞాతంలోకో తరలిపోయారు. పాటలు, నాటకాలు, వివిధ కళారూపాల్లో ప్రదర్శనానుగుణ రచనలు ఎన్నో వచ్చాయి. లక్ష్మీకాంత మోహన్ 'సింహగర్జన' నవల ఈ కాలంలోనే వెలువడింది. అప్పటి నిర్బంధ వాతావరణానికి అది సాహసమే. ఈ కాలంలో జరిగిన దారుణాలను ఆరుద్ర తన సంకేతాత్మక కావ్యం 'త్వమేవాహం'లో చిత్రించారు. పోరాట విరమణ అనంతరం గంగినేని వెంకటేశ్వరరావు తెలంగాణా ప్రాంతంలో పర్యటించి ఈ కాలంలో భారత సైన్యం అమలుపరచిన నిర్బంధాన్ని, సాగించిన మారణకాండను గర్హిస్తూ, అమరుల జీవిత చరిత్రలను చిత్రిస్తూ కథలుగా మలుస్తూ 'ఎర్రజెండాలు' మూడు భాగాలుగా ప్రచురించారు.

అప్పటి వరకు సాహిత్యాన్ని ప్రచురించిన విశాలాంధ్ర, ప్రజాశక్తి వంటి పత్రికలు నిర్బంధ వాతావరణంలో నడపటం సాధ్యంకాక మూతపడ్డాయి.

పోరాట విరమణ అనంతరం చాలామంది నాయకులు తమ అనుభవాలను ప్రచురించారు. పుచ్చలపల్లి సుందరయ్య, బి.ఎన్.రెడ్డి,

చంద్ర రాజేశ్వరరావు, దేవులపల్లి వెంకటేశ్వరరావు, ఆరుట్ల రామచంద్రారెడ్డి, నల్లా నర్సింహులు, రావి నారాయణరెడ్డి వంటి నాయకులు రాసిన అనుభవాలు తెలంగాణ రైతాంగ పోరాట పటిమను, దీక్షను తెలియజేస్తాయి.

1952లో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో రావి నారాయణరెడ్డి భువనగిరి నియోజకవర్గం నుంచి దేశంలోనే అత్యంత భారీ మెజారిటీతో (నెహ్రూకి మించిన మెజారిటీ) పార్లమెంటులో ప్రవేశించారు.

ఆరుద్ర, అట్లూరి పిచ్చేశ్వరరావు, దాశరథి వంటి కవులు, రచయితలు మద్రాసు వెళ్ళి సినిమా రంగంలో స్థిరపడ్డారు...

ఇది చరిత్ర
ఇది చరిత అందించిన సాహిత్యం.
తెలుగు భాషాకిరీటంలో ఈ సాహిత్యం మరో కలికితురాయి. ■

ప్రజాసాహితి పత్రిక మాజీ సంపాదకులు, కథా
సాహితి వార్షిక సంకలనాల సహ సంపాదకులు,
హైదరాబాద్. 98493 10560

హృదయానందం

పొన్నాడ విజయ్‌కుమార్

"వచ్చే భాద్రపద బహుళ పంచమికి నీకు ముప్పై రెండు నిండుతాయి తెలుసా?"

ఉలిక్కిపడ్డాడు ఆనందరావు. ముప్పై రెండా? అనుకున్నాడు. హృదయం కలుక్కుమంది. చిన్న సవరణ. హృదయమే కలుక్కుమనిపించింది. అది హృదయాంతరంగాల్లోంచి వచ్చిన ఓ ఆర్తనాదం. దాన్ని హృదయఘోష అన్నా పర్లేదు.

చాలా సేపటినించి ఆనందరావు హృదయం తన ఘోషని ఎడతెరిపి లేకుండా, ఏకబిగిన, ఏకరవు పెడుతూనే ఉంది. ప్రయోజనం ఉండదని తెలిసికూడా. కానీ తన హృదయం చివరగా అన్న మాట తన హృదయాన్నే తూట్లు పొడిచింది. మళ్లీ సవరణ: హృదయమే తూట్లు పొడిచింది.

"నువ్వు నా హృదయాన్ని బాధపెట్టావు" అన్నాడు ఆనందరావు.

"నేనే నీ హృదయాన్ని. నువ్వే నన్ను బాధపెట్టావు" అంది హృదయం.

నాలిక్కర్చుకున్నాడు.

"అయినా శాయశక్తులా, ప్రయత్నం చేస్తున్నాను కదా. ఎంతోమంది అమ్మాయిల్ని ప్రేమించాను. వారిని పదిలంగా నా హృదయంలో పీట వేసి కూర్చోపెట్టాను. కానీ వాళ్ళే 'ఛస్' కాదని వెళ్ళిపోతే అది నా తప్పా? చెప్పు" బేలగా అన్నాడు ఆనందరావు.

"నువ్వు ఎంతమందిని ప్రేమించావన్నది అప్రస్తుతం. నిన్ను ఎంత మంది ప్రేమించారన్నది అత్యవసరం. నిజం చెప్పు. బేవార్సుగా భోజనం వడ్డిస్తుంటే, రుచీ పచీ లేకపోయినా పడుంటాయని అన్నీ కడుపులోకి తోసేసినట్టు, కనిపించిన ప్రతి అమ్మాయినీ ప్రేమించాననే మిషతో హృదయంలోకి తోసి పారేశావు. వీరిలో ఏ ఒక్కరైనా నిన్ను ఇష్టపడ్డ దాఖలాలున్నాయా చెప్పు?" నిలదీసింది హృదయం. నిలబడలేక చతికిలపడిపోయాడు ఆనందరావు. "కనీసం, నీ చిన్నప్పటి జ్ఞానప్రసూనాంబయినా సరే" మళ్లీ అంది హృదయం.

జ్ఞాన ప్రసూనాంబ గుర్తుకు రాగానే, ఆనందరావు కుడిచెయ్యి అసంకల్పితంగా గుండెల మీద కొచ్చింది.

అపుడు ఆనందరావుకి అయిదేళ్ళుంటాయి. సెలవులకి ఊరెళ్ళాడు. వాళ్ళింటికి ఎదురుగా ఉండే తెలుగు పంతులుగారి అమ్మాయే ప్రసూనాంబ. తనూ ఆనందరావు ఓ మారు అమ్మానాన్న ఆటలో జంటగా కుదిరిపోయారు. ఆనందరావు హడలిపోయి నువ్వు నేను అస్సలు బాగుండం అనేశాడు. దీంతో శివాలెత్తిన జ్ఞానప్రసూనాంబ, దభేల్న ఆనందరావుని కింద పడేసి ఎడంకాలితో గుండెల మీద తన్నేసింది. "తప్పు. పెళ్లాం మొగుడ్ని తన్నకూడదు, కాఫీలు వంటలు చేసి పెట్టాలి" అన్నాడు గుండెల మీద నించి జ్ఞాన ప్రసూనాంబ కాలు తీసే ప్రయత్నంలో. ప్రసూనాంబ, ఆనందరావు కన్నా ఏణ్ణర్థం పెద్దది. ఆరున్నర కిలోల బరువు, మూడంగుళాల ఎత్తు ఎక్కువ. అందుకే కదపలేకపోయాడు. "పోరా! మా అమ్మా మా నాన్నని ఇలానే తంతుంది. వంటలు కూడా మా నాన్నే చేస్తాడు" అంది కాలు తీయకుండానే.

అప్పుడే చిన్న ఆనందరావుకి ఓ పెద్ద విషయం స్పష్టంగా కాకపోయినా అర్థమయ్యింది. ఏంటంటే, వంటచేసే మగవాళ్ళింట్లో, తన్నే ఆడ వాళ్ళుంటారు అని.

'ఏది ఏమైనా, నా హృదయంలో కాలు పెట్టిన మొట్టమొదటి ఆడపిల్ల జ్ఞాన ప్రసూనాంబ' ఆనందంగా అనుకున్నాడు ఆనందరావు.

"సవరణ" అంది హృదయం. "కాలు పెట్టిందన్నది నిజం. కానీ, హృదయం'లో' కాదు... 'మీద' " అంది. నాలిక్కరుచుకున్నాడు ఆనందరావు.

జ్ఞాన ప్రసూనాంబ చేసిన ఆ హృదయారంగేట్రానికి, ఆనందరావులో అనూహ్యమైన స్పందన (భయం అనీ అనవచ్చు) వచ్చి, తీవ్ర పరిణామాలకి దారితీసింది.

అంతే, పద్మనాభస్వామి 'నిధి నిక్షేపాల' సంరక్షణార్థం గది ద్వారాలు మూసేసి నాగప్రతిష్ఠ చేసినట్లు, ఆనందరావు తన 'విధి' సంక్షేమం సంరక్షణార్థం హృదయ ద్వారాలు మూసేసి మగప్రతిష్ఠ చేశాడు. ఆడది వచ్చి అప్రతిష్ఠపాలు చేయకుండా. అది మొదలు మరో పదహారేళ్ల దాకా అమ్మాయిల జోలికి పోతే ఒట్టు. హృదయం నీరు కారిపోయింది.

అదుగో అప్పుడే సులోచన వచ్చింది. ఆ రోజే ఆనందరావు చదివే (వెళ్లే) కాలేజీలోను, అలాగే ఆనందరావుతో పాటు మరో పదకొండుమంది హృదయాల్లోనూ ఒకేసారి ప్రవేశించింది.

జట్కా బండి వూగుతున్నట్టు, పిల్ల నడకతో వయ్యారంగా నడిచి వస్తున్న సులోచనని కన్నార్పకుండా చూస్తూ, ఎదురెళ్ళి, ఆగిపోయిన రైలింజను



ఎదుట

నుంచుని రైలు ఆపేసిన వాడిలా "మిమ్మల్ని ఓటి అడగచ్చా" అని "మరి కోపం తెచ్చుకో కూడదు సుమా" అన్నాడు.

సులోచన అదోలా నవ్వి "అడుక్కో" అంది. ఆనందరావు చాలాసేపు నాన్చి, మరి కొంచెం సేపు మెలికలు తిరిగి, ఆఖరికి ఓ తొంభై ఏడు సెకన్ల తరువాత "టైమెంతయ్యిందో చెబుతారా" అనడిగాడు.

"హార్నీ. నీకూ వాచీ ఉంది కదా" అనేసింది సులోచన.

"నా టైము బాగోలేదు" అన్నాడు ఆనందరావు మెలికలు తిరగటం మర్చిపోయి.

"బాగుంది" అని కిసుక్కున నవ్వి వెళ్ళిపోయింది సులోచన.

సులోచన కిసుక్కుమన్న ఉత్తర క్షణాన కిర్రుమని కూడా వినిపించింది. తన హృదయంలో ఎవరో గిరినట్టయ్యింది.

"ఏమిటది" అన్నాడు.

"హృదయ ద్వారం తెరుచుకుందిలే. చాలా రోజులయ్యింది కదా దాన్ని వాడక. కాస్త బిగుసుకుపోయి తుప్పు పట్టినట్టుంది" అంది హృదయం.

"చీకటి కొట్టులా, దొడ్ల సావిడిలా, ప్రభుత్వ ఆసుపత్రిలా వాడకుండా వదిలేసిన నా హృదయంలోకి సులోచన ప్రవేశించింది. బూజు గట్రా దులిపి, దుమ్ము ధూళి, చెత్త చెదారం చీపురుతో తుడిచి శుభ్రంగా కడిగి, ముగ్గుపెట్టి, ఓ అరవై వాట్ల బల్బు పెట్టి లైటు వేసింది. నా హృదయంలో వెలుగు నింపింది." అనుకుంటూ గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు ఆనందరావు.

"ఎలా ఉంది" అడిగాడు ఆనందరావు.



"పర్లేదు నీకు హృదయం ఉందని నిరూపించుకున్నావు" అంది హృదయం. ఆనందరావు జోకులకి అస్సలు నవ్వడు.

సులోచన ఆనందరావు హృదయంలో ఆనందం నింపిందన్న ఆనందం అట్టే రోజులు నిలువలేదు. ఓ రోజు దబేల్‌మనే శబ్దానికి ఉలిక్కిపడి లేచాడు ఆనందరావు. "ఏమైయ్యుంటుంది"అని ఆలోచించేలోగా హృదయం స్పందించింది.

"ఆవిడగారు హృదయంలో లైటు ఆర్పేసి, బయటికి పోతూ, తలుపు వేసిన శబ్దం. కాస్త విసురుగా వేసిందిలే" అంది హృదయం. గేదె మీద పడ్డ వర్షంలా నిలకడ లేకుండా వెళ్ళిపోయిన సులోచనని తలుచుకుని భోరున ఏడ్చాడు ఆనందరావు. ఏడ్వటం అయిపోయాక, ముఖం కడుక్కుని డాక్టరు దగ్గరకెళ్ళాడు. "చిన్న సైజు గుండె పోటు" అని నిర్ధారణ చేశాడు. పర్లేదు, ఏమీకాదు అని చెప్పినందుకు డాక్టరుకి రెండు వేలు ఇవ్వవలసి వచ్చింది ఆనందరావుకి.

మన ప్రభుత్వం దావూదు ఇబ్రహీం కోసం వెదికినట్టు, ఆనందరావు మరో అమ్మాయి కోసం వెదికాడు. దావూదు ఇబ్రహీం దొరకలేదు. అమ్మాయి దొరికింది. పేరు సుబ్బలక్ష్మి. ఓ పెళ్ళిలో పరిచయం.

ఉబుసుపోక ఎవరో చేసుకునే పెళ్ళికి వెళ్ళాడు ఆనందరావు. ఈ మధ్య ఇలా అన్నింటికీ వెళ్ళాలనుకున్నాడు. అక్కడ తనలాగే ఈసురోమంటూ దిగులుగా ఉన్న సుబ్బలక్ష్మిని చూశాడు. ఆలస్యం చేయకుండా ప్రేమించేశాడు.

సుబ్బలక్ష్మి ఆనందరావు హృదయంలో సాంప్రదాయబద్ధంగా కుడికాలు పెట్టి ఎడం చేత్తో లైటు వేసి, మళ్ళీ ఆనందరావు హృదయాన్ని వెలుగుతో నింపింది.

సుబ్బలక్ష్మి ఓ పక్కనున్న స్తంభానికి చేతులు ఆన్చుకుని, దిగాలుగా, దీనంగా, ఉసూరుమంటూ ఓ పందొమ్మిదడుగుల దూరంలో ఉన్న కిటికీ గుండా బయట శూన్యంలోకి చూస్తోంది. అదే అదననుకొని ఆనందరావు సుబ్బలక్ష్మికి ఎదురుగా నిల్చుని చేతులు కట్టుకుని పాతాళభైరవిలో తోటరాముడిలా "టైమెంతయ్యిందో చెబుతారా సుబ్బలక్ష్మి గారూ" అనడిగాడు.

సుబ్బలక్ష్మి ఆనందరావు కళ్ళలోకి చూసి "నా టైము బాగోలేదు" అని చీర కొంగుని, నోట్లోకి వెళ్ళేంత వరకు కుక్కేసుకుని భోరుమంది.

"అభ్యంతరం లేకపోతే, మీ టైము బాగుచేయిస్తాను" అని అన్నాడు బలిపీఠంలో శోభన్‌బాబులా.

సుబ్బలక్ష్మి మారు మాట్లాడకుండా, చేతి గడియారాన్ని తీసి ఇచ్చేసింది. ఆనందరావు మళ్ళీ గుండెల నిండా గాలి పీల్చుకున్నాడు.

"ఎలా ఉంది" అడిగాడు ఆనందరావు.

"కొంచెం కురసయ్యింది" అంది హృదయం.

"కురసయ్యిందన్నది అప్రస్తుతం. వరసయ్యిందన్నది అత్యవసరం" తిప్పి కొట్టాడు రసని ప్రాసగా చేసి.

కానీ, రసపట్టులో పట్టు లేదని గడియారాన్ని బాగుచేయించాక గానీ తెలీలేదు.

ఆ గడియారాన్ని తీసుకుని సుబ్బలక్ష్మి "మీ మేలు జన్మ జన్మలకీ మర్చిపోను" అంది... దాన్ని చెవి దగ్గర పెట్టుకుని పన్జేస్తోందని నిర్ధారించుకుని.

"జన్మ జన్మలకీ గుర్తు చేస్తూనే ఉంటాను మీరు మర్చిపోకుండా" అన్నాడు ఆనందరావు.

"అదెలా" అంది సుబ్బలక్ష్మి.

"అది ప్రేమశక్తి. మనల్ని అలా కలుపుతూనే ఉంటుంది" అన్నాడు ఆనందరావు.

"ప్రేమేంటీ? నీకేమైనా పిచ్చా? గడియారం బాగుచేసిన వాడ్ని ప్రేమించాలా? అలా అయితే ఇప్పటికి, ఓ పాతిక మంది ఉండే వారు" అంది పరుగులాటి నడకతో బయటికి వెళ్తూ.

మళ్ళీ మామూలే. దబేల్, కిర్రు, ఢాం! మూడోశబ్దం కొత్తది ఏంటి చెప్మా అనుకున్నాడు.

"బల్బు పేలిందిలే" అందించింది హృదయం

ఈసారి ధన్వంతరి "వాల్వు దెబ్బతింది" అన్నాడు. అయితే, "పర్లేదు" అనటానికి మరో నాలుగువేలు ఎక్కువ తీసుకున్నాడు లెండి.

ఇక అక్కడ్నించి మొదలయ్యింది. ఆనందరావు హృదయమర్దనం. బోల్డు మంది ఆనందరావు హృదయాన్ని తాకి, తన్ని, పొడిచి, విరిచి గాయాలు చేశారు. తనది ఎంతో విశాల హృదయం. జాతి, మత, శాఖ,

భాష, వయస్సు, రంగు, ప్రాంతాల కతీతంగా అందర్నీ ఆదరించాడు. సలోమి, మార్గరెట్, అంబుజాక్షి, వెంకటలక్ష్మి, మెహరున్నీసా, లిజి, హనీనా, అలేఖ్య, సుందరి ఇలా చాలామంది ఆనందరావు హృదయంలో దూరి మరీ గాయ పరిచారు. దీనివల్ల బాగుపడిందెవరైనా ఉన్నా రంటే వైద్యుడొక్కడే. ఈ మధ్యే గుండె ఆకా రంలో ఇల్లు కట్టుకున్నాడు. పాపం.

"నీకు బొత్తిగా బుద్ధిలేదు" అంది హృదయం.

"ఛా! తెలీని విషయం చెప్పు" అన్నాడు ఆనందరావు.

"నీకు హృదయం దేనికిరా? వాజమ్మా. ఒక్కరూ పట్టుమని ఒక్క రోజు కూడా ఉండి చావడం లేదు. ఇది హృదయమా లేక ఢిల్లీ ఏపీ భవనమా? లేకపోతే తిరుమలలో ఉచిత అన్న సత్రమా!" అంది కసిగా.

ఆనందరావుకి తెలుసు. హృదయాన్ని ఎలా ఏమార్చాలో. "తిరుపతి అంటే గుర్తొ చ్చింది. నీకు కాళహస్తిలో కలిసిన ప్రియంవద గుర్తుందోయ్" అడిగాడు ఆనందరావు.

"నాకు మతిమరపు భాగ్యం లేదు. అయినా ఆవిడ్ని మర్చిపోగలమా? ఆఫ్రికా ఏనుగులా, రాక్ ఆఫ్ జిబ్రాల్టర్‌లా ఉన్న ఆ సైజు? ఎప్పుడు ఫొటో తీసినా సగమే పడేది" అంది హృదయం.

"నిజమే సుమీ. తనని పూర్తిగా చూడటా నికి నాలుగురోజులు పట్టింది. అదీ ఆటోలో వెళ్తే" అన్నాడు విచారంగా. "బోల్డుండేది ఇంచక్కా" అనుకున్నాడు.

"బోల్డు ఏం ఖర్మ. బోల్డున్నరుండేది. అయినా ఆ బుల్‌డోజర్ నీకెలా నచ్చింది" ఆశ్చర్యపోయింది హృదయం.

"అడుక్కునేవాళ్ళకి ఎంచుకునే అవకాశా లుండవు" తెలుసా? అన్నాడు ఆనందరావు.

"నువ్వు అడుక్కునే వాడివేంటోయ్" ఎదురు ప్రశ్న వేసింది హృదయం.

"ఛస్! కాదు" అని "కానీ నాకు ఎంచు కునే అవకాశం లేదుగా" అన్నాడు. "ఏమైనా చెప్పు, ప్రియంవద ఓ పదిమంది పెట్టు"

"నీకు మరీ మొహమాటం ఎక్కువ. పది మందేం ఖర్మ. సుబ్బరంగా పాతికమంది పెట్టు. హృదయంలో దూరటానికే పదిరో జులు పట్టింది. అయినా, సగం బయటే ఉంది" అంది హృదయం.

"అవును నిజమే. ఆ రోజుల్లో గుండె బరువెక్కినట్టు కిందకి జారిపోతున్నట్టు ఉండేది. వైద్యుడు దాన్ని హార్టు ఎన్‌లార్జ్ మెంట్ అన్నాడు" వెర్రిగా నవ్వుతూ అన్నాడు ఆనందరావు.

ఇలా హృదయాలను కుదిపేసి, భయ భ్రాంతులకు గురిచేసే హృదయ విదారక ఆకా రాలు, కొలతలు ఉన్నవారిని కూడా ఆనంద రావు ఆదరించి, సహృదయంతో హృదయంలో చోటిచ్చాడు. అయినా ఒక్కరూ నిలబడ లేదు. కూర్చోలేదు. ఒక్క అలివేలు మాత్రమే కాస్త నడుం వాల్చింది.

అలివేలు విషయంలో ఆనందరావు ఎక్కువ విశాల దృక్పథంతో ఆలోచించాడో, లేక నిర్లక్ష్య ధోరణి అవలంబించాడో చెప్పటం కష్టం. ఫలితం: అలివేలు ఆనందరావు హృద యంలో మూడున్నర రోజుల పైచిలుకే ఉండి పోయింది. ఈ వైపరీత్యానికి హడలిపోయాడు ఆనందరావు.

ఆనవాయితీ ప్రకారం అలివేలుని చూడ గానే హృదయం తెరుచు కుపోయింది. అలివేలు లోనికెళ్ళి తలుపేసేసు కుంది. అంతే, ఆ తర వాత మాటా మంతీ ఏమీ లేదు. కారణం ఏమై ఉంటుందాని ఆలో చిస్తూంటే...

" 'నా హృదయంలో నిదురించే చెలీ...' అని ఎవడు పాడమన్నాడు. ఆ పాట విని ఎలాగో పాడేశాడు కదా, పడు కుంటే పోలే అని నిఝంగానే నిదురించే సింది" అంది హృదయం ఆవులిస్తూ.

"హార్నీ! ఇదా సంగతీ" అనుకుని "శయ నించే ఓ చిలుక ఎగిరిపో, పాడైపోయెను గూడు" అని పాడేసరికి అలివేలు కిటికీ లోంచి దూకి పారిపోయింది. "హమ్మయ్య" అనుకు న్నాడు.

తరువాత ఆలోచించాడు. హృదయానికి కిటికీ లేదు కదా? దానికి ధన్వంతరి పదిహే నువేలు తీసుకుని "గుండెకు చిల్లు పడింది లేవోయ్" అన్నాడు. చిల్లుని పూడ్చుకునే వరకూ మరో అమ్మాయిని హృదయంలో అడుగు పెట్టనీయకూడదని నిర్ణయించుకుని, పెళ్ళిచూపులు మొదలెట్టాడు. అలా చూసిన శతకోటిన్నరలోనూ, ఇవాళ వెళ్ళింది ఒకటి.

విజయవాడ సత్యనారాయణపురంలో, సూర్యనారాయణరావుగారి అమ్మాయే వెంకట లక్ష్మి. చూడగానే "బాగుందోచ్" అనేసుకు న్నాడు. కానీ హృదయంలోకి వెళ్ళనీయలేదు. మరమ్మతులో ఉంది కదా. తాత్కాలికంగా కళ్ళలో దాచుకున్నాడు. హృదయం బాగ య్యాక బదిలీ చేయచ్చని.

"మీకు హైజంపులో ప్రవేశం ఉందా" అనడిగింది. ఆనందరావు తల నిలువుగా ఊపుతూ "ఊ" అనేశాడు. "మీతో నాలుగు ముక్కలు మాట్లాడాలి" అంది పెరట్లోకి వెళ్తూ. ఉత్సాహంగా వెనకాలే వెళ్లాడు ఆనంద రావు.

వెంకటలక్ష్మి మితభాషి. పైగా పొదుపరి. మాట్లాడుతానన్న నాలుగు మాటల్లోను, రెండే మాట్లాడింది. ఆ రెండు మాటలే, వెన్నులోంచి వణుకు పుట్టించాయి. "ఇంకా నయం నాలుగూ మాట్లాడింది కాదు" అనుకున్నాడు.

ఆ రెండు ముక్కలూ విన్నాక ఆనందరా వులో ఒకందుకు బాధ. ఒకందుకు సంతోషం. హైజంపు విషయం ఎందుకడిగిందో అర్థ మైంది.

ఎదురుగా ఎనిమిదడుగుల గోడ ఉంది. అంతే, ఆలోచించకుండా ఎలా ఎక్కాడో, దూకేడో... అంతా రెప్పపాటులో జరిగిపో యింది.

ఇలా దూకగలనని ఆనాడు తెలిసుంటే, బళ్ళో బహుమతి వచ్చేది. అదీ బాధ. అయితే, ఇప్పుడు చేయగలిగినందుకు సంతోషం.

ఇంతకీ ఆనందరావు 'జంపయ్యి' పోటా నికి వెంకటలక్ష్మి మాట్లాడిన రెండు ముక్కలు ఏమిటంటే. "నేనతన్ని ప్రేమించాను" అని వెనక ఇంట్లో, వంటికి నూనె రాసుకుని బస్కీలు తీస్తున్న ఓ వస్తాదుని చూపించింది.

"లేచిన వేళ బాగుంది" అని రైల్వే

స్టేషనుకి పరుగు లంకించుకున్నాడు ఆనందరావు.

ఆనందరావు చూట్టానికి బానే ఉంటాడు. చదువు పర్లేదు. ఉద్యోగమూ పర్లేదు. ఎత్తు, పొడుగు ఇంకా పర్లేదు. వయస్సు పర్లేదు కన్నా కొంచెం ఎక్కువ.

అన్నీ 'పర్లేక' పోయినా, పెళ్ళి కావటం లేదు. ఎంతమంది ఆడపిల్లల్ని ఆశ్రయించినా (ఆశ్రయం ఇచ్చినా) ఏ ఒక్కరికీ సుమారుగా కూడా నచ్చటం లేదు.

ఆయాసం వచ్చి, నెమ్మదిగా నడవటం మొదలెట్టాడు. కాస్త ఆయాసం తగ్గాక హృదయం అందుకుంది.

"వచ్చే భాద్రపద బహుళ పంచమికి నీకు ముప్పై రెండు నిండుతాయి తెలుసా?" అంది. ఉలిక్కిపడ్డాడు ఆనందరావు. "ముప్పై రెండా" ఆలోచిస్తూనే స్టేషనుకొచ్చి పడ్డాడు. టికెట్టు కొనుక్కుని రైలెక్కి, కిటికీ పక్క సీటులో కూర్చున్నాడు. ఎదుటి సీటు ఖాళీగా ఉంది. తన హృదయంలానే అనుకున్నాడు.

రైలు అయిదు నిమిషాల్లో బయలు దేరింది. అప్పుడే ఓ ముద్దుగుమ్మ, మెరుపు తీగ, నాజూగ్గా, వయ్యారంగా పరుగెత్తుకొచ్చి రైలు ఎక్కింది.

ఆయాసపడుతూ, ఆనందరావు ఎదురుగా ఖాళీగా ఉన్న సీటులో కూర్చుంది. ఆయాసం తగ్గలేదు. ఆనందరావు నీళ్ల సీసా ఆమెకందించాడు. తీసుకుని గడగడ తాగేసి స్థిమితపడింది. బాటిల్ కింద పెడుతూ, ఆమె పాదాలు చూశాడు.

"మీరు ఏమీ అనుకోనంటే, మిమ్మల్ని ఓటి అడగొచ్చా" అడిగాడు.

"అడగండి" అంది నవ్వుతూ "తాగిన నీళ్ళని ఇచ్చేయమని అడుగుతారా" అంది.

"అబ్బే అదేం లేదు. మీరు చెప్పే సమాధానం బట్టి, ఇక నాకు ఆకలి వేయదు దాహం వేయదు" అన్నాడు.

"ఏమిటో అది. అడగండి" అంది.

"మీరు జ్ఞాన ప్రసూనాంబా" అనడిగాడు.

"నువ్వు ఆనందరావా?" ఏకవచనం!

"ఎలా గుర్తు పట్టావు" అడిగాడు.

"నీ మొద్దు మొహం ఏమీ మారలేదు. పైగా నీ నుదిటి మీద నేను రాయితో కొట్టిన దాని బాపతు గాటు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది" అంది నవ్వుతూ. "నువ్వెలా గుర్తుపట్టావ్" అంది.

"నువ్వు నేను అమ్మా నాన్న ఆట ఆడుతుంటే, నన్ను కిందపడేసి ఎడం కాలుతో తొక్కేశావు గుర్తుందా?" అని "ఆ కాలు తీసే ప్రయత్నంలో నీ ఎడంకాలు మీద చూసిన పుట్టుమచ్చ" అన్నాడు.

"అయితే తన్ను కూడా మంచిదే" అంది.

"కాదు. మచ్చ మాత్రమే మంచిది" అన్నాడు.

ఇక ఎప్పుడు ఎలా వచ్చిందో తెలీదు, జ్ఞాన ప్రసూనాంబ ఎదుటి సీటులోంచి వచ్చి, ఆనందరావు పక్కనే కూర్చుంది. ఆనందరావు హృదయం మౌనంగా ఉంది.

గోల చేయటం లేదు... దూషించటం లేదు... ఘోషించటం లేదు... పేచీ పెట్టడం లేదు... దుయ్యబట్టడం లేదు... ఎందుకంటే ఇప్పుడు ఆనందరావు హృదయం తన దగ్గర లేదు. జ్ఞాన ప్రసూనాంబ దగ్గర ఉంది. ఆనందరావు జీవితంలో వెలుగు వచ్చింది. ఆనందరావు జీవితంలో జ్ఞానప్రసూనాంబ వచ్చింది.

సినీ రచయిత, మార్కెటింగ్,
కార్యక్రమ నిర్వాహకులు,
హైదరాబాద్. 80088 84281

కళలు @ 64

కళ కళ కోసమే అనుకుని లెక్కేస్తే అవి మొత్తం 64. గమ్మత్తేమిటంటే చౌర్యం కూడా ఇందులో ఉంది. హృదయచౌర్యమూ చోటు చేసుకుంది.

చతుష్షష్టి కళలు

1. ఇతిహాసము
2. ఆగమము
3. కావ్యము
4. అలంకారము
5. నాటకము
6. గాయకత్వము
7. కవిత్వము
8. కామశాస్త్రము
9. దురోదరము
10. దేశభాషా లిపిజ్ఞానము
11. లిపికర్మము
12. వాచకము
13. అవధానము
14. స్వరశాస్త్రము
15. శకునము
16. సాముద్రికము
17. రత్నశాస్త్రము
18. రథాశ్వ గజకౌశలము
19. మల్లశాస్త్రము
20. సూదకర్మము
21. దోహదము
22. గంధవాదము
23. ధాతువాదము
24. ఖనివాదము
25. రసవాదము
26. జలవాదము
27. అగ్ని స్తంభనము
28. ఖడ్గ స్తంభనము
29. వాక్ స్తంభనము
30. వాయు స్తంభనము
31. వశ్యము
32. ఆకర్షణము
33. మోహనము
34. విద్వేషణము
35. ఉచ్చాటనము
36. మారణము
37. కాలవంచనము
38. పరకాయ ప్రవేశము
39. పాదుకాసిద్ధి
40. వాక్సిద్ధి
41. ఇంద్రజాలికము
42. అంజనము
43. దృష్టి వంచనము
44. స్వర వంచనము
45. మణి సిద్ధి
46. చోరకర్మం
47. చిత్ర క్రియ
48. లోహ క్రియ
49. అశ్మ క్రియ
50. మృత్క్రియ
51. దారుక్రియ
52. వేణు క్రియ
53. చర్మ క్రియ
54. అంబర క్రియ
55. అదృశ్య కరణము
56. దూతీ కరణము
57. వాణిజ్యము
58. పాశుపాల్యము
59. కృషి
60. ఆసవకర్మ
61. ప్రాణిద్యూత కౌశలము
62. జలస్తంభనము
63. మంత్రసిద్ధి
64. ఔషధసిద్ధి

నెల్లూరి మండళ్లు

యద్దల లలిత

ఆంధ్రప్రదేశ్ నలుచెరగులా మాట్లాడేది తెలుగే అయినా ఏ ప్రాంతానికి తగ్గ యాస (మాండలికం) ఆ ప్రాంతానిది. ఎంత చదువుకున్న వారైనా, ఎన్ని దేశాలు తిరిగినా తమ సొంత గడ్డపై కాలు మోపగానే వాళ్ల యాసలో వాళ్ళు మాట్లాడుకోవటంలో తల్లి స్పర్శంత ఆత్మీయత ఉంటుంది. ఎవరి యాసానందం వారిది.

పెన్నా తీరంలోని మా నెల్లూరి సీమలో అత్యంత అద్భుతమైన వినసొంపైన భాష ఉంది. నెల్లూరు చుట్టుపక్కల ఓ రకం గాను, సూళ్లూరుపేట వైపు ఇంకొంచెం మార్పుతోను యాస ఉంటుంది.

నెల్లూరు సీమకు వేల ఏళ్ల చరిత్ర ఉంది. నెల్లూరు వడ్లకి, ధాన్యానికి ప్రసిద్ధి చెందింది. నెల్లు అంటే వడ్లు అని తమిళంలో అర్థం. అందుకని నెల్లూరుగా పేరు అని, నెల్లి చెట్టు (చిన్న ఉసిరిక) కింద స్వయంభువుగా వెలసిన రంగనాయకులు స్వామి వలన నెల్లిపూరని, కాలక్రమేణా నెల్లూరుగా మారిందని పెద్దలు చెబుతారు. మొలగొలుకుల ధాన్యానికి పుట్టినిల్లుగా, కళలకు సాహిత్యానికి ఆలవాలంగా పేరుగాంచింది. సాహిత్యాన్ని పోషించే మహారాజ పోషకులున్నారిక్కడ.

మహాభారతాన్ని ఆంధ్రీకరించిన కవి బ్రహ్మ తిక్కన తెలుగు భాషామతల్లికి ఎనలేని ఖ్యాతి తెచ్చిపెట్టిందిక్కడే. మొల్లమ్మ తిరుగాడింది ఇక్కడే. కవికోకిల దువ్వూరి రామిరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి జన్మించిన బంగారు నేల ఇదే. రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం జేసిన అమరజీవిని అందించింది ఈ విక్రమ సింహపురే. మనసు కవి ఆత్రేయ ఉదయించిందీ ఇక్కడే. ఇక్కడి భాషలోని యాస రకరకాల పదజాలంతో వినసొంపుగా ఉంటుంది.

మచ్చుకి కొన్ని: నెల్లూరు జిల్లాలో ఎక్కువగా రైతుల కుటుంబాలే ఉంటాయి. "ఏమ్మాయా! పైరు కోశావంటనే! ఏ దామాషా (లెక్కన) అయినాయి వడ్లు?"

"ఇంకా కాటా వేయలేదబ్బయ్యా"

"ఉరామరిగ్గా రాసి చూసి చెప్పలేవా?" (ఉజ్జాయింపుగా)

"ఎకరానికి ముప్పన్నుం కావచ్చు (ఒకటిన్నర పుట్టి.. పుట్టికి 850 కిలోలు) పొట్ట మీదున్నపుడు వానొచ్చి సుంకు రాలి పోయిందిరా! లేకుంటే మూడుపుట్ల దామాషా అయ్యుండేది."

గూడూరు నుంచి సూళ్లూరుపేట దగ్గర ఓ చిన్న గ్రామం నాన్నమ్మ వాళ్లది. వేసవి సెలవులకు వస్తే వాళ్ల భాష వినసొంపుగా మన సొంత భాష ఇదే కదా అనిపించేది.

"లల్తా! బుడిగీలు గూట్లో పెట్టి దళ్లోకి పొయ్యి పైకి పోసుకునిరా! కూడు తిందూగాని" అనేది.

బుడిగీలు: బువ్వాట ఆడుకునే మట్టి పిడతలు. దడి: తాటాకులతో కట్టిన స్నానాలగది. పైకి: తలస్నానం కాకుండా మామూలు స్నానం.

నా స్నేహితురాలొకరు "లల్తో! ఈ రోజు మా యింటికాడ గోగాకు ఎన్నించి వంకాయ తాళింపు జేసినారు. నీ కిష్టం గదా తిందూగాన్రా" అని పిలిచేది. ఇంక సేద్యగాడు "ఓ నల్తెమ్మో! నేను మాలాడకి పొయ్యి ఒల్లికిపోసుకొనస్తా! అవ్వకు జెప్పు" అనేవాడు. ఒల్లికి అంటే స్నానం అన్న మాట. "ఏరా ఇంత సేపా!" అని నానమ్మ అడిగితే "యాడ రెడ్డసానీ! పిలకాయలు తగులుకొని రానిస్తే గదా!" అనేవాడు తలగోక్కుంటూ.

చిన్నాన్న ఏవూరైనా వెళ్లవలసి వస్తే చిన్నమ్మకి నానమ్మకి 'మందళ్ళు' చెప్పేవాడు.



వీధి వాకిట్లోకి వెళ్ళినంక కూడా చెబుతూనే ఉండేవాడు. "నేను చెప్పే మందల బాగా విను. రేపు మిట్టపట్టెడకి (ఆ కయ్యి పేరు) నీళ్లేయ మను. సేద్యగాడు రాంగానే చెప్పు. మడవలు బాగా చూసుకోమను. అసలే నీళ్ళు రాని కాలం. పక్కోడి కయ్యి పారపోబాతది (తడిసిపో తుంది). బావి కాడ పాదిలో రేపు నల్గురు మనుషుల్ని పిలిచి కలుపు తీయించమని చెప్పు. రేపు పైటేళకి వాళ్లకి దాహం కాయి. వక్కా ముక్కా కాయిబాక. సుద్దంగా వండిపెట్టు" అని పదే పదే మందళ్ళు చెప్పేవాడు. మందల అంటే విషయము.

బావికాడ: బావి దగ్గర

పైటేళ: మధ్యాహ్న వేళ

మాపిటేళ: రాత్రివేళ

వక్కా ముక్కా: శుభ్రత లేకుండా, రుచి లేకుండా

సుద్దంగా: శుభ్రంగా, రుచిగా

కాస్త ఎక్కువగా అతిశయోక్తులు చెప్పే వాళ్ళు, గర్వంగా ఉండే వాళ్ళని "ఓయబ్బ ఆ పిల్లకి బలే జంబాలు (డాబులు)" అంటారు. ఆ పిల్లోడికి బలే 'పెగ్గె' (గర్వం, పొగరు). వాడు చానా 'పెతర' (పోకిరి, అధిక ప్రసంగి)

"ఏందబ్బా ఈయ్యాళ బలే కుశాలగా వుండాడు మా అబ్బయ్యా!"

ఇయ్యాళ: ఈ వేళ, కుశాల: ఉత్సాహం, సరదా

ఇంట్లో వాళ్ళు ఆడపిల్లని 'అమ్మి' అని, అబ్బాయిని 'అబ్బయ్య' అని పిలుచుకుంటారు. చనువుగా పిలిచే ఆడవాళ్ళను "మేయ్!" అంటారు.

అబ్బాయిని "ఏరా!" అన్నట్లు ఆడవాళ్ళను- "ఓమే! యాడకి పోతుండావా? " అంటారు. ఆడవాళ్ల పేర్లకు "అమ్మ", అని మగవాళ్ల పేర్లకు "అయ్య" అని చేర్చి బయట వాళ్ళు పిలవడం మర్యాద. శేఖ రయ్య, భారతమ్మ ఇలా.

ఎకసెక్కంగా, పొగరుగా మాట్లాడితే, "ఏందబ్బయ్యో! 'సెకలు'పడు తున్నావో! మాటలు బాగా రానీ" అంటారు.

"నేను చెర్లోకి పొయ్యేతలికి ఆడ చేపలు అయిపోయినాయమ్మా!" అంటాడు సేద్యగాడు. పోయ్యేతలికి: వెళ్ళేసరికి, వచ్చే తలికి: వచ్చేసరికి

"ఈ కూర నాకు పళ్లేదు, నాకు సగీదు" (సయించదు)

"నువ్వేం వాళ్ళింటికి పోబళ్లే, రాబళ్లే!" పోబళ్లే: పోనవసరం లేదు. రాబళ్లే: రానవసరం లేదు.

పోబాక, రాబాక కూడా అలానే వాడతారు.

"వాళ్లందరూ ఇప్పుడు 'అలాదులు' పోయినారు." అలాదులు అంటే (ఉమ్మడి కుటుంబం నుండి 'విడిగా' వచ్చేశారు అని)

బిన్నా రా (బిరాన రా)- త్వరగా రా

గబాన: త్వరగా

ఆనక: తర్వాత

సజ్జా: ప్రస్తుతం

"ఏరా! రెండుకాలుకి వస్తానన్నావు.. మూడుముక్కాలుకువచ్చావ్? "

కాలు: పావు, ముక్కాలు: ముప్పావు

కిందా, మిట్టా అంటే భూమి, ఆకాశం అని అర్థం. ■

కథన రచయిత్రి, శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్
తిరుపతి.
94902 30600

వెలుగు రేకలు

అల నన్నయ్యకు తిక్కనార్యునకు పెద్దన్నైన యెఱ్ఱన్నకున్
లలితోద్యానకవిత్వమాధురులతో లాలించు శ్రీకృష్ణరాట్
విలసత్కావ్యకళావిలాసములకున్ వేవేల జోహారులన్
పలుకన్‌బూనుము తెల్గుపౌరుడ! భవద్భద్రైకవిద్యాప్తికై!

సుమతిన్‌పోతనవేమనన్ దలుపనీశోభావహంబైన వా
క్సుమరాజుల్ సురుచుల్ వెలార్చు కవితాజ్యోతుల్ విరాజిల్లు నీ
సుమనఃపీఠమునందు భారతి సదా శోభిల్లుసంతృప్తయై
కమనీయాంధ్రధరాతలప్రభవతన్ గర్వింపుమెల్లప్పుడున్!

అచ్చులు కర్ణభూషలగు హల్లులు కంఠసురత్నమాలికల్
అచ్చపు తెల్గుపల్కుబడు లక్షయ సంపదలెల్లవారికిన్
నచ్చినమాటలై కవుల నవ్యసుభాషితసూనరాజులున్
మెచ్చినవైన జానపదమిశ్రితవాక్కులు తెల్గురుక్కులే!

నిరతము బాలశిక్షలను నిత్యము పల్ శతకాలతోడుగా
విరియగ తెల్గు సోయగము విచ్చిన అక్షరమాలవెంట నీ
వరయుము బాస వాసినొక భవ్యతపమ్ముగనెంచి నీ మనః
సురుచిరపుష్పవాటికల సూటిగ నాటుము తెల్గుమొక్కలన్!

కావ్యము నాటకమ్ము కథ కమ్మని పాటకు తెల్గు మూలమౌ
శ్రావ్యత దీని మూలమగు సాగరరత్నమువోలె మూల్యమై
దీవ్యదనంతభావరస దివ్యపదావళులీజగాన సం
భావ్యములౌనుగాదె భువి భాస్కర దీధితులై వెలుంగుచున్!

- డా॥ అయాచితం నటేశ్వరశర్మ, 94404 68557

ఎటు తిరిగీ పిచ్చి నాకే

ఇదారు దశాబ్దాల క్రితం నాటిమాట. తిరుపతి వెంకటకవులు, కొప్పరపు సోదరులు, పింగళి-కాటూరి కవులు అప్పట్లో జంటక విత్వం చెప్పేవారు. అలానే తామూ జంటకవిత్వం చెప్పాలను కున్నారు గుర్రం జాషువా, ఆయన ఆప్త మిత్రుడు దీపాల పిచ్చయ్య శాస్త్రి.

ఇకనేం? తమ పేర్ల నుంచి కొంత కొంత తీసి ఒక పేరు తయారు చేయాలని ఇద్దరూ కలిసి కుస్తీపట్టారు. గుర్రం పిచ్చి, పిచ్చిగుర్రం, పిచ్చిజాషువా, జాషువా పిచ్చి... ఇలా తయారవు తున్నాయి పేర్లు. దాంతో జాషువా 'వద్దులెండి.. ఎటుతిరిగీ పిచ్చి నాకే పట్టేట్టుంది... ఎవరికి వారే రాసుకుందాం పోనిద్దురూ..' అని పిచ్చయ్య శాస్త్రితో చెప్పేశారట.



రాయలసీమ పలుకే రత్నం

వేంపల్లి గంగాధర్

రాయలసీమ వాసుల భాష, మాటతీరు, స్వభావ వ్యవహారాలు ఇతర ప్రాంతాల కన్నా భిన్నంగా ఉండడానికి చారిత్రక, భౌగోళిక, సాంస్కృతిక కారణాలున్నాయి. 'రాయలసీమలో చిత్రమైన ద్విమాండలికత (Diglossia) కూడా కన్పిస్తుంది. సీమలోని అన్ని జిల్లాలలోనూ ఒకే మాండలిక భాషలేని మాట నిజమే. కానీ విభిన్న ప్రాంతాల్లో వినిపించే విభిన్న వర్ణాల మాండలికంలో ఏకత్వం కూడా వినిపిస్తుంది' అంటారు ప్రముఖ సాహితీ విమర్శకులు వల్లంపాటి వెంకట సుబ్బయ్య.

'జీవితం బండబారి మొరటుదేలినప్పుడు వాళ్ళు ఉపయోగించే భాషలో, యాసలో జీవన శైలిలో, వ్యావహారిక శైలిలో ఆ మొరటుదనం అనివార్యంగా ప్రతిఫలిస్తుంది. భాషలో, యాసలో, వ్యక్తీకరణలో సౌకుమార్యం, సారళ్యం లేకపోవడానికి ఇక్కడి బండబారిన జీవితమే కారణం' అంటారు ప్రముఖ విశ్లేషకులు సింగమనేని నారాయణ.

రాయలసీమది మిశ్రమ సంస్కృతి. అనంతపురం జిల్లాలో మడకశిర, హిందూపురం ప్రాంతాల్లో కన్నడ భాషా ప్రభావం కన్పిస్తుంది. చిత్తూరు జిల్లాలో సత్యవేడు, తిరుపతి ప్రాంతాల్లో తమిళ ప్రభావం ఎక్కువ. కర్నూలు జిల్లాకు ఒక చివర తెలంగాణాలోని మహబూబ్‌నగర్ ప్రాంతం సరిహద్దుగా ఉన్న చోట భాషలో తేడా కన్పిస్తుంది. కడప జిల్లాకు మరో చివర ప్రకాశం జిల్లా కలుస్తుంది. అక్కడ కొంత భాషను ప్రభావితం చేస్తూ ఉంది.

ప్రాంతీయ, సామాజిక, చారిత్రక, జీవ శాస్త్రానుసారాలు, భాషావ్యవహారాలలోని భిన్న భిన్న వృత్తులు, ప్రాంతీయ భేదాలు, స్త్రీ, పురుష భేదాలు, సంఘంలోని స్థాయి, చదువు, సంస్కారం.... తదితరాల వల్ల ఈ ప్రాంతీయ భేదాలు ఏర్పడి మాండలికాలు తయారవుతున్నాయి.

తెలుగు భాషకు ఉన్న నాలుగు ప్రాంతీయ మాండలిక రూపాలు:

1) ఉత్తర మాండలికం/ తెలంగాణ
2) దక్షిణ మాండలికం/ రాయలసీమ
3) మధ్య మాండలికం/ కోస్తా
4) పూర్వ మాండలికం/ కళింగ

మ్మ, ఆ, ప, వే, దొం, ల, ట, డి, ర, కా, బీ, క, గ, గు, ట్ట, బెం, మా, పొ, ము, క్కు, మ, లు, సొ, డి, డ

ఇక్కడ పాతిక అక్షరాలున్నాయి. వీటిని ఉపయోగించి కొన్ని దుంపలు, కూరగాయల పేర్లు రాయగలరా? ప్రయత్నించి చూడండి.

బ్రహ్మచెముడు!

ఒక నాటకంలో బ్రహ్మ వేషధారికి చెవులను కప్పుతూ మిగిలిన తలలను అమర్చారు. లోపలిపక్క దూదిలాంటిది పెట్టడంతో అతని చెవులు మూసుకుపోయాయి. అతనికి పక్కవారి సంభాషణలు సరిగ్గా వినిపించక తన సంభాషణలు తప్పుగా చెబుతున్నాడు. అక్కడే ఉన్న భమిడిపాటి వెంటనే 'బ్రహ్మచెముడు అంటే ఇదే కాబోలు' అని చమత్కరించారు.

కడప మాండలికం



కడప ప్రాంతం భాషలోని ప్రత్యేకతల విషయానికి వస్తే క్రియా రూపాల్లో ఏకారధ్వని వినిపిస్తుంది. నకారం కొన్ని వర్గ మాండలికాల్లో ఇకారంగా మారుతుంది. అర్ధ దీర్ఘస్వరం వినిపిస్తుంది. ఊనిక ద్వితీయాక్షరం మీద కొన్ని ప్రాంతాల్లో పలుకుతుంది. దంత్య (దంతమూలీయ) చ, జ లు వాడుకలో లేవు. విసర్గ స్థానంలో కంఠమూల స్పర్శధ్వని వినిపిస్తుంది. త, ద లు- చ, జ లుగా తాలవ్యీకరణం పొందినట్లు కన్పించదు. 'ఇవ్వ'కు బదులు 'ఈ' వంటి ప్రాచీన రూపాలు ఈ మాండలికంలో కన్పిస్తాయి. ఆధునిక వచన వాఙ్మయ ప్రభావం గాని, ఆధునిక ప్రసార సాధనాల ప్రభావం గాని ఈ మాండలికంపై అంతగా కన్పించదు. 'కడప మాండలికం కోస్తా మాండలికం కంటే తెలంగాణా మాండలికానికే దగ్గర వుంద'ని బూదరాజు రాధాకృష్ణ అభిప్రాయపడ్డారు. **ఉదా:** "ఏమే! నీ మొగుడు నా ఇంటి మీది కొచ్చి నన్నూ, నా కొడుకునూ తిట్టిపోతాడా! వాన్ని కాల్చి బూడ్డి సేయిచ్చకుండా ఊరకుంటానా".

అనంతపురం మాండలికం

ఈ జిల్లా వారి మాండలికం మీద కన్నడ భాషా ప్రభావం ఉచ్చారణలో, పదజాలంలో, పదబంధాల్లో, వాక్య రచనలో కూడా కన్పిస్తుంది. ఇతర ప్రాంతాల్లో తెలుగు వాడుకలో లేని చోట్ల కూడా 'ళ' 'ణ'ల వాడుక ఎక్కువ. దంతమూలీయ చ, జ ల వాడుక తక్కువ. అనేక పదాలు కన్నడ ప్రభావం వలన వాడుకలోకి వచ్చాయి.

భూతార్థక ప్రత్యయాలుగా 'ఇనా' రూపాలతో పాటూ 'త' రూపాలు కూడా వినిపిస్తాయి. ఉదాహరణకు 'వచ్చినా(ను)' అనే రూపంతో 'వస్తి(ని)' అనేది వాడుకలో వుంది. 'వీటికి' అనే శబ్దానికి బదులు 'ఇవిటికి' వంటి రూపాలు, అనౌప విభక్తిక ప్రయోగాలు చేయడం ఈ వ్యవహారంలో కన్పిస్తాయి. 'కంతు' అనే పదానికి 'వాయిదా' అనే అర్థంలో వాడటం సీమలో పలుచోట్ల మనం స్పష్టంగా గమనించవచ్చు. 'రుద్దు' అనే పదాన్ని 'తిక్కు'గా వ్యవహరించడం కూడా కన్పిస్తుంది.

చిత్తూరు మాండలికం

ఈ జిల్లాలోని సత్యవేడు, పలమనేరు, చంద్రగిరి తాలూకాలు పూర్వం మద్రాసు రాష్ట్రంలో అంతర్భాగాలు కావడం వలన తమిళ భాషా ప్రభావం ఎక్కువగా ఇక్కడ కన్పిస్తుంది. అలాగే మదనపల్లి, వాయల్పాడు తాలూకాల్లో కడప జిల్లా మాండలిక ఛాయలున్నాయి. ఇక్కడ 'శ' 'స' వర్ణాలను 'స' వర్ణంగా ఉచ్చరిస్తారు. మహా ప్రాణత్వం విద్యావంతుల భాషలో విన్పిస్తుంది. ఒక్కోసారి సగం తెలుగు, సగం తమిళం అయిన ప్రయోగాలు ఇక్కడ విన్పిస్తుంటాయి. ఉదాహరణకు 'ఇదే బతుకుదా' 'పూడ్సినాడు' (పూడ్చు-ఇనా-డు). ప్రాచీన భాషా ప్రయోగాలు ఎన్నో చిత్తూరు జిల్లా వ్యవహారంలో జీవిస్తున్నాయి.

కర్నూలు మాండలికం

కర్నూలు జిల్లా భాషలో దక్షిణ మండలం లక్షణాలతో పాటు ఉత్తర మండల లక్షణాలు కూడా పదజాలంలో కన్పిస్తాయి. ఆలూరు, ఆదోని తాలూకాలు ఒకప్పుడు బళ్ళారి జిల్లాలో వుండటం వల్ల కన్నడ భాషా ప్రభావం ఉంది. నంద్యాల, ఆళ్ళగడ్డ, కోయిలకుంట్ల తాలూకాల్లో కన్నడ ప్రభావం; కర్నూలు, ఆత్మకూరు తాలూకాల్లో మహబూబ్‌నగర్ జిల్లా మాండలిక లక్షణాల ముద్ర ఉంది. ఇందువల్ల కర్నూలు జిల్లా మాండలికంపై విభిన్న ప్రాంతాల ప్రభావం ఉందని భావించవచ్చు.

అభ్యంతరార్థకంలో- 'లోన' ప్రత్యయం వాడుక సాధారణంగా వినిపిస్తుంది (ఉదా: కాలేజిలోన). తమర్థ రూపానికి 'నీకి' చేరడం కన్పిస్తుంది (తాగనీకి). 'లెక్క'ను తులనార్థకంలో ప్రయోగిస్తారు (వాని లెక్క). తోలుకొనివచ్చు రూపం పశుపక్ష్యాదులకు పరిమితమై ఉండగా వాడుకలో మనుష్యపరంగా వాడటం గమనించవచ్చు. (ఉదా: పెండ్లాన్ని తోల్కపోడు). వ్యతిరేక రూపానికి 'గా' ప్రత్యయంగా చేర్చడం జరుగుతుంది (ఉదా: ఇంటికొస్తాండగా). కర్నూలు మాండలికంలో ప్రాచీన భాషా ప్రయోగాలు వ్యవహారంలో ఎక్కువ.

చివరగా...

సీమలో విభిన్న ప్రాంతాలలో విన్పించే విభిన్న వర్ణాల మాండలికంలో ఏకత్వం కూడా కన్పిస్తుంది. భాషలో కొంత మొరటుతనం వుండటంతో ఉచ్చారణలోనూ, యాసలోనూ ఈ శైలి ప్రతిబింబిస్తుంది. ఇలాంటి శైలితోనే ఇటీవల కథలు సీమ నుంచి విస్తృతంగా వస్తున్న పరిణామాన్ని కూడా గుర్తుంచుకోవాలి. రాయలేలిన సీమలో రత్నాల భాషగా సీమ మాండలికాన్ని చెప్పుకోవచ్చు. పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమయ్య, కాలజ్ఞానాన్ని ప్రబోధించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములు, పద్యాల ద్వారా చైతన్యాన్ని కాంక్షించిన వేమన, ప్రబంధాల ద్వారా పేరుగాంచిన అల్లసాని పెద్దన వంటి ఉద్దండులు రాయలసీమ భాషకు పట్టం కట్టారు.

ప్రముఖ రచయిత,
కేంద్ర సాహిత్య అకాడమీ
యువ పురస్కార గ్రహీత,
అనంతపురం. 94400 74893

ఒరెంకారేవడ్సా? కాదిస్కేస్కే!

ఇదేంటో మీకు అర్థం అయిందా? పోనీ ఇదే భాషో చెప్పగలరా? తెలుగే! ఔను... ఆశ్చర్యపోకండి. వాక్యంలో పదాల మధ్య ఎక్కడ ఖాళీ వదలాలో తెలియని వ్యక్తి రాసిందిది. విషయం ఏంటంటే... పడవల మీద ప్రయాణం చేసే వారిద్దరి మధ్య సంభాషణ ఇది. ఇద్దరూ ఒకరికొకరు ఎదురయ్యారు. అందులో ఒకడు 'ఓరి వెంకా, రేవు అడుసా? ' అని అడిగాడు. అంటే రేవు బురదగా ఉందా? అని. దానికి రెండో వాడు 'కాదు ఇసుక ఇసుకగానే ఉంది' అని జవాబిచ్చాడు. వాళ్ళు ఎలా ఉచ్చరించారో అదే పద్ధతిలో ఈ పెద్దమనిషి రాసేశాడు. అసలు దాన్ని ఎలా రాయాలంటే... ఓ రెంకా... రేవడుసా? కాదు ఇసుకిసుకే! అర్థమైంది కదా పదాలకు మధ్య దూరం పాటించకపోతే మన తెలుగే మనకు విదేశీ భాషలా అన్పిస్తుంది మరి!

బోనాలు... మన సంస్కృతికి ప్రాణాలు

దుర్గం రవీందర్

బోనం అంటే భోజనమే. గత ఏడాది తమ ఊరిని పంట పొలాలను, పిల్లా పాపలను రక్షించినందుకు, రానున్న ఏడాది కాలంలో రక్షించేందుకు గ్రామస్థులందరూ సామూహికంగా గ్రామ దేవతలకు భోజనాలు సమర్పించడమే బోనాల పండగ. హైదరాబాద్, సికింద్రాబాద్‌ల్లో జరిపే బోనాల పండగకు గ్రామ ప్రాంతాల్లో జరిపే బోనాల పండగకు కొంత తేడా ఉంటుంది. ప్రాంతాలను బట్టి కూడా బోనాల పండగ నిర్వహించే పద్ధతుల్లో చిన్నచిన్న తేడాలుంటాయి.

గ్రామ దేవతల ప్రీతి కోసమే బోనాలు

ఈ తంతును 'ఊరడి' అని అంటారు. కొన్ని ప్రాంతాల్లో దీన్ని పెద్ద పండగ అంటారు. ఇంకొందరు ఊరపండగ అంటారు. ఈ ఊరడే నగర ప్రాంతాల్లో బోనాలుగా మార్పు చెందింది. ఊరి మధ్యలో బొడ్రాయి ఉంటుంది. సాధారణంగా బొడ్రాయిని ఒక గద్దెపై నిలుపుతారు. దీన్నే కొన్ని ప్రాంతాల్లో ఊరడవ్వ అని అంటారు. గుండ్రని రాయిని గద్దెపై పూన్చి దానికి పసుపు పూసి, పసుపు, పిండి, కుంకుమ బొట్లు పెడతారు. ఈ గద్దెన వేపచెట్టు తప్పనిసరిగా ఉంటుంది. బొడ్రాయి ఉన్న ప్రాంతం ఊరికి నాభిస్థానంలో ఉంటుంది. ఊరి చివర్లో సాధారణంగా పంట పొలాలకు వెళ్లేదారిలో పోచవ్వ ఉంటుంది. ఊరి చెరువు గట్టున కట్టమైసమ్మ ఉంటుంది. ఊరి పశువులను రక్షిస్తూ పచ్చిక బీళ్లలో కాని, పెంట కుప్పల దగ్గర్లో గాని ఉప్పలమ్మ ఉంటుంది. బోనాల ఊరేగింపు బొడ్రాయి దగ్గర ప్రారంభమై, పోచవ్వ దగ్గరికి వచ్చి అక్కడ నుంచి కట్టమైసమ్మ దగ్గరికి సాగిపోతుంది. ఇలా ఆ ఊరేగింపు డప్పులు, పీకలతో, పూనకాలతో అన్ని గ్రామ దేవతల దగ్గరికి వెళ్ళి ప్రతి దేవత దగ్గర మేకలు, కోళ్ల బలి కార్యక్రమం ఉంటుంది. గ్రామ దేవతల పూజారులుగా సాధారణంగా బయట బైండ్ల వారు, గుడి లోపల ముదిరాజులు ఉంటారు.

దాదాపు 100-150 ఏళ్ళుగా పలు ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన వృత్తి కులాలవారు, వ్యవసాయాధార కులాలవారు వారివారి పద్ధతులను కలగాపులగం చేసి జరిపే పండగనే జంటనగరాల బోనాలు. ఇది బ్రాహ్మణేతరుల పండగ. మద్య మాంసాల పండగ. కొద్ది తేడాలు, పేరు మార్పులతో తెలుగునాట అంతటా ఈ గ్రామదేవతల పండగలను నిర్వహిస్తారు.

గ్రామ దేవతలు శక్తి ఆరాధనకు ముందరి ఆదిమ దేవతా రూపాలు. వాన ఎందుకు కురుస్తుందో, ఉరుములు, మెరుపులు ఎలా వస్తాయో, పంట ఎలా పండుతుందో, గర్భధారణ ఎలా జరుగుతుందో, అంటువ్యాధులు ఎలా వ్యాపిస్తాయో తెలియని రోజుల్లో ఆనాటి మానవులు తమకు తోచిన రీతిలో వీటికి కర్తృత్వాన్ని, మహత్మ్యాన్ని ఆపాదిస్తూ రూపొందించిన తొలి దేవతా రూపమే గ్రామ దేవత. కొంచెం ఆలోచన పెరిగాక దానికో స్పష్టమైన రూపాన్ని - భావాన్ని నిర్మించారు. ఆ భావజాలం బలపడుతూ దాని చుట్టూ అనేక క్రతువులు, నమ్మకాలు వచ్చి చేరాయి. అలా గ్రామదేవతల వ్యవస్థ బలపడింది. గ్రామదేవతకు స్పష్టమైన ఆకారం, రూపం ఉండదు. గుండ్రంగా ఉండే బండకు పసుపు పూసి, వరిపిండి, కుంకుమ, పసుపుతో బొట్లు పెడతారు. వీలైతే నాలుగు వైపులా నాలుగు సల్పాలు (గ్రానైట్ రాతి పలకలు) నిలిపి పైన ఇంకో సల్పను పెడతారు. సాధారణంగా ప్రతి

గ్రామదేవత ప్రాంగణంలో వేపచెట్టు తప్పక ఉంటుంది.

జంటనగరాల్లో...

హైదరాబాద్ మొదట చిన్న పట్టణం. ఇది విస్తరించి నగరంగా పరిణామం చెందుతున్న క్రమంలో అనేక గ్రామాలు నగరంలో విలీనం అయ్యాయి. గోల్కొండ మొదలుకొని పంజాగుట్ట, అమీర్‌పేట్, బోరబండ, నల్లకుంట, అంబర్‌పేట, బతుకమ్మకుంట, విద్యానగర్, అడిక్‌మెట్, బాకారం, మారేడ్‌పల్లి, రామాంతాపూర్ ఇలా అనేకానేక గ్రామాలు ఈ నగరంలో విలీనమైనాయి. ఈ గ్రామాలన్నింటికి చెరువులున్నాయి. గ్రామ దేవతలున్నాయి. ఈ గ్రామదేవతలైన పోచమ్మ, ఎల్లమ్మ, కట్ట మైసమ్మలను కలిపి చేసే పండగనే బోనాల పండగ. ఇప్పుడు చెరువులు లేవు. గ్రామాలు లేవు కానీ బోనాలున్నాయి. మారుతున్న నగర జీవితంతోపాటే బోనాల పండగ నిర్వహణ రీతులు కూడా కొన్ని మార్పులు చెందాయి. హైదరాబాద్‌లో కలగాపులగం అయిన రీతుల్లో ఈ పండగను జరుపుతారు. ఉత్తరాది వాసనలూ కొన్ని అంటుకొన్నాయి. శిష్ట (వైదిక), శక్తి ఆరాధన పద్ధతులన్నీ ఇందులో కలగలసి ఉంటాయి.

బోనం అలంకరణ

కుమ్మరి ఇంటి నుంచి కొత్త కుండను, మట్టి ముంతను దానిపై పెట్టడానికి మట్టితో చేసిన మూతను తెస్తారు. కుండకు సున్నం పూసి పసుపు, కుంకుమబొట్లు పెడతారు. కొందరు జాజుతో కుండపై జానపద చిత్రాలను డిజైన్లుగా చిత్రిస్తారు. కుండ మెడకు లేత వేపాకులు కడతారు. ఒక కొత్త తెల్లని వస్త్రంలో నవధాన్యాలు పోసి చిన్న ముల్లెగా కట్టి ఆ గుడ్డ నాలుగు అంచులను పైకి వత్తిగా పేనుతారు. మట్టి మూతలో నూనె పోసి ఆ వత్తిని అందులో పెడతారు. బోనం ఎత్తే ముందు వత్తిని వెలిగిస్తారు. నిజానికి ఆ కుండలో అమ్మవారి కోసం చేసిన ప్రత్యేక భోజనం ఉండాలి. క్రింది కుండలో నీరు, పై ముంతలో నైవేద్యం ఉంటుంది. ఆ నీటితో అమ్మవారికి అభిషేకం చేసి, నైవేద్యాన్ని అర్పించి కల్లుతో సాకపెడతారు. కాని పద్ధతి మారింది. నైవేద్యంగా తీపి వంటకాలనే పెడుతున్నారు. కల్లు, సారా సాకలు కూడా తగ్గాయి.

కోస్తాంధ్రాలో సంక్రాంతికి కూతుర్ని, అల్లుడిని పుట్టింటి వారు పిలుచుకున్నట్లే నగరంలో బోనాలకు కూతురు, అల్లుళ్ళను పిలుచుకుంటారు. ప్రతి ఇంటికి వేపాకు, మామిడాకు తోరణాలు కడతారు. ముంగిట్లో పసుపు నీళ్ళు చల్లుతారు. సాన్పుచల్లి ముగ్గులు వేస్తారు. ఎవరి తాహతును బట్టి వారు కోడినో, పొట్టేలునో అమ్మవారికి 'హారం' (బలి) ఇస్తారు. హారంగా ఇచ్చిన జీవి మాంసంతో కూర, బగార అన్నంతో నైవేద్యం వండి, అమ్మవారికి బోనంగా సమర్పిస్తారు. దీనికి తోడుగా కల్లుతోగాని సార, బ్రాందితోగాని సాక పెడతారు.

గుర్రమైతే గుర్రం ఏనుగైతే ఏనుగు...

కొత్తగా తల్లిదండ్రులైన దంపతులు అమ్మవారికి తొట్టెలను సమర్పిస్తారు. 'నా ఇంట్లో తొట్టి ఊగితే నీకు తొట్లెను సమర్పిస్తా', జ్వరం వచ్చిన నా కొడుకుకు అనారోగ్యం పోయి గుర్రంలాగ అయితే నీకు గుర్రం సమర్పిస్తా', 'ఏనుగులా అయితే ఏనుగును సమర్పిస్తా', 'నా సంకెళ్ళు సంకటాలు తొలగితే నీకు సంకెళ్ళు సమర్పిస్తా' ఇలా ఉంటాయి గ్రామదేవతకు మొక్కులు. తొట్లె అంటే వడ్రంగి చేసే చిన్న తొట్లె. గుర్రం, ఏనుగు అంటే కుమ్మరి చేసిన గుర్రం, ఏనుగు బొమ్మలు. సంకెళ్ళు అంటే వడ్రంగి చేసిన కర్ర సంకెళ్ళు. ఇలా అమ్మవారికి మొక్కులు సమర్పించడం ఒక పద్ధతిగా ఉంది. ఏ మొక్కు లేకపోయినా ఏడాదికి ఒకసారి అవ్వకు ఏదో ఒక జీవి రక్తంతో శాంతి చేయాల్సిందే. ఈ పద్ధతులే కాలానుగుణంగా మారి నగరంలో బోనాల పండగ నాటి బోనాలు, పలహారం బండి, తొట్టెలు, పోతురాజు నృత్యాలుగా రూపాంతరం చెందాయి.

ఘల్లుఘల్లుమనే పెద్ద మువ్వలు కట్టిన ఎర్రరంగు చెడ్డి, కాళ్లకు చిరుగజ్జెలు, నోటి

లోపల దవడలకు రెండు నిమ్మపండ్లు చేతిలో పెద్ద కొరడా, కంటి కింద నల్లటి కాటుక, జుల పాల జుట్లు, ఒళ్లంత బండారు పూసుకొని పోతురాజులు ప్రత్యేకంగా నృత్యాలు చేయడం హైదరాబాద్ బోనాల్లో ప్రత్యేకంగా ఉంటుంది. ఒకప్పటి బైండ్ల పూజారి ప్రతిరూపమే ఈ పోతురాజు. నిజానికి గ్రామ దేవతల సోద రుడు ఈ పోతురాజు. పోతురాజు నృత్యం దరువు ప్రత్యేకంగా ఆకర్షణీయంగా ఉంటాయి.

పెళ్లీడు పిల్లలు స్నానాలు చేసి, పట్టు లంగా ఓణీలు కట్టి, నూతన వస్త్రాలు ధరించి, నగలు అలంకరించుకొని కొత్తకోడళ్ళు బోనం ఎత్తుకొని నడవగా వీరికి ముందు డప్పులు, బ్యాండు మేళం ఉంటుంది. వీరితోపాటే పూన కంతో ఊగిపోతూ పోతురాజులుంటారు. పోతురాజులతోపాటు నెత్తిమీద బోనం పెట్టు

మద్యం కూడా తప్పక ఉంటుంది. ఊరిని, పిల్లాపాపలను వర్షాకాలారంభంలో వచ్చే అంటువ్యాధుల (గత్తర, కక్కుడు బైలు - కలరా) నుంచి కాపాడుతూ పాడిపంటలు బాగుండాలని బర్కత్ కలగాలని గ్రామదేవ తల ప్రీత్యర్థం గ్రామస్థులందరూ కలిసి చేసే పండగ ఇది.

జంటనగరాల్లో మొదటి బోనాల పండగ ఆషాడమాస ఆరంభంలో గోల్కొండలో జరు గుతుంది. తర్వాత పాత నగరం లాల్‌దర్వా జలో జరుగుతుంది. ఆ తర్వాత ఎవరి వీలుని బట్టి ఆ మాసంలో వారు ఒక్కోవారం ఒక ప్రాంతంలో బోనాల పండగను జరుపుకుం టారు. సంస్కృతీకరణ ప్రభావం క్రమంలో పోచమ్మ స్థానంలో పార్వతి, మైసమ్మ స్థానంలో మహేశ్వరి ఇతర గ్రామదేవత స్థానాల్లో కాళిమాత వచ్చి చేరుతున్నాయి.

గంప పెట్టుకొని ఊరిలో, ఊరిపొలాల్లో ఫల హారంను చల్లుతూ తిరుగుతారు. ఊరి పొలి మేరల్లో ఉండే పోలేరమ్మకు, ఊరి ఎల్లలో ఉండే ఎల్లమ్మకు, ఊరి మధ్యలో ఉండే ఊర దవ్వకు, ఊరిలో పొలం గట్టున ఉండే భూదే వికి, పశువులను రక్షించే ఉప్పలమ్మకు, ఈదు లకు కల్లును ఇప్పించే ఈదులమ్మకు, దేహాల మీద పొక్కులు పోస్తూ ఉగ్రరూపాన్ని ప్రద ర్శించే పోచమ్మకు ఇలా అన్ని రకాల గ్రామదే వతలకు ఊర పండగలో సంతృప్తిపరుస్తారు.

కుంభం

కొత్త ఈత చాపలను నాలుగింటిని గ్రామదే వత గద్దె ముందు పరిచి ఒకటిరెండు సంచుల బియ్యంతో అన్నం వండి పెద్ద కుప్ప పోస్తారు. దానిపై పసుపు, జంతురక్తంతో 'ఎక్స్' ఆకారం పట్టీలు పెడతారు. అన్నం కుప్పమీద బలి ఇచ్చిన దున్నపోతు తలను

కొని రెండు చేతుల్లో వేపమండలు పట్టుకొని కొందరు నడివయసు మహిళలు కూడా వెంట్రుకలు విరబోసుకొని లయబద్ధంగా పూనకంలో ఊగిపోతూ ఊరేగింపు వెంట సాగిపోతారు. పోతురాజులతోపాటు పాదం కలుపుతూ యువకులందరూ తీన్‌మార్ దరు వుకు అనువుగా నృత్యం చేస్తారు. మొత్తం మీద బోనాల ఊరేగింపు ఉత్సాహవంతమైన ఉత్సవంగా సాగిపోతుంది. ఏ బస్తీవారు ఆ బస్తీలో పూర్వం నుంచి ఉన్న ఎల్లమ్మ, పోచ మ్మల గుడి దాకా వెళ్ళి బోనం సమర్పించి అంతే ఉత్సాహంగా వెనక్కి తిరిగి వస్తారు. బోనాల పండగకు మాంసాహారంతోపాటు

మాంసాహార పండగ కాస్తా శాఖాహార పండ గగా మారుతున్నది.

జంటనగరాల్లో జరిపే బోనాల పండగనే గ్రామాల్లో 'ఊరపండగ' లేదా పెద్ద పండగ పేరుతో నిర్వహిస్తారు. ఊరపండగ అంటే ఊరి దేవతలకు ఊరందరు కలిసి చేసే పండగ. ఈ పండగలో ఇంటికో బోనం ఎత్తు తారు. ఊరి బైండ్లోళ్ళు గ్రామదేవతల ప్రీత్యర్థం బతికిన మేకలను, కోళ్లను నోటితో కొరికి గావు పట్టి గ్రామ దేవతలకు రక్తతర్ప ణతో బలిని ఇస్తారు. గావు పట్టిన మేక దొబ్బ, కార్జం, గుత్తిని మెడలో వేసుకొని పూన కంతో ఊగిపోతారు. నెత్తి మీద ఫలహారం

పెడతారు. దాని కొమ్ముల మధ్యన గండదీపాన్ని, నోట్లో దున్నపోతు ఎడమ కాలును నరికి పెడతారు.

బలి ఇచ్చిన దున్న తల, నరికిన కాలు, రక్తం చారికలు, గొర్రెలు, మేకలను బలి ఇవ్వగా ఏర్పడిన రక్తం మడుగులు, బండారు దూలి సారా వాసన, మైసాక్షి పొగలు, పూనకాలు, తాగి మత్తులో గట్టిగా అరుపులు,

డప్పుల చప్పుళ్ళు, పసుపు మరకలతో వాతావరణం బీభత్సంగా ఉంటుంది. అందుకే పిల్లల్ని, స్త్రీలను కుంభం పెట్టిన వైపు రానివ్వరు. ఈ తంతు అంతా అర్ధరాత్రి మొదలై తెల్లవారుజామున ముగుస్తుంది. భారతదేశం అంతటా పూర్వం ఏ యుద్ధం ఎప్పుడు ముంచుకు వస్తుందో తెలియని అనిశ్చిత పరిస్థితి ఉండేది. శత్రురాజుల దాడులు, యుద్ధాలను, యుద్ధానంతర పరిణామాలను తట్టుకునేందుకు వీలుగా ఇలాంటి ఆచారాలు పాటించేవారని జానపద రంగంలో పరిశోధన చేసేవారు చెబుతారు. కుంభంలోని అన్నాన్ని గ్రామస్థులందరూ అమ్మవారి ప్రసాదంగా ఇళ్లకు తీసుకెళ్తారు. ఈ ప్రసాదాన్ని ఆనాటి విందు భోజనాల్లో కలిపేయడంతోపాటు ధాన్యం గాదెల్లో పంట పొలాల్లో చల్లుతారు. ఇలా చేయడం ద్వారా 'బర్కత్' కలుగుతుందని జానపదుల నమ్మకం. గ్రామదేవతలతోపాటు పెద్దల (పితృదేవతల)ను సంతృప్తి పరచడానికి ఏటా ఈ ఊరపండగ చేయాల్సిందేనన్నది వారి నమ్మకం.

సికింద్రాబాద్ మార్కెట్‌లో ఉన్న మహంకాళి ఆలయంలో పూర్వం అమ్మవారి దారు శిల్పం ఉండేది. సుమారు 1815కి క్రితం ఉజ్జయిని నుంచి ఒక సైనికోద్యోగి తెచ్చిన కాళికాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిర్మించిన గుడి ఇది. నర్సయ్య అనే సైనికుడు 1813లో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి బదిలీపై వెళతాడు. అప్పుడు అక్కడ కలరా వ్యాపించి ఉంటుంది. ఆ కలరా బారిన పడకుండా తనను సికింద్రాబాద్‌కు క్షేమంగా చేరిస్తే అక్కడ అమ్మవారి గుడి కడతానని ఉజ్జయినిలోని కాళికాలయంలో మొక్కుకుంటాడు. ఆ మొక్కు ఫలితమే నేటి గుడి. కాలక్రమంలో బాగా అభివృద్ధి చెందిన మహంకాళి గుడిలో ఇప్పుడు బోనాల ఉత్సవాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఈ బోనాలను రాష్ట్ర ఉత్సవాలుగా ప్రకటించడానికి ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. మహంకాళి బోనాలకు కనీసం నాలుగైదు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. జిల్లా పాలనా యంత్రాంగం భక్తుల కోసం పలు సదుపాయాలను సమకూరుస్తుంది.

సికింద్రాబాద్ బోనాలను ఇక్కడ స్థిరపడిన అన్ని కులాలవారు, అన్ని ప్రాంతాలవారు జరుపుకుంటారు. ఇప్పుడు జరుగుతున్న ఉత్సవాలు గ్రామదేవతల ఆరాధన పద్ధతులతోపాటు ఉత్తరాది శాక్తేయ ఆచారాలు, శిష్ట దేవత ఆరాధన రీతులతో కలగలసి ఉంటుంది. ఆలయంలో మేకలు, కోళ్ళు బలి కార్యక్రమం ఉండదు. ఎవరికి వారు అమ్మ పేర ఇళ్లల్లో, వీధి మొదట్లో మేకలు, గొర్రెలను కోసి మొక్కులు చెల్లించుకుంటారు.

రంగం

అమ్మవారి పూజారిణిగా ఉండే ముదిరాజ్ కులస్తురాలు బోనాల రోజు నిష్ఠగా ఉపవాసం ఉండి రంగమెక్కి భవిష్యవాణి పలుకుతుంది.

ఆయా రంగాలకు చెందిన అవ్వతల్లులు

పోశవ్వ	పోషణ చేసే అవ్వ; పొక్కుల రూపంలో పోసే అవ్వ
ఎల్లవ్వ	ఎల్లలను రక్షించే అవ్వ; ఎల్లరిని రక్షించే అవ్వ; ఎల్లెడలా ఉండే అవ్వ
పోలేరమ్మ	పొలిమేరలో ఉండే అమ్మ
ఊరడవ్వ	ఊరిని రక్షించే అవ్వ
ఈదులమ్మ	ఈత చెట్ల రక్షకురాలు
ఒడ్డెవ్వ	ఒడ్ల మీద నిలిపిన అవ్వ; ఒడ్లను ఇచ్చే అవ్వ
భూమవ్వ	పంటలను ఇచ్చే భూతల్లి
బాలవ్వ	మనుషులకు బలాన్ని ఇచ్చే అవ్వ
మైసమ్మ	కోటలను, చెరువు కట్టలను రక్షించే అవ్వ

మైసమ్మకు ప్రత్యేక ఆకారం, విగ్రహం ఏమీ ఉండవు. చెరువు కట్టన నిలిపితే కట్టమైసమ్మ, కోటగోడకు పూనిస్తే కోటమైసమ్మ; గండిలో ప్రతిష్ఠిస్తే గండిమైసమ్మ; ఇంట్లో బయట గూడులో నిలిపితే ఇంటిమైసమ్మ అవుతుంది. ఇంట్లో ఏ పండగకైనా సరే తొలి నైవేద్యం మైసమ్మ గూడులోనే పెడతారు. గోడకు పసుపు పూసి ముందర ఒక గుండ్రాయి నిలిపి దానికి కొంత బండారు పూసి బొట్టు పెడితే మైసమ్మ అవుతుంది. ■

అనుభవజ్ఞులైన పాత్రికేయులు,
హైదరాబాద్. 93464 54912

ఉమ్మనీరులో... అమ్మ భాష

దరెగోని శ్రీనివాస్

తల్లి నుంచి బిడ్డ మాతృభాషను ఎలా నేర్చుకుంటాడు? ఈ అంశంపై ఎన్నో పరిశోధనలు జరిగాయి. జరుగుతూనే ఉన్నాయి. బిడ్డ తల్లి కడుపులో ఉండగానే మాతృభాషను స్వీకరిస్తాడనీ, అమ్మ మాట్లాడే భాషలోని చిన్నచిన్న పదాలని గ్రహించి, అర్థం చేసుకోవడానికి ప్రయత్నించి తన భాషగా తీర్చిదిద్దుకుంటాడనేది శాస్త్రవేత్తల స్పష్టీకరణ. అమ్మ కడుపులోనే భాషను నేర్చుకునే ఈ ప్రక్రియను మనో విశ్లేషణ శాస్త్ర పరిభాషలో 'ప్రీ అడాప్టేషన్ ఫర్ లెర్నింగ్ లాంగ్వేజ్'గా వ్యవహరిస్తారు. అయితే.. బయటి నుంచి మన శబ్దాలు ఉమ్మనీటిలో పెరుగుతున్న శిశువులకు యథాతథంగా వినిపిస్తాయా? వినిపించకపోతే అమ్మ కడుపులో ఉన్నప్పుడే భాషను ఎలా గ్రహిస్తారు? ఈ సందేహానికి 'మాక్స్ ప్లాంక్ ఇనిస్టిట్యూట్ ఫర్ హ్యూమన్ కాగ్నిటివ్, బ్రెయిన్ సైన్సెస్'కు చెందిన పరిశోధకులు తెరదించారు. నీటిలో ఉండే చేపలు వాటి శరీరాంగాల నుంచి, ఎముకల నుంచీ మెదడుకు చేరే ధ్వని తరంగాలను గ్రహించినట్లుగానే, బిడ్డ ఉమ్మనీటిలో నుంచి తల్లి భాషకు సంబంధించిన శబ్దాలు స్వీకరిస్తారని ఈ సంస్థకు చెందిన ప్రొఫెసర్ ఏంజెలా ఫ్రీడెరికి వెల్లడించారు. గర్భస్థ శిశువుల మెదడు వాళ్ళు గాఢ నిద్రావస్థలో ఉన్నప్పుడు ధ్వని తరంగాలను స్వీకరించగలుగుతుందని ప్రొఫెసర్ ఏంజెలా తన పరిశోధనలతో గుర్తించారు.

తల్లి గర్భంలోని పిండం చివరి మూడు నెలల నుంచే బయటి నుంచి వినిపించే శబ్దాలకు సంబంధించిన శ్రవణ ప్రేరణలను జ్ఞాపకం ఉంచుకునే ప్రయత్నం చేస్తుంది. ఈ కారణంగానే అప్పుడే పుట్టిన బిడ్డలు ఇతరుల గొంతుకలకన్నా తల్లి స్వరాన్నే ఇష్టపడతారు. 'తల్లి భాషలోని మనోభావాలు, ఆమె స్వరంలోని ధ్వనుల ద్వారా బిడ్డకు చేరతాయి. దీనితో వారిలో విభిన్న భాషల మధ్య తేడాలను గుర్తించే సామర్థ్యం అలవడుతుంది. అమ్మ కడుపులో ఉన్నప్పుడు మాతృభాష ప్రభావంవల్లే గ్రహణశక్తి ఏర్పడుతుంద'ని బిర్గిట్, ఏంజెలా, అనీ, క్యాథలీన్‌లు తమ పరిశోధన పత్రం 'న్యూబార్న్ క్రై మెలోడీ'లో పేర్కొన్నారు. గర్భంలోని శిశువుపై తల్లి ఉచ్ఛ్వాస, నిశ్వాసలు, మనోభావాల ప్రభావం ఉంటుందనీ, అలాగే బిడ్డ మనోభావాల తీవ్రత తల్లిపై ప్రసరిస్తుందని భారతీయ ప్రాచీన వైద్య పండితులు ఎప్పుడో చెప్పారు. ఇవన్నీ అభిమన్యుడి ఉదంతానికి బలాన్నిచ్చేవే.

ఏడుపు.. భాషే!

బిడ్డ పుట్టగానే మొదట చేసే పని ఏడ్వడమే. ఆ తొలి ఏడుపులో వినిపించే ధ్వని ఆ బిడ్డ భాషేననీ, అది కూడా ఆ బిడ్డ మాతృభాషలోనే ఉంటుందని తేల్చి చెప్పారు శాస్త్రవేత్తలు. బిడ్డ భూమ్మీద పడగానే ఏడ్వటానికి పలు కారణాలున్నా, ఆ ఏడుపు ధ్వని మాతృభాషదే అవటానికి కారణం మాత్రం ఆ బిడ్డ అమ్మ కడుపులో ఉన్నప్పుడు ఆమె మాటలు వినడమేనని స్పష్టం చేశారు. బిడ్డ తొలి ఏడుపు మాతృభాషలోనే ఉంటుందనేది నిర్ధరించేందుకు జర్మనీ ఉర్జ్‌బర్గ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ దిశగా నిశితమైన పరిశోధనలు చేపట్టారు. బిడ్డ ఏడుపంటే కేవలం అరుపులాంటి శబ్దాలే కావనీ, అది తల్లి కడుపులో ఉన్నప్పుడు నేర్చుకున్నప్పటి భాషలోని అభివ్యక్తీకరణేనని గుర్తించారు. గర్భంలో ఉండి తల్లి మాటలనే తన భాషగా స్వీకరించడం వల్ల మాతృమూర్తి ఏ భాషకు చెందితే ఆమె బిడ్డ కూడా ఆ భాషలోనే ఏడుస్తారని ఉర్జ్‌బర్గ్ పరిశోధకులు స్పష్టీకరించారు. ఏ బిడ్డయినా తన మనోభావాల్ని మాతృభాషలోనే వెల్లడించే ప్రయత్నాన్ని పుట్టిన క్షణం నుంచే మొదలుపెడతాడని పేర్కొన్నారు. తల్లి భాషలో ఉండే లయ వంటి నిర్దిష్ట లక్షణాల్ని, ధ్వని విధానాల్ని బిడ్డలు గర్భంలోనే పసిగట్టి, పుడుతూనే వాటిని అనుకరిస్తూ ఏడుపు తదితర ధ్వనుల ద్వారా తమ మనోభావాలు తెలియపరుస్తారని ఈ అధ్యయనంలో శాస్త్రవేత్తలు నిర్దిష్టంగా చెప్పారు.

మరయితే, తల్లి మాట్లాడే భాషే బిడ్డకూ మాతృభాషగా అలవడుతోందనీ, ఆ భాషలోనే పుట్టిన శిశువు ఏడుస్తోందనీ గుర్తించేదెలా? దీనికోసం క్యాథలీన్ వెర్మ్‌కే అనే మహిళా శాస్త్రవేత్త ఆధ్వర్యంలో ఉర్జ్‌బెర్గ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఆసక్తికరమైన అధ్యయనం చేపట్టారు. జర్మనీ, ఫ్రెంచి భాషలకు చెందిన తల్లులను, బిడ్డలను పరిశీలించారు. ఈ రెండు భాషల లయలలో తేడాలను

విశ్లేషించారు. సాధారణంగా పలికేటప్పుడు జర్మన్ పదాల శబ్దం ఉచ్ఛస్థాయి నుంచి కిందికి (అవరోహణ) దిగుతుందనీ, ఫ్రెంచి పదాలు పలికే సమయంలో శబ్దం కింది నుంచి ఉచ్ఛస్థాయికి (ఆరోహణ) చేరుతుందనేది గుర్తించారు. జర్మన్, ఫ్రెంచి జాతీయులకు చెందిన కొంతమంది పసిబిడ్డలను ఎంచుకున్నారు. పుట్టిన మొదటి ఐదు రోజుల్లో వారి ఏడుపుల్ని, వాటి ధ్వని తరంగాలను నమోదు చేశారు. వాటిని ప్రయోగశాలల్లో శాస్త్రీయంగా విశ్లేషించారు. జర్మన్ బిడ్డల ఏడుపు హెచ్చుస్థాయి నుంచి దిగువ స్థాయికి వస్తుండగా, ఫ్రెంచి బిడ్డల రోదనం కిందిస్థాయి నుంచి పైస్థాయికి వెళ్తున్నట్లు తేలింది.

ఇలా జర్మన్, ఫ్రెంచి భాషలకు చెందిన బిడ్డలు తమ మాతృభాషల ధ్వని రూపాల శైలిలోనే ఏడుపులనూ కొనసాగించినట్లు తేల్చారు. దీన్నిబట్టి పుట్టిన బిడ్డ తల్లి కడుపులో ఉండగా గ్రహించిన భాషనే మాతృభాషగా స్వీకరించి, తన మనోభావాల వ్యక్తీకరణలో భాగమైన ఏడుపులో దానిని ఉపయోగించినట్లు అర్థమవుతోంది. సాధారణ పరిశీలన విషయానికి వస్తే, తెలుగు పసిబిడ్డ 'అమ్..మ' అని తెలుగులో రోదిస్తే, 'ఎవ్..వ' అని కన్నడ బిడ్డ ఏడ్వటం చాలామంది గమనించే అంశమే.



పుట్టిన తర్వాత?

పుట్టిన తర్వాత శిశువు మాట్లాడటం, భాష నేర్చుకునే ప్రక్రియ సంగతేమిటి? వారిపై మాతృభాష ప్రభావం ఎంత? పుట్టిన తొలినాళ్ళలోనే బిడ్డ మాతృభాషను నేర్చుకునే విషయంలో కీలకంగా నిలిచేది తల్లి తదితరులు మాట్లాడే మాతృభాషే. వాషింగ్టన్ విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనంలో ఇదే తేలింది. ఈ అధ్యయనంలో కొంతమంది బిడ్డలతో నేరుగా మనుషులే సంభాషించగా, మరి కొంతమంది పిల్లలను టీవీ ఎదుట కూర్చోబెట్టి భాషను వినిపించారు. నేరుగా మనుషులు సంభాషించిన పిల్లల్లోనే భాషా గ్రాహ్యక శక్తి అధికంగా ఉన్నట్లు ప్యాట్రీసియా కె.కుల్ చేపట్టిన ఈ అధ్యయనంలో వెల్లడైంది. అంతేకాదు, తమకు అంతగా పరిచయం లేని ఇతర భాషలకన్నా, మాతృభాషలో సంభాషించినప్పుడు బిడ్డలు దానిని తేలికగా గ్రహిస్తున్నట్లు ఇందులో గుర్తించారు. తల్లులు తమ బిడ్డలతో చెప్పే కబుర్లను బిడ్డలు ఎంతమేర గ్రహిస్తారు, ఏ భాషలో మాట్లాడితే ఎంత బాగా ఆకళింపు చేసుకుంటారని వాషింగ్టన్ వర్సిటీ పరిశోధకులే మరొక అధ్యయనంలో పరిశీలించారు. గతంలో జరిగిన ఏదో ఒక సంఘటన గురించి తల్లులు రకరకాల పద్ధతుల్లో చెప్పిన సంభాషణలను, ఆ తర్వాత జరిగిన మార్పుల్ని ఇందులో పరిశీలించారు. పాత సంఘటనలను పూసగుచ్చినట్లుగా వివరిస్తూ తల్లి సాగించే సంభాషణ వల్ల బిడ్డలు భాషను సమర్థంగా గ్రహిస్తున్నట్లు గుర్తించారు.

తల్లి మాట్లాడే భాషా శైలి సరళంగా, సాఫీగా, గందరగోళానికి తావీయకుండా ఉంటే బిడ్డ ఆ భాషను సులభంగా గ్రహిస్తున్నట్లు 'సొసైటీ ఫర్ రీసెర్చి ఇన్ ఛైల్డ్ డెవలప్‌మెంట్' పరిశోధన పత్రం పేర్కొంది. వీటికి ఊతమిస్తూ, 'భాషను నేర్చుకునే ప్రక్రియలో శిశువు ముందుగా దానిని గుర్తిస్తాడు. ఎదుటి వ్యక్తి చెప్పాలనుకునే అభివ్యక్తీకరణను అర్థం చేసుకునేందుకు యత్నిస్తాడు. ఆ తర్వాత దాని అర్థానికి, అభివ్యక్తీకరణకు మధ్య సంబంధంపై అవగాహన పెంచుకునేందుకు కృషి చేస్తాడ'ని 'సైక్‌ఇన్ఫో డేటాబేస్ రికార్డు' చెబుతోంది. వీటన్నిటి వల్ల తేలిందేమిటంటే, తల్లి బిడ్డతో సాగించే అచ్చట్లు ముచ్చట్లు, లల్లాయి మాటలు మాతృభాష అలవడేందుకు దోహదపడుతున్నాయని అర్థమవుతోంది. మాతృభాష రావాలంటే ఇతరులతో సామాజిక పరస్పర చర్య, తగిన వాతావరణం ఉండటం ముఖ్యమనేది అందరూ ఒప్పుకునే వాస్తవం. పిల్లల చుట్టూ మాతృభాష వాతావరణం కల్పించడం, అలాంటి ఆరోగ్యకరమైన పరిస్థితుల మధ్యే వారి మనోబుద్ధులు వికసించేలా తోడ్పడటం మన కర్తవ్యం. ▪

మన ప్రహ్లాదుడు

అమ్మ కడుపులో ఉండగానే బిడ్డ భాషను నేర్చుకుంటాడని ప్రపంచ వ్యాప్తంగా కొందరు పరిశోధకులు అంటున్నారు. అమ్మ కడుపులో ఉండగా బిడ్డ తత్త్వబోధకూడా గ్రహిస్తాడంటోంది భాగవతం.

ఒక సందర్భంలో రాక్షసరాజు హిరణ్యకశిపుడు బ్రహ్మ గురించి తపస్సు చేసుకోవడానికి వెళ్ళాడు. దీన్ని కనిపెట్టి ఇంద్రుడు దేవతలతో రాక్షసులపై దండెత్తాడు. ఇంద్రుడు హిరణ్యకశిపుని భార్య లీలావతిని పట్టుకోబోయాడు. నారద మహర్షి జోక్యం చేసుకుని లీలావతి పుణ్యవతని, ఏమీ చేయవద్దని గట్టిగా వారించగా లీలావతిని వదిలేశాడు. అప్పుడు నారద మహర్షి లీలావతిని తన ఆశ్రమానికి తీసుకు వెళ్ళి 'తత్త్వబోధ' చేశారు. అది ఆమె కడుపులో ఉన్న శిశువు (ప్రహ్లాదుడు) విన్నాడు. ఆ తత్త్వబోధ ఫలితంగా ప్రహ్లాదుడు పుడుతూనే విష్ణు భక్తుడయ్యాడు.



డిప్యూటీ చీఫ్ సబ్‌ఎడిటర్,
ఈనాడు, హైదరాబాద్.
80085 91414

ఒక్క అక్షరం గొప్ప భావం

అయ్యగారి శ్రీనివాసరావు

ఏ విషయంలోనైనా ఎంత బరువు తగ్గితే అంత సుఖం ఉంటుంది. అదే సూత్రం భాషకూ వర్తిస్తుంది. భాష, సాహిత్యం పరిఢవిల్లాలంటే అక్షరం ప్రధానమైనది. కొన్ని అక్షరాల సమాహారం పదం. అందులో ఒక్క అక్షరం తగ్గినా అందం చెడిపోతుంది. అది ఒక పార్శ్వం. అలాగని అన్ని అక్షరాలనీ ఉపయోగించకుండా కొన్నిటిని విడిచిపెట్టినా అర్థం చెడిపోకపోవడం రెండవ పార్శ్వం.

'పండితులు ఒక అక్షరం తగ్గినా పుత్రోత్సాహం పొందినంత ఆనందం పొందుతారు' అనేది సంస్కృత లోకోక్తి. అందుకే కొన్ని పదాలకు బదులుగా ఒక్క అక్షరంతోనే పూర్తి అర్థాన్ని సంతరింపచేశారు భాషా కోవిదులు.

పట్టుకుని రా (తీసుకుని రా) అనే పదానికి బదులు 'తే' అనే ఒకే అక్షరాన్ని వాడి పూర్తి అర్థాన్ని సాధిస్తుంటాం. ఇలా పలకడం వలన అర్థంకాని పరిస్థితి ఉండదు. అందరికీ చక్కగా అర్థమవుతుంది. నాలుగు అక్షరాలు ఆదా అవుతాయి. అలాగే ఒక్క అక్షరంలో పెద్ద పదాలని, ఎన్నో అర్థాలని ఇముడ్చుకున్న అక్షరాలెన్నో. 'జ్యా' అంటే వింటినారి, నేల, తల్లి, కర్ణం (గణితంలో) అనే అర్థాలున్నాయి. 'గుద్దుకున్నాయి' అనే పదానికి 'ఢీ' అనే ఒకే అక్షరంతో పూర్తి భావాన్ని వ్యక్తం చేస్తూ ఎన్ని అక్షరాలని పొదుపు చేస్తున్నామో ఆలోచిస్తే అదీ ఒక విజయమే. ఆడది, ఇంతి, కొమ్మ, పొలతి, పడతి లాటి పదాలకి ఒకే అక్షరం 'స్త్రీ'. అలాగే రమ్ము, పొమ్ము, నాది, నీది లాటి పదాలకి రా, పో, నా, నీ అనే అక్షరాలతోటే పూర్తి అర్థాన్ని పొందుతున్నాం.

మా (మా యొక్క), మీ (మీ యొక్క), జ (పుట్టడం) అనే అక్షరాలతోనే సూక్ష్మంలో మోక్షం పొందుతున్నాం. ఆ (అది), ఈ (ఇది), ఏ (ఏది), తా (తాను) లాటి అక్షరాలూ ఆయా పదాలకి దగ్గర తోవ వుతున్నాయి. 'ధనము' ఎక్కువ ఉన్నా ఇబ్బంది అనే కాబోలు ఆ పదానికి 'రై' అనే ఒకే అక్షరంలో అర్థాన్ని ఇమిడ్చారు.

మనిషిలోని వివిధ భావాలను వ్యక్తీకరించడానికి కేవలం ఒక్క అక్షరాన్నే ఉపయోగించడం నిత్యానుభవమే అని మనకు తెలుసు. ఛీ (అసహ్యించుకోవడం), ఛ (బాధపడటం) హూం... (విసుగు, అసహ్యం), హే (కసురుకోవడం), హాం... (ఆశ్చర్యం), ఊం (ఒప్పుకోవడం) లాటివి.

ఒకే అక్షరానికి ఉన్న మరో బలం అనేక అర్థాలని పలికించగల సత్తా ఉండటం. దానికి 'ఓ' (ఒక్క) ఉదాహరణ 'ఓ' అనే అక్షరం. దీనికి (అలాగే అని) ఒప్పుకోడానికి, (ఓయీ అని) సంబోధించడానికి. (ఒకటి అనే) అంకెను సూచించడానికి ఇలా అనేక అర్థాలున్నాయి.

పదార్థానికి రుచి కలిగించడానికి కొద్ది మోతాదులో ఉప్పు వేసినట్లే పదానికి సంపూర్ణత్వాన్ని, బలాన్ని ఇవ్వడానికి ఒక్క అక్షరమే పనికొస్తుంది. మంచి అనే అర్థాన్ని ఇవ్వడానికి 'సు', చెడు అనే అర్థానికి దు(రా) అనే అక్షరాలు ఇలాంటివే. 'ఐ'నా వాటితో ఆగిపోలేదు ఏకాక్షర ప్రవాహం.

ధ్వన్యనుకరణకూ ఒకే అక్షరం వాడటం కలదు. 'కూ...' అంటే కూత పెట్టడం. 'గీ' అంటే అరవడం (అరిచి 'గీ'పెట్టినా) అనే అర్థంలోను, వ్యంగ్యార్థంలోనూ ('డబ్బు-గిబ్బు', (బాధ-'గీ'ద ఇలా) 'వాం'... ఏడ్వడం అనే అర్థంలోను, 'పీ' ఊదడం అనే అర్థంలోను పాడుతూంటాం... 'జో' అనే అక్షరం వినగానే బిడ్డలు నిద్ర పోతారు (అదే జోకొడితే)

ఏకాక్షర సంప్రదాయం తెలుగులోనే కాక ఇతర భాషల్లోనూ ఉంది. హిందీలో నై (లేదు), సౌ (వంద), హైం (ఉంది), యే (ఇది), ఓ (అది) లాటివి.

ఆంగ్లంలో టీ (తేనీరు), టై (మెడ పట్టీ), దే (వారు) మొదలైనవి.

సంస్కృతాన్ని పరిశీలిస్తే.. కో (ఎవరి), స్వ (తన), ధీ (బుద్ధి) అనే అక్షరాలు ఆయా అర్థాలకి ప్రత్యామ్నాయాలుగా చెలామణీ అవుతున్నాయి.

అలాగే 'చంద్రుడు' అనే పదాన్ని 'గ్లౌ' అనే అక్షరంతోను, తల్లిని, లక్ష్మీదేవిని సైతం 'మా' అనే అక్షరంతోను పిలుస్తాం. కనుబొమల మధ్య ప్రదేశానికి 'భ్రూ' అనే ఒక్క అక్షరం చాలు. 'చః' కూడా. మే = శరీరం. భో = ఓ (సంబోధన), క్ష్మా = నేల, నిద్ర, స్థానము, రాక్షసుడు అనే అర్థాలనీ తెలుపుతున్నాయి పై అక్షరాలు. ధీ = బుద్ధి, భీ = భయం, శ్రీ = శుభం లాటివి పై కోవకి చెందినవే.

సంస్కృత భాష నుంచి తెలుగు పదాలుగా మార్చడానికి ఉపయోగపడేవీ ఏకాక్షరాలే. వాటినే విభక్తులు అని పిలుస్తారు. రామః అనే పదాన్ని తెలుగు చేయాలంటే 'డు' అనే అక్షరం ఒక్కటి చాలు (ఇలా)...

అ మొదలు అః వరకు ఉన్న అక్షర మాలలో ఇంచుమించు ప్రతి అక్షరానికీ అనేక అర్థాలు ఉన్నాయని నిఘంటువులు తెల్పుతున్నాయి. ఒక్కొక్క అక్షరానికీ ఎన్నెన్నో అర్థాలున్నా... ఒక్కొక్క అర్థానికీ ఒక్కొక్కదాన్ని తీసుకుని పరిశీలిస్తే... అ = బ్రహ్మ, శివుడు, తాబేలు... ఇలా ఇరవై అర్థాలున్నాయి. 'ఈ' అనే అక్షరానికి కోపం, దుఃఖం, లక్ష్మి, సరస్వతి... ఇలా పదిహేను వరకూ అర్థాలున్నాయి.

ఉ = రాజు	ట = సూర్యకిరణం
ఊ = పురుషుడు	ఠ = పిల్లనగ్రోవి
ఋ = ఏనుగు	డ = దేశం
ౠ = కేశాలు	ఢ = ధ్వని
ఌ = ఏనుగు దంతాలు	ణ = శూరుడు
ౡ = ఊసరవెల్లి	త = కోపం
ఎ = ఏది	ద = ఇచ్చుట
ఏ = తేజస్సు	ధ = కుబేరుడు
ఐ = హస్తం	న = గొడ్రాలు
ఒ = కమలం	ప = బంగారం
ఓ = బ్రహ్మ, దయ	ఫ = ఝుంఝూమారుతం
ఔ = కుమారస్వామి	బ = వరుణుడు
క = పరమాత్మ	భ = శుక్రుడు
ఖ = గరుత్మంతుడు	మ = వేళ
గ = వినాయకుడు	య = ఏది
ఘ = అమృతం	ర = వజ్రం
ఙ = భైరవుడు	ల = గ్రహించడం
చ = చకోర పక్షి	వ = సాత్వికుడు
ఛ = మలినం	శ = దేవతాపూజ
జ = సముద్రపు ఒడ్డు	ష = పరోక్షం
ఝ = గాలివాన	స = శరీరకాంతి
ఞ = గర్వం	హ = యుద్ధం

ఇలా... నిఘంటువు పరిశీలిస్తే ప్రతి అక్షరానికీ అనేక అర్థాలు చెబుతోంది (పరిశీలించగలరు)

దేవతారాధనలో, మంత్రోచ్చారణలో, ఆవాహనలో బీజాక్షరాల పాత్ర ఎంతో ఉంది. 'ఓం' అనే ఒక్క అక్షరం ప్రణవమై పరిఢవిల్లుతోంది. సకల శుభాలకీ ఆలవాలం అవుతోంది. అలాగే 'ఐం'... 'హ్రీం', 'గం', 'రం'... ఇలా అనేక బీజాక్షరాలు దేవతల ఆరాధనకు ముఖ్యమైనవై అలరారుతున్నాయి. ఇలా అల్పాక్షరంలో, అనల్ప జ్ఞానాన్నిచ్చే ఏకాక్షరాలు భాషలకి పూర్తి సౌకర్యాన్ని కూర్చుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత. తెలుగు పండితులు. కోనాడ (విజయనగరం) జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల. 94401 08820

ఊయల పాట

పల్లవి: జోలాలి జోలాలి బంగారమా।
అమ్మ ఒడి నిండిన మందారమా॥

చరణం: పగడాల నవ్వుల పసిడి పూతల పాప
నీ చిన్ని నవ్వులు చిలక ముత్యాలు
అందరికి పంచేటి ఆనందరాశి
ఊగమ్మ ఊయల జో... జో...

చరణం: పలుకు తేనెల తల్లి పారిజాతములంపె
నడయాడు వేళ అవి నవనీత రాగాలు
కలహంసలా సిరులు కదలాడు తల్లి
ఊగమ్మ ఊయల జో... జో...

చరణం: ఇంద్రనీలములొచ్చి కనుల కాంతులు కాగ
నిండైన దీవెనలు పుష్యరాగములు
అందుకొని ఎదగాలి చిన్నారి పొన్నారి
ఊగమ్మ ఊయల జో... జో...

చరణం: మధుర మంజుల రాగ మాణిక్య రూపమా
అమ్మకు, నాన్నకు అపురూప వజ్రమా
ముగ్గురమ్మలు నీకు ముద్దుముచ్చటలివ్వ
ఊగమ్మ ఊయల జో... జో...

చరణం: కెంపుల కాంతిలా ఇంపుగా రాజిల్లు
గోమేధికమ్ముల గౌరవాల పట్టు
నీ ఇంటివారికి నట్టిల్లు సిరులుగా
ఊగమ్మ ఊయల జో... జో...

చరణం: సిద్ధి, బుద్ధి ఇచ్చి గణపతి దీవించె
జ్ఞానమూర్తివై నీవు భాసిల్లు తల్లి
చిరకాలము నీకు సుఖశాంతులమర
ఊగమ్మ ఊయల జో... జో...

– కిలారి మాధవీలత, గుంటూరు. 9491664551.

స్వభాష

పానుగంటి లక్ష్మీనరసింహారావు సాక్షి వ్యాసాల్లోని 'స్వభాష'కు వాడుక భాషలో సంక్షిప్త రూపం

నేను సభాభవనానికి వెళ్లే సరికి జంఘాల శాస్త్రి దేన్ని గురించో ఉపన్యసిస్తున్నాడు. అది వరకు ఏం చెప్పాడో తెలియదుగాని నేను సభలోకి వెళ్ళిన తర్వాత ఇట్లా చెప్పాడు.

"మీకు అసత్యంగా తోచవచ్చు నాయనలారా! అసత్యం కాదు. ఆయన ఆంధ్రుడు - కృష్ణా తీరంలో పుట్టిన వాడు. శుద్ధ శ్రోత్రియ కుటుంబంలోని వాడు. ఎం.ఎ.,బి.ఎల్., పరీక్షలలో ఉత్తీర్ణుడై న్యాయవాద వృత్తిని నిరాఘాటంగా నిరంకుశంగా నిర్వర్తిస్తున్న వాడు. అలాంటి వాడిని ఆహ్వానించి ఆదరించి ఆంధ్ర బాలక సంబంధమైన ఒక సభలో సభాధ్యక్షుడిగా ఉండమని పాఠశాల బాలకులు ప్రార్థించగా ఉంటానని ఒప్పుకుని చివరకు చేసిన పని ఇది! 'నాకు ఆంధ్రభాష రాదు నేను తెలుగులో మాట్లాడలేను. మీకిష్టమైతే ఆంగ్లేయ భాషలో మాట్లాడతాను' అని అర్థమిచ్చే మాటలను ఆయన ఇంగ్లిష భాషలో పలికాడు. తెల్లబోయి తెలివితప్పి నిలువు గుడ్లు వేసుకున్న పసి బాలలు అప్పుడు ఏమి చేయగలరు? కొంత సేపు మాట్లాడ లేక నిరుత్సాహులై దీర్ఘంగా శ్వాసపీల్చి 'మీకు ఎట్లా ఇష్టం అయితే అట్లాగే' అని అయిష్టతతో అన్నారు. అప్పుడు ఆ అధ్యక్షుడు ఒక పావుగంట సేపు ఇంగ్లిష భాషలో దేహసాధన గూర్చి ఉపన్యసించి తన ఉపసంహారం చెప్పి 'ఎనీ జంటిల్మన్ కం ఫార్వర్డ్ టు స్పీక్' అని సభికులను ప్రశ్నించాడు. బాలురు నిరుత్సాహంగా ఉండటం వల్ల జవాబు చెప్పలేక ఊరకున్నారు. అయ్యా నేను మాట్లాడతానని లేచాను. 'మనం చూడనే లేదయ్యా! మన జంఘాల శాస్త్రి' అని వాళ్లలో వాళ్లనుకొని 'ఎప్పుడొచ్చారు. ఎక్కడి నుంచి వచ్చారు? సాక్షి రాలేదేమి? మీరు సభకు వచ్చానైనా మాకు తెలియజేయనక్కర్లేదా? ఏం న్యాయమయ్యా' అని ఏవేవో కోపం ఏ మాత్రం లేని అనురాగసూచక అసందర్భ సల్లాపాలాడి నన్ను ఉపన్యాస రంగానికి తీసుకొని వెళ్లారు. నేనిట్లా ఉపన్యసించాను:

"హరహరా! మహాదేవశంభో! మహాదేవ శంభో! ఎంత మాట వినబడింది. ఎంత మాట వినబడింది. నాయనలారా! మీరు కూడా విన్నారు కదా? నేనొక్కడినే విన్నానా? ఏదో విని మరేదో అని భ్రమ పడ్డానా? నాయనలారా! అదే అయితే అదృష్టవంతుడనేగదా! నేనొక్కణ్నే అదృష్టవంతుడినా? ఆంధ్ర దేశంలో, ఆంధ్ర మాతపితలకు పుట్టి, ఆంధ్ర సంప్రదాయాలు అభ్యసించి, ఆంధ్ర జాతీయతత్వ సంపత్తితో అభివృద్ధి చెంది, ఆంధ్ర భాషలో పండితులై ఆంధ్ర గ్రంథాలు రాసి ఆంధ్రభాషాదేవికి అమూల్య అలంకారాలుగా అర్పించి, ఆంధ్ర దేశ సేవచేసి తమ అంగాలు, ప్రాణాలు, ఆత్మలు పవిత్రం చేసుకొని, ప్రాణాలు వదిలి పరమపదం చేరిన ప్రాచీనాంధ్రులు అందరూ కూడా అదృష్టవంతులు కాదా? అయ్యయ్యో! అంత అదృష్టం పడుతుందా? పట్టదు. విన్నాను, మీరు కూడా నాతో పాటే విన్నారు. వినక చెవుల కేమైనా చిల్లులు పడ్డాయా? మతి మందగించిందా? వినక పోవడం కూడానా? గుండెలు పగిలేలా విన్నాం. మనస్సు మండిపోయేలా విన్నాం. సిగ్గు లేకుండా విన్నాం. ప్రాణాలు పై కెగసి పోయేలా విన్నాం. నాయనలారా!

" 'బతికి యుండిన సుఖములు బడయ వచ్చు' అని ఓ కవి చెప్పాడు. ఇంకా బతికి ఉన్నందుకు ఇదా ఫలం - ఇదా సుఖం. ఆహా! ఇంత వరకు జీవించకుండా ఇది వరకే దేహాలు చాలించుకుని పోయిన దేశీయులు దివ్యభాగ్యంగల వారు కారా? వారు ఇలాంటివి వినకపోవడం వల్ల వారి భాగ్యం ఇంతింత అనవచ్చా? మాటంటే మాటా? మాణిక్యాల మూట- ముత్యాల పేట- మక రంద ప్రవాహ పేట- పరబ్రహ్మం నుండి ప్రణవం బయలు దొర్లినట్లు బయలు దేరిందో? ఆహాహా; ఏమని? ఏమని? మన అధ్యక్ష భగవానుడి ఆలాపకలాపమేది? వారు సాయించిన శ్రీసూక్తి ఏది? వారి గొంతులో నుంచి అవతరించిన ఆగమ సూత్రమేది? చెప్పాలా ఆంధ్రుడు చెప్పాల్సింది కాదే?



చెప్పనా? చెప్పక తప్పుతుందా? మన అగ్రాసనాధిపతికి ఆంధ్ర భాష రాదట. ఆయన ఆంధ్రంలో మాట్లాడనే లేరట. అయ్యయ్యో? ఆంధ్రంలో మాట్లాడలేక పోవడం ఏమిటి? మూగవారు కారే - నంగి నంగి మాట్లాడే వారు కారే - మెమ్మె పెప్పె అనే వారు కారే - ఆంగ్లేయ భాషా పండితా గ్రగణ్యులే - బర్క్ సిసిరో డెమాస్తనీస్, గ్లాడ్సన్ మొదలైన మహావక్తల వైభవాన్ని కబ ళించి, నమిలి, చప్పరించి, మింగి, జీర్ణించుకొని రక్తమాంసాల్లో కలుపుకొన్నారు. ఇదిగాక బిఎల్ పరీక్షలో కడతేలి, నల్లబట్టలు తొడు క్కుని న్యాయమూర్తుల ఎదుట కాకిని గద్దను, గద్దను కాకిని చేయగలిగిన కర్కశతర్క వాగ్వాహినీ మోహినీకరణ దక్షులే, అలాంటి వాగ్ధారాధీరులైన వీరు ఆంధ్రంలో మాట్లాడ లేక పోవడం ఏమిటి? నాకేమీ బోధపడ లేదు. మ్యావ్ అని కూయలేని పిల్లి ఎక్కడైన ఉంటుందా? కిచకిచలాడ లేని కోతిని మీరెక్క డైన చూశారా? ఈతరాని కప్ప ఏదేశంలో నైనా ఉంటుందా? పుట్టగానే క్యార్‌మన లేని బిడ్డ చచ్చిందనడానికి ఏమైనా సందేహమా? ఆంధ్రదేశంలో పుట్టిన పక్షులైనా నిరంతరం విని ఆంధ్రభాషలో మాట్లాడుతుండగా - అయ్యయ్యో! మనిషే- అంత మనిషే- ఆంధ్ర మాతాపితలకు పుట్టిన వాడే - ఆంధ్రదేశ గాలి పీల్చిన వాడే, నీరు తాగినవాడే- కనీసం ఆరేళ్ళదాకానైనా ఆంధ్రంలో మాట్లాడిన వాడే - అలాంటి వాడు ఇంగ్లిషు అభ్యసించినంత మాత్రాన ఇప్పుడు తెలుగులో మాట్లాడ లేడా? ఆశ్చర్యం. నమ్మలేం. అసత్యం. ఆంధ్రంలో అతణ్ని మాట్లాడకుండా చేసింది అశక్తి కాదు. అయిష్టత - అసహ్యం - అది శిలాక్షరమైన మాట. మాట్లాడడానికి ఇష్టం ఎందుకు లేకుండా పోవాలి? తెలుగు భాషంత దిక్కుమాలిన భాష లేదనే ఈ ఇంగ్లీషు తేజస్సు నమ్మకం. తెలుగు మాట్లాడే వాడు విధం చెడిన వాడు, విద్యరాని వాడు, గౌరవం లేని వాడు, గతిలేని వాడు, తెలివి మాలిన వాడు, దిక్కు మాలిన వాడు! ఆయ నకు అలాంటి అభిప్రాయం ఉంది. అలాకాకపోతే మాట్లాడక పోవడమేమిటి? అయ్యయ్యో! తెలుగులో మాట్లాడడం సిగ్గు సిగ్గు! అంత సిగ్గు పడటానికి ఇది ఏమంత చెయ్యగూడని పనో! రిఫ్రెష్మెంట్ రూంలో గొడ్డు మాంసం తినడమా? విస్కీ తాగడమా? సభలో తూలి పడిపోవటమా? ఇప్పుడు అవి చేయకూడని పనులేకావు. ఇవే ఇప్పుడు నిత్యవిధులు అయి పోయాయి. పట్ట ణాల్లోనూ, పల్లెటూళ్ళల్లోనూ వాటి వైభవం తరచుగా చూస్తూనే ఉన్నాం. వీటిన్నిటి కంటే తెలుగులో మాట్లాడటం సిగ్గు సిగ్గు- తప్పు- నీచత్వం- అధమత్వం- కులహీనత- స్పష్టంగా చెప్పానా? అలాంటి అభిప్రాయం మన అధ్యక్ష శార్దూలానికి దేశీయుల దౌర్భాగ్యం వల్ల దాపురించింది. అందుకే వారు ఆంధ్రంలో మాట్లాడలేదు. మాట్లాడితే మైల పడతామేమో, సచేల స్నానం చేయాలేమో, జంధ్యం మార్చుకోవాలేమో, ప్రాయశ్చిత్తం చేయించుకోవాలేమో అని ఆయనకు భయం కాబోలు. నా వెర్రిగానీ, భాషే అసహ్యమైన వాడికి ప్రాయశ్చిత్తంలో భక్తి ఉంటుందా? అదీ లేదు. ఇదీ లేదు. కన్న తల్లిని పూజిం చని వాడికి అన్న ఆజ్ఞ మీద ఆదరణా? తండ్రిని తన్నే కొడుకు మామగారికి మంగళ హారతి ఇస్తాడా?

"అయ్యయ్యో! మనభాషే- నమ్రతకు నమ్రత, కాఠిన్యానికి కాఠిన్యం, వదులుకు వదులు, బిగికి బిగి, జోరుకు జోరు, ఎదురెక్క డానికి ఎదురెక్క, మందతకు మందత, ధాటికి ధాటి - అన్ని వన్నెలు - అన్ని చిన్నెలు- అన్ని వగలు, అన్ని ఒద్దికలు- అన్ని తళుకులు, అన్ని బెళుకులు, అన్ని హొయలు, అన్ని ఒయ్యారాలు కలిగిన మాతృభాషే, వ్యాసానికి ఉపన్యాసానికి కవిత్వానికి గాని సంపూర్ణ అర్హతగల భాషే- పై వారే ఆ భాషను పట్టుదలతో ప్రయత్నించి నేర్చుకో వాల్సి ఉండగా - మనవాళ్లే దాన్నంత అధమాధమంగా చూడటం తగునా? సరే, మీరు ఇలాంటి భాషను వదిలేసి పై భాషను చదివారు. ఇన్ని మాన్యాలమ్ముకొని, ఇంత సొమ్ము ఖర్చు చేసి, ఇందరిని ఆశ్రయించి, ఇంత చిత్తక్లేశం పడి సంపాదించిన మీ ఇంగ్లిషు భాషా పాండిత్యం ఏ మాత్రమో చూద్దాం. ఇంగ్లిషు గ్రంథాలు ఎన్నో రాస్తు న్నారు. ఇంగ్లిషు ఉపన్యాసాలు ఎన్నో ఇస్తు న్నారు. మీకేమాత్రం భాషాసౌకర్యం కలి గింది? ఏ మాత్రం భాషా సౌలభ్యం సిద్ధిం చింది? గ్రంథాలు చదివిన జ్ఞానం లేని, జన్మతః ఆంగ్లేయుడైనవాని ఇంగ్లిషు నుడికా రంలో ఉన్న సౌలభ్యంలో సగమైనా అర్థశ తాబ్దం ఆంగ్లభాష అభ్యసించిన మీకు ఒంటబ ట్టిందా? సంపూర్ణమైన భాషోచ్చరణ సౌష్టవ మైనా పట్టుపడిందా? ఎలా పట్టు పడు తుంది? పై భాష ఎప్పటికీ పరభాషే. మీరేవో ఇంగ్లిషు గ్రంథాలు రాస్తున్నారని ఇంగ్లీషు ఉపన్యాసాలిస్తున్నారని విశేషజ్ఞుల మని అనుకుంటున్నారు కాబోలు. అవి ఒట్టి

తల విరుపులు చిలుక పలుకులు - కల్ల కెంపులు- గాజురాళ్ళు. అవన్నీ మక్కికి మక్కులు వెక్కిరింపులు. వాటికి స్వతంత్ర శక్తి లేదు. వెన్నెముక బలం లేదు. మీ లెక్కేమిటి? మీ తలదన్నిన ధీమంతులకే లెక్కలేదు. 'పారడైజ్ లాస్ట్' రాసి ఆంగ్లేయ వ్యాస పీఠాధిపత్యానికి అర్హుడనిపించు కొన్న మిల్టన్ రాసిన లాటిన్ పద్యాలు లాటిన్ భాషే స్వభాషగాగల దేశీయ కవులలో అధములు రాసిన పద్యాల ముందు దిగదుడుపు అని వారి పరిశోధకులే రాశారు. మిల్టన్ లాటిన్ రాతల కంటే మీ ఇంగ్లీషు రాతలు ఘనమైనవా? తల్లి పాలతో పాటు ఏ భాష మనం తాగుతామో ఆ భాషలోనే మనం ఎన్నటికైనా కఠిన ప్రయత్నం చేస్తే ఉపజ్ఞ కలిగిన ఉత్తమ గ్రంథం రాయగలం. కాని పరభాషలో ఎన్నడూ రాయలేం. పరభాషలో ఎన్నడూ ఆ భాషావేత్తలు మెచ్చేటట్టు మాట్లాడనూ లేం. మన రాజధానిలో ఉన్న ఒక కాలేజీలో- 'వర్నాక్యులర్ సూపరింటెండెంట్'గా సంస్కృత భాషా పండితుడైన ఒక ఆంగ్లేయ పండితుడు వచ్చాడు.

"అతడు 'యంత్రబ్రహ్మ వేదాంత' మొదలైన శ్లోకాలను 'ఇయాంబిక్ మీటర్'లో చదవడం నేను చూశాను. ఆంగ్లేయుడు పద్దెనిమిది సంవత్సరాలు సంస్కృత భాషను నిరంతర దీక్షతో అభ్యసించనీ - అభ్యసించినంత కాలం మననం చేసి రాపిడి పెట్టనీ- 'హంగుం సత్యుచిష' మంత్రాన్ని పొడుగు పొట్టి పలుకుబడి పరిపాటిని మాని - సిసలైన ఉచ్చారణతో చదవగలడేమో పరిశీలించండి. ఇక మీరు 24 సంవత్సరాలు ఇంగ్లీషు భాష అభ్యసించండి. 'ఇన్నెమోరియం'లో ఉన్నదని చెప్పిన 'మ్యూజిక్' మీరు కనిపెట్టగలరేమో? అది వాడివల్ల కాదు. ఇది మీ వల్లా కాదు. రానినోటికి అది చిక్కదు- మీ చెవికి ఇది ఎక్కదు. పరభాషా పదాలకు అర్థం తెలిసినంత మాత్రాన పరభాషా పాండిత్యం లభించిందని భ్రమపడకండి. భాషలోని కళను ప్రాణాన్ని తత్వాన్ని ఆత్మను కనిపెట్టాలి. అది మీకు అసాధ్యం. చివరకు ఇన్ని ఇనాలు అమ్మి, అమ్మ మెడలోని పుస్తె పూసలు అమ్మి - వంటింట్లోని పాత్రలు అమ్మి దైన్యపడి- వారాలు చేసుకొని - ముష్టెత్తి సంపాదించిన ఆంగ్లేయభాషలోని పాండిత్యం పస ఈ రంగులోకి దిగింది. ఈ విధంగా బద్ధలైంది. స్వభాష ఇదివరకే మీచేత చావనే చచ్చింది. మీ గతి ఎంత ఉభయభ్రష్టమైందో చూశారా? మీరు వెచ్చించిన ధనంలో, పడ్డ శ్రమలో, వినియోగించిన కాలంలో, పొందిన దైన్యంలో, ఏడ్చిన ఏడ్పుల్లో పదహారోవంతైనా అక్కర లేకుండా మీరు దేశభాషా పండితులై ఉండేవారు. స్వభాష నేర్చుకోవడంలో మీకు ఎంత శ్రమ ఉంది? అక్షరాభ్యాస దినం నుండే మీరు స్వభాష అభ్యసిస్తున్నారని అనుకోకండి. మీ తల్లి కడుపులో ఉన్నప్పుడే నేర్చుకోవడం మొదలు పెట్టారు. ఆమె తిన్న పదార్థాల రసాన్ని నాభీ నాళం ద్వారా మీలో ప్రవేశపెడు



తున్నప్పుడే ఆంధ్రభాషాజ్ఞానం కూడా దాంతో కలిసింది. తరతరాల నుండి వంశానుక్రమంగా మీ రక్తంలో జీర్ణమై, మీ మాంసానికి మాంసమై, శల్యానికి శల్యమై, మెదడుకు మెదడై, మీతత్వంలో ఐక్యమైన ఆంధ్రభాషను మీరిప్పుడు కొత్తగా నేర్చుకోవడమేంటి? ఉపాధ్యాయుడైనా అక్కర లేకుండా గ్రంథాలు ఊరకే చదువుకుంటూ పోతే భాషాజ్ఞాన సంపాదన మీకెంత సేపు? నాకు ఆంధ్రభాష రాదని మన అధ్యక్షుడు కంఠోక్తిగా పలికాడు. భాష మీకు రాదా? అచ్చా! మీరే ప్రయత్నం చేసి రాదంటున్నారు? భాష తనంత తానే మీకు వస్తుందనుకుంటున్నారా? మహమ్మద్ గారి వద్దకు కొండ రానప్పుడు మహమ్మద్గారు కొండ దగ్గరకు వెళ్లారా లేదా? మీకు భాష రాక పోవడం భాష లోపమా? మీ లోపమా? భాషను కొంచెం దీక్షతో పఠిస్తే అది రానివాడుంటాడా? పఠించకుండా భాష రావాలంటే అది అంత పైపైన ఉందా? భాష మీద మీకు నిర్లక్ష్యం ఉంటే భాషకు మీమీద అభిమానం ఉంటుందా? భాషా గ్రంథం మీకు తలకింద దిండుగానైనా పనికి రానప్పుడు భాషా జ్ఞానం మీ తలలో ఎట్లా దూరుతుంది? చదివినా భాష రానివాడెవడు? ఎవడో వేలు మడిచి ఒక్కని పేరెత్తి చెప్పండి. భాషలో పుట్టి భాష నేర్చుకుని భాషరాక భ్రష్టుడైన ప్రపంచాతీత పురుషుడెవడో చూద్దాం. చూసి యథార్థంగా స్వభాషా జ్ఞానానికి అర్హుడు కాని అద్భుత అజ్ఞాన తత్వమే అయితే నన్నయభట్టు కాలం నుండి ఇప్పటి వరకున్న భాషా గ్రంథాలన్నీ కట్టగట్టి బంగాళాఖాతంలో పారేద్దాం. మనకు రానిభాషతో మనకేం పని? అయ్యయ్యో? రవంత కష్టమైనా పడనక్కర్లేదా? నోరుమెదపనైనా అక్కర్లేదా? 'క్రిమినల్ ప్రొసీజర్కోడ్' చేత పట్టకుండానే మన అధ్యక్ష శిరోమణికి శిక్షాశాస్త్ర సిద్ధి అయిందా? 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ' యాక్టు తల కొట్టుకొని వల్లెవేసినారే- తారాశశాంక విజయం రవంత చదవలేరా? సరదా తీరుతుంది. శబ్దజ్ఞానం వస్తుంది. ఊరకే రమ్మంటే ఏదైనా వస్తుందా? కడుపు నిండటానికి నోట్లోపడ్డ దాన్ని మింగనైనా వద్దా? ఆ మాత్రం శ్రమైనా పడనక్కర్లేదా? 'మెయిన్స్ పీనల్కోడ్' మడత వేయడంలో మెదడు చింపుకున్న వాడవే- మనుచరిత్ర ఒక్క ఆశ్వాసాన్నైనా చదవడానికి నీకు ఓపిక లేక పోయిందా? తీరిక లేకపోయిందా? శక్తి లేక పోయిందా? బుద్ధిలేక పోయిందా? చంద్రబుల్లిని ఆమూలాగ్రంగా ఎరుగుదువు కాని చంద్రమతి పేరైనా ఎరుగవా! 'కన్నింగామ్స్ ఎవిడెన్స్' ఆక్టు వల్ల నీ కడుపే నిండుతుంది కాని కంకంటి వారి రామాయణం వలన నీ మనస్సే నిండుతుంది! 'జస్టిస్ హోలోవే' గారి జడ్జిమెంట్‌ను ఒప్పజెప్పగలవు కాని జనకచక్రవర్తి ప్రపంచమునకు బోధించిన నీతి నెరుగవా? 'సివిల్ ప్రొసీజర్కోడ్ లేటెస్ట్ ఎడిషన్'కు కర్త ఎవడో ఎరుగుదువు కాని సీతారా

మాంజనేయ కవి ఎవడో ఎరుగవా? భారత భాగవతాలను పఠించని నీవు బారిష్టర్‌వైన నేమి- ప్రభూత్తముడివైతేనేమి? ఆంధ్రుడవై ఎందుకు పుట్టావు! నీవు ఆంధ్రదేశానికి ఎందుకు నాయనా? నాకు బోధపడక అడుగుతున్నాను. క్షమించు, నీవు ఏ పుస్తకాలనూ చదవక్కర్లేదు. రోజుకొక్క సారి పావుగంట తెరపి చేసుకొని రాత్రి భోజనమైన తర్వాత ఇల్లాలిని పిల్లలను నీ చుట్టూ కూర్చోపెట్టుకుని తాంబూలం నములుతూ నడుమ నాన్కోపరేషన్ ముచ్చట్లు చెప్పుకుంటూ ఆంధ్ర పత్రికను చదవరాదా? నాలుగు మాసాలు అట్లా చదువు. నీకాంధ్ర భాషా జ్ఞానం ఎంత వృద్ధి అవుతుందో! తెలుగు భాషలో ఏదైనా పస ఉన్నదని నీకప్పటికి తెలిస్తే భాషా గ్రంథాలు చదవచ్చు. అందరు తెలుగు మాట్లాడవలసిన ఇందరిలో నీవొక్కడివి ఇంగ్లిషులో మాట్లాడావు. కావుకావుమని అనాల్సిన కాకులన్నిటిలో ఒక్క కాకి కొక్కొరొకో అని అరిస్తే మిగిలిన కాకులు దాన్ని ముక్కుతో పొడిచివేయక మానాయా? మేము నీలాంటి అనేక ప్రకృతులకు అలవాటు పడినవాళ్లం కనక సరిపోయింది. కాని లేకపోతే ఏమయ్యేది? ఆంగ్లభాష ఎందుకు చదువుకున్నావని నేను అధిక్షేపించను. ఇంతకన్న అధిక జ్ఞానం కూడా ఆ భాషలో సంపాదించు. నాకు మరింత ఇష్టం. కాని నీ ఆంగ్ల భాషాజ్ఞానం ఎందుకో నీకు తెలుసా? ఆంగ్లేయ భాషే కాదు, ఇంకా అనేక భాషలు కూడనేర్చుకో. నీవు సంపాదించిన పరభాషా జ్ఞానమంత నీ భాషను అభివృద్ధి చేయడానికే. నీ భాషను భాగ్యవత్తరం చేయడానికే. నీ భాషను పరభాషా గ్రంథ ప్రశస్తాభిప్రాయాలతో వన్నె పెట్టడానికే. అంతకుమించి వేరే కాదు. ఆంధ్రుడవై ఉండీ ఆంధ్రభాషలో 'ఆ' అని నోరుమెదపలేని వాడివిగదా! నీ ఆంగ్లేయ భాషాజ్ఞానాన్ని దేశానికెట్లా ఉపయోగించ దలచావో చెప్పు.

"నాయనలారా! మనకు ఇంగ్లీషు మాటలతో చెప్పిన గాని ఏ అంశము కూడా మనసుకెక్కదు. ఆ అలవాటు చిరకాలం నుంచి

మన మూలుగల్లో జీర్ణించుకుపోయిన రోగం. ఆయుర్వేద వైద్యుడు వచ్చి 'అయ్యా! కరివేపాకు పొడుముతో పథ్యం చేయమ'ని చెప్తే నీ కామాట నచ్చదు. నాన్సెన్స్. కరివేపాకు పొడుం ఎందుకయ్యా అని నీవు ఆయుర్వేద వైద్యుడిని అధిక్షేపిస్తావు. ధనియాలు డైజెషన్‌కు మంచివి. మిరియాలు 'లివర్' మీద 'యాక్ట్' చేస్తాయి. కరివేపాకు 'గాల్‌బ్లాడర్'కు సత్తువ ఇస్తుందని ఎవడో ఎల్.ఎం.పి, మనవాడే చెప్తే నీకు అది శ్రుతిప్రమాణం. నాయనలారా! మనమెంత లక్షాధిపతులమైనా కోటీశ్వరులమైనా మన బతుకులు ముష్టి బతుకులే కాని మరి ఒకటి కాదు. ఈ ముష్టి దేవులాటలో ఇంగ్లిషు మాటలు కూడా ఎందుకు? ఆ ఏడుపేదో మాతృభాషలోనే ఏడిస్తే మంచిది కాదా? మన కడుపు సహజంగాను సాపుగాను స్వతంత్రంగానూ ఉంటుందే. ఏడుపులో కూడా మనకు అస్వతంత్రత ఏమి కర్మ! అందుకు సర్వస్వతంత్రులం సంపూర్ణాధికారులమే కాదా?

"నాయనలారా! మీ సభాకార్యక్రమం అంతా చెడగొట్టాను. నన్ను మీరు క్షమించాలి. మరెప్పుడైనా ఈ సభ మళ్లీ చేసుకోండి. (అప్పుడు మీరు అధ్యక్షునిగా రావాలని కేకలు) నాయనలారా! అలాగే- మీరంత ఆంధ్రభాషాభిమానంతో ప్రవర్తిస్తున్నప్పుడు నాచేతనైన సేవ నేను చేయనా? ఆంధ్రభాష బొత్తిగా రానివాడితో తప్ప మీరు ఇంగ్లీషులో ఎన్నడూ మాట్లాడ కూడదు. మీరు మీ మిత్రులకు ఉత్తరం రాసేటప్పుడు 'డియర్‌ఫ్రెండ్'తో ఆరంభించి 'యువర్స్ ట్రూలీ'తో పూర్తి చేయకుండా 'బ్రహ్మశ్రీ'తోనో, 'మహారాజశ్రీ'తోనో ఆరంభించి, 'చిత్తగింప వలయును'తో పూర్తి చేయాలి. ఆంధ్ర భాష వచ్చిన వానికి ఆంగ్లేయ భాషలో ఉత్తరమెన్నడూ రాయకండి. ఈ నియమాలను మీరు చేసుకోగలరా? (అభ్యంతరం ఏమి అని కేకలు) నూతనంగా అచ్చవుతున్న ఆంధ్ర గ్రంథాలన్నింటినీ విమర్శనా బుద్ధితో చదవండి. తొందరపడి అధిక్షేపించకండి. శనాదివారాల్లో రాత్రి తప్పకుండా రెండు గంటలు పురాణ పఠనంలో కాలక్షేపం చేయండి. స్వభాషా పత్రికలను చూడకుండా ఆవల పారేయకండి. ఆంగ్లేయ భాషా గ్రంథాలను మీరు చదువుతున్నప్పుడు వాటిలో మన భాషకు అక్కరకు వచ్చే అంశాలు ఏమిటి అని తదేక దృష్టితో చూస్తూ వాటిని మెదడులో పదిల పరచుకోండి.

"మీరు ఈ నియమాలు పాటించి, పట్టుదలతో ఆచరించి పుట్టుక చేతనే గాక, బుద్ధి చేత, స్వభావం చేత, యోగ్యత చేత ఆంధ్రులమని అనిపించుకోవాలి."

తేనెల తెలుగు

వేటూరి పాటలో ఊటలా ఉబికింది
తిక్కన్న నుదురుపై తిలకమై మెరిసింది
వేమన్న పద్యాన్ని వేదంగా మలిచింది
త్యాగయ్య గళములో రాగాలు పొదిగింది
ఎంత కమ్మనిదిరా మన తెలుగు
అంతుచిక్కని సొబగు తెలుగు
జంధ్యాల పాపయను జాతిరత్నంచేసి
శ్రీశ్రీ శిరసును నిమురుతు
జాషువా కలములో రోషాన్ని నింపింది

ఎంత కమ్మనిదిరా మన తెలుగు
అంతుచిక్కని సొబగు తెలుగు
సెలయేటి గాలులన్ ఎలదేటి పాటలా
పలుమార్లు రవళించి పంచుతీపిని - తెలుగు
మరుమల్లె పూలలో పరిమళమ్ములుతెచ్చి
దరహాస చంద్రికల్ విసరు తెలుగు
ఎంత కమ్మనిదిరా మన తెలుగు
అంతుచిక్కని సొబగు తెలుగు

-కె.నాగేంద్రాచారి (చిట్టికవి), హైదరాబాద్.
73828 21728

వెనక్కి వెళ్ళే రైలు

మెహెర్

నలువైపులా నగరం తాకిడికి నా ఆత్మనిబ్బరం ఏనాడో బీటలు వారిపోయింది. రోజూలాగే ఆ రాత్రి నీరసంగా ప్లాట్‌ఫాం బల్ల మీద కూర్చున్నాను. చుట్టూ ఏ మాత్రం నిమ్మళం లేని ఆధునిక జీవితపు రద్దీని మనసులో అలవాటుగా ఆడిపోసుకుంటున్నాను. గుర్తింపు కార్డులు వేలాడుతున్న మెడలు, భోజనం డబ్బాలు మోస్తున్న భుజాలు, రోజంతా పనితో అలసిన ముఖాలు... ప్రతీ ఒక్కరూ ఏదో ఒక పోరాటంలో భాగస్వాముల్లానే ఉన్నారు.

కూత వేసుకుంటూ లోకల్ రైలు వచ్చి ఆగింది. అది విన్న అందరూ మంత్రానికి బద్ధులైన శాపగ్రస్తుల్లా ఒక్కసారిగా కదిలారు. మిగతా పోరాటాలన్నింటినీ తాత్కాలికంగా వాయిదా వేశారు. రైల్లో ఎక్కి చోటు సంపాయించటమనే తక్షణ పోరాటానికి సన్నద్ధమయ్యారు. చోటు దొరకటమే మోక్ష మార్గమన్నంత ఆత్రంతో నెట్టుకుంటూ, తిట్టుకుంటూ లోనికి జొరబడుతున్నారు.

ఉన్నట్టుండి నన్ను విపరీతమైన నిస్త్రాణ కమ్ముకుంది. తెగేదాకా లాగకూడదన్న సూత్రం జీవితంలో ప్రతి అంశానికీ వర్తిస్తుంది. అప్పటికప్పుడు ఆ రద్దీ చూసి నాలో ఏదో పటుక్కున తెగినట్టయింది. ఎందుకు ఇలా రోజూ ఒక క్రమాన్ని బానిసలా పాటించి తీరాలన్న ఎదిరింపు మొదలైంది. పద్ధతైన జీవిత నిర్మాణాన్ని కూలగొట్టాలన్న మొండితనం తలెత్తింది. ఈ రోజుకి ఇదే ఆఖరి రైలని తెలుసు. అయినా ఎక్కకూడదని తీర్మానించుకున్నాను. తర్వాతేమిటనే నిర్ణయానికి రాకముందే, రైలు కదిలిపోయింది.

ఈ తిరుగుబాటుని నా మనసే అంగీకరించలేకపోతోంది. తొందర పెడుతోంది. బయటికెళితే ఆటోలుంటాయి, లేదా నాలుగు రోడ్ల కూడలి వరకూ నడిస్తే బస్సులైనా దొరుకుతాయి అంటూ మార్గాంతరాలు సూచిస్తోంది. కానీ మనసు బుజ్జగిస్తున్న కొద్దీ నాలో మొండితనం కూడా పెరుగుతోంది. అలాగే కూర్చుండిపోయాను. అప్పటికే పరిసరాలు నిర్మానుష్యమయ్యాయి. టికెట్ కౌంటర్లు మూసేశారు. ప్లాట్‌ఫాం మీద దీపాలు ఆర్పేశారు. ఒక కుక్క మాత్రం ఎవరూ నియమించని కాపలాదారులా అటూ ఇటూ చక్కర్లు కొడుతోంది.

లోలోపల రగులుతున్న మూగవిప్లవంతో అలా ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలియదు. ఇంతలో నన్నాశ్చర్యపరుస్తూ మళ్ళీ రైలు కూత వినిపించింది. ఈ సమయంలో రైలేమీ లేదే? దిగ్గున లేచి ప్లాట్‌ఫాం అంచు దాకా నడిచి తొంగి చూశా. పట్టాల మీద దేదీప్యమానమైన వెలుగు తివాచీ పరుస్తూ ఏదో గుర్తు తెలియని రైలు ఇటే వస్తోంది. అప్పటికే మనసు చేస్తున్న బుజ్జగింపులకు కొద్ది కొద్దిగా లొంగిపోయాను. ఆటోనా బస్సా అని ఊగిసలాడుతున్నాను. దాంతో ఇపుడీ రైలు రాక ఆనందాన్ని కలిగించింది. కానీ ప్లాట్‌ఫాం మీద కుక్క ఎందుకో తెగ మొరుగుతూ అటూ ఇటూ పరిగెడుతోంది. దాని ఆదుర్దాకు కారణమేంటో రైలొచ్చాక అర్థమైంది. అది మామూలు రైలులా లేదు. పాత కాలం నాటి బొగ్గు ఇంజను పొగ వదుల్తూ నన్ను దాటింది. పెట్టెలూ పాతవే. ఏ పెట్టెలోనూ మనిషి జాడ లేదు. దీపాలు మాత్రం కళ్ళు జిగేల్మనిపించేలా వెలుగుతున్నాయి. నన్ను ఆహ్వానిస్తున్నట్టు ఒక గుమ్మం సరిగ్గా నా ముందాగింది. నా పాద స్పర్శ తెలిసినట్టు నేను ఎక్కగానే రైలు బయల్దేరింది. అయితే ముందుకు కాదు, వచ్చిన దారినే వెనక్కి!

ఈ మానవాతీత సన్నివేశంలోకి నేను పెద్ద జంకేమీ లేకుండానే ప్రవేశించాను. ఊరికే వాహ్యాళిలా రైలంతా తిరగసాగాను. పెట్టెల్లోని తెల్లటి వెలుగు కళ్ళకు కట్టినట్టు ఉంది. బయటి పరిసరాలవీ ఆనటం లేదు. అన్నీ ఖాళీ సీట్లేనన్నది ఖాయపరుచుకుంటూ రైలు మధ్య బోగీ దాకా వచ్చాను. అక్కడ ఒకాయన ఎదురయ్యాడు. నా లాగే మనుషుల కోసం వెతుకుతున్నాడల్లే ఉంది, నన్ను చూడగానే... ఇవాళ దీంట్లో మనిద్దరమే ప్రయాణికులం కామోసు! అన్నాడు నవ్వుతూ. నేనూ మర్యాదగా నవ్వా.

ఇద్దరం కిటికీ పక్క సీట్లలో ఎదురుబొదురు కూర్చున్నాం. ఆయన వేషధారణ ఈ కాలానిదిలా లేదు. తలపాగా, పంచెకట్టు మీద బొత్తాలు లేని పొడుగు చేతుల జుబ్బా, భుజాన మూట, ఒక చేత్తో మరచెంబు, కాళ్ళకు తోలు చెప్పులు.

ఆయన కూడా నన్ను కుతూహలంగా చూస్తున్నాడు. నా మెళ్ళో గుర్తింపు కార్డు, మెరుస్తున్న నా బూట్లను, భుజాన స్ట్రాప్ బ్యాగును పరిశీలిస్తున్నాడు. "మీరు ఏ కాలం వారు? " అని ఆయనే ముందు అడిగాడు. నేను ప్రస్తుతం మాకు ఏ ఏడాది గడుస్తోందో చెప్పాను. ఆయన కళ్ళు పెద్దవి చేశాడు. నేను ఆయన కాలం గురించి అడిగాను. దాదాపు రెండొందల ఏళ్ళనాటి సంవత్సరం చెప్పారాయన.

మా ఇద్దరికీ పరిస్థితి ఏమిటో బోధపడింది. ఆయన కిటికీ లోంచి బయటికి చూస్తూ, "కాలంలో ప్రయాణమంటే ఇలా చీకటి విస్తారాల్లోంచి సాగుతుందన్నమాట!" అన్నాడు.

ఆయన ఏ కాలానికి చెందినవాడో తెలియగానే నాకు అమితానందం కలిగింది. జీవితం గడిపేందుకు ఏ కాలం ఆదర్శవంతమని అనుకుంటానో, ఆయన అప్పటి వాడు. ఆ కాలం గురించి నాకు పాత పుస్తకాల ద్వారా తెలుసు. ఆ కాలం మనుషులు

కథ

నింపాదిగా జీవించేవారు. వారి జీవితాలు సైనిక కవాతులు కాదు. వన విహారాలు. మనుషులు పరికరాల ద్వారా గాక, ముఖాముఖీ మాట్లాడుకునేవారు. ప్రయాణాలు ఇప్పటికన్నా ఆలస్యంగా జరిగినా, ఉత్తరాలు ఇప్పటికన్నా ఆలస్యంగా చేరినా కూడా వాళ్ళ జీవితాల్లో బోలెడు ఖాళీ. ఆ ఖాళీని తలుపులు బిడాయించుకుని టీవీల ముందు గడపకుండా, వాకిటి అరుగుల మీద కూర్చుని అందరూ కబుర్లు చెప్పుకుంటూ గడిపేవారు. ఒంటరితనానికి తావివ్వని ఉమ్మడి సంసారాలు వారివి.

ఇవన్నీ గుర్తొచ్చి ఒక్కసారిగా ఉద్వేగం కమ్ముకుంది. ఇపుడు రైలు అటువైపే వెళ్తుంటే గనక ఆయనెక్కిన స్టేషన్లో దిగిపోవాలని నిశ్చయించుకున్నాను. ఆయనకు ఆ సంగతి చెప్పాను.



నా జీవితంలో ప్రతీ రోజూ అంతకు మునుపటి రోజుకు నకల్లా ఎంత యాంత్రికమో వివరించాను. ఆయన బతుకుతున్న కాలమంటే నాకెంత ప్రేమో చెప్పాను. దీనికి ఆయన ఆనందిస్తాడని అనుకున్నా. కానీ నా వంక చిత్రంగా చూడటంతో మాటలు ఆపాను. అపుడే ఒక విషయం గుర్తుకొచ్చింది. "ఇంతకూ మీరెందుకు ఎక్కారీ రైలు, అంతటి స్వర్గతుల్యమైన కాలాన్ని విడిచిపెట్టి? " అని అడిగాను.

"నా బొంద స్వర్గం!" అని మొదలుపెట్టాడు. ఆయన కాలం వట్టి జడత్వ జ్వరంతో జబ్బు పడిన కాలమట. మనుషుల్ని ముందుకు తరిమే ఉద్దీపన ఏదీ లేని తాత్సారం బతుకులట. గాలి పీల్చుకునే ఏకాంతం దొరక్క ఉక్కిపోయే ఉమ్మడి సంసారాలట. ఎప్పుడూ నిద్రపోతున్నట్టుండే కచేరీల్లో పని అట. వ్యక్తి ఆలోచనలకు ఎంత విశాలత్వం ఉన్నా సంఘమనే పలుపుతాడు ఎంత దూరం పోనిస్తుందో అదే అతని ప్రపంచ వైశాల్యం అట. "జీవితానికి ఉండాల్సిన యుద్ధ చైతన్యం లేదు. అది లేనపుడు మనిషిగానే ఎందుకు పుట్టడం. దేవుడు ఏ మానుగానో పుట్టించినా పోయేది కదా. నాకు పోరాటం కావాలి. అందుకే ఎపుడూ కలలు కనే వాణ్ణి. ఎప్పటికైనా కాలంలో వెనక్కి వెళ్ళే అవకాశం వస్తే రాజుల, రాజ్యాల కాలంలోకి వెళ్ళిపోవాలని.

అపుడు అనుక్షణం ఉత్తేజభరితం. ఎక్కడికో పరుగు. ఎవరి మీదకో దండయాత్ర. కోటలెక్కడం, వ్యూహాలు పన్నడం. ఒంట్లో రక్తం ఎప్పుడూ వరద పరవళ్ళు తొక్కుతూ ఉంటుంది. అది కాదూ అసలు జీవితమంటే! ఈ రైలు నిజంగా అంత దూరం వెళ్ళాలే గానీ, ఏ శ్రీ కృష్ణదేవరాయల సామ్రాజ్యంలోనో దిగిపోతాను. ఆయన సైన్యంలో చేరిపోతాను," అంటూ ఉద్వేగపు ఆయాసంతో మాట



ముగించాడు.

ఆయన మాట ముగించాడో లేదో, ఉన్నట్టుండి పై బెర్తు మీద నుంచి ఒక తల తొంగి చూసింది. తర్వాత ఆ తల తాలూకు శరీరం కిందకి దూకింది. ఈ మూడో ప్రయాణికుని అవతారం చూసి ఇద్దరం నోళ్ళు వెళ్ళబెట్టాం. జానపద సినిమాల్లో కత్తి కాంతారావు అక్రమంగా యువరాణి అంతపురంలోకి ప్రవేశిస్తుంటే అడ్డొచ్చి తన్నులు తినే భటుడి అవతారంలో ఉన్నాడతను.

కిందకి దిగుతూనే చేతిలో ఉన్న బల్లాన్ని విసురుగా నేలకేసి కొట్టాడు. "రామేశ్వరం పోయినా శనీశ్వరం తప్పదన్నట్టు... ప్రభువులూ, ఎవరు తమరు? ఇక్కడ కూడా సైన్యాలు, దండయాత్రలు అంటూ నా నిద్ర చెడగొడుతున్నారు? " అన్నాడు. నేను తప్పు నాది కాదన్నట్టు మరచెంబాయన వైపు చూశాను.

ఆయన ముఖం సంభ్రమంతో వెలిగిపోతోంది. ఎక్కడి వాడివి బాబూ నువ్వు! అన్నాడు ఆరాధనగా.

"కృష్ణదేవరాయల సైన్యంలో కాల్బలంలో పనిచేస్తాను."

"అవునా! నా నోటి వెంట రాయల వారి పేరు పలకడం, నువ్వు పై నుంచీ ఊడిపట్టం! దైవలీల గాక మరేమిటి? "

"ఊడిపడక ఏం చేయను సామీ! ఇందాకణ్ణించీ ఉగ్గబట్టుకున్నాను. కానీ రాజుల గురించీ, రాజ్యాల గురించీ తమరి భ్రమలు నా జీవిత కష్టాల్ని వెక్కిరిస్తుంటే ఇక ఊరుకోలేపోయా."

"కష్టాలా? రాయల సైన్యంలో, యుద్ధ నగారాల మధ్య, జీవితాన్ని నిత్యం విజయోత్సవంగా సాగించుకుంటూ... కష్టాలంటున్నావా? "

"కడుపులో చల్ల కదలకుండా కోటలో కూర్చుని వింటే నగారాల మోత బానే ఉంటుంది. యుద్ధ రంగంలో నిలబడి విన్నప్పుడే బాగుండదు. మనం ఇంతకు మునుపు ఎరుగని వాళ్ళంతా ఒక సైన్యంగా జట్టుకట్టి, వాళ్ళకి ఎపుడూ ఏ హానీ చేయకపోయినా మనల్ని చంపాలని వరదలా ముంచుకొస్తుంటే, అప్పుడు వినాలి నగారాల మోత. అది నీ గుండెలు జార్చేస్తుంది."

"నువ్వు పిరికి సైనికుడి మల్లే ఉన్నావు."

"తమరి బొంద! నాది పిరికితనం కాదు. కొన్ని ప్రశ్నలకు జవాబు దొరకనితనం. అసలు నేనెందుకు యుద్ధం చెయ్యాలి? ఎందుకు నా జీవితాన్ని పణంగా పెట్టాలి? ఆ యుద్ధం నాది కాదు. నేను పోరాడేది నా కోసం కాదు. ఓడినా గెలిచినా నాకు ఒరిగేదేమీ లేదు. నేను మా రాజుగారి సవాలక్షమంది సైనికుల్లో ఒక సైనికుణ్ణి. నాకంటూ స్వతంత్ర అస్తిత్వం లేదు. పుడతాను, ఎవరికో పాటుపడి అనామకంగా ఏ మూలో గిడతాను. చరిత్రలో నా పేరు ఎక్కడా వినపడదు. నా శ్రమ కనపడదు. అదీ ఒక బతుకేనా!".

అప్పటిదాకా టెన్నిస్ కోర్టులో ఎగురుతున్న బంతిని చూస్తున్నట్టు, వాళ్ళిద్దరి వైపూ బుర్ర మార్చి మార్చి తిప్పుతున్నాను. సైనికుని చివరి మాటలు విన్నాకా గొంతు అప్రయత్నంగా పెగిలింది. నీకూ నాకూ పెద్ద తేడా లేదు! నువ్వు మీ రాజుకి పని చేస్తావు. నేను మా సంస్థకి పని చేస్తాను అంతే అన్నాను.

అయితే వాళ్ళిద్దరూ నా మాట వినే స్థితిలో లేరు. చాలా సేపు వాదించుకున్నారు. చివరికి ఆయాసపడి వదిలేశారు. వాదన అంతమైంది గాని, ఇద్దరిలో ఎవరి అభిప్రాయాలూ మారలేదు. వాళ్ళ దుస్తులు మాత్రం ఒకరివి మరొకరికి మారాయి.

రైలు తొలుత మరచెంబాయన ఎక్కిన చోటులో ఆగింది. అక్కడ సైనికుడు దిగాడు, మరచెంబు పుచ్చుకుని. తర్వాత రాయల కాలం వచ్చింది. మరచెంబాయన దిగాడు, బల్లెంతో.

ఎవరి స్టేషను దగ్గర వాళ్ళు నన్నూ తమతో దిగమని అడిగారు. నాకు మనస్కరించలేదు. రైలు తిరిగి నేనెక్కిన చోటుకి వస్తుందన్న అంచనాతో అలాగే కూర్చుండిపోయాను. ఏ గతి రచియించిరేని సమకాలము వారు మెచ్చరే గదా! అంటూ ఒక కవి వాపోవడం గుర్తుకొచ్చింది. దేవుడనే వాడు నిజంగా ఉంటే, తన సృష్టి రచన విషయంలో ఇలాగే వాపోతుంటాడేమో అనిపించింది.



కథా రచయిత,
హైదరాబాద్.

రైతు కల

తెలుగు తల్లి సుతుడు విలువల రైతన్న
కష్టించి సృష్టించు కలిమిమిగుల
సిరుల రాశులు పోయు చెమట ముత్యాలతో
భాగ్యరాశులు లేక పస్తులుండు
రేయిపగలనక వేయి కనులు దాల్చి
పంట పొలాలు కాపాడు చుండు
రెక్కల భారము డొక్కల ఆకలి
లెక్క చేయవు తన లెక్కలెపుడు

విత్తనాల కొరత, విద్యుత్తుకోతలు
రుణరణములు వాన రుతువు గతులు
మందుటెండదాడి, మంచు పొగల చీడ
ఎదురు దెబ్బలెన్ని ఎన్నగలము?

కొడుకు చదువు పెరిగి కొండంత భారమై
కాసు పంపలేక వీసమైన
కన్నబిడ్డ పెళ్ళి కలగా మిగిలిపోయి
చేతులెత్తి వేయు రైతురాజు.

– డా॥ బాలినేని కృష్ణమూర్తి

మారుపల్కవేర? మంతిరన్న!

తెల్లదొరలు పోయి నల్లదొరలు పీఠమెక్కినా తాడితులు, పీడితుల కష్టాలు తీరనేలేదు. దాంతో కడుపు మండిన జాషువా రాసిన పద్యం ఇది.

రాజ్య పీఠమెక్కి రాజదండము పట్టి
మూడువత్సరములు మునిగిపోయె
దొరల రాచరికమె మెరుగయ్యెననిపించె
మారుపల్కవేర? మంతిరన్న!



అక్షరాన్ని నేనక్షరాన్ని

యశస్వి

అక్షరాన్ని.. నేనక్షరాన్ని.. శబ్దం నా లక్షణం...
పదే పదే ప్రయోగిస్తే భావం నా లక్ష్యం
నా లక్షణంతోనే లక్ష్యాన్ని సాధించే మధురక్షణాన్ని..
లక్ష్యం నుండే నా జననం..
లక్ష్యం లోకే నా పయనం..
అక్షరాన్ని నేనక్షరాన్ని

విడిగా చూస్తే నా జీవితం అరక్షణం..
నిఘంటువులలో నా లోతు అహోబిలం
నా పరిధి శతసహస్ర జ్యోతిర్వర్షం
శబ్దార్థ సర్వస్వమూ నా సాక్షాత్కారం
అరుణ కిరణపు తీక్షణాన్ని, ధైర్యవంతుల లక్షణాన్ని..
క్షరాన్ని కాదు నేనక్షరాన్ని.. క్షయాన్ని కాదు నేనక్షయాన్ని..

నా మాతృ మూర్తి మాట వెంట నా విలువ అక్షరాలా అక్షరలక్ష..
నా మాతృ భూమి పాట వెంట లక్ష అక్షౌహిణుల పై మాటే..
శాఖా గ్రంథాలయాలలో నిక్షిప్తమైన అవక్షేపాన్ని..
విశ్వవిద్యాలయ ప్రశాఖల్లో అలక్ష్యమౌతున్న నిక్షేపాన్ని
సాహితీగవాక్షం నుండి వీక్షిస్తే విరూపాక్షుని విశ్వ రూపాన్ని..

నా ప్రాభవం గత జన్మపు మోక్షం
పద్యపు పల్లకీ కుదుపులకు చిక్కిన నుడికారపు నడుమును
నన్నయ నేర్పిన నడకకు.. తిక్కన తీక్షణనాదం తోడైతే..
పోతన పూసిన తేనె పూతను..
శ్రీనాథు శృంగార నైషధాన్ని.. నే నక్షరాన్ని

లుప్త శిల్పమై జవసత్వాలుడిగిన నాకు
దత్తాత్రేయుని పౌరుషరూపమిచ్చింది తెలుగు త్రిమూర్తులు...

ఇప్పుడు.. శ్రీశ్రీ రాబందుల రెక్కల చప్పుడుతో నిద్రలేచా..
మైలమ భీమన కలల ఖడ్గసృష్టి చేశా
దాశరథి అగ్నిధారనై రుద్రవీణనై పలికించా..
సినారె విశ్వంభరలో నక్షత్రాన్నై దారిచూపా
శేషేంద్రుని శేషజ్యోత్స్ననై.. ఎర్రకోరిక కోరా

ఇప్పుడు.. ఇప్పుడు..
ఇప్పుడు నే ప్రజా విప్లవ ప్రవాహ తాలోత్తాలపు తరంగాగ్రాన్ని..
ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతపు ఘీంకారాన్ని..
వెన్నెల్లో ఆడుకునే ఓ అందమైన ఆడపిల్ల ప్రతిరూపాన్ని.

అక్షరంలోని అంతరిక్షాన్ని.. మనోంతరిక్షంలోని అక్షర నక్షత్రాన్ని..
అక్షరాన్ని నేనక్షరాన్ని..

ఇప్పుడు.. నే సమాజపు ప్రక్షాళనకై నడుం కట్టిన వజ్ర దీక్షను
అనుమానపు అర్ధ విజ్ఞానం కాదు నే కోరేది..
పునఃపరీక్షతో పరిణతి చెందే పరిపూర్ణ జ్ఞానం
హెచ్చుతగ్గులక్కై ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతాలు కాదు...
ప్రేమ పూరిత గురుకులపు తడిఆరని అక్షరాల అపేక్ష సిద్ధాంతాలు..
ఆధునికత పేర వదిలేసే పద కాలుష్యాన్ని కారాదు..
పది మందిని పరిమళంతో పరామర్శించే పవిత్ర పుష్పాన్ని కావాలి..
నల్లబల్లపై శస్త్రచికిత్సల ఫలితంగా...
అక్షరగోదావరిలో గులకరాయిని కారాదు...
సాక్షాత్ సరస్వతీ సాక్షాత్కారాన్ని కావాలి...

నేనంటే..
ఒక అద్భుతానికి ఆశ్చర్యం...
ఒక విజయానికి ఆనందం..
ఒక బీభత్సానికి అశ్రుతర్పణం..
నేనొక... ఆర్తిని.. దయామూర్తిని..
నే కోరేది నిరక్షరకుక్షి మస్తిష్కంలోకి నా మహాప్రస్థానం..
నే కోరేది సుషుప్తావస్థలో ఉన్న సమాజపు చైతన్యం

నాకోరిక...
మానవతా ఉషోదయాన్ని తట్టిలేపే చైతన్యస్ఫూర్తిని...
లోక రక్షని కావాలని..
ఆ లక్ష్యం తీరేవరకు..
ఓ అద్భుత రాగం కోసం... కత్తి గాటుకు గురయ్యే మురళిలా..
ఆ కృష్ణుని రాక కోసం విరహోత్కంఠిత రాధికలా..
ఎదురు చూస్తూనే ఉంటా..
మరో వాల్మీకి జననం కోసం...
బోయవాని బాణానికి బలయ్యే పక్షిలా నిరీక్షిస్తూనే ఉంటా..
ఎన్ని సార్లు మరణించినా.. పుష్పిస్తూనే ఉంటా..
నాది తీరని ప్రేమ.. నేను అక్షరాన్ని..

యర్రంశెట్టి సతీష్ కుమార్,
హైదరాబాద్. 80080 01942

మాతృభూమికి హారతి

ప్రవాస భారతి

తెలుగుతనమంటే అదేదో మన నుంచి వేరైంది కాదు. పుట్టుకతోనే ప్రాప్తిస్తుంది. దాని పట్ల స్వాభిమానం ఉన్నంత కాలం ప్రకాశిస్తుంది. మనతో పాటు దేశ విదేశాలకూ పాకుతుంది. తెలుగు గడ్డ విడిచినా, ఇలా తెలుగుతనాన్ని వీడని ప్రవాసాంధ్రులు ఎందరో ఉన్నారు. వారి స్వరాష్ట్రాభిమానం వల్ల మన సంస్కృతి కొత్త కొమ్మలు తొడుగుతోంది. ఆస్ట్రేలియాలో తెలుగు సుమాల్ని విరబూయిస్తున్న 'ప్రవాసభారతి' దీనికి ఉదాహరణ.

ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ నగరం నుంచి 'ప్రవాసభారతి' అనే మాసపత్రిక వెలువడుతోంది. మల్లికేశ్వరరావు కొంచాడ, శ్రీనాథ్ అనే ఇద్దరు మిత్రులు దీన్ని ప్రారంభించారు. ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఆగస్టు 2011లో తొలిసంచిక విడుదలైంది. అక్కడి తెలుగువారి ఆదరణ బాగుండటంతో ఇది దినదిన ప్రవర్ధమానమవుతోంది. మెల్బోర్న్ దాటి అడిలైడ్, పెర్త్, సిడ్నీ, కాన్‌బెరా, బ్రిస్బేన్ నగరాలకు కూడా విస్తరించింది. ఐదువేలతో మొదలైన ప్రతుల సంఖ్య సంవత్సరం దాటకముందే పదివేలకు చేరుకుంది.

దీని ఆదరణకు ప్రధాన కారణం విషయ వైవిధ్యమే. ఆస్ట్రేలియాలో జరిగే తెలుగు కార్యక్రమాలు, స్థానిక వార్తలతో పాటు తెలుగు సంస్కృతికి అద్దం పట్టే విషయాలెన్నో ఉంటున్నాయి. ఆయా నెలల్లో వచ్చే పండగల విశిష్టతలు వివరిస్తున్నారు. ఈ దేశం నుంచి వెళ్ళి అక్కడ ఉన్నత స్థాయికి చేరుకున్నవారి స్ఫూర్తి కథనాలు అందిస్తున్నారు. 'భువన విజయం' శీర్షికన ప్రవాసాంధ్రుల కవితల్ని ప్రచురిస్తున్నారు. ధారావాహికలూ ఉన్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా, తెలుగు రాని తర్వాతి తరాల పిల్లల కోసం 'మన భాష' అనే శీర్షిక నిర్వహిస్తున్నారు. ఇందులో పొడుపు కథలు, వేమన పద్యాలు, మన తెలుగు ఆటల్ని గురించి ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వార్తావిశేషాలకు కూడా చోటు కల్పిస్తున్నారు.

ఇది ద్విభాషా పత్రిక. పుటలు ఒక వైపు నుంచి తెలుగులోను, మరో వైపు నుంచి ఇంగ్లిషులోను ఉంటాయి. దీనికి కారణమేమిటో సంపాదకుడు మల్లికేశ్వరరావు ఇలా వివరించారు: "చాలాకాలంగా ఇక్కడ స్థిరపడిన వారిలో కొందరు తెలుగు మాట్లాడగలరు గాని, చదవటం రాయటం రాదు. వారికి కూడా ఇందులో భాగస్వామ్యం కల్పించేందుకు ఇలా చేస్తున్నాం. పైగా, దీని వల్ల ఆస్ట్రేలియన్లకు కూడా మన విశేషాలు తెలుసుకునే అవకాశం కలుగుతుంది."

తెలుగు మాట వినపడటమే అరుదైన చోట తెలుగు అక్షరం కనపడటం అపురూపమే. అందుకే ఈ ప్రయత్నం మిత్రులిద్దరికీ మంచి పేరు తీసుకువచ్చింది. "ఇపుడు ఎక్కడికి వెళ్ళినా అంతా నన్ను అభి

పేగు బంధాల వారధి

ఈ పత్రిక ఆవిర్భావం మూలాల్లోకి వెళితే ప్రవాసాంధ్రుల జీవితాల్లోని మౌలిక సంఘర్షణ అవగతమవుతుంది. 'వాళ్ళకేం చక్కా డాలర్లలో సంపాదిస్తారు, కార్లలో తిరుగుతారు' అని కొందరు అనుకుంటారు. కాని ప్రవాసంలోని బాధేమిటో పడే వాళ్ళకే తెలుస్తుంది. గురజాడ అన్నట్టు దేశమంటే మట్టి కాదు. నైసర్గిక స్వరూపమూ కాదు. దేశం మన రక్త మాంసాల్లో ఇంకిపోతుంది. అక్కడి మనుషులు, భాష, ఆచారాలు, రుతువులు, ప్రకృతి వైనాలు... వీటన్నింటితో మనకు గాఢమైన అనుబంధం ఉంటుంది. దాన్నుంచి వేరయినపుడు మాత్రమే ఆ గాఢత ఎంతో, ఏమిటో తెలుస్తుంది. పుట్టినపుడు బొడ్డు తాడు కోసిన బాధ కాసేపే. కాని మాతృదేశంతో పేగు బంధం తెగితే ఆ బాధ జీవిత కాలం పట్టి పీడిస్తుంది. సాంత్వన పొందేందుకు ప్రవాసులు ఉన్న చోటునే తల్లి సంస్కృతిని పునఃస్థాపించుకునే ప్రయత్నం చేస్తారు. ఈ ప్రయత్నం ఒకరి వల్ల అయ్యేది కాదు కనుక, అందరూ ఐక్యమవుతారు. మన తెలుగువారిని కలిపేది తెలుగు భాష కనుక, అదే మా అందరి మధ్య వారధిగా నిలుస్తోంది. 'ప్రవాసభారతి' వెనుక స్ఫూర్తి ఇదే.

– మల్లికేశ్వరరావు కొంచాడ

నందిస్తున్నారు. అందరిదీ ఒకటే ఆనందం. 'నలభై యాభై సంవత్సరాల నుంచి ఇక్కడ ఉన్నాం. ఆస్ట్రేలియాలో తెలుగు అక్షరాలు ఎప్పుడైనా చూడగలమా అన్నది కలగా ఉండేది. ప్రవాసభారతి ద్వారా ఆ కల తీరింది' అంటున్నారంతా. అందరికీ సాహిత్యాభిరుచి ఉండదు. కాని పత్రికలు మాత్రం అంతా చదువుతారు. వాటి ద్వారానే ఎక్కువమందికి అక్షరాలతో అనుబంధం మిగులుతుంది. ఆ లోటు నాకు తెలుసు. కొందరైతే ఇండియా వెళ్ళినపుడు ఈనాడు పేపర్లు తెచ్చుకుని కొన్నాళ్ళపాటు వాటినే చదువుకుంటూ ఆ అనుభూతుల్ని నెమరు వేసుకునేవారు. అపుడే మాకు ఈ ఆలోచన వచ్చింది. ఒక్క మెల్‌బోర్న్‌లోనే నలభై వేల మంది దాకా తెలుగువారు ఉన్నారు. మొత్తం ఆస్ట్రేలియాలోనే లక్షమంది దాకా ఉన్నారు. వీరందరికీ ఒక తెలుగు మాధ్యమం అవసరమని గుర్తించాం. అదే 'ప్రవాసభారతి' ఏర్పాటుకు ప్రేరణగా నిలిచింది" అని తెలిపారు మల్లికేశ్వరరావు.

ఈ పత్రికను పాఠకస్వామ్యమే నడిపిస్తుందంటారు ఆయన. ఎందుకంటే, పత్రికలో ప్రచురితమయ్యే సమాచారం సింహభాగం పాఠకుల నుంచే వస్తుంది. రచనలు, కవితలు పంపడం మాత్రమే కాదు. తమ ప్రాంతాల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్ని, ఇతర వార్తా విశేషాల్ని కూడా పాఠకులే పత్రికలో ప్రచురితమయ్యేలా శ్రద్ధ తీసుకుంటారు.

నిజానికి ఈ పత్రిక ఇప్పటికిప్పుడు పుట్టిన ఉత్సాహ ఫలితం కాదు. ఆస్ట్రేలియాలో ఎప్పటి నుంచో సాగుతున్న తెలుగు సాంస్కృతిక అభివృద్ధికి ఇది ఫలశ్రుతి. దీనికి ముందు కూడా అనేక కార్యక్రమాలు జరిగాయి. పండగల సమయంలో ఉత్సవాలు, తెలుగు నాటకాలు, కళారూపాలు ప్రదర్శించడం వంటివి ఎన్నో చేశారు. భువనవిజయం అనే సంస్థని స్థాపించి, మెల్బోర్న్‌లోని ఔత్సాహిక కవులతో ఇష్టాగోష్ఠి జరిపారు. ఆ సంస్థ తరపున 'కవితాస్త్రాలయ' అనే సంకలనం కూడా తీసుకువచ్చారు. వీరికి ప్రభుత్వ సాయమూ లభిస్తోంది. ఆస్ట్రేలియా ప్రభుత్వం వలస దేశాల వారి అభివృద్ధిని ప్రోత్సహించేది కావడం వీరికి సదుపాయంగా ఉంటోంది. తెలుగువారి ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు అందుతున్నాయి.

పత్రిక ద్వారా జరగవలసిన కార్యక్రమాలు ఇంకెన్నో మా ప్రణాళికలో ఉన్నాయి అంటున్నారు మల్లికేశ్వరరావు కొంచాడ. పత్రిక నిలదొక్కుకుంది కనుక, ఇక వాటిపై దృష్టి సారిస్తామంటున్నారు. ముఖ్యంగా తెలుగుతో పరిచయమే లేకుండా పెరిగే ప్రవాసాంధ్రుల పిల్లల్లో తెలుగు పట్ల అభిరుచి, ఇష్టం పెంపొందించేందుకు కృషి చేయాల్సి ఉందంటున్నారు.

ఒకరకంగా ప్రవాసాంధ్రుల పరిస్థితి మన భవిష్యచిత్రాన్ని మనకు చూపుతుంది. మనమూ మన సంస్కృతికి పరాయిలమవుతున్నాం. మన భాషకు దూరమవుతున్నాం. మన మూలాల్ని విస్మరిస్తున్నాం. మన రాష్ట్రంలోనే మనం ప్రవాసులుగా మిగులుతున్నాం. ప్రవాసాంధ్రుల్ని హెచ్చరికగా కాకపోయినా, వారి కృషిని స్ఫూర్తిగా తీసుకుంటే అయినా, మనల్ని మనం కాపాడుకోగలమేమో.

కృతజ్ఞతలు

'ప్రవాసభారతి' ఆస్ట్రేలియాలో పంచుతున్న తెలుగు సౌరభాల గురించి మద్దుల జనార్దనరావు అధ్యయనం చేసి 'తెలుగు వెలుగు'కు తెలియజేశారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్, హైదరాబాద్‌లో ప్రత్యేకాధికారిగా పని చేసిన ఆయన కొన్నాళ్లు ఆస్ట్రేలియాలో ఉన్నారు.

తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణ కోసం జరుగుతున్న స్ఫూర్తిదాయక కృషిని మీరూ తెలియజేయండి. వీలు వెంబడి ఆ స్ఫూర్తిని అందరికీ పంచుకుందాం.

దిక్కుతోచని

భాషా బోధకులు

భాష సజీవంగా ఉండాలంటే... కొత్త తరాలకు దానితో అనుబంధమేర్పడాలి. ఇది మన సొంత భాష, దీన్ని సక్రమంగా నేర్చుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకుంటామన్న విశ్వాసాన్ని చిన్నారుల్లో కలిగించాలి. అప్పుడే వారు నేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తారు. భవిష్యత్తులో మరో పది మందికీ నేర్పిస్తారు. ఇది జరగాలంటే... విద్యార్థుల్లో భాషానురక్తి పెరిగేలా బోధించగలిగిన ఉపాధ్యాయులుండాలి, వారికి భాషపైన పట్టు, బోధనలో అంకితభావం ఉండాలి. అదృష్టవశాత్తూ మన రాష్ట్రంలో అలాంటి వారు ఉన్నారు. కానీ, వారికి నానా సమస్యలను సృష్టిస్తూ, తెలుగు భాషా బోధనపై వారు పూర్తి దృష్టి సారించలేని పరిస్థితి సృష్టిస్తోంది ప్రభుత్వం.

రవిచంద్రకుమార్

తెలుగు భాష పరిరక్షణకు, అభివృద్ధికి పాలకుల కృషి శూన్యమన్న సంగతి తెలిసిందే. దీనికి తోడు... రేపటి తరానికి నాణ్యమైన భాషా బోధననూ దూరం చేస్తున్నారు. రాష్ట్రంలోని భాషా పండితుల ఇక్కట్లు, వాటి మూలంగా తెలుగు బోధనపై పడుతున్న దుష్ప్రభావాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది.

ఇద్దరూ ఉపాధ్యాయులే. ఒకరు గణితాన్ని బోధిస్తారు. మరొకరు తెలుగు చెబుతారు. ఇద్దరి పని గంటలు సమానమే. వారి కష్టమూ ఒక్కటే. అయితే ప్రతిఫలాన్ని అందుకోవడంలో మాత్రం ఎంతో తేడా. గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలను బోధించే వారికి ఉన్న 'విలువ'... తెలుగు పండితులకు లేదు. తోటి ఉపాధ్యాయులకు భిన్నంగా పదోన్నతులకు దూరంగా, తక్కువ జీతాలతో పని చేయాల్సిన దుస్థితి వారిది.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వపు హక్కు - సమాన పనికి సమాన వేతనం)కు వ్యతిరేకంగా మన రాష్ట్ర పాఠశాల విద్యా వ్యవస్థలో పాతుకుపోయిన దుస్సాంప్రదాయమిది. మాతృభాషను బోధించే వారిపై సవతి తల్లి ప్రేమను కనబరుస్తున్న ప్రభుత్వాలు అంతిమంగా తెలుగు భాష మనుగడకు ఈ విధంగా కూడా తూట్లు పొడుస్తున్నాయి. రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల్లో పూర్తి అర్హతలున్న భాషా పండితుల కొరత, ఉన్న వారికి కూడా అరకొర సౌకర్యాలను కల్పించి - వారిని ఆవేదనకు గురి చేస్తున్న పాలకులు... వెరసి, వీటి ప్రభావం రేపటి తరంపై పడుతోంది.

మన రాష్ట్రంలో 20 వేలకు పైగా గ్రేడ్- 1, గ్రేడ్- 2 భాషా పండితులున్నారు. వీరిలో గ్రేడ్ - 2 పండితులు... 6, 7 తరగతులకు, గ్రేడ్ - 1 పండితులేమో 8, 9, 10 తరగతులకు బోధించాలన్నది నిబంధన. అయితే... సర్కారే స్వయంగా దీన్ని బేఖాతరు చేస్తోంది. గ్రేడ్- 1 పోస్టులకు పదోన్నతులు ఇవ్వకుండా గ్రేడ్- 2 వారి చేతే 8, 9, 10 తరగతి విద్యార్థులకు బోధన చేయిస్తోంది. దీని వల్ల ఆయా ఉపాధ్యాయులు అశాంతికి గురవుతున్నారు.

ఉపాధ్యాయుల నియామకాల సందర్భంలోనే విచిత్ర పరిస్థితి నెలకొంది. ఎస్జీటీ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, డీఎడ్; స్కూల్ అసిస్టెంట్లకు డిగ్రీ, బీఈడీలు అర్హతలు. అయితే... గ్రేడ్ - 1, గ్రేడ్ - 2 భాషా పండితులకు మాత్రం ఒకే అర్హతలను నిర్ణయించారు. సంబంధిత భాషలో ఓరియంటల్ టైటిల్, పండిత శిక్షణ (లేదా) సంబంధిత భాషతో డిగ్రీ, పండిత శిక్షణ (లేదా) సంబంధిత భాష మెథడాలజీ సబ్జెక్టులలో ఒకటిగా బీఈడీ అని చెప్పారు. ఒకే రకమైన అర్హతలున్న ఇద్దరిని తీసుకొచ్చి వేర్వేరు గ్రేడుల్లో, స్థానాల్లో నియమించడం అసమంజసం కాదా? గ్రేడ్- 2లో అవకాశం దక్కిన వారికి తమకు అన్యాయం జరిగిందన్న భావన

రాదా? అలా జరిగితే, దాని ప్రభావం బోధనపై పడదా?

వేతనాల విషయంలోనూ గతంలో ఉన్న నిబంధనలను ఇప్పటి ప్రభుత్వాలు రద్దు చేసేశాయి. 1974 పీఆర్సీలో ఎస్జీటీల వేతన స్కేలు 250 - 430. గ్రేడ్ - 2లకు 290 - 520. 1978 పీఆర్సీలో ఎస్జీటీలకు 450 - 700 ఉంటే గ్రేడ్ - 2లకు 530 - 850 ఉండేది. ఆ తర్వాత జరిగిన స్కేళ్ల రీగ్రూపింగ్‌లో గ్రేడ్ - 2, ఎస్జీటీలకు సమాన వేతనం చేశారు. గ్రేడ్ - 1 వారికి స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా వేతనాలిస్తున్నారు. అప్పటి నుంచి వస్తున్న పీఆర్సీల్లో ఇదే విధానం కొనసాగుతోంది. దీన్ని బట్టి చూస్తే ఉపాధ్యాయులందరికీ అందే వేతనం సమానం. కానీ... పదోన్నతుల్లో మాత్రం భాషా పండితులకు రిక్తహస్తం. ఎందుకంత చిన్న చూపు?



పదోన్నతుల్లో భాషా పండితులకు ఏ పాటి న్యాయం జరుగుతోందో చూద్దాం...

● ఏప్రిల్ 7, 2000న జీవో నం.43 వచ్చింది. దీని ద్వారా రెండు వేల మంది పీఈటీలను అప్‌గ్రేడ్ చేశారు. భాషాపండితులకు అవకాశం దక్కలేదు.

● 2001 మార్చిలో భాషా పండితుల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. పదోన్నతులు ఇస్తామని చర్చాంశాల (మినిట్స్)లో కూడా పేర్కొంది. కానీ, ఆ మాటను నిలబెట్టుకోలేదు. వీరిని పక్కన బెట్టేసి జీవో నం.163తో 15,968 మంది ఎస్జీటీలను ఆంగ్లం, సామాన్య శాస్త్రం స్కూలు అసిస్టెంట్లుగా చేసింది.

● ప్రభుత్వం మారాక కూడా 'పండితుల' బాధలు తీరలేదు. డిసెంబరు 31, 2004, ఫిబ్రవరి 18, 2005ల్లో భాషా పండితులతో అప్పటి పాఠశాల విద్యాశాఖ మంత్రి, కార్యదర్శులు చర్చలు జరిపారు. అప్‌గ్రేడ్ చేస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. కానీ, అదీ వాస్తవ రూపం దాల్చలేదు.

● 2007లో సక్సెస్ స్కూళ్ల పేరిట భాషా పండితుల పోస్టులను తప్ప మిగిలిన వాటన్నింటినీ అప్‌గ్రేడ్ చేశారు.

● నవంబర్ 10, 2008న జీవో నం.363 వెలువడింది. దీని ప్రకారం 15,555 మంది ఎస్జీటీలు స్కూలు అసిస్టెంట్లయ్యారు. ఎప్పట్లానే భాషా పండితుల పరిస్థితి ఎవరికీ గుర్తుకు రాలేదు.

మన రాష్ట్రంలో భాషా పండితులకు తీరని అన్యాయం జరుగుతోంది. ఉన్నత పాఠశాలల్లో అన్ని పోస్టులనూ అప్‌గ్రేడ్ చేశారు. భాషా పండితుల ఉద్యోగాలకు మాత్రం దాన్ని వర్తింపచేయలేదు.

— చుక్కా రామయ్య, ఎమ్మెల్సీ

● 2009లో 3258 మంది ఎస్జీటీలకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి ఇచ్చారు.

● సంవత్సరాల కిందటి మాట. అప్పట్లో జీవో నం.330 ఉండేది. 11.2.1982 నాటికి సర్వీస్‌లో ఉండి, గ్రేడ్ - 1 అర్హతలున్న గ్రేడ్ - 2 ఉపాధ్యాయులకు గ్రేడ్ - 1 జీతమివ్వాలన్నది దాని సారాంశం. అయితే... తర్వాత వచ్చిన ప్రభుత్వ పెద్దలు ఈ జీవోను రద్దు చేశారు. గ్రేడ్ - 2 పండితులను పదోన్నతులకు దూరం చేశారు. ఫలితంగా గ్రేడ్ - 2లుగా ఉద్యోగాల్లో చేరిన వారు ఆ హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోంది. ఎస్జీటీలుగా చేరిన వారు మాత్రం పదవీ విరమణ సమయానికి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా, మండల విద్యాధికారులుగా ఉంటున్నారు.

మరో వైపు శ్రమదోపిడీ. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టులను బోధించడానికి సగటున రెండు పోస్టులను కేటాయిస్తున్నారు. కానీ, తెలుగు, హిందీల బోధనకు మాత్రం ఒక్కొక్క పోస్టే! 450 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో కూడా 6-10 తరగతులకు బోధించడానికి ఒక్క పండితుణ్నే నియమిస్తున్నారు. అంత మందికి ఒక్కరు బోధించడమంటే ఎంత శ్రమించాలి? మరి అందుకు తగ్గ జీతం వస్తోందా అంటే, అదీ లేదు. గణితం, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రాల పోస్టులకు స్కూలు అసిస్టెంట్ స్థాయి ఇస్తున్నారు. భాషా పండితులను గ్రేడ్ - 2లోనే ఉంచుతున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధం.

భాషా పండితులకు పదోన్నతులు దక్కకపోవడం వల్ల వారొక్కరే నష్టపోవట్లేదు. 8, 9, 10 తరగతుల్లోని విద్యార్థులకు (2010 - 11 నాటికి 32 లక్షలకు పైచిలుకు) నాణ్యమైన తెలుగు రావట్లేదు. పదో తరగతి తర్వాత ప్రాచ్య కళాశాలల్లో ప్రీ డిగ్రీ, విద్వాన్, ఓరియంటల్ డిగ్రీ, డిగ్రీలో ప్రత్యేకంగా తెలుగు చదివి, పండిత శిక్షణ పొంది, గ్రేడ్ - 2లుగా చేరే వారికి 10, 15 ఏళ్ల బోధనానుభవం వచ్చినా సరే గ్రేడ్ - 1లు కాలేకపోతున్నారు. దాంతో ఇన్ని అర్హతలు, అనుభవం ఉన్న వారు 6, 7 తరగతులకే పాఠాలు చెప్పేందుకు పరిమితమవ్వాల్సి వస్తోంది. దీని వల్ల 8 - 10 తరగతుల విద్యార్థులకు భాషలోని మాధుర్యం, సాహిత్య విలువల సంగతి దేవుడెరుగు, కనీస ప్రమాణాలూ తెలియకుండా పోతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ నిష్పత్తి ప్రమాణాల ప్రకారం చూసుకుంటే ఒక్కొక్క జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ స్థాయి తెలుగు/హిందీ పోస్టులలో 200 మందికి పైగా పండితులను నియమించాలి. ఒక్కో జిల్లాలో 50, 60 పాఠశాలల్లో భాషా పండితుల పోస్టులను కేటాయించాలి.

పదోన్నతులు లేకపోవడం వల్ల భాషా పండితులవడానికి కొత్త వారు విముఖత చూపిస్తున్నారు. 2000వ సంవత్సరం వరకూ రాష్ట్రంలో వందకు పైగా ప్రాచ్య కళాశాలలు విద్యార్థులతో కళకళలాడేవి. నేడవి వెలవెలబోతున్నాయి. అలాగే, తెలుగు/హిందీ పండిత శిక్షణ కళాశాలలు 160కి పైగా ఉండేవి. నేడు వాటి సంఖ్య 128. ఈ కళాశాలల్లో చదివే వారికి భాషా పండితులుగా మాత్రమే ఉద్యోగార్హత ఉంటుంది. దశాబ్దాల తరబడి పదోన్నతులు దక్కకపోవడంతో వీటిపై ఆసక్తి చూపే వారూ గగనమవుతున్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే తెలుగు ఉపాధ్యాయులు, వారితో ముడిపడ్డ మన భాష భవిష్యత్తును ఊహించడానికే భయం వేస్తోంది.

తెలుగు పండితులు,
మార్కాపురం,
ప్రకాశం జిల్లా.
98493 72251

రాజాశ్రయం ఉన్నప్పుడే దేనికైనా రాణింపు. భాష కూడా అంతే. సాహితీవేత్తల కృషికి ప్రభుత్వ మద్దతు తోడైతే ఆ భాష ఎల్లకాలాల పాటు పచ్చగా ఉంటుంది. కొత్త తరానికి సులువుగా చేరుతుంది. ప్రస్తుతం కర్ణాటకలో ఇదే జరుగుతోంది. పాలకులు, నాయకులు, ప్రజల మాతృభాషానురక్తి, అంకిత భావాలతో అజరామరమౌతోన్న కన్నడ స్ఫూర్తిని మనమూ అందిపుచ్చుకుందాం.

కన్నడమే రాజ్యలక్ష్మి

కె. ఆదినారాయణమూర్తి

కన్నడ విధానసభ సమావేశాల్లో వినిపించేది ఒక్క కన్నడమే. సభాపతి, ముఖ్యమంత్రుల నుంచి శాసనసభ్యుల వరకూ అందరూ అందులోనే మాట్లాడతారు. సభకు సమర్పించే ముసాయిదాలు, సభ్యుల ప్రశ్నలు, మంత్రుల సమాధానాలు... సమస్తం ఆ భాషలోనే. అక్కడ అరుదుగా మాత్రమే ఆంగ్లం వినపడుతుంది. ఆదేశాల రూపకల్పన నుంచి జారీ వరకూ అన్ని రాతకోతలూ అధికార భాషలోనే. ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రధాన కార్యదర్శి నుంచి క్షేత్రస్థాయి అధికారుల వరకూ అందరూ కన్నడాన్నే అనుసరిస్తారు. అభిమానిస్తారు.

భాషాభివృద్ధే ధ్యేయం

కన్నడాన్ని కాపాడుకోవడానికి, కాలానుగుణంగా అభివృద్ధి చేసుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 1983లో అప్పటి ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే 'కన్నడ కావలు సమితి' పేరిట భాషా పరిరక్షణ కార్యక్రమాలను చేపట్టారు. ఆ తర్వాత 1992లో 'కన్నడ అభివృద్ధి ప్రాధికార' ఏర్పాటైంది. దీని అధ్యక్షుడికి క్యాబినెట్ మంత్రి హోదా కల్పించారు. సర్కారీ కార్యాలయాలను తనిఖీ చేయడం, కన్నడంలోనే అన్ని పరిపాలనా వ్యవహారాలు జరిగేలా చూడటం దీని విధి. అధికార భాషను విస్మరించే సిబ్బందికి వ్యతిరేకంగా... వారి వ్యక్తిగత నివేదికల్లో నమోదు చేసే అధికారమూ దీనికి ఉంది.

ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాల్లో స్నాతకోత్తర విద్యార్థులకు ప్రతి నెలా రూ. రెండు వేల వంతున ఏడాదికి రూ. ఇరవై వేలు మించకుండా నగదు చెల్లిస్తున్నారు. ప్రస్తుత ప్రాధికార అధ్యక్షుడు, సినీ నటుడు అయిన ఎం. చంద్రు పరికల్పన ఇది.

ఆంధ్రప్రదేశ్‌లోని ఉస్మానియా, ద్రావిడ; తమిళనాడులోని కామరాజు, మద్రాసు; మహారాష్ట్రలోని ముంబై, షోలాపుర విశ్వవిద్యాలయాలు, కేరళలోని కాసరగోడు కన్నడ స్నాతకోత్తర, పరిశోధన విభాగాల్లో ప్రస్తుతం దాదాపు వంద మంది విద్యార్థులు కన్నడ స్నాతకోత్తర విద్యను అభ్యసిస్తున్నారు. కేవలం విద్యార్థుల్ని ఆదుకోవటమే కాకుండా అక్కడి కన్నడ అధ్యయన కేంద్రాల మౌలిక వసతులపై కూడా 'ప్రాధికార' దృష్టి పెడుతోంది.

వ్యాపార సంస్థలు నామఫలకాల్ని కన్నడంలో రాయకుంటే రూ. పదివేల జరిమానా తప్పదు. ఈ ఉత్తర్వుల ఆలోచన కన్నడ అభివృద్ధి ప్రాధికారదే. దేవనహళ్ళి అంతర్జాతీయ విమానాశ్రయంలో మొదట్లో కన్నడ పత్రికలు దర్శనమిచ్చేవి కావు. చంద్రు చొరవతో ఆ సమస్య తీరింది.

అమ్మభాషకే ఆదరణ

కర్ణాటక సాంస్కృతిక శాఖకు ప్రభుత్వం ఈ ఏడాది రూ. 195 కోట్లు కేటాయించింది. గత ఐదేళ్ళలో ఈ మొత్తం గణనీయంగా పెరిగింది. ఈ శాఖ కేంద్ర కార్యాలయం పేరు... కన్నడ భవన. సాహిత్య, సంగీత - నృత్య, నాటక, లలిత కళ, శిల్ప కళ, యక్షగాన, అనువాద (కువెంపు భాషా భారతి), ఉర్దూ అకాడెమీలు, పుస్తక ప్రాధికార కార్యాలయాలు ఇందు

లోనే ఉన్నాయి. లిపి లేని భాషలైన కొడవ, తుళు, బ్యారీ భాషలకూ మంగళూరు, మడికేరి పట్టణాల్లో ప్రత్యేక అకాడెమీలు ఉన్నాయి. కొడగు ప్రాంతంలో గౌడ అనే తెగ భాషాభివృద్ధికీ మరో అకాడెమినీ స్థాపించనున్నారు.

కన్నడ సంస్కృతి శాఖ ఇప్పటి వరకూ నాలుగు వందలకు పైగా పుస్తకాలను ప్రచురించింది. తొమ్మిదో దశకంలో ముఖ్యమంత్రిగా ఉన్న జె.హెచ్.పటేల్ చొరవతో లోహియా సాహిత్యాన్ని కన్నడంలోకి అనువదించి తక్కువ ధరకు విక్రయించారు. సిరి సంపిగె పేరిట 14 జిల్లా కేంద్రాల్లో పుస్తకాల దుకాణాల్ని ప్రారంభించారు. త్వరలోనే తక్కిన 16 జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాటు కానున్నాయి.

మరోవైపు... కన్నడ సాహిత్య అకాడెమి ఐదు వందల కంటే ఎక్కువ పుస్తకాలనే ప్రచురించింది. సాహిత్యాన్ని సామాన్యులకు మరింత చేరువ చేసేందుకు అంతర్జాల వేదికను వినూత్నంగా వినియోగించుకుంది. 150 మంది కవుల కవితా గానాన్ని అక్కడ అందుబాటులో ఉంచింది. ఒక్కో కవి రాసిన ఐదేసి కవితల్ని వారి చేతనే పాడించటం విశేషం.

కన్నడ పుస్తక ప్రాధికార కూడా నాలుగు వందల పుస్తకాల్ని వెలువరించింది. కువెంపు భాషా భారతి వివిధ భాషలకు చెందిన 180 గ్రంథాల్ని కన్నడలోకి అనువదించింది. వీటిలో అయిదు తెలుగువి. సినారె, విశ్వనాథ సత్యనారాయణ, డి.విజయభాస్కర్ రచనలున్నాయి. ఒక్కో అకాడెమీకి ఏటా రూ.యాభై లక్షలు కేటాయిస్తున్నారు. చలం సాహిత్యాన్ని అనువదించదలచినట్లు పుస్తక ప్రాధికార అధ్యక్షుడు డాక్టర్ సిద్ధలింగయ్య వెల్లడించారు.

హంపిలోని కన్నడ విశ్వవిద్యాలయం భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తోంది. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత చంద్రశేఖర కంబార్ దీని తొలి ఉపకులపతి. ఇతర రాష్ట్రాలతో కన్నడకు ఉన్న సంబంధాలపై ఇది అధ్యయనం చేస్తోంది. కన్నడలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ మొదలైన పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు పాఠ్యపుస్తకాల్ని తర్జుమా చేస్తోంది. కన్నడను కంప్యూటర్లో సమర్థంగా వినియోగించుకునేందుకూ పాటు పడుతోంది. కర్ణాటక సరిహద్దుకు అవతల, ఇవతల ఉన్న కన్నడ పాఠశాలల్లో కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటోంది. ఆ పాఠశాలల్లోని పిల్లలకు రాష్ట్ర వృత్తి విద్యా కోర్సుల్లో అయిదు శాతం సీట్లను కేటాయించారు.

ప్రసిద్ధ సాహితీవేత్తలు యు.ఆర్.అనంతమూర్తి, చంద్రశేఖర కంబార్‌ల రచనలను పునర్ముద్రించడానికి కర్ణాటక ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వాటిని వివిధ ప్రభుత్వ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచాలనుకుంటోంది. అలాగే... వీరద్దరి రచనలను ఇతర భాషల్లోకి అనుదింప చేయాలని కూడా నిర్ణయించింది.

నిత్యం... ప్రజల పక్షం

సామాన్యుల బాగు కోసం కర్ణాటక సాహితీవేత్తలు ప్రజావ్యతిరేకమైన ప్రభుత్వ నిర్ణయాలను బహిరంగంగా వ్యతిరేకించడానికీ వెనకాడరు. గంగావతిలో జరిగిన కన్నడ సాహిత్య పరిషత్తు సమావేశంలో... పాలకుల అవినీతిని తీవ్రంగా నిరసించారు. దీనిపై రాష్ట్ర మంత్రి ఒకరు స్పందిస్తూ, ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో జరిగే పరిషత్తు సమావేశాల్లో సర్కారును నిందించడమేంటంటూ మాట్లాడారు. ఈ వ్యాఖ్యలను సాహితీవేత్తలు ఖండించారు. పరిషత్తు సమావేశాలకు కేటాయించే సొమ్ము ప్రజాధనమని, పాలకుల సొంత డబ్బు కాదని, ప్రజల పక్షాన గొంతెత్తే హక్కు తమకు ఉందని స్పష్టం చేశారు. దాంతో ఆ మంత్రి వెనక్కి తగ్గి క్షమాపణ చెప్పారు.

కన్నడ సాహిత్య పరిషత్తు ఏటా నిర్వహించే సాహిత్య సమ్మేళనాలకు రూ.పది కోట్ల వరకూ ఖర్చవుతుంది. ఇందులో దాదాపు యాభై శాతాన్ని ప్రభుత్వం భరిస్తోంది. ఈ సమ్మేళనాలకు విఖ్యాత సాహితీ వేత్తలు అధ్యక్షత వహిస్తారు.

విశ్వ లిపిగళ రాణి...

ప్రపంచ లిపులన్నిటికీ రాణి అంటూ భూదానోద్యమ పితామహుడు వినోబా భావే కీర్తించింది కన్నడాన్నే. ద్రవిడ కుటుంబంలో పుట్టి, కస్తూరి సువాసనలు పొదుపుకుని, 'కవి రాజమార్గ' లాంటి ప్రాచీన సాహిత్యానికి జన్మనిచ్చి, పంప, రణ్ణ, జణ్ణ తదితర కవిరాజుల మాటలకు అక్షరాలను అందించి... వారి కావ్యాలను అజరామరం చేసింది కన్నడమే. వర్తమానంలో అనంతమూర్తి, గిరీశ్‌కర్నాడ్ లాంటి ఎనిమిది మంది 'జ్ఞానపీఠ్' విజేతలకు దేశవ్యాప్త ఖ్యాతి తెచ్చిపెట్టిందీ ఈ భాషే.





కర్ణాటక ప్రభుత్వ ఉత్తర్వులిలా కన్నడ మాత్రమే...

ప్రజా భాగస్వామ్యమిది

భాషాభివృద్ధిలో ప్రజలూ పాలు పంచుకుంటున్నారు. రాష్ట్రావతరణ దినోత్సవాల్ని నవంబరు మాసమంతా ఊరూ వాడా ఘనంగా నిర్వహిస్తారు. అన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, కర్మాగారాల్లో కన్నడ సంఘాలున్నాయి. అవి పరిపాలనలో కన్నడ అమలుకు ఇతోధికంగా సహకరిస్తున్నాయి.

చివరగా...

రాష్ట్ర అవతరణ రోజున (నవంబర్ 1) ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కన్నడ భాష జెండాను ఎగరవేయాలనే నిబంధనను సర్కారు అమల్లోకి తేనుంది. కన్నడ అభివృద్ధి ప్రాధికార సిఫార్సు మేరకు ఈ విషయంలో ప్రభుత్వం స్పందించింది. మంత్రివర్గ నిర్ణయం త్వరలో ప్రకటితం కానుంది.

చీఫ్‌రిపోర్టర్,
ఈనాడు, బెంగళూరు.
099725 13029

దగడు

పెద్దింటి అశోక్‌కుమార్

రామదాసు కాలిగాలిన పిల్లిలెక్క ఇంట్లకూ బయటకూ తిరుగుతున్నడు. గడియకోసారి గడియారం సూసుకుంటున్నడు. పైకి నిమ్మళంగా కనిపించినా లోపల్లోపల భయపడుతున్నడు. మాటికోసారి సెల్‌ఫోన్ల ఎవలతోనో మాట్లాడుతున్నడు. తాపతాపకు తొవ్వలు జూస్తున్నడు.

ఇల్లు సందడిగా ఉంది. కడిగిన గచ్చు ఆరలేదు. తలుపులకు మొగురాలకు పూసిన రంగు వాసన గోడలకేసిన సున్నం వాసన కలె గలిసి ఘాటుగా వస్తుంది. వచ్చిన సుట్టాల బట్టలకు సున్నం మరుకలు అంటుతున్నయి.

రామదాసు బయిటికి వచ్చి వాకిట్ల నిలబడ్డడు. సౌప్పెరి గుంజలతో వాకిలి నిండా పచ్చని పందిరి ఉంది. వాడకట్టోళ్ళు కులపోళ్ళు కానుగాకు మోపులతో ఒక్కొక్కలు వత్తున్నరు. వచ్చిన వాళ్ళు వచ్చినట్టు తెచ్చిన మోపును ఇప్పి కానుగు కొమ్మలను పందిరి మీద కప్పుతున్నరు. మోపులు తెచ్చినోళ్ళకు చాయ పలారం పెడుతుంది పద్మ.

రామదాసు పందిరి కింద తిరుగుతుండు. మనుసులో ఎన్నో అనుమానాలు, భయాలు. నవీన్ ఎందుకు రాలేదు..? దేవరాజు ఏమన్న చేసిండా..? ఇప్పుడు ఎట్ల?

పందిరి గుంజలకు కట్టిన పిల్లగుంజలను సూడంగనే ఏదో యాది కచ్చింది రామదాసుకు. పిల్లగుంజల్ని మ్యానమామనే తెచ్చిపాతాలె. వెంటనే పద్మను పిలిచిండు.

పసుపులు ముట్టుడుకు అన్నీ సదురుకుంటున్న పద్మ ఆగమాగానవాకిట్లకచ్చింది.

"ఏంది... ఏమో పిలిత్తివి...." అడిగింది విసుగ్గా.

పందిరి గుంజలను సూపించి నవ్వుకుంట "మీ అన్నగిట్ల వచ్చిండా ఏంది? పిల్లగుంజలు పాతింద్రు.. నడిజాము రాత్రిదాకా పొయ్యస్తివి గదా!" అన్నడు. పైనకి తేలికగా అన్నా గుండె నిండా బరువు.

పద్మ కోపంగా చూసింది "వో... ఈ ముచ్చటకేనా పనాడ పిలిసినవు. పని పాతరపెట్టి సోకు జాతరవోయిందట. వత్తే నీకు కనవడకుంట పోతడా," అంటూ లోపలికి పోయింది.

రామదాసుకు ఉన్న కొద్దిగ ఆశ అడుగంటింది. ఏదో గులుక్కుంట పద్మ వెనుక నడిచిండు. పోంగవోంగ ఎనుకకు తిరిగింది పద్మ. భర్తను చూసి "అవునుగనీ.. వీడేడి. నిన్న పోయినోడు ఇంకా రాకపాయె. పసుపులు ముట్టాలె జెట్టన రమ్మను..." అన్నది.

అసలు సంగతి చెప్పుదామని నోరు తెరిచిన రామదాసు 'ఇంకా సుద్దాంలే' అనుకుని ఆగిపోయిండు. మరోసారి నవీన్‌కు ఫోను జేసిండు. పొద్దటి నుంచి వస్తున్న జవాబే ఆపు చేసిండని. భయంగా పెరట్లకు నడిచిండు రామదాసు.

పెరట్లో రెండు గాడిపొయ్యిలు మండుతున్నయి. కూరాళ్ళు చెయ్యడానికి కులం, చుట్టుపక్కల ఆడోళ్ళు వత్తరు, భోజనాలు చేత్తరు. వాళ్ల కోసం వంటలు తయారరయితున్నయి. రామదాసు ఇద్దరన్నలు ఒక తమ్ముడు వంటలు వండుతంద్రు. గడియ గడియకు భయం ఎక్కువైతుంటే కొయ్యకున్న అంగి తొడుక్కుని బయటకచ్చిండు.

వాకిలి దాటుతుంటే ఎదురచ్చింది పద్మ. "అగో... తలుగుతప్పదీసినట్టు ఇప్పుడెటుపోతున్నవు... పసుపులు ముట్టాలె. వానికి ఫోన్ చేసినవా లేదా..? ఎక్కడున్నడట..." అడిగింది.

'ఎక్కడున్నడో తెలిసినంక ఇంత ఆగం ఎందుకుంటది' అనుకున్నడు రామదాసు. ఆదుర్దలో ఏం చెప్పాలెనో అర్థం కాలేదు. " ఏ... యాడికిపోతున్ననే.. అడుగుకదులనియ్యవు. ఎప్పటికి నీ తోక పట్టుకునే నడువన్నా. సప్పుడోల్లను తోలుకత్త" అన్నడు. పద్మ చిత్రంగా చూసింది. "సప్పుడోల్లా... వాళ్లెట్లుంటరు. వచ్చినోళ్ళు సప్పుడోళ్ళు కాదా ఏంది? " అరుగు మీద కూసున్నోళ్ళను చూపిస్తూ అన్నది.

'అయ్యగొడుకులు ఇద్దరిద్దరే... పందిరి మీద గుండ్లు... పడేదాకా తెలువది' గులుక్కుంటూ ఇంట్లకు పోయింది పద్మ.

రామదాసు అడుగుల అడుగేసుకుంట 'ఏదన్న జాడ దొరుక్కపోతదా' అనుకుని గురుజు కిందికచ్చిండు. నవీన్ దోస్తు వెంకటి ఎదురయిండు. 'కనపడ్డడా' అని అడిగే లోపలనే "పెద్దబాపూ... నవీనేంది ఇంట్లకెళ్ళి ఎల్లుతలేడు. రెండు రోజులనుంచి పత్తలేడు జాడలేడు" అన్నడు.

మారు మాట్లాడలేదు రామదాసు. ఏదో చెప్పి దబదబ నడుచుకుంట కచీరు దగ్గరికి చేరుకున్నడు. అతని బిత్తిరి బిత్తిరి చూపులు అత్తర బుత్తర నడుక అందరికీ ఇసిత్రంగా అనిపించింది. మనిషికో మాట అంటుంన్రు. అందరికీ తలుకాయ ఊపుతండు రామదాసు.

"పిల్లగాన్ని తోలుకపోను వచ్చింన్రా.." మామ వరుసయ్యే కైలాసం అడిగిండు.

"ఇప్పుడే వత్తరా... పగటి యాళ్ల వరకత్తరు" ఇసుగ్గా అన్నడు రామదాసు. కైలాసం దగ్గరికి జరిగి చెవుల గుసగుసగా "అచ్చుడేందో పోవుడేందో... నీపని చెట్ల మీద గూసోని ఇస్తార్లు కుట్టినట్టుంది. మీ కోడలు పది మంది ఆడోళ్ళను ఎంటేసుకుని కొండపురం బోతంది. మీ బామ్మరిదైతే కావలే గాత్తండు" అన్నండు.

"ఎందుకు...?" భయంగా అడిగిండు రామదాసు.

"ఎందుకా..? ఎందుకేందిరా..

కొత్తగా అడుగుతున్నవు. వాళ్ళు పెండ్లిని చెడగొట్టేతట్టున్నరు" చెప్పుతుంటే బాపురెడ్డి వచ్చిండు. కైలాసం చెప్పుడు ఆపిండు. వత్త వత్తనే "ఏందిరా... దాసూ... గడ్డకెక్కి తెడ్డు సూపిచ్చుడంటే ఇదే. మ్యానపిల్లను గాదని ఎవలనో చేసుకుంటున్నవట. దేవరాజు నిన్ను ఎంత ఆదుకున్నడురా. వాడు నిలవడకుంటే నీ బతుకు ఎట్లుండురా. ఎన్నడో బొంద మీద గడ్డి మొలుసు. నీ అన్నదమ్ములే నిన్ను బుక్కవెడుదామని చూసిరి. ఇయ్యాల్ల వీడు అల్లమాయే వాడు బెల్లమాయె" అన్నడు.

రామదాసు గుండెల కలుక్కుమంది నాలిక సందుల ముల్లిరికినట్టు ఎటూ మాట్లాడరాలేదు. గోసోలె చూసిండు. కైలాసమే అందుకుని "బుద్ధి తెలిసిన పిల్లలు మనం చెప్పితె ఇంటరా బాపన్నా. ఇంటింటికి మంటిపొయ్యే. బంగారు పొయ్యి ఎవలకుంటది చెప్పు. కొడుకు ఇంట లేడట. సావనన్న సత్తగని ఆ పిల్లను ఇడువనంటుండట" అన్నడు.

బాపురెడ్డి చెడమిర్రగ మాట్లాడుతుండు. కైలాసంకు కోపమచ్చింది. "అయినా... బాపన్నా... ఈ కాలం పిల్లలు ఇంతేనే.. మన బాధలు ఇజ్జత్ వాళ్లకేం ముద్దు. నీ బిడ్డ మాత్రం నీ మాట విన్నదా.. సుట్టేడు బలుగాలకు మచ్చదెచ్చె" అన్నడు చూసి చూసి.

బాపురెడ్డి ఒక్క గడియకూడా నిలవలేదు. ఎవలో తరిమినట్టు లుంగి సదురుకుంట మాపీకిండు. అది చూసి కైలాసం నవ్వుకుంట "ఎవని వీపు వానికి కనవడదట, తన తప్పు తప్పుగాదట, తన కొడుకు దొంగ గాదట అన్నట్టు వీడుగూడ సాలు జెప్పవట్టే. దాసు.. ఏంగాదు భయపడకు పెండ్లంటే నూరేండ్ల పంట. పిల్లలకు ఇష్టంలేని పెండ్లీలు చెయ్యద్దు. ఇడుపుగాయిదాలకు తేవద్దు" అంటూ ఎల్లిపోయిండు.

రామదాసుకు మనుసున వడుతలేదు. కైలాసం చెప్పిన మాటలకు కార్యాలు కదులుతున్నయి. సునిత కొండపురం ఎందుకు పోయింది..? దేవరాజు ఎక్కడ కావలిగాత్తండు. వీళ్ల ప్లానేంటిది. ఏం జెత్తరు? నవీన్ను ఏమన్న జేసిరా ఏంది? వీడెందుకు రాకపాయే? ఆలోచించుకుంట పోతే అన్నీ ప్రశ్నలే!

నవీన్ పెండ్లి చూపులప్పుడు దేవరాజు అన్న మాటలు యాదికచ్చినయి రామదాసుకు. 'నేను ఎంత మంచోన్నో అంత చెడ్డోన్ని. ఇంత దాక నా మంచి తనమే చూసింన్రు. ఇప్పుడు నా చెడ్డతనం సూత్తరు. మ్యానమామను నేనుండంగ ఇంకొకడు ఎట్ల అడుగువెడుతడు. వాన్ని భూమ్మీద బతుకనిత్తనా? ' అన్నడు దేవరాజు. ఆ మాటలే ఇప్పుడు చెవులల్ల మోగుతున్నయి రామదాసుకు. దేవరాజు ఎంత మొండి మనిషో తెలుసు. ఆ మొండితనమే తనకు నీడనిచ్చింది. అదే ఇపుడు వణుకు పుట్టిత్తంది.

ఎవలు మాట్లాడిత్తున్నా పట్టించుకోకుంట ఇంటికి వచ్చిండు రామదాసు. వాకిట్ల బ్యాండు సప్పుడు. పసుపులు ముడుతున్నట్టున్నరు. ఇంట్ల నుంచి పాట. బెస్త మైసవ్వ పాట జోరుగా పాడుతుంది.

అల్లోనేరడల్లో... అల్లనేరడల్లో... మామిడాకు తోరణాలు మరి ఎవ్వలింట్లో అల్లోనేరడల్లో...

అల్లోనేరడల్లో... అల్లనేరడల్లో... మామిడాకు తోరణాలు రామాదాసింట్లో అల్లోనేరడల్లో...

'అబ్బర కొడుక... నవీన్ రానిది పసుపులు ముట్టరు. వాడచ్చినట్టున్నడు... యానంగ వచ్చెనో...' అనుకుంట దబ దబ నడిచి ఇంట్లకచ్చిండు. నవీన్ ఎక్కడ కనవడలేదు.

నడుమ ఇసుర్రాయి దాని చుట్టూ ఆడోళ్ళు. ఇసుర్రాయి మీద పసుపు కొమ్ములు పెట్టి రాయితో వక్కలు జేస్తున్నరు. పద్మ ఇసుర్రాయికి కంకణం కడుతూ వాళ్లను వీళ్లను జమకడుతుంది.

పద్మను పక్కకు పిలిచి "ఇదేందే... వాడు లేకుంటనే పసుపులు ముడుతున్నరు" అన్నడు రామదాసు దివాలుగా.

పద్మ గత్తరగావరలెక్కుంది.

"ఏం జెయ్యిమంటవు పది పన్నెండు గావట్టె... కూరాళ్ల భోజనాలు వెట్టాలె. కురాళ్ళు తేవాలే. ఐరెండ్లు కూరాళ్ళు జెయ్యాలే. వచ్చినోళ్ళు ఎంతసేపు ఆగుతరు. వాడు ఎప్పుడు గింతే. వత్తరనని కాకుంట జేత్తడు" అంటూ గిన్నె అందుకుని వచ్చినోళ్ల చెంపలకు గందం, కాళ్లకు పసుపు పెడుతుంది.

రామదాసు కడుపుల డప్పులేగినయి. వచ్చి డీలవడి కుర్చీల కూసున్నడు. పెండ్లి డ్రెస్సు ఇంక కొంత సామాను తెచ్చుకుంటనని నిన్న పగటియాల్లకు సిద్దిపేట పోయిన నవీన్ ఎక్కడున్నడో ఎందుకు రాలేదో అనుమానం మొదలయింది.

'పెండ్లి చెడగొట్టాలని దేవరాజే ఏదో చేసిండు. లేకుంటే ఇప్పటిదాక యాడుంటడు. ఎట్లగతీ... పద్మతోని చెప్పుదునా...' అనుకుంటుండంగనే వచ్చింది పద్మ. "జరాగితే కొండపురం నుంచి పిల్లగాన్ని తోలుక పోనత్తరు. పిల్లగాన్ని జెయ్యాలె. మైలపోలు దియ్యాలె. అగ్గోలె లగ్గమచ్చె అప్పుడు దొడ్డికచ్చెనన్నట్లు ఊర్లు తిరుగుడుకు వీనికి ఇప్పుడే తీరిందా... జెట్టన రమ్మన్న" అన్నది.

"వత్తడత్తడు.. నీపనిగానీ..." అలాలిసగా అన్నడు రామదాసు.

పద్మ యాష్టపడుతూ "నీ వచ్చుడు సల్లగుండ. నిన్నటి నుంచి ఇదే మాట. వత్తడు వత్తడు.. ఎప్పుడత్తడు పందిట్లకత్తడా" అంటూ ఎవలో పిలిస్తే అటుపోయింది.

అందరూ బోజినాలకు లేసిండ్రు. రామదాసు బీరిపోయి కూసున్నడు. "తమ్మీ.. గట్ల బీరిపోయినవేందిరా... మన చేతులేముంది చెప్పు... నాలుగు రోజులైతే ఈ కోపాలుండయి. అందరు కలిసిపోతరు. వానికి అల్లుడే దొరుకడా..? లెవ్వు.. లేచిగా బువ్వనో కూరనో సదురుపో... ఒక్కతి ఎంతగనమని తండ్లాడుతది" పక్కింటి ముత్తవ్వ మాటలతో ఉల్కిపడ్డడు రామదాసు.

ముత్తవ్వ అతని బాధను ఇంకో తరీక అర్థం చేసుకుంది. అప్పుడే అక్కడికి వచ్చిన గోపవ్వ ఈ మాటలిని "బాధుండదా వదినే.. వాడు లేకుంటే వీడెక్కడిది. ఆ ఊర్లెకెళ్ళి ఈ ఊర్లెకు తెచ్చి ఇల్లు నిలిపె. అన్నదమ్ములతోని కొట్లాడి ఆస్తివంచుకచ్చె. పైస, పలము ఎన్నో సగవెట్టె. మొగ పిల్లగాడున్నడని ఆశపడితే నవీన్‌గాడు ఇట్లజేసే" అన్నది బరువుగా.

రామదాసుకు బతుకంతా యాదికచ్చింది. అన్నదమ్ములతో తనకు భూములకొట్లాట, కావాలనే మంత్రాలత్తయని బదునాం జెయ్యడం, తెలువకుంట ఇంట్ల బొక్కల రాట్నం బెట్టి ఊరంతా పుకారు లేపడం, గోజలు గత్తరచ్చి సత్తె తనే మంత్రాలు చేసి చంపిన్నని ఊరంతా ఒక్కటి చెయ్యడం రాత్రికి రాత్రి ఇల్లు అంటువెట్టి చంపే ప్లాను వెయ్యిడం యాదికచ్చింది.

రామదాసు లేచిపెరట్లకు నడిచిండు. పద్మ వచ్చినోళ్ళకు బొట్టు పెడుతుంది. వదినె ఇస్త్రార్లు ఏత్తుంది. మరుదలు అన్నం పెడుతుంది. తమ్ముడు కూరలేత్తుండు. ఎవలి పనిలో ఆళ్ళున్నరు. అన్నీ చూసుకుంటున్నట్టు చూసి గోడగోడోలె నడుచుకుంట బయటకచ్చిండు.

అసలు సంగతి బయటకు ఎరుకైతే ఎంత అంగడైతదో తెలుసు. ఇంకా జూద్దాం. రాకపోతడా అనుకుంట సెల్‌ఫోన్ తీత్తండు. నవీన్‌కు కొడతండు, జేబులేత్తండు.

ఏవో పనుల మీద బయటకచ్చిన పద్మ ఒకటి రెండుసార్లు కోపంగా జూసింది. మూడోసారి మాత్రం అగ్గి మీద గుగ్గిలమయింది.

"ఏమాయె... తీరిందా.. లెవ్వంగనే గోడకొరిగినవు. ఇంట్లకచ్చి ఏదన్న పనిజేత్తె తప్పా..." అన్నది.

రామదాసు లెవ్వలేదు. పద్మ కదులలేదు. మాటలనుకున్నరు. అన్నం తిని మనుమరాలును తోలుకుని పోతున్న ముత్తవ్వ ఇద్దరిని చూసి ఆగి "తమ్ముడు బాధ పడుతండు పద్మా... మీ అన్న వదినె రాలేదని" అన్నది సదిరి చెప్పుతూ..

"ఏం జెయ్యాలె వదినే.. నాకు మాత్రం బాధ లేదా. కార్యం నడవాలని తండ్లాడుతున్నగనీ కడుపు చెరువయితంది. నిన్న కూరుకు రాత్రిదాక బతిలాడచ్చిన... అన్నా నా ఇల్లు నిలిపినవు, బతుకుదెరువు జూపినవు. నన్ను దూరంగొట్టకె అని కాళ్ళు మొక్కిన..." ఏడ్సుకుంట చెప్పింది పద్మ.

ముత్తవ్వ దగ్గరికచ్చి కండ్లు తుడిచి "ఏ.. ఊకో పిల్లా.. ఈ కోపాలు ఎప్పటికుంటయా... పెండ్లింట్ల ఏడువద్దు. లెవ్వు తమ్మీ.. లేచి అదో ఇదో సదురుపో" అన్నది.

బోజనాలు అయిపోయినట్టున్నయి కుమ్మరోళ్ల ఇంటికి కూరాళ్ల



కోసం అందరినీ కూడగొట్టింది పద్మ. ఐదుగురి వరుసన కుమ్మరోళ్ల ఇంటికి పోయిండ్రు. ఐదు వందల పదారు కట్నం పెట్టి ఐదు కూరాడు కుండలు ఐదు చిప్పలు తీసుకున్నరు.

"ఏమాయె... మరుదలా.. తమ్మున్ని ఎటుదోలినవు. కురాళ్ళు ఇచ్చెటప్పుడు ఇద్దరుండరా" కుమ్మరామెను అడిగింది పద్మ.

"ఏ... ఇవారుదాకుండె వదినే.. ఇప్పుడే మాయమైండు. అయినా కూరాళ్ళకు ఇద్దరెందుకు ఐరేండ్లు ఇచ్చెటప్పుడు ఉండాలె" కుమ్మరి అంజవ్వ అన్నది.

పద్మ బొట్టు పెట్టింది. అంజవ్వ ఎదురు బొట్టు పెట్టింది. కుండలు పట్టుకొని అందరు బయటకచ్చిండ్రు. దిక్కులు చూసుకుంట రామదాసు గూడా బయటకచ్చిండు. అంజవ్వ నవ్వుతూ "అదేంది వదినే.. బోజనానికి రమ్మంటలెవ్వు. ఎసరు పెట్టినవా లేదా.." అన్నది.

"ఆ.. నువ్వత్తవని ఎగిలివారంగనే పెట్టిన. పిలువకుంటె రావా ఏంది? పొయ్యిలు మీ తాత మెత్తుతడా.." నవ్వుకుంట నడిచింది పద్మ.

జేబుల సెల్ మోగింది. రామదాసుకు పాణమచ్చింది. ఆగమాగాన ఎత్తి 'అలో' అన్నడు. చేసింది నవీన్ గాదు, వియ్యంపుని తమ్ముడు. సరేనని పెట్టేసి పద్మ దగ్గరికచ్చిండు.

"వాళ్ళు పిల్లగాన్ని తోలుకపోనచ్చిండ్రట అనుమండ్ల గుడికాడ ఉన్నరట" చెప్పిండు.

పొద్దుగాళ్ల ఉన్న హుషారు లేదు పద్మకు "రాని... వత్తె నన్నేం జెయ్యిమంటవు. ఎత్తుకరమ్మంటవా" అన్నది.

"అదిగాదే.. ఇంట్ల పనులైనయా... ఎదురకద్దమా... అంటున్న" అన్నడు రామదాసు.

"ఏం పనులు.. ఆగుతయా.. ఎనుకాముందు అవ్వే అయితయి. చెరువుల బర్రెను దోలి కొమ్ములకు దరగట్టినట్టుంది. అసలోడే దిక్కు లేడు. ఏ పని జేత్తేముంది" అన్నది యాష్టగా.

'వత్తడు.. వత్తడు.. బస్సు దొరికిందో లేదో' అనుకుంట అన్నలను తమ్ముళ్ని ఎంటవెట్టుకుని చప్పుడుతో పోయిండు రామదాసు. ఎదురుకుని వచ్చేసరికి గంటయింది. ఇంటి సాకలితోని తొమ్మిది మంది వచ్చిండ్రు. సాకలి మల్లయ్య మొదలు అడుగువెట్టి కూరగాయల ముల్లె అందిచ్చిండు. పద్మ కూరగాయలు అందుకుని కాళ్లకు నీళ్ళిచ్చింది. ఆమె మొఖంల నవ్వులేదు.

వచ్చినోళ్ళు అన్నం తిన్నరు.

"బావా...పిల్లగాన్ని జెట్టన తయారు జెయ్యిండ్రి. మేముపోవాలె. అక్కడ మస్తు పనులున్నయి" అన్నడు ఇయ్యంపుని తమ్ముడు.

రామదాసు సల్లవడ్డడు. చెమటలు పుట్టినయి. ఆఖరుసారి పోన్ గొట్టిండు. అదే సిచ్చాఫ్. ఇంతదాక దాచిండు. ఇప్పుడు దాగదని తెలిసిపోయింది. భర్తలోని మార్పు చూసిన పద్మ భయం భయంగ దగ్గరికచ్చింది. కండ్లల్ల నీళ్ళు తిరిగినయి.

"ఏమాయె... వాడేడి... ఉన్నడా లేడా.. ఇప్పుడు ఊరంతా తిరిగి పెండ్లి పిల్లగాన్ని జెయ్యాలె" గుసగుసగా అన్నది

రామదాసుకు ఏడుపు ఆగలేదు. పొద్దంత ఉగ్గవట్టుకున్నడుగనీ ఇప్పుడు తన్నుకచ్చింది. "ఇగరా" అని పద్మను పక్కకు పిలిచి అసలు సంగతి చెప్పిండు. చెప్పినంక అతనికి బరువు దిగిపోయింది. పద్మ మాత్రం పిచ్చిదై పోయింది. ఇద్దరు రాతి బొమ్మలైపోయిండ్రు.

వచ్చెటోళ్ళు వత్తండ్రు, పోయెటోళ్ళు పోతండ్రు. నడిచే పనులు నడుత్తున్నయి. ఇద్దరికి మాత్రం మనసు మనసుల లేదు. మొదాలు రామదాసే తేరుకున్నడు.

"ఇగో.. ఇట్లగాదు. మనం బీరిపోతె కతనడువది. మీ అన్ననే ఏదో ప్లానేసిండు. నవీన్ను ఎక్కడనో దాసిండు. ఇప్పుడు సక్కగా మీ అన్న దగ్గరికి పోదాం. అడిగే తరీఖన అడుగుదాం. చెప్పకపోతే సక్కగా పోలీస్టేషన్కు పోదాం. తెగిన బొక్కన నూతిలదాక. ఎట్లయితె గట్లాయె" ధైర్యంగా అన్నడు రామదాసు.

పద్మ ఉలుకులేదు పలుకు లేదు. అట్లనే గోడకొరిగింది

కూరాడు కుండలు నింపుడుకు ఐదుగురి వరుసన బాయి దగ్గరికి పోవాలె. ఆడిబిడ్డ బాయిని సున్నం పసుపు కుంకుమతో పూదియ్యాలె. నీళ్ళు తీసుకురావాలె. అన్నీ చేతపట్టుకుని వచ్చిన రామదాసు అక్క ఇద్దరిని చూసి ఆగిపోయింది.

"ఏందే పద్మా... ఇద్దరిద్దరే పూర్తిగ గోడలైండ్రు. చిలుకలేని అన్న నీకు గాంక ఉన్నడు తియ్యి. అయ్యరాకపోతే అమాస ఆగుతదా.. అన్న రాకపోతే లగ్గమాగుతదా.. సప్పుడుతోని పక్కీరోళ్ళబాయికి పోవాలె నడువు..." అన్నది మందిలిస్తూ...

పద్మ కండ్లనీళ్ళను కండ్లళ్ళనే దాసుకుంటూ "మీరు నడువుండ్రి వదినే.. నేనత్త... పసుపు ఇసురాలే" అన్నది.

ఇద్దరినీ చిత్రంగా చూసి ఆమె ముందుకు పోయింది

"నడువు.. ఇప్పటికే లేటయింది. పోరన్ని ఏం జేసిరో" రామదాసు అన్నడు. కాని కదులలేదు.

"నేనేమంటున్న...పా..." అన్నదిగనీ కదులలేదు పద్మ

ఇద్దరు నువ్వానేనా అని పతుకులాడుతండ్రు. పోయి అడుగుడుకు ధైర్నమత్తలేదు. మూలలాగినట్టు ఒకలెనుక ఒకలు ఇల్లు దాటిండ్రు, సంది దాటిండ్రు, పెద్ద బజార్లకచ్చిండ్రు.

నిద్రల నడిచినట్టు నడుత్తండ్రు. ఇల్లు దగ్గరయితుంటే గుండెల దడపుడుతంది. ఎప్పుడైనా ఆ ఇంటికి పోవాలంటే నడక ఉరికినట్టుంటుండె. ఇప్పుడు అడుగుల అడుగేత్తుండ్రు. ఇద్దరికీ ఏడుపత్తంది. ఏమనాలె, ఏమడగాలె అని ఎవలకు వాళ్ళు మాటలు దేవులాడుకుంటుండ్రు.

ఇంటికి చేరుకునేసరికి ఇంటిముందట బ్యాండు సప్పుడుంది. వాకిట్లనే ఎదురైండు దేవరాజు. పద్మగొంతు తడారిపోయింది. తడిపిల్లు గొంటూ "అన్నా" అని పిలిచింది. కండ్లపొంటి నీళ్ళు గారుతున్నయి కాళ్ళు వణుకుతున్నయి. కడుపుల పేగులు కదులుతున్నయి. దుఃఖాన్ని ఆపుకుంట దమ్ము తీసుకుని "నా... కొడుకును ఏం జేసినవు... యాడ దాసినవు.. సంపుతవా" అంటూ ఇంటకు అడుగువెట్టింది.

లోపల జరిగేది చూసినంక ఇద్దరి కండ్లు తిరిగినయి. కిందపడబోయి ఒకలనొకలు పట్టుకున్నరు. ఏడుపు ఆగలేదు, నిలువు నిత్తారం కరిగి నీళ్లయిపోయిండ్రు.

నవీన్ పీటమీద కూసున్నడు, వదినె పెండ్లి బొట్టు పెడుతుంది, సునిత చెమ్కీలు అద్దుతుంది. అన్న తువ్వాల కప్పిండు. అన్న కొడుకు వేలుకు ఉంగరం పెట్టిండు, ముంగట మంగలారతి పట్టిండ్రు, నోట్ల చెక్కరి పోసిండ్రు, కొత్త తువ్వాల భుజాల మీద కప్పిండ్రు.

"చెల్లే.. రాండ్రి... యాల్లకచ్చిండ్రు... చూసినవా... దేవుడు ఎట్ల తోలుకచ్చిండో... నవీన్ నా ఇంటి అల్లుడు కావాలని ఆశపడ్డ. బాకి లేదు, కాలేదు. అన్నీ అనుకున్నట్టు కావు గదా! కనీసం పెండ్లి కొడుకునైనా చేసి పంపాలనుకున్న. మ్యానమామను గదా!" అన్నడు దేవరాజు.

ఎంత ఉగ్గపట్టుకున్నా దుఖం ఆగులేదు ఇద్దరికి.

ఇద్దరు నిలువు నిత్తారం దేవరాజు మీద పడి పక్కున పలిగిండ్రు.

ప్రముఖ రచయిత. ప్రభుత్వ ఉపాధ్యాయులు,
రామాజీపేట, కరీంనగర్ జిల్లా. 94416 72428

పుస్తకమే మస్తకం

'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో... మంచి పుస్తకం కొనుక్కో'

అన్నది హితోక్తి. ఉత్తమ గ్రంథాల విలువ అలాంటిది. అంతే కాదు... భాష బాగా అబ్బాలంటే పుస్తకాల్ని చదవటమే మార్గం. పుస్తకం మనిషికి మంచినేస్తం. అపారమైన జ్ఞాన సముద్రాన్ని ఆపోశన పట్టడానికి పుస్తకంలా పనికొచ్చేది మరొకటి లేదు. గ్రంథ పఠనం అలసట తీరుస్తుంది. సాహిత్య ప్రయోజనం చైతన్యస్థాయిని పెంచడమే కాదు... ఊరట కలిగించడం దిశానిర్దేశం చేయడం, అలసిన గుండెల సేద తీర్చడం కూడా.

ఆర్.వి.రామారావు

'తింటే గారెలే తినాలి వింటే మహాభారతమే వినాలి' అన్నది నానుడి. అక్షరాస్యత అంతగా పెరగని రోజుల్లో వినడానికే ప్రాధాన్యం ఉండేది. చదువు వచ్చిన వారు చదువుతుంటే చదువు రానివారు విని విషయం గ్రహించే వారు. కాని ఇప్పుడు అక్షరజ్ఞానం క్రమంగా పెరుగుతోంది కాబట్టి ఎవరి సహాయం లేకుండానే జ్ఞానం సంపాదించుకోవచ్చు. వింటే మహాభారతమే వినాలి అనడం చాలా ఔచిత్యంతో కూడిన మాట. మహాభారతంలో అనేకానేక విషయాలు ప్రస్తావనకు వస్తాయి. మహాభారతాన్ని నన్నయ తెలుగులో రాసినప్పుడు అది ఎవరెవరికి ఉపయోగపడుతుందో పెద్ద జాబితా ఇచ్చాడు.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
        ఆధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని
        కవి వృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
        ఐతిహాసికులితిహాసమనియు
పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ
        యంబని మహిగొనియాడు చుండ
వివిధ వేదతత్త్వ వేది వేదవ్యాసు
        డాదిముని పరాశరాత్మజుండు
విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై
        పరగుచుండజేసె భారతంబు

అంటే తన మహాభారతంలో ఎవరికేది కావాలంటే అది దొరుకుతుందన్నది నన్నయ భావం. అందుకే దానికి అంత ప్రశస్తి. రామాయణ, మహాభారతాలు చదవని వారికీ వాటిలో కథ స్థూలంగా తెలుసు. అవి మన సంస్కృతిలో అంతర్భాగం. ఒక తరం నుంచి మరో తరానికి వాటి విశేషాలు అందుతూనే

ఉన్నాయి. అన్ని గ్రంథాలూ ఇంత మహత్తరమైనవి కాకపోవచ్చు. కానీ ఎంత చెత్త పుస్తకంలోనైనా ఎంతో కొంత తెలుసుకోదగింది ఉంటుంది.

మానవ శరీరంలోని అన్ని అంగాలకూ వాడే కొద్దీ అరుగుదల ఉంటుంది. మెదడు మాత్రం వాడే కొద్దీ రాటుదేలుతుంది. మెదడుకు పదును పెట్టడానికి పుస్తకాలు చాలా తోడ్పడతాయి. పాఠశాలలోనో, కళాశాలలోనో విద్యార్జన పూర్తి అయిపోతుందనుకోవడం అపోహే. చదువు నిరంతరంగా కొనసాగించాల్సిన వ్యవహారం. చదవ నేర్చిన వారు మంచి పుస్తకాలు చదవక పోతే చదువురాని వారికీ వచ్చిన వారికీ తేడా ఉండదు అన్నాడు మార్క్‌ట్వైన్. టీవీలు, ఇంటర్నెట్‌ల వల్ల చదివే అలవాటు తగ్గిందన్నది వాస్తవమే. అయినా మంచి గ్రంథాలను ఉపయోగించుకునే వారి సంఖ్య ఇప్పటికీ గణనీయమే.

పుస్తక పఠన పద్ధతులు

చాలామంది పుస్తకాలు చదువుతారు. కాని చదివింది గుర్తుండదు. చదివిందంతా గుర్తుంచుకోవడం ఎవరికీ సాధ్యం కాకపోవచ్చు. కానీ చదువుతున్న కొద్దీ గుర్తుంచుకోవడం కూడా పెరుగుతుంది. చదివిన విషయాన్ని గుర్తుంచుకోవడంతోపాటు చదివిన విషయాలను ఆకళింపు చేసుకోవడం కూడా గొప్ప విషయమే. చదివి ఆకళింపు చేసుకుని అన్వయించుకునే శక్తి సంపాదించడం మరోదశ. ఈ మూడూ సమకూరితే దానికి తమ ఆలోచనలు కూడా జోడించి సరికొత్త సూత్రీకరణలు చేయడం చివరి దశ. ఆదశకు చేరుకున్న వారినే మేధావులు అంటాం. ఈ దశల్లో ఏ దశకు చేరతామన్న దాన్ని బట్టి చదివిన చదువులవల్ల ప్రయోజనం ఆధారపడి ఉంటుంది.

చాలామంది పుస్తకాలు చదువుతారు. కొద్ది మంది మాత్రమే అందులోని మంచి చెడ్డలను విశ్లేషించగలుగుతారు. విశ్లేషణా శక్తి పెరుగుతూ ఉంటే పఠనాసక్తి తదనుగుణంగా పెరుగుతుంది. అయితే దాదాపు పాఠకులందరూ తమకు ఆ పుస్తకం నచ్చిందో లేదో చెప్పగలరు కాని ఆ పుస్తకం చదివి ఏం గ్రహించారు అంటే అందరూ చెప్పలేకపోవచ్చు. కొన్ని కిటుకులు నేర్చుకుంటే పుస్తకం చదివిన తర్వాత ఏం గ్రహించగలిగామో చెప్పడం కూడా వీలవుతుంది. ఉదాహరణకు ఒక సినిమానో, నాటకమో చూస్తే అది నచ్చిందో, నచ్చలేదో, అందులో ఉన్న విషయాలు వాస్తవమో కాదో చెప్పగలం. అయితే ఎలా నచ్చింది, ఏం నచ్చింది, ఎందుకు నచ్చింది అన్న అంశాలు కూడా పరిశీలించగలిగితే విశ్లేషణాత్మకంగా చెప్పవచ్చు. ఏ సృజనాత్మక కళలో అయినా మూడు ప్రధానాంశాలు ఉంటాయి.

1. సౌందర్యాత్మకత (aesthetics)
2. వాస్తవికత (realism)
3. తాత్త్వికత (ideology)

సౌందర్యాత్మకత

ఒక సినిమానో, నాటకమో చూసినప్పుడు, ఒక పుస్తకం చదివినప్పుడు మనకు అది నచ్చడానికి, నచ్చకపోవడానికి అందులోని సౌందర్యమే కారణం. అది మన మనస్సునో, కంటినో, హృదయాన్నో తాకితే అది సుందరంగా ఉన్నట్టు, అందులో సౌందర్యాత్మకత ఉన్నట్టు లెక్క. బాగుండటం, బాగోలేకపోవడానికి ఇదే ప్రధాన కారణం. సుందరత అనేది వైయక్తికమూ కావచ్చు. సార్వజనీనమైందీ కావచ్చు. ఉదాహరణకు పూలన్నీ అందమైనవే. అందరికీ ఇష్టమే. కానీ ఆ పూలల్లో కొన్ని కొందరికి ఎక్కువ నచ్చుతాయి. మరి కొన్ని అంతగా నచ్చవు. ఈ ఇష్టాయిష్టాలు వైయక్తికమైనవి. దీనినే subjective beauty అంటాం. పూలన్నీ అందమైనవేనని అనడం సార్వజనీనమైన (objective), లేదా వస్తునిష్ఠమైన సౌందర్యం. అదే సహజ సౌందర్యం.

ఈ సౌందర్యం చాలా వరకు బాహ్యమైంది. దాదాపుగా దీన్ని అందరూ గ్రహించగలుగుతారు. ఆస్వాదించగలుగుతారు. అయితే కేవలం సౌందర్యం ఎల్లవేళలా ఆకట్టుకోకపోవచ్చు. ఆ సౌందర్యం కేవలం కాల్పనికం అయితే అందరికీ నచ్చదు. జీవిత వాస్తవికతతో మిళితమైన సౌందర్యం పాఠకుడి మీద చెరగని ముద్ర వేస్తుంది. ఆ సౌందర్యం ఆత్మను తట్టి లేపుతుంది. వాస్తవికతతో ముడిపడని సాహితీ సృజన కాలక్షేపానికి పరిమితం అయ్యే ప్రమాదం ఉంది. అందులో వాస్తవికత పాలు తక్కువ కాబట్టి జీవిత వాస్తవికతను ప్రతిబింబించక పోవచ్చు. ఏ భాషలో అయినా ఈ రకం సాహిత్యమే ఎక్కువ. కాలక్షేపానికి మాత్రమే ఉపకరించే సాహిత్యం వల్ల కూడా కొంత ప్రయోజనం ఉంటుంది. అది పాఠకుల సంఖ్యను, చదివే అలవాటు పెంపొందించడానికి ఉపకరిస్తుంది.

వాస్తవికత

మనం ఏ పుస్తకం చదివినా నచ్చిందో లేదో గమనించిన తర్వాత వేసుకునే రెండో ప్రశ్న అది వాస్తవమేనా అన్నదే. అది వాస్తవమైనదైతే, లేదా వాస్తవం కావడానికి వీలున్నదైతే ఆ రచన మనల్ని మరింతగా ఆకట్టుకుంటుంది. జీవిత వాస్తవాల్ని రచయిత వాస్తవికతగా మలుస్తాడు. కేవలం జరిగింది జరిగినట్టు చెబితే అది వాస్తవాన్ని ప్రతిబింబించినట్టు లెక్క. ఈ వాస్తవంలోనూ వైయక్తికమైన అంశాలూ ఉండొచ్చు, సార్వజనీనమైనవీ ఉండొచ్చు. వ్యక్తుల అనుభవాల పరిధిని విస్తృతం చేసి వాటిని సమాజానికి వర్తింపచేయడమే వాస్తవానికి వాస్తవికత స్థాయి కల్పించడం. ఇదే realism.

వాస్తవికత ఉన్న సాహిత్యం అంతా మేలైంది కాకపోవచ్చు. సమాజాభ్యుదయానికి తోడ్పడకపోవచ్చు. ఉదాహరణకు 'వేయిపడగలు' నవలలో విశ్వనాథ సత్యనారాయణ అందించిన సౌందర్యాత్మకత అపారమైంది. ఆయన చిత్రించిన సంఘటనలు వాస్తవికతకు దర్పణాలు. భూస్వామ్య సమాజ పతనావస్థను నిజాయతీగా చిత్రించారు. వేయిపడ

గల్లో ఒక్కొక్క పడగే ఎలా రాలిపోయిందో చూపించారు. చివరకు ఆ నవలలో కథానాయకుడైన ధర్మారావు అన్న ఒక్క పడగ మాత్రమే మిగిలిందన్న సత్యాన్నీ అంగీకరించారు. భూస్వామ్య వ్యవస్థ అంతరిస్తున్నందుకు విశ్వనాథ పడే బాధను ఈ నవల కళ్లకు కడుతుంది. కానీ ఆ దశ దాటి మరింత మెరుగైన దశకు సమాజ పయనం విశ్వనాథకు నచ్చలేదు. మళ్లీ వెనక్కు వెళ్లాలన్నది ఆయన ఆలోచన. ఆయన master realist, but a reactionary philosopher. మంచైనా, చెడైనా సమాజం ముందుకే వెళుతుంది అన్న సత్యాన్ని విశ్వనాథ జీర్ణించుకోలేకపోయారు. ఇదీ ఆయన తాత్త్విక దృక్పథం.

తాత్త్వికత

ఒక గ్రంథం చదివిన తర్వాత దానినుంచి ఏం గ్రహించాం అన్న విషయాన్ని పాఠకులందరూ ఆలోచించకపోవచ్చు. నీతి కథల్లోలాగా సృజనాత్మక సాహిత్యంలో విధిగా చివరన నీతిబోధ, నీతి వాక్యాలు ఉండకపోవచ్చు. కానీ రచన అంతా చదివిన తర్వాత ఆలోచిస్తే ఏం నేర్చుకున్నాం అని తెలుతుంది. ఆ నేర్చుకునే అంశంతో మనం ఏకీభవించవచ్చు. ఏకీభవించకనూ పోవచ్చు. రచయిత చెప్పదలచుకున్న సందేశాన్ని ఆ రచయిత తాత్త్విక దృక్పథమే పట్టిస్తుంది. వాస్తవాంశాలను గ్రహించే శక్తిని అలవరచుకుని భవిష్యత్ కార్యాచరణకు పురికొల్పే తాత్త్విక దృక్పథం సమాజ అభ్యుదయానికి తోడ్పాటు అవుతుంది.

ఇక్కడే మరో చిక్కు ఉంది. రచయిత ఒక అంశాన్ని చర్చిస్తున్నప్పుడు మంచికి, చెడుకు ప్రాతినిధ్యం వహించే పాత్రలను సృష్టించవచ్చు. రచయిత తాత్త్విక దృక్పథాన్ని బట్టి అతను ఏ పక్షాన ఉన్నాడో స్పష్టం అవుతుంది. ఉదాహరణకు రామాయణంలో రాముడి పాత్రను తీర్చిదిద్దింది, రావణుడి పాత్రను మలిచిందీ వాల్మీకే. అయితే వాల్మీకి తన తాత్త్విక దృక్పథాన్ని ఆవిష్కరించే క్రమంలోనే ఆయన రాముడి వైపు ఉన్నాడా, రావణుడి వైపు ఉన్నాడా అని తెలుతుంది. వాల్మీకి ఉద్దేశం రావణుడి వంటి లక్షణాలున్న వారిని త్యజించాలని, రాముడి వంటి ఉదాత్త లక్షణాలున్న వారిని అనుసరించాలని. ఏ రచనకైనా ఇదే సూత్రం వర్తిస్తుంది.

ముక్తాయింపు

ఏ కళాఖండంలోనైనా సౌందర్యాత్మకత, వాస్తవికత, తాత్త్వికత అన్న మూడు అంశాలూ ఉంటాయి. వాటిని గుర్తించగలగడం పాఠకుడు, శ్రోత, ప్రేక్షకుడి పరిశీలనాశక్తిపై ఆధారపడి ఉంటుంది. ఈ శక్తిని ఎంతగా పెంపొందించుకుంటే కళను అంతగా ఆస్వాదించగలుగుతాం. కాలక్షేపానికి పనికొచ్చేవి ఏమిటో, జీవితాన్ని సుసంపన్నం చేసుకునే సాహిత్యం ఏమిటో వింగడించగలుగుతాం. ఈ దృష్టితో చదవడం మొదలు పెడితే ఉత్తమ సాహిత్యం ఏదో పసిగట్టడం అసాధ్యం కాదు. దాన్ని విశ్లేషించడానికి పనికొచ్చే ఉపకరణాలను అందిపుచ్చుకోవడం అలవడుతుంది. ఈ లక్షణం పాఠకుడిని ఉబుసుపోక చదివే దశ నుంచి ఉత్తమాభిరుచితో చదివే దశకు చేరుస్తుంది.

అనుభవజ్ఞులైన పాత్రికేయులు,
పాత్రికేయ అధ్యాపకులు,
రచయిత, అనువాదకులు.
హైదరాబాద్. 96762 82858

జై కొట్టు



నేలపచ్చ చీరే గట్టిందో
నెమలిపూల రవికే తొడిగిందో
పొద్దునే బొట్టుగ బెట్టిందో
పొన్నపూలు కొప్పున జుట్టిందో
గాలి సోకితెచాలు
కాలి అందెల రవళి
మమ్ములను బ్రోచేది
అమ్మ నీ పాదధూళి
ఎన్ని జన్మలకైనా
కన్నతల్లివి నీవే
జై కొట్టు తెలుగుభాష
జనులు పాడగా
యుగమంతా నినదిస్తా
జగమే కొనియాడగా
॥నేలపచ్చ॥

కలలో కనుపాపలుగా
కాచినదీ తెలుగుభాష
ఇలలోన దీపికవై
పూసెనే మా తెలుగు శ్వాస
అన్నమయ్య పదకవితల
కన్నమయినది తెలుగు
కంచర్ల గోపన్న
కంఠసీమ పంట తెలుగు
త్యాగరాజ కృతి గీతిక
శృతిలయలై సుధను పంచ
మువ్వగోపాలుని పద
మువ్వలుగా నవ్వినది
॥జై కొట్టు॥

కట్టులోన బొట్టులోన
పట్టె ఉడుము పట్టులోన
మాటలోన, పాటలోన
నడిచె బ్రతుకు బాటలోన
తెలుగు జాతి ప్రత్యేకత
వెలుగులీను వేకువరా
ఎల్ల భాషలందు తెలుగు
ఎవరెస్టు శిఖరమురా
అమ్మపాల కమ్మదనం
తెలుగే అభిమానధనం
పలుకు పలుకున తేనియ
లొలుకు తెలుగు మొలక నవ్వుల
॥జై కొట్టు॥

ఆత్మగౌరవంతో తెలుగు
జాతిపరువు నిలబెట్టగ
తెలుగు భాష, సంస్కృతులను
ఎలుగెత్తి చాటుదాము
ప్రాచీనతతో తెలుగును
ప్రపంచాన నిలబెట్టగ
గత చరితల ఘనకీర్తిని
గళమెత్తి పాడుదాము
కలనైనా మరచిపోకు
కన్నది నిను తెలుగునేల
కలిమాయకు లోనవ్వక
కవిగానామృతము పంచ
॥జై కొట్టు॥

– డాక్టర్ అందెశ్రీ,
హైదరాబాద్.
98485 60986

ఆయన 'పలుకుబడి' అనితరసాధ్యం

డా॥కావూరి పాపయ్యశాస్త్రి

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 'నాది వ్యవహార భాష' అని ఏనాడో అన్నారు. తన రచనల్లో ఉన్నదంతా తెలుగు అనీ, అదే ప్రజల నిత్యశైలి అనేదే సారాంశం. ఆయనను 'పాషాణ పాక ప్రభువ'న్నారు జరుక్‌శాస్త్రి. విశ్వనాథ రాసినంత వ్యావహారిక తెలుగును మరెవరూ ఉపయోగించలేదన్నారు చేరాతల కర్త చేకూరి రామారావు. లోకోక్తులు, నుడికారాలు, జాతీయాలు, సామెతలు.. విశ్వనాథ కథలు, నవలలు, ఖండకావ్యాల్లో అనేకం. రామాయణ కల్పవృక్షంలోనూ అవే కొల్లలుగా లభిస్తాయి. 'భ్రష్టయోగి' ఆ కవి ఖండికల సంకలనం. ఇందులోనిదే 'గొంగళిపురుగు'. ఈ పద్యాల తెలుగు అతి స్వచ్ఛం. అత్యంత వ్యావహారికం.

॥వారి దొడ్డినుండి వ్రాలి మునగచెట్టు
వీరి దొడ్డిలోకి విరుగగాచె
పులుసుచారు పప్పు పులుసులకై, కోయు
కోయుమంచు కన్నుకొట్టి పిలిచె ॥

॥ గడయెట్టి వారికిని గ
న్పడకుండగ నెంత యొడుపునన్ గోసిన గ
న్పడెనే కన్పడె చివరకు
లడాయి క్రింద దిగె జెప్పి లాభము లేకన్ ॥

ఇదే ఖండికలోని భాష అంతా సులలితం, సుబోధకం. విరుగకాచె, కన్నుకొట్టి పిలిచె, ఒడుపుగ కోసినను, లడాయి, ఫరవా, నాల్గుకాడలు.. ఇలాంటివన్నీ విశ్వనాథ చెప్పిన వ్యవహారానికి ప్రమాణాలు.

'పసివాడు' ఖండికలో- 'ఏను మారాముపెట్టి పెట్లేడ్చుచుంటి.. నేడుపుడిపింప మా తండ్రి యవియవియును నిచ్చె, నవి పారవేసి నేనేడ్చుచుంటి'.. పద్యంలోనిదీ తేటతెలుగే. 'నాకొక విషజ్వరము వచ్చినది, ఎరుగను నన్ను నేను, మంచమ్ముపై బడియుంటి, నా జనని మందు త్రాగుమన్నది, విషమ్ము నాకది-గ్రహింపజాలనన్నాను నేను'. ఇదంతా, ఈ పదజాల మంతా గద్యాత్మకమే. సహజసిద్ధ పలుకుబడే. 'అంధభిక్షువు' ఖండిక అందరికీ తెలిసిందే. 'అతడు రైలులోనే బోయినప్పుడెల్ల నెక్కడో ఒక్కచోట దానెక్కు వాని అతని కూతురు నడిపించుచనుసరించు... అంతలో పాటనాపి తానచటనచట కాసుల డిగి కూతురు ముందుగా వినిర్గమించునాతడు-నేనందు మిగిలిపోదు'. ఇలా సాగిన ఈ గీతమాలికలోని భాషంతా మన వాడుకలోనిదే కదా.

'మధ్యాక్కరలు' తెలుగులో దేశిఛందస్సు. విశ్వనాథ ఇందులో పది శతకాలు రాశారు. శివునితో సాగించిన ఆత్మీయభాషణమంతా అసలు సిసలు తెలుగులోనే. 'కోరి, కబేళాకు మందగా తోలికొని పోవుచుండ దారి ప్రక్కనయున్న పచ్చిగడ్డిపై దారాడు పసుల తీరుగా నున్నది జనుల భోగాశ' (శ్రీగిరి శతకం). చావబోతూ కూడా చావని ఆశను గురించి అచ్చ తెలుగులో పలికిన పలుకులివి. 'తనివితీర నిన్ను రెండుచేతుల దాకగా వచ్చు: తిరుపతికిం బోయి యొడలి నగలెల్ల దీసి ఇచ్చెదరు; హర! వచ్చి నిను జూచి యొక నమస్కార మాచరించెదరు; నిట్టి వేషాలనెందరో వేతురు పప్పులుడకవు; అంతుపట్టని యట్లు దూరదూరానికరిగెడువాడ'. తీయని, తీరైన తెలుగుతో నిండిన ఇటువంటి పద్యాలెన్నో.

ఆయన కావ్యాల్లో అగ్రగణ్యం రామాయణ కల్పవృక్షం. తెలుగువారి మాటతీరు, వ్యవహార రీతి, పలుకుబడులు, చమత్కారాలు.. సకల జీవనవిధానాన్నీ ఇందులో చూపించారు. 'అచ్చమైన అమృతమమరులు త్రావినారోయి దానికే నసూయపడను' అనేదే మొదలు నుంచి ఆఖరిదాకా జిలుగులీనింది. రామాయణ కల్పవృక్షంలో రాముడు, సీత వంటి పురాణ పాత్రలున్నా - తెలుగు కుటుంబంలోని మన్ననలు, ఆప్యాయతలు, పద్ధతులూ ఆ పాత్రలతో పాటే సహజీవనం చేస్తాయి.

దశరథుడు సుమంత్రునితో మాట్లాడిన వాటిల్లో తెలుగుతనమెంతో. ఒకచోట గురువు... మందింకొకచోనన్నట్లు.. వంటి సామెతలు సందర్భోచితంగా మనం ఉపయోగించేవే. తాంబూలంబు దయసేయించినచో.. అనే మాటలూ అలాంటివే. ముండ్లపై కూరుచున్నటుల; పిల్లయు మేకయు; రాజునకును గన్నీళ్ల పర్యంతమయ్యె.. లాంటి జాతీయాలు కూడా భాషకు వన్నెతెచ్చేవే. ఊపిరియాడకుండ దినుచుందురు; చిటారుకొమ్మెక్కినాడు.. ఈ మాదిరి ప్రయోగాలూ కనిపిస్తాయి.

ఈ ఉదాహరణలన్నీ బాలకాండ ప్రారంభంలోనివే. అంత గుండెమెత్తన గల స్వామి అంటూ రాముని గురించి ప్రజలు పలికినా, 'బిడ్డలకు గూడదమ పేర్లుపెట్టుకున్న మనల నిటుసేయుటయు న్యాయమా' అని బాధపడినా అన్నీ తెలుగు పలుకుబడులే. రాముడి మెత్తటి హాస్యపు మాటలన్నిటిలోనూ తెలుగువారి తీరుతెన్నులన్నీ ప్రతిఫలిస్తాయి. అడవిలో కాపురమున్న సీతారాములు అచ్చపు తెలుగువారు. చెంబుతప్పేళలు భుజాన వేసుకొని కదిలివెళ్లారనడంలోనూ తెలుగుతనం అనంతం. ఇలా ఉదహరిస్తూపోతే ఆయన పలుకుబడులను బండ్లకెత్తవచ్చు. తన కల్పవృక్షాన్ని తెలుగు రామాయణమనే చెప్పుకొన్నారు. తెలుగు రుతువుల్లోనూ అంతటి వైభవాన్నే చూపారు. కిన్నెరసాని పాటల్లోనివి అందరినీ అబ్బురపరిచేవే. తెనుగు వంపు, మెత్తన, తెనుంగు ప్రతిభ కిన్నెరసానిలో ప్రతిఫలించు అన్నారాయన. ఇవే మాటలు ఇతర రచనలకీ వర్తిస్తాయి. ■

ప్రముఖ పద్యకవి, విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు. భద్రాచలం, ఖమ్మం జిల్లా. 98484 21964

లాభం 1.. 2..

కొన్ని సామెతలు కూడా ఎగుమతి వ్యాపారం నుంచే పుట్టినట్టుగా తెలుస్తోంది. 'సింగినాదం జీలకర్ర' అనే సామెత 'శృంగనాదం, జీలకర్ర' నుంచి పుట్టిందని ప్రతీతి. జీలకర్ర ఓడ వచ్చినపుడు 'శృంగ నాదం' వినిపించేవారట. ఆ శబ్దం విని వ్యాపారస్తులు, ఓడ కూలీలు ఓడ దగ్గరకు వచ్చే వారట.

డా.ఎం.సి.దాస్

క్రీస్తు పూర్వం రెండు వందల సంవత్సరాలు, క్రీస్తు తర్వాత మరొక రెండు వందల సంవత్సరాలు పరిపాలించిన శాతవాహనాంధ్రులు, ముఖ్యంగా గౌతమీ పుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి, విదేశీ వ్యాపారానికి ఎంతగానో ప్రాముఖ్యత ఇచ్చారు. కృష్ణా జిల్లాలోని ఘంటసాల, గూడూరు, అవనిగడ్డ రేవుల నుంచి రోము, ఇటలీ, బర్మా, చైనా, సయాం, తూర్పు సముద్ర తీర దేశాలతో విదేశీ వ్యాపారం కొనసాగింది. భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా శ్రీకాకుళం జిల్లాలో మాంగనీసు ఖనిజం దొరికినట్లు చరిత్ర చెబుతోంది. అక్కడి నుంచి విదేశాలకు ఈ ఖనిజం 1892 నుంచీ ఎగుమతులు జరిగినట్లు దాఖలాలున్నాయి. దీని వల్ల మన వ్యాపార భాషలో స్థానిక పదాలకు అన్యభాషా పదాలు వచ్చి చేరాయి.

కొన్ని సామెతలు కూడా ఈ ఎగుమతి వ్యాపారం నుంచే పుట్టినట్టుగా తెలుస్తోంది. 'సింగినాదం జీలకర్ర' అనే సామెత 'శృంగనాదం, జీలకర్ర' నుంచి పుట్టిందని ప్రతీతి. జీలకర్ర ఓడ వచ్చినపుడు 'శృంగనాదం' వినిపించేవారట. ఆ శబ్దం విని వ్యాపారస్తులు, ఓడ కూలీలు ఓడ దగ్గరకు వచ్చే వారట. 'ఎక్కడయినా బావ గాని, వంగతోట దగ్గర కాదు' అనే సామెత కూడా వ్యాపారం లో మొహమాటాలు కూడవని తెలియజేస్తుంది.

వ్యాపార, వర్తక, వాణిజ్య, పరిశ్రమలకు తెలుగు భాషలో చక్కటి నిర్వచనాలు ఉన్నాయి. 'వ్యాపారం' పరిధి విస్తృతం. వర్తక, వాణిజ్య, పారిశ్రామిక వ్యాపకాలన్నీ వ్యాపార పరిధిలోనివే. కొనుగోలు, అమ్మకాల వ్యవహారాలు వర్తకమైతే వాటికి సంబంధించిన గిడ్డంగులు, రవాణా, బీమా, రుణ సదుపాయాలు మొదలైన వాటిని వాణిజ్యమంటారు. ఇక వస్తువులను గానీ సేవలను గానీ ఉత్పత్తి చేసే ప్రక్రియను పరిశ్రమ అంటారు.

మన లెక్కలు మనకుండేవి. రూపాయికి పదహారణాలు, అణాకి నాలుగు కానీలు, కానీకి మూడు దమ్మిడీలు! ఒకప్పుడు హరిదాసులకు దమ్మిడీలు పడేవట. కానీ పడితే ఆ సభలో ఎవరో ఉదార స్వభావుడున్నట్టు లెక్క.

అలాగే సోల, అడ్డ, కుంచం ధాన్యాలు కొలవడానికి ఉపయోగించే వారు. దూరాన్ని కూడా కోసులలో కొలిచేవారు.

చిన్నప్పుడు నేర్చుకున్న ఎక్కాలు ఇప్పటికి లెక్కలు కట్టడానికి ఉపయోగపడుతున్నాయి. పాలవాళ్ళు వేసినంత తొందరగా లెక్కల పట్టభద్రుడు కూడా లెక్కలు వెయ్యలేడు. రోజుకి రూపాయి ముప్పావలా చొప్పున ముప్పైరోజులకి లెక్క కట్టాలంటే ముప్పై రూపాయిలు, ముప్పై అర్ధలు పదిహేను రూపాయిలు, ముప్పై పావలాలు ఏడున్నరగా విడదీసి, వాటిని కలుపుతారు. అదొక సులభపద్ధతి. వ్యాపార గణక శాస్త్రంలో తెలుగులో ఉన్నన్ని పదాలు మరేభాషలో లేవంటే అతిశయోక్తి కాదు. వ్యాపార లావాదేవీలను వ్యవహారాలుగా విభజించడం, వాటిని జమా ఖర్చులలో వేసి చివరకు అంకణా తేలుస్తారు. అంకణా సమానమైనప్పుడే ముగింపు లెక్కలు తయారు చేస్తారు. ఈ ముగింపు లెక్కలో లాభనష్టాల ఖాతా, ఆస్తి అప్పుల పట్టీ తయారు చేస్తారు. ఇక్కడొక విషయం గమనించాలి. వ్యాపార గణక శాస్త్రానికి, గణాంక శాస్త్రానికి తేడా ఉంది. గణక శాస్త్రం అంటే లెక్కలు తేల్చడం, గణాంక శాస్త్రమంటే లెక్కలు కట్టడం.

వ్యాపారస్తుల దగ్గర కొన్ని చిట్కాలుండేవి.

కొనేటప్పుడు లాభం, ఒకటి, రెండు... అని లెక్క పెట్టేవారు. అంటే పది వస్తువులు కొంటే పదకొండు వచ్చేవి. అమ్మేటప్పుడు ఒకటితో మొదలు పెట్టి కొలిచేవారు. అంటే అమ్మేటప్పుడు పదివస్తువులు మాత్రమే వెళ్తాయి. అలాగే పూర్వం ధాన్యం కొలిచేటప్పుడూ 'పుట్టెకు సెలగ' అని పక్కన పెట్టేవారు. పుట్టెడు అంటే ఇరవై కుంచాలు. పుట్టెడు లెక్క కట్టి పక్కన ఒక కుంచం ధాన్యం సెలగ కింద పెట్టేవారు. చివరకు ఎన్నిపుట్ల ధాన్యం అయ్యిందో తెలుసుకోడానికి. అయితే చివరకు ఆ సెలగలన్నీ కొనుగోలుదారుడు తీసుకునేవాడు. అంటే వ్యాపారస్తుడు 20 పుట్ల ధాన్యం కొంటే సెలగల ద్వారా మరోపుట్టెడు ధాన్యం తీసుకునేవాడు.

అంకెలు చెప్పేటపుడు ఆరు అయ్యాక ఏడు అనే వాళ్ళు కాదు. 'ఏడు' అనడం అమంగళకరంగా భావించేవారు. అందుకే 'ఆరున్నొక్కటి' అని తరువాత 'ఎనిమిది' చెప్పేవారు. దీన్నుంచే 'ఆరున్నొక్కరాగం' అందుకున్నాడు అని ఏడవటం గురించి వ్యంగ్యంగా చెప్పడం మొదలై ఉండొచ్చు.

అసలు డబ్బు చలామణీలోకి రాక ముందు వస్తువినిమయం ఉండేది. అంటే వస్తువుకు వస్తువు ముదరా యిచ్చి వ్యాపారం చేసేవారు. ఆ వస్తువినిమయం సుగమం చెయ్యడానికి సంతలు నెలకొల్పారు. మన 'సంత' పదంలో నుంచే 'షేండీ' అనే ఇంగ్లిషు పదం వచ్చింది. ఎవరు ఉత్పత్తి చేసిన వస్తువులు వారు యీ సంతలకు తీసుకు వచ్చి వినిమయం చేసుకునేవారు. ఇందులోంచే వినియోగం అనే పదం పుట్టింది. అంటే వినియోగానికి వినిమయం అవసరం.

వస్తు వినిమయంలోని ఇబ్బందులను అధిగమించడానికి 'డబ్బు' పుట్టింది. మొట్టమొదట జంతువులను డబ్బుగా వాడుకునేవారు. డబ్బుకు సంబంధించిన 'పెక్యూనియరీ' అనే ఆంగ్ల పదం 'పెక్యూనీయా' అనే గ్రీకు పదం నుంచి పుట్టింది. ఆ 'పెక్యూనియా' అనే పదం 'పీకస్' అనే పదం నుంచి వచ్చింది. 'పీకస్' అంటే 'ఎద్దు' అని అర్థం. దీన్ని బట్టి ఒకప్పుడు ఎద్దులనే 'డబ్బు'గా వాడే వారు అని తెలుస్తోంది. ప్రాచీనకాలంలో ఆవుల్నీ ధనంగా భావించేవారు.

ఇప్పటికి కొన్ని జిల్లాల్లో పశువులను 'సొమ్ములు' అంటారు. గొర్రెలు, మేకలు, బానిసలను కూడా 'డబ్బు'గా వాడిన రోజులున్నాయి. ఆ తర్వాత వస్తువులను డబ్బుగా వాడటం ప్రారంభమయింది. పక్షి ఈకలు, రాళ్ళు, పూసలు, గవ్వలు, ధాన్యం, ఉప్పు మొదలైనవి 'డబ్బు'గా వాడారు. అందుకే 'మీ ఉప్పు తిని బతుకు తున్నాను' అనే నానుడి వాడుకలోకి వచ్చింది. రోమ్ నగరంలో వేతనాలు ఉప్పు రూపంలో ఇచ్చేవారు. అందుకే 'సేలరీ' అనే ఇంగ్లిషు పదం 'సాల్ట్' అంటే ఉప్పు అనే పదంలోంచి వచ్చింది.

తర్వాత పరిణామక్రమంలో లోహాలు, కాగితాలు, ప్లాస్టిక్ ముక్కలు, సైబర్ డబ్బులు ఇలా డబ్బు అనేక రూపాంతరాలు చెందుతోంది. జపాన్‌లో 'అరచేతి డబ్బు' అనే ఒక ప్రక్రియ వాడుకలో వుంది. అంటే ఒక దుకాణానికి వెళ్ళి వస్తువులు కొనుగోలు చేసి ఆ మూల్యం చెల్లించడానికి అక్కడ ఉన్న యంత్రం మీద అరచేతిని ఉంచితే చాలు, ఆ దుకాణం ఖాతాలో జమ, కొనుగోలుదారుని ఖాతాకు ఖర్చు పడిపోతుంది. 'అరచేతిలో స్వర్గం' అంటే ఇదే కాబోలు!

కన్యాశుల్కం నాటకంలో గిరీశం 'నావంటి బుద్ధిమంతుడు తొందరపడి ఏపనీ చెయ్యకూడదు. లాభనష్టాలు బేరీజు వేసి జమాఖర్చు చూసుకుని మరీ డిసైడ్ చెయ్యాలి' అంటాడు, బుచ్చమ్మను పెళ్ళాడాలా వద్దా అన్న మీమాంసలో! సాహిత్యంలోనే కాదు వాణిజ్యంలో కూడా తెలుగు తియ్యదనం పటిష్ఠంగా ఉంటుంది మరి!

ఆంధ్రా లయోలా కాలేజీ, వాణిజ్యశాస్త్ర శాఖ అధ్యక్షుడిగా పని చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలకు సలహాదారు. విజయవాడ. 99486 56111

మన సంఖ్యామానం!

ఒకటి	= 1	శంఖము	= 1000000000000000000
పది	= 10	మహా శంఖం	= 10000000000000000000
నూరు	= 100	క్షితి	= 100000000000000000000
వెయ్యి	= 1000	మహా క్షితి	= 1000000000000000000000
పది వేలు	= 10000	క్షోభం	= 10000000000000000000000
లక్ష	= 100000	మహా క్షోభం	= 100000000000000000000000
పది లక్షలు	= 1000000	నిధి	= 1000000000000000000000000
కోటి	= 10000000	మహా నిధి	= 10000000000000000000000000
దశ కోటి	= 100000000	పరాతం	= 100000000000000000000000000
శత కోటి	= 1000000000	పరార్ధం	= 1000000000000000000000000000
సహస్ర కోటి (అర్బుద్ధం)	= 10000000000	అనంతం	= 10000000000000000000000000000
న్యార్బుద్ధం	= 100000000000	సాగరం	= 100000000000000000000000000000
ఖర్వం	= 1000000000000	అవ్యయం	= 1000000000000000000000000000000
మహా ఖర్వం	= 10000000000000	అమృతం	= 10000000000000000000000000000000
పద్మం	= 100000000000000	అచింత్యం	= 100000000000000000000000000000000
మహా పద్మం	= 1000000000000000	అమేయం	= 1000000000000000000000000000000000
క్షోణి	= 10000000000000000	భూరి	= 10000000000000000000000000000000000
మహా క్షోణి	= 100000000000000000	మహా భూరి	= 100000000000000000000000000000000000



కల్యాణి

వల్లభనేని అశ్వినీకుమార్

ఈ కల్పన...

ఒంటరితనం, వేదనలో సాంత్వన... పరస్పర ఓదార్పు... కథనంలో ఖాళీ...

మాధ్యమాలతో అనన్యత... పరిసరాలతో ఐక్యత... సముద్రం - అలలు ఇచ్చే తెలియని సంయమనం - వైరుధ్యాల ఏకత్వం...

ఆ సాయంత్రం చీకటిలోనికి మారుతున్నపుడు, కింద అలల నవ్వులు మాసిపోతున్నపుడు,

సన్నగా చినుకులు మొదలయినాయి.

మనం వర్షానికి సిద్ధంగా ఉండం కదా, అది కూడా అపురూపమైంది కదా.

తెన్నేటి తోటలో ఉన్న వారిలో చాలా మంది వానకు ఎవరి దారిన వారు బయలుదేరారు.

చినుకులు ఎప్పుడూ చివురులు కదుపుతుంటాయి. ఎండిన ఒంటికి ఊరట కలిగిస్తుంటాయి. తడారిపోయిన గుండెల్లో చల్లని మంటలు రేపుతుంటాయి.

చినుకుల్లో ముఖం పెట్టి, సముద్రపు గాలికి మనసు పెట్టి అక్కడే కూర్చున్నా.

అప్పుడే చూశాను, ఆ చిన్నారి చిరువానలో గిరగిరా తిరుగుతోంది. పాపనే చూస్తున్నా - ఎక్కడైనా నా బాల్యం కనపడుతుందేమోనని. కాలం వెనకకు తిరుగుతుందా?

కాని గతమెప్పుడూ తియ్యగానే వుంటుందెందుకనో?

అంతలో అమ్మ పాపను చెంగులో దాస్తూ తలదాచుకునే చోటు కోసం చుట్టూ చూస్తోంది.

ఈతాకు టోపీ నా చేతిలోనే ఉంది. మెల్లగా పాప తలమీద సవరించాను. అప్పుడే చూశాను కల్యాణిని - అక్కడే వర్షంలో తడుస్తూ. వాన పెరిగితే ముగ్గురం ఐస్‌క్రీం బండి చూరుక్రింద చేరాం.

అది ఎంత చూరని మమ్మల్ని చినుకుల నుంచి కాపాడుతుంది?

పూర్తిగా ముద్దయి పోయాం. మొక్కల్లా నీళ్ళు కారుతూ నవ్వుకున్నాం.

తర్వాత వర్షం తగ్గినపుడో, ఆటో అటుగా వచ్చినపుడో వాళ్ళు వెళ్ళిపోయారు.

స్నేహానికి ఏంకావాలి? ఒంటరి తనం, గతపు గాయాలు, కొంచెం విషాదం, కొంచెం సంగీతం కూడా.

రాత్రి 'కర్స్ ఆఫ్ ఎల్లోఫ్లవర్' ఒంటరిగా చూశాను. నా గదిలో.

తెలిసీ విషం తాగుతున్న రాణి అందంలోని విషాదం ఏదో నిషాలా నాలోకి పాకింది.

అందులోనే మన్వంతరాల దూరంలో ధ్వనించే సంగీతం నా నరాలన్నీ తెంపింది. ఎన్ని బంధాలో, ఎన్ని విచ్ఛిన్నాలో - ఎంత విషాదమో ఎంత కర్కశమో - మనిషి

బతుకు. అంతఃపురాలు - అంతరంగాలు - అనంతతీరాలు ఇవేనా బతుక్కి అర్థం?

ఎప్పుడో చెలి చెవిలో పాడిన పాట ఇప్పుడు వినిపిస్తోంది. హృదయం దేనికోసమో వేచి చూస్తోంది. దేనికోసం? నిదుర లేదు.

తడితీరంలో నడుస్తున్నా, అడుగులు వెతుక్కుంటూ.

మెల్లగా తూరుపు మబ్బులమాటు నుంచి వెలుగు తొంగి చూస్తోంది. రెండు పిట్టలు తడిసిన ఇసుకలో పురుగులు ఏరుకుంటున్నాయి. చిన్న చిన్న పీతలు అడ్డంగా పరుగులు పెడుతూ నురగలలో కలుస్తున్నాయి.

ఎదురుగా కల్యాణి వస్తోంది.

“హాయ్, రోజూనా”

“ఎప్పుడైనా”

“పాప? ”

“అమ్మ దగ్గరుంది”

తడిసిన పాదాలు మెరుస్తున్నాయి.

“పరుగెడదామా? ”

కొద్దిదూరం కలిసే అడుగులు వేశాం.

తరువాత ముందుకు వెళ్ళిపోయింది.

ఏమిటి? అప్పుడే అలిసిపోయానా?

గుండె దడ పరుగెడుతోంది, నాకంటే ముందుగా.

అవును- ఒంటరితనం వయసును దహిస్తుంది. కొంతసేపటికి తన దగ్గరగా వచ్చి అలసిన నవ్వుతో “నువ్వు రన్నర్‌వా? ”

“హుం, పారిపోతున్నా, అన్నిటి నుంచీ”

“మరి నీ నుంచి కూడానా? ”

“అదే బాధ. ఎక్కడికి వెళ్ళినా నేనే ఎదురవుతున్నా.”

“అప్పుడప్పుడు నేను కూడా? ”

నవ్వింది.

అక్కడే అలలు చుట్టుకుంటుంటే పొడిచే పొద్దు చూసి విడిపోయాం.

* * *

మరో సాయంత్రం యోగా సెంటర్ గేటు బైట కారు పెట్టి అప్పల రాజు ఖర్జూరాలు, బాదంపాలు అమ్ముతుంటే ప్రక్కన కూర్చున్నా - ఔటర్ హార్బర్‌లో ఓడల దీపాలు మిల మిల మెరుస్తున్నాయి. లావుపాటి వాళ్ళు రోడ్డుకి అటూ ఇటూ గబగబ నడుస్తున్నారు. కొందరు కుక్కలను నడిపిస్తున్నారు. పక్కన పచ్చికలో మరి కొందరు పడుకున్నారు. బీచ్ ఇసుకలో రెండు గుర్రాలు పిల్లలను మోస్తున్నాయి.

గోడ పక్కన కందెల్ని కాలుస్తోంది పైడి తల్లి.

గేటులో నుంచి కల్యాణి వస్తోంది.

“ఏమిటి యోగా కూడానా? ”

“ఆఁ! నాలో లోతుల్ని తెలుసుకునేందుకు బాగా ఉపయోగపడుతోంది, యోగా” చిన్నగా నవ్వింది.

అంతలో అల్లం మజ్జిగ ఇచ్చాడు రాజు.

ఆ రాత్రి కారులో ఇంటి దగ్గర దింపాను.

“ఇంకా ఏదో ఇంకా ఏదో ఇదయి పోతావే...

మదిలో ఇష్టాలే తెలిపేందుకు...” పాట కారులో వినపడుతోంది.

* * *

ఆ పాత దీపస్తంభం నీడలో ఇసుక తిన్నెల లోయల్లో దగ్గరగా కూర్చున్నాం. కార్తీక సాయంత్రం చీకటిగా మారిపోతోంది. డాల్ఫిన్ కొండ వెనక పొద్దు దిగిపోయింది. ఇంకా తరంగాల నీహారపు తెరలు సోడియం వేపర్ వెలుగుతో కలిసి పసుపు తెరలు మా చుట్టూ దింపుతున్నాయి.

ఉప్పుగాలి కప్పుకుంటుంటే దగ్గరగా మరీ దగ్గరగా ఉన్న ఆమె పరిమళం నా నెత్తురు మరిగిస్తోంది.. నా నరాల్లో విద్యుల్లతలు పాకిస్తోంది...

వణుకుతున్న పెదవి వెచ్చగా ఉప్పగా ఏదో చెప్పాలని అంటూంది.

ఎల్లలు లేని ఈ పరిసరాల్లో - అంతంలేని అలలు నురుగుల నవ్వులతో దూర దూరంగా జరుగుతున్న జనభాషలో, మెల్లమెల్లగా విరిగి పడుతున్న అలల చప్పుడు చిన్నబోతోంది.

అరమోడ్పు కన్నుల్లో అరకోటి కోర్కెలు. ఆశల దీపాల వలె కంటిపాపల వెలుగు. అరచేతిలో చెలి చంద్రబింబం.

ఇసుకలో మేడకట్టి - వయసుతో కాపురం పెట్టనా? ఈ వెలుగు ముద్దను అలలపై పడవలా వదిలి పెట్టనా? ఇంతకంటే ఆహ్వానం ఏముంటుంది? పూలతోరణం ఎవరు కడతారు?

ఇక్కడ ఏ తలుపులు మూయాలి?

స్నేహానికి నిర్వచనమేమిటి? వయసు వలయాలు సంకెల లేనా? మనసు చిల్లుల నైలాన్ వలయేనా?

ఎక్కడో చందమామ అలలపై వెలుతురు పరుస్తుంటే, దూరంగా ఏవో ఊళ్ల లాగా ఓడలు నిలబడి ఉన్నాయి. టూరింగ్ టాకీస్ లైట్లులాగా మిణుకు మిణుకు మంటున్నాయి.

ఆమె మృదువైన చేతులు గులాబి దండలై మెడకు చుట్టుకున్నాయి.

ఎటునుంచో నీచువాసన గాలి మోసుకువచ్చింది. రోజూ తిరిగే రాజా అప్పుడే అటుగా వచ్చింది. చందమామ వెలుతురు పెరిగి కింద సముద్రాన్ని వెన్నెల్లో తడుపుతోంది.

“వెళ్దామా” అంటోంది.

“ఎక్కడికి? ”

“ఇలా ఉండలేము కదా!”

అవును. వెళ్ళిపోవాలి, విడిపోవాలి. ఒంటరి తనం లోనికి. నన్ను నేను వెతుక్కునే ఒంటరితనం, గాయాలకు బర్నాల్ రాసుకుంటూ, నిదురకు ఎదురు చూస్తూ, కలల కోసం కలలు కంటూ, కళ్ళు తెరచి...

“వెళ్దామా? ” ఇది ప్రశ్న కాదు. చిక్కుముడి.

గుండెలో దిగులు కంటి చివరి నుంచి - నా చేతిలో వెలుగు ముద్దను తడిపింది - “ఛ! ఎందుకు” అంటూ పెదవులతో అద్ది, కంటి పాపలను నీటితో తడుపుకుంది.

ఎవరికి ఎవరు ఓదార్పు, వెన్నెలతడి మంటల్ని ఆర్పుతుందా? దుఃఖానికి గమ్యముంటుందా?

దుఃఖాన్ని మింగుతున్న రాణి గుర్తుకొచ్చింది.

మంచులో తడుస్తున్న వెన్నెల్లో చీకటి ముద్దల్లా కూర్చున్నాం. ఎంతసేపు?

ఈ రాత్రి, అలలు తీరంలో కలల తాకిడిలో మేల్కొనే ఉంది.

బంతిపూల పసుపులో రాణి విషాదంలా... ■

సంపాదకులు, మిసిమి
మాసపత్రిక, హైదరాబాద్
040 - 27645536

రాత భవితకు చేయూత

ఎజాస్ అహ్మద్

అందమైన చేతిరాత మనిషి మనసును అదుపులో ఉంచుతుంది. నిర్మాణాత్మకంగా ఆలోచింపచేస్తుంది. స్వీయ క్రమశిక్షణను పెంపొందింప చేస్తుంది. అందుకే పిల్లలకు విద్యార్థి దశలోనే అందంగా రాయడం నేర్పించడం అవసరం. మనిషి అంతస్సౌందర్యానికి మనోజ్ఞమైన భాష్యం హస్తాక్షరి. అది పాఠకుల హృదయాలను రంజింపచేసే సువర్ణ రసఝరి. ఉపాధ్యాయులు ఆ అక్షర రమ్యతను చేజిక్కించుకుని విద్యార్థుల గుండె గరిసెల్లో ఆణిముత్యాల సంపదను నింపాలి.

విద్య అనే నాణేనికి చదవడం, రాయడం.. బొమ్మ, బొరుసులు. రెండింటిలో దేనినీ అలక్ష్యం చేయకూడదు. మనిషి మదిలోని తత్వాన్ని చూడకుండా మాట్లాడకుండా తెలుసుకోవడం చేతిరాత తోనే సాధ్యం.

మనిషి హృదయ సౌందర్యానికి దర్పణం చేతిరాత. హస్తాక్షరి మన అస్తిత్వాన్ని కళ్ల ముందు ఉంచుతుంది. నలుగురిలో ఉనికిని చాటుకోవడానికి, ఇతరులకు మనం ఆదర్శం కావడానికి, మనపై మనకు నమ్మకం ఏర్పడటానికి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడానికి చేతిరాత చేయూతనిస్తుంది. చదవడం ఎంత ముఖ్యమో, తప్పులు లేకుండా రాయడం కూడా అంతే ముఖ్యం. ముఖాన్నిచూసి మనిషి భావాల్ని అంచనా వేయవచ్చు. చేతిరాతను బట్టి కూడా వ్యక్తి ప్రవర్తనను, ఆలోచనలను అంచనా వేయవచ్చుని మరో పరిశీలన. ఇదే వాస్తవం. మన రాత బాగుంటే, మనుగడా బాగుంటుంది. రాతనుబట్టే చేతలూ ఉంటాయి. వాటిని అనుసరించే భవిత. అభ్యాసంతో అంతా సాధించగలం. ఇది అందరూ అంగీకరించిన, అందరికీ తెలిసిన విషయమే. అభ్యసనమనేది బాల్యంనుంచే అలవడితే, ఆ జీవితం ఆనందమయం అవడమే కాక, ఆదర్శవంతంగా నిలుస్తుంది. ముత్యాల్లాంటి చేతిరాత.. ఒక వ్యక్తి అసాధారణ ప్రజ్ఞాపాటవాల కంటే మిన్న అని తాజా అధ్యయనాల్లోనూ వెల్లడైంది.

చేతిరాత ద్వారా మనలోని ప్రతిభకు మెరుగులు దిద్దుకునే ప్రక్రియ ఆరంభమవుతుందని న్యూయార్క్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు స్టీవ్‌గ్రాహం నిర్వహణలోని సర్వే తెలిపింది. పిల్లలకు అక్షరాలు దిద్దించేటప్పుడే.. వారు విషయాన్ని ఎలా గ్రహించాలి, భావాల్ని ఎలా వ్యక్తీకరించాలి? అనేవి అవగతమవుతాయని

చాటింది. అందంగా వేగంగా రాసే విద్యార్థులే తరగతిలో ముందుంటారని, వారికే మంచి మార్కులు వస్తాయనీ ఆ నివేదిక తెలిపింది.

భావ ప్రకటనకు భాష మూలాధారం. అలాంటి భాషకు అక్షరాలే ప్రాణప్రదం. మొత్తం 56 అక్షరాలున్న సుసంపన్న భాష.. మన తెలుగు. తెలుగు మధురం. స్వభావంతో పాటు స్వరూపంలోనూ ఆ భాష అంతే మధురం. అక్షరం అంటే - క్షరం కానిది (నశించనిది). దేశభాషల్లో దేనికీ లేనన్ని అక్షరాలు మన తెలుగుకున్నాయి. కాలక్రమంలో కొన్ని అక్షరాలు కనుమరుగైనా, తెలుగు మౌలిక పరిమళాలు చెక్కుచెదరలేదు. సాకారభాషకు ఆకారమిచ్చే అక్షరాలు. అవి తమకంటూ నిర్దిష్ట రూపాల్ని సంతరించుకున్నాయి. అందుకే ఏ ధ్వనినైనా ఉచ్చరించే వీలు, రాసే అవకాశం ఉంది.

సున్నాను కనిపెట్టిన ఘనత మన భారతీయులదే. ఆ ఒక్క సున్నాయే ఎన్నెన్నో అక్షరాల రూపకల్పనకు ఆధారం. కొమ్ముల గర్వం తలకట్టు అందం; ఏత్వాల, ఓత్వాల, ఐత్వాల సాంగత్యం; ఒత్తుల మెత్తదనం, దీర్ఘ సరళత్వం గుడులతో కలిపి; పలుకుబడులు నిలిపి; విద్యార్థినీ విద్యార్థుల మనోమందిరాల్లో చెరగని ముద్రలు వేసుకోవాలి.

అనుసరించమెపుడు అభ్యాసయోగమున్
అందులోనె విద్యలమరునెపుడు
నిద్ర ఆకలెపుడు నినువంచనెంచును
అన్ని మరచి విద్యలందుకొనుము

అన్నట్లు పిల్లలకు ఎక్కువ అభ్యాసం చేయించాలి. తెలుగు డబల్‌రూల్ కాపీలలో రాయించాలి. ఉపాధ్యాయులు రోజుకో రంగు కలాలు వాడుతుంటే, అందరికీ ఆసక్తి పెరుగుతుంది. అక్షరాలు, పదాలు, వాక్యాలను కింద నుంచే రాయమనాలి. ఎందుకంటే పైనుంచి రాస్తే.. బోధకుడు పెట్టించింది విద్యార్థి ఒకేసారి రాస్తాడు. ప్రతీ పంక్తీ రాస్తున్నప్పుడు తను రాసిందే చూస్తుంటాడు. అందంగా రాదు. దిగువ నుంచి ఉంటే, ప్రతీ పంక్తీ రాస్తున్నప్పుడు.. ఉపాధ్యాయులు పెట్టించిందే చూస్తాడు కాబట్టి రాత అందంగా ఉంటుంది. తెలుగు అక్షరాలు గుండ్రంగా, సమానంగా ఉండాలి. అచ్చ తెనుగు అక్షరాలు అందంగా రాయాలంటే తెలుగు అక్షరాలు ఒకే సైజులో గుండ్రంగా ఉండాలి. వినాయకుని చేతిలోని లడ్డులాగా, అనిల్‌కుంబ్లే చేతిలోని బంతిలాగా, ఉడిపి హోటల్‌లోని పూరీ, ఇడ్లీ, వడలా, ప్రధానోపాధ్యాయుడి బల్లపైన గ్లోబులా ఉండాలి.

ముందుగా డబల్‌రూల్ ప్రతిలో గుండ్రటి సున్నాలు, అరసున్నాలు దిశలు మార్చి గీయాలి.

పావలా, అర్ధరూపాయి బిళ్లలతో కానీ, సిరప్ మూతలతో కానీ గుండ్రాలు గీసుకొని అందులో అక్షరాలు రాయడం సాధన చేయాలి. ఇలాచేస్తే ప్రతి అక్షరం సమానంగా, గుండ్రంగా ఉండి రాత అందాన్ని పెంచుతుంది.

అచ్చుల, హల్లుల నుంచి ఒకేరకం అక్షరాలను విడిగా నేర్చుకోవాలి.

తలకట్టు:

తలకట్టు ఉన్న అక్షరాలు:

గుడి:

గీతలోపలే గుడి కల అక్షరాలు:

కొమ్ము:

ఎత్వం:

ఒత్వం:

సున్న:

ఇలా అక్షరాలను సాధనచేసి, చక్కని చేతిరాతను అలవరుచుకుంటే, అది చూడముచ్చట. అందరూ మెచ్చుకోవడమే కాదు; పరీక్షలలోనూ ఎక్కువ మార్కులు వస్తాయి. ■

దస్తూరి నిపుణులు,
పాఠశాల నిర్వాహకులు,
సిద్దిపేట, మెదక్.
94404 94466

అక్షర లక్షలు

ఆధారాలు

అడ్డం:
1. నమస్కారం (3)
2. సొంతంగా చేసే ప్రమాణం (5)
3. మచ్చు (3)

నిలువు :
2. తీసుకునేవాడు (3)
4. శ్రీశ్రీ పుస్తకం తిరగబడింది (5)
5. దీనికి చాలా మంది భయపడతారు (3)

కాల్పులకు ఆహ్వానం

చందమామ విజయా కంబైన్స్
విరేచన చిత్రాల నిర్మాతలు
వాహినీ స్టూడియోలు, మదరాసు - 26

శ్రీ ప్రకాష్ గారికి

సహాయ దర్శకుడినైన నేను గోపాలరావు తెలియజేయుచున్నాను. ఆర్యా! రేపు తమకు కాల్పులు గలవు. మన చిత్రము యొక్క కాల్పులు తిరుపతిలో జరుగును. కాల్పులలో మొదటి దెబ్బ మీ మీదే. అందువలన రాత్రికే బయల్దేరవలెను. కాల్పులు రెండు రోజులు జరిగిన తర్వాత మీరు తిరిగి రాగలరు. ఈ లేఖ అందిన వెంటనే మా కార్యాలయమునకు విచ్చేసి ఖర్చులు అందుకోగలరు.

ఇట్లు

శిక్షణలో ఉన్న సహాయ దర్శకుడు జి.గోపాలరావు

మక్కికి మక్కీ అనువాదంపై రావికొండలరావు చురకల్లో ఇదొకటి! (హ్యూమరథం నుంచి)

రాజకీయ ఒత్తిడితోనే భాషకు రక్షణ

మాతృభాషా పరిరక్షణకు రాజ్యాంగం నిర్దేశించిన రీతిలో పాలనా విధానం సాగాలి. విద్యావిధానం కూడా మాతృ భాషా పరిరక్షణ స్ఫూర్తితోనే రూపొందాలనేది జాతీయోద్యమ లక్ష్యం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఆంగ్లానికి ప్రాధాన్యత క్రమేణా తగ్గి రాష్ట్రాలలో ప్రాంతీయ భాషలు, దేశస్థాయిలో హిందీ రాజ్యం ఏలతాయని ఆనాటి నాయకులు భావించారు, ఆకాంక్షించారు కూడా! కానీ, ఆ కలలు కల్లలే అవుతాయని ఎవరూ ఊహించలేదు. ఇందుకు కారణాలు, పరిష్కారమార్గాలపై తన మనోభావాలను 'తెలుగు వెలుగు'తో పంచుకున్నారు... మాజీ మంత్రి

మండలి బుద్ధప్రసాద్.

మాతృభాషను పరిరక్షించాలనే వాంఛ జాతీయోద్యమంలో భాగంగా రూపుదిద్దుకొని, బలమైన ఉద్యమరూపాన్ని పొందింది. గాంధీ నిర్మాణ కార్యక్రమంలో దేశీయ భాషల పరిరక్షణ, జాతీయ భాషగా హిందీని రూపొందించటం ముఖ్య అంశాలు. భాషల విషయంలో మనకో నిర్దిష్ట విధానం ఉండాలనే భావన ఆనాటి జాతీయోద్యమ నాయకులకు, కార్యకర్తలకు బలంగా ఉండేది. దీనిపై విస్తృత చర్చలూ సాగేవి. అనేక కమిటీలను వేసి తీర్మానాలు చేసి, విధాన కల్పన కోసం విశ్వప్రయత్నం చేశారు.

1937లో అఖిల భారత కాంగ్రెస్ మైనారిటీల భాషా సంస్కృతుల పరిరక్షణకు హామీ ఇవ్వటం ద్వారా జాతీయ భాషా విధానం ఒకటి ఉండాలనే ఆలోచనకు శ్రీకారం చుట్టింది. 1937 ఎన్నికలు దేశవ్యాప్తంగా జరిగిన మొట్టమొదటి పెద్ద ఎన్నికలు. కాంగ్రెస్ ఒక రాజకీయ పార్టీగా ఈ ఎన్నికల్లో పాల్గొనాలని తొలిసారిగా సంకల్పించింది. ఆ పరిస్థితుల్లో ఎన్నికల ప్రణాళికలో భాషలపై విధానాన్ని ప్రకటించాల్సి వచ్చింది. అన్ని వర్గాల, అన్ని భాషల, అన్ని సంస్కృతులకూ మెజారిటీ అయినా మైనారిటీ అయినా సమాన ప్రతిపత్తికి హామీ ఇస్తూ కాంగ్రెస్ భాషా విధానాన్ని ప్రకటించింది.

అది ఆ ఎన్నికలకు పరిమితం కాకుండా జాతీయ భాషా విధానంగా మారేలా ఆనాటి జాతీయ నాయకులు ముందు చూపుతో వ్యవహరించారు. 1939 హరిపుర కాంగ్రెస్ సమావేశాల్లో జాతీయ భాషా విధానం గురించి (National Lingua Franca) మోతీలాల్ నెహ్రూ కమిటీ సిఫార్సులపైనా, ఇంకొంతకాలం పాటు ఇంగ్లిషుని కూడా కొనసాగించాలనే మరికొందరి ప్రతిపాదనలపైనా, భారతీయ భాషల విధాన రూపకల్పన జరగాలనే నెహ్రూ వాదన పైనా జరిగిన చర్చలు చరిత్రాత్మకం. వాటి ఆధారంగానే రాజ్యాంగపరంగా భాషా విధానాలు రూపొందాయి. ప్రాంతీయ భాషల ఉనికిని గౌరవిస్తూనే జాతీయ భాషా విధానంపైన దృష్టి నిలిపారు. మాతృభాషలకు సమాన ప్రాతినిధ్యాన్ని ఇస్తూ, హిందీని జాతీయ అనుసంధాన భాషగా చేయాలనే నిర్ణయానికి వచ్చారు.

హరిపుర కాంగ్రెస్ జాతీయ భాష విషయంలోనే కాదు, జాతీయ విద్యా విధానంలో కూడా గొప్ప మార్పులకు శ్రీకారం చుట్టింది. ఏడేళ్ళ వయసు వరకు ఉచిత ప్రాథమిక విద్యను అదీ అమ్మ భాషలోనే నేర్పించాలనే నిర్ణయం వీటిలో ముఖ్యమైంది. ఇండియన్ ఎడ్యుకేషన్ బోర్డ్ ఏర్పాటు దీని ఫలితమే. మాతృభాషలలో విద్యాబోధన ఈ బోర్డు పరమ లక్ష్యాలలో ఒకటి.

అప్పట్లో అత్యధిక ప్రావిన్సులలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. దీని వల్ల జాతీయ విద్యావిధానం రూపొందించటానికి అవకాశం ఏర్పడింది. ఉదాహరణకు మద్రాస్ ప్రావిన్సులో చక్రవర్తుల రాజగోపాలచారి

ప్రభుత్వం హిందీని తప్పని సరిగా నేర్చుకోవలసిన భాష (Obligatory language)గా ప్రకటించింది. అలాగే, మద్రాసు ప్రావిన్సులోని తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ తదితర భాషా ప్రాంతాలలో ఆయా మాధ్యమాల్లోనే స్కూలు ఫైనల్ వరకూ విద్యను చెప్పాలని కూడా చట్టం చేసింది. నాటి నాయకుల ముందు చూపునకు ఇలాంటి నిదర్శనాలు మరెన్నో.

భారత రాజ్యాంగం PART XVII, CHAPTER IV-SPECIAL DIRECTIVES (350A) ప్రకారం భాషా మైనారిటీ గ్రూపులను కూడా దృష్టిలో పెట్టుకొని ప్రాథమిక విద్య వరకూ తప్పని సరిగా మాతృభాషలలోనే చెప్పాలని నిర్దేశిస్తోంది. మాతృభాషాభివృద్ధి, జాతీయతా భావం, దేశభక్తి, శాస్త్రీయ విద్యావిధానం అనే అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని దీన్ని రాజ్యాంగంలో పొందుపరిచారు.

భాషోద్యమం తమిళనాడులో బలంగానూ, కర్ణాటకలో చెప్పుకోదగిందిగానూ ఉంది. అస్సామీ, కొంకణీ భాషల విషయంలో కూడా ఉద్యమాలు తలెత్తుతున్నాయి. తెలుగు నేల మీద ఇపుడిపుడే వేడి రాజుకొంటోంది. తమిళనాడులో ప్రాంతీయ పార్టీలు కూడా భాషకు ప్రత్యేక ప్రాధాన్యత నిస్తున్నాయి. న్యాయస్థానాల్లో తమిళ వినియోగాన్ని తప్పనిసరి చేయటం, తమిళ కోర్సులలో భాషాభివృద్ధి అంశాలను చేర్చటం, కంప్యూటర్ కోర్సులలో కూడా తమిళ భాషను తప్పనిసరి చేయటం, తమిళ విశ్వవిద్యాలయాన్ని భాషాపరంగా అభివృద్ధి చేయటం, తమిళ భాషను చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించటం అనే అంశాలు అన్నాడీఎంకె 2011 ఎన్నికల ప్రణాళికలో చోటు దక్కించుకున్నాయి.

డీఎంకె మరో అడుగు ముందుకు వేసి కేంద్ర ప్రభుత్వ స్థాయిలో తమిళాన్ని రెండవ అధికార భాషగా దేశస్థాయిలో పెట్టించే ఏర్పాట్లు చేస్తామని వాగ్దానం చేసింది. అన్ని విమానాశ్రయాలలో విమానాల రాకపోకలకు తమిళంలోనే ప్రకటనలు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చింది. తమిళ పరిశోధకులకు ఇచ్చే పురస్కారాలు తొల్కాప్పియర్, తిరువళ్ళువర్‌ల పేర్లతో ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. తమిళనాడులోనూ ఢిల్లీలోనూ రెండు తమిళ భాషా పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. విద్య విషయంలో గ్రామీణ విద్యార్థులకు 15% రిజర్వేషన్ కల్పించటం, ప్రవేశ పరీక్షలు రద్దు చేయటం, ఫీజులు తగ్గించటం లాంటి వాగ్దానాలతో పాటు, ఉన్నత పాఠశాల స్థాయి వరకూ అందరూ తమిళాన్ని చదువుకొనేలా విద్యావ్యవస్థను మారుస్తామని ప్రకటించింది. తమిళనాడులో డా. జయలలిత నాయకత్వంలో అన్నాడీఎంకె ప్రభుత్వం ఏర్పడిన వెనువెంటనే, తమ వాగ్దానం ప్రకారం, తమిళనాడులో 5వ తరగతి వరకూ శాస్త్రీయ తమిళాన్ని తప్పనిసరి చేయనున్నట్లు ప్రకటించారు.

పొరుగు రాష్ట్రంలో పరిస్థితి ఇలా ఉండగా, మన రాష్ట్రంలో విద్యాలయాలలో తెలుగులో మాట్లాడితే పిల్లలను దండించే పోకడలు కనిపిస్తున్నాయి. ఇలాంటివి జరిగినప్పుడు రాజకీయ పార్టీలు కానీ, నాయకులు కానీ పెదవి విప్పటం లేదు. మన రాష్ట్రంలో ఒక్క పార్టీ కూడా భాష విషయాన్ని ఎన్నికల ప్రణాళికలో ప్రస్తావించటం లేదు. పార్టీల మీద ఆ మేరకు ఒత్తిడి తేవడం ఇప్పటి తక్షణావసరం.

మన రాష్ట్ర ప్రభుత్వం 2003లో 86వ నంబరుతో ఒక ఉత్తర్వును విడుదల చేసింది. ఉన్నత పాఠశాల స్థాయి వరకూ, విడిగా ఒక పాఠ్యాంశంగా తెలుగును చదవటాన్ని తప్పనిసరి చేస్తూ విడుదల చేసిన ఉత్తర్వు ఇది. దాన్ని ఇప్పటివరకూ అమలు చేయలేదు.

ఇంగ్లిషుతోపాటు మాతృభాషని కూడా సమంగా నేర్పించినప్పుడే పిల్లల ఆలోచనా పరిధి, ఆకళింపు పెరుగుతుంది. ఇతర భాషలను కూడా తేలికగా అనువదించుకొని అర్థం చేసుకొనే శక్తి ఏర్పడుతుంది.

కేంద్రం స్పష్టమైన భాషా విధానాన్ని ప్రకటించగలిగినప్పుడే రాష్ట్రాలలో మౌలికమైన మార్పులు సాధ్యమవుతాయి. త్రిభాషా సూత్రాన్ని వివిధ స్థాయిల్లో అమలు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత దృఢంగా వ్యవహరించాలి.

మారిషస్‌లో మొత్తం జనాభాలో తెలుగువారు ఉన్నది కేవలం నాలుగు శాతమే. అయినా తెలుగు అభివృద్ధి కోసం అక్కడి ప్రభుత్వ చర్యలు చూసి ముగ్ధుడినయ్యాను. అక్కడ తెలుగుతో సహా అనేక భాషల ప్రజలు జీవిస్తున్నారు. అందరికీ సమన్వయం పాటిస్తూ, వారి వారి మాతృ భాషలు మృతభాషలు కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకూ అక్కడ తెలుగులో చదువుకునే అవకాశం ఉంది. మనదేశంలో ఇతర రాష్ట్రాలలో తెలుగు వారెవరికీ ఇలాంటి సదుపాయాలు లేవు. దీని వల్ల అక్కడి వారు నష్టపోతున్నారు. ఇలా భాషా సంస్కృతుల విషయంలో ఎంతో కోల్పోతున్నాం. కొన్ని రాష్ట్రాలలో ఎప్పటినుంచో జీవిస్తున్నా తెలుగువారిమని చెప్పుకోవటానికి అవకాశం లేని పరిస్థితులున్నాయి.

ప్రభుత్వాల ఉదాసీనతకు ప్రజల అలసత్వమూ తోడవడమే మన భాష దుస్థితికి కారణం. 2011లో తెలుగుకు సంబంధించి విశేష చర్చ, ప్రపంచ స్థాయిలో ఆలోచనలు సాగాయి. కృష్ణాజిల్లా రచయితల సంఘం, తెలుగు భాషోద్యమ సమాఖ్య, సిలికానాంధ్ర వంటి భాషోద్యమ సేవా సంస్థలనేకం ఇందుకు చేసిన కృషి ఎన్నతగినది. స్థానిక సంస్థల ఉద్యోగాలలో తెలుగు మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులకు ఐదు శాతం రిజర్వేషన్ ఇచ్చే పూర్వపు విధానాన్ని అమలు చేయాలని ఈ మహాసభలు విజ్ఞప్తి చేశాయి. వాటిని ప్రభుత్వం పట్టించుకోవాలి. త్రిభాషా సూత్రం అమలు దిశగా మనము అడుగులు వేయాలి. అందుకు రాజకీయ మనసు కావాలి. ఆ మనసుకు తెలుగు భాష పట్ల మమకారం ఉండాలి. ఆ మమకారం ప్రజల ఒత్తిడి రూపంలో వెల్లువెత్తాలి. అది సాధ్యం కావాలంటే, మాతృ భాషోద్యమం మరింత శక్తి సంపన్నం కావాలి.

అమెరికా తెలుగు జీవితాల చిత్రణ... 'మూడో ముద్రణ'

అమెరికాలో స్థిరపడిన తెలుగు వాళ్ళు కథలు రాయడం ప్రారంభించి దాదాపు యాభయ్యేళ్ళు గడిచిపోయాయి. అమెరికా వెళ్ళిన తొలితరం తెలుగు వారిలో పులిగండ్ల మల్లికార్జునరావు రాసిన 'వారాహి' కథ 1964లో ఆంధ్రప్రభలో అచ్చయింది. దీన్నే అక్కడి వారు రాసిన తొలికథగా భావిస్తున్నారు. అప్పటినుంచి అనేకమంది తెలుగు వాళ్ళు కథలు రాస్తున్నారు. అవి ప్రధానంగా ఇక్కడి పత్రికల్లోనే అచ్చవుతున్నాయి. అలా కాకుండా డెబ్బైలలో అమెరికాలో తెలుగు పత్రికలు ఔత్సాహికంగా ప్రారంభమయ్యాక అప్పుడప్పుడు అక్కడ పత్రికల్లోనూ కథలు రాస్తున్నారు. ఇలా ప్రస్తుతం కథలు రాస్తున్న రచయితలు దాదాపు యాభైమంది వరకు ఉంటారని ఒక అంచనా. వీరందరిలోకి విలక్షణమైన రచయిత కన్నెగంటి చంద్ర. ముప్పై ఏళ్లల్లో కేవలం ముప్పై కథలు రాశారు. భారతదేశంలో ఉన్నపుడే కథా రచన ప్రారంభించిన చంద్ర. అమెరికా వెళ్లాక సుదీర్ఘ విరామం అనంతరం మళ్లీ తొంభైల చివర్లో కథలు రాయడం మొదలు పెట్టారు. అయితే ఈ కథలన్నీ అమెరికా నుంచి వెలువడే పత్రికలలోనో లేదా అంతర్జాల పత్రికలలోనో అచ్చవటం వల్ల ఇక్కడి పాఠకులకు అంతగా పరిచయం లేదు.

కథా నిర్మాణంలోనూ, సంవిధానంలోనూ, వస్తువులు ఎంచుకునే తీరులోనూ చంద్ర రచనా ధోరణి భిన్నమైంది. నిగూఢత లేదా గోప్యత చంద్ర కథల్లో ప్రధాన ధోరణి. కథలోని ప్రతి అంశాన్ని రచయితగా తనే వివరించాలని చాపల్యం లేదు. చాలా వరకూ పాఠకుల ఆలోచనలకే వదిలేస్తాడు. ఆయనకు పాఠకుల గ్రహణశక్తి పట్ల అపార నమ్మకం. ఇటీవల చంద్ర ప్రచురించిన 'మూడో ముద్రణ' కథా సంపుటి చదివిన తరువాత కలిగిన అభిప్రాయమిది.

ఈ సంపుటిలో కథాత్రయం 'మూడోముద్రణ', 'చిహ్నం', 'చిట్టచివరిది' చదివాక కథల్లో గోప్యత విషయమై చంద్రకున్న స్థిరమైన అభిప్రాయం అర్థమౌతుంది. అంతేకాదు, కథ ప్రారంభించే ముందు బహుశా ఆయన మనసులో కథారూపం పూర్తిగా తయారయి ఉంటుందనిపిస్తోంది. తొలిరోజుల్లో రాసిన 'అవతలి గట్టు' కథ చదివినా, ఇటీవలి 'ఒక నేను-కొన్ని నువ్వులు' కథ చదివినా ఈ సంగతి అర్థమవుతుంది. తొలిరోజుల్లోనే రాసిన 'సిగ్గుకథ', 'విచిత్రం' నేటికీ ఆధునికంగానే కనబడతాయి. పాత్రల అంతః సంఘర్షణను చిత్రించడంలో చంద్ర చూపే పరిణతి ఆశ్చర్యం కల్గించక మానదు. ఈ సంపుటిలోని రెండు కథలను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఒకటి 'బతుకు', రెండోది 'మచ్చ'. అమెరికాలో జంటశిఖరాలు కూల్చివేత అనంతర ప్రపంచ పరిణామాలు ఎలా ఉన్నా, అక్కడి భారతీయులు, ముఖ్యంగా తెలుగువారి మానసిక సంఘర్షణను భిన్న కోణం నుంచి చిత్రించిన కథ బతుకు. నాలుగు పేజీల్లో అనంతమైన సంఘర్షణను చిత్రించడం కత్తిమీద సాము. దీనిని చంద్ర అవలీలగా సాధించాడు. అమెరికా తెలుగు జీవితాన్ని, సంబంధ బాంధవ్యాలపై వలస జీవిత ప్రభావాన్ని కథల్లో నిజాయితీగా విశ్లేషిస్తున్న వారిలో కన్నెగంటి ముఖ్యుడు. నేటి యువతరంలో అసహనానికి ప్రతీకగా, సైన్స్‌ఫిక్షన్ రూపంలో 'మచ్చ' కథను మలిచారు. 'ఒక వేసవి', పాప' వంటి కథల్లో ఉన్న ఆర్ద్రత పాఠకులను కదిలిస్తుంది. ఈ సంపుటిలో 22 కథలున్నాయి. అవగాహన ఉండి రాయ గల్గిన కన్నెగంటి చంద్ర మరిన్ని కథలు రాస్తాడని ఆశిద్దాం.

రచన: కన్నెగంటి చంద్ర

పుటలు: 182; **వెల:** 60 రూ.

ప్రతులకు: నవోదయ పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్, విజయవాడ.

అగ్గి కైతల వెలుగు 'పొద్దు పొడుపు'



కవిత్వం ఓ రసాయనిక చర్య. దృశ్యం కట్టి చెప్పడంలో, తాను పొందిన అనుభూతిని మనం పొందేలా చేయడంలో తాను నమ్మిన సిద్ధాంతాన్ని మనచేత ఆలోచింప చేయడంలో కవిశక్తి దోహదం చేస్తుంది. అటువంటి శక్తికల అన్నవరం దేవేందర్ 'పొద్దు పొడుపు' కడుపులో 42 ఖండికల్ని ఇచ్చారు.

ఇందులోని 'రైతు చితి' కవిత ఓ బాధాకరమైన దృశ్యాన్ని ఇలా చిత్రిస్తోంది... "డెబ్బై ఏళ్ళుగా ఎవుసమే ఆయన ప్రపంచం/ దుక్కీ చేనూ చెలకలే జీవితం/ ఇవాళ ఆయన పెంచిన తుమ్మ చెట్టే/ ఆయన శవ దహనానికి దోహదమయ్యింది/ తాను దున్నిన మడికట్లల్లనే / తాను దగ్ధం అయ్యిండు/ ఆయన కొన్న కొత్త కుండలనే/ పెద్ద కొడుకు అంగి ఇడిశి అగ్గి పట్టిండు/ కూలినాలికి పోలందున్నిన మాదిగలు/ చెట్టుకొట్టి కాట్నం పేర్చి పాడె కట్టిండ్రు/ దప్పు సప్పుల్లతో దరువేశి సాగనంపిండ్రు..." కళ్ళను వర్షింపజేసే కవిత. ఈ సంపుటిలోని కవితల్లో ప్రకృతి అందచందాలున్నాయి. ప్రాంతీయ వాతావరణ వర్ణన ఉంది. సామాజిక సమస్యలున్నాయి. శ్రమ జీవుల వేదనలున్నాయి. 'స్పర్శ' అనేది పురుషుడు రాసిన మహిళోద్యమ కవిత.

"కనపడే ప్రతీ మగవాడూ/ ఖడ్గ మృగం కూడా అయివుండవచ్చు/ కొన్ని కొన్ని జంతువుల వల్ల భయంలేదని

కొండ అద్దమందు...

మబ్బుల పల్లకి

తెలంగాణలోని ఆట, మాటలను పాటలలో ఒలికించిన బాల గేయాల పుస్తకమిది. చిర్రగోనె వంటి ఆటలూ, తిండిపోతు తిమ్మక్క వంటి పాత్రలూ, ఈ గేయాలలో మనల్ని పలకరిస్తాయి. 'ప గుణింతంపై పాట' నూతనంగా ఉంటే 'చిన్న కుటుంబం'పై గేయం నిత్య నూతనంగా ఉంది. ఇందులోని అన్ని పాటలూ పాడుకోదగ్గవే, ఆ పాటలకు వేసిన అన్ని బొమ్మలూ చూడచక్కనివే.

రచన: వరుకోలు లక్ష్మయ్య.

పుటలు: 50; **వెల:** 30 రూ.

ప్రతులకు: రచయిత, గట్లమల్యాల గ్రామం, నంగునూరు మండలం, మెదక్ జిల్లా.

ప్రభాత కిరణాలు

'పుస్తకాలు చదువుతుంటె అక్షర స్నేహాలు పెరుగు' అంటూ తాను కూడా మంచి గేయాల రూపంలో మరికొన్ని స్నేహాలను బాలలకు అందించారు రచయిత. 'అక్షర యాత్ర'కు 'మా బడి' బాట పట్టమనే రచయిత, పైసలిస్తేనేగానీ బడికి పోమని 'గారాలు' పోయే బాలలని కూడా బుక్కున చేర్చుకున్నారు.

రచన: పెండోట వెంకటేశ్వర్లు.

పుటలు: 30; **వెల:** 30 రూ.

ప్రతులకు: రచయిత, బద్దిపడగ గ్రామం, నంగునూరు మండలం, మెదక్ జిల్లా.

తెల్చుకున్నాకే కదా! చనువు/ కరచాలన స్పర్శ కరవాలమై మారవచ్చు/ తేనె మాటల్లోనే తేళ్ళు కూడా ఉండవచ్చు/ఊసులు కలపాలన్న ఉబలాటం/ ఉహూ! అంటే ముఖంపై ఆమ్లం/ కాదంటే గొంతుపై కత్తి కదలిక" అంటూ సాగుతుంది.

ముఖ్యంగా 'పొద్దు పొడుపు'లో తెలంగాణ ప్రజల హృదయ అగ్ని కణాలు, సమస్య ఇప్పటికీ పరిష్కారం కావడం లేదనే బాధ. అస్తిత్వవాద ఆలోచనల అంశాలు నిండుగా ఉన్నాయి. దీనికి 'దోఖా' అద్దం పడుతోంది. "తెలంగాణ నేల శాపగ్రస్త భూమా? క్షతగ్రస్త నేలా? /" అని అంటూ "తెలంగాణ ఒడవనికత/ ఎక్కెక్కి పడుతున్న దుక్కం" అనడంలో అగ్నిగుండాల వేడిని అర్థం చేసుకోవచ్చు. పొద్దు పొడుపు చదివి తీరవలసిన కవితా సంపుటి. ఇందులో తెలంగాణ ఆత్మ, యాసబాస సొగసులు వంటివి చాలా ఉన్నాయి.

కవి: అన్నవరం దేవేందర్

పుటలు: 77; **వెల:** 65 రూ.

ప్రతులకు: శ్రీమతి రాజేశ్వరి, ప్లాట్ నెం-406, మారుతీ హెవెన్స్, భగత్‌నగర్, కరీంనగర్ - 505 001.

-సన్నిధానం నరసింహ శర్మ

చరిత్రను భద్రపరిచే గ్రంథం

ఒకనాటి గ్రంథాలయోద్యమానికీ నేటి గ్రంథాలయ శాస్త్రరంగానికీ సేతువు వంటి వెలగా సేకరణ కృషికి ఇది ప్రతిబింబం. కాపీరైటు చట్టం గురించి, గ్రంథకర్తల లావాదేవీల గురించి బాగా వివరించారు. " భాష సుబోధకంగా, సులభగ్రాహ్యంగా సమ రూపంలో నిర్దిష్టంగా ఉండాలంటే ఒక విధానం అవసరం" అంటారీయన. " 'అంతసీను లేదు'; 'కిరికిరి'; 'నొక్కేయడం' వంటి ఇటీవలి మాటలు భాష నవీకరణకు మెట్టు"అన్నారు. ఇది తెలుగు ప్రచురణ కర్తలకు, ప్రకాశకులకూ కరదీపిక.

రచయిత, ప్రకాశకులు: డాక్టర్ వెలగా వెంకటప్పయ్య

పుటలు: 300; **వెల:** 300 రూ.

ప్రతులకు: ఐతానగరం, తెనాలి - 522201.

పర్యావరణ కథలు, కృష్ణారెడ్డి గారి ఏనుగు

కన్నడ మూలం: పూర్ణచంద్ర తేజస్వి

తెలుగు అనువాదం:

శాఖమూరు రామగోపాల్

ప్రతులకు: హైదరాబాద్,

ఫోన్: 9052563666

పర్యావరణ కథలు **వెల:** 150 రూ.

కృష్ణారెడ్డి గారి ఏనుగు **వెల:** 100 రూ.

కొందరిని గురించి ఏమైనా చెప్పాలనుకున్నప్పుడు అనేక భావాలు ఒక్కుమ్మడిగా ముసురుకుంటాయి. ఏం చెప్పినా సంతృప్తి కలగదు. ముఖ్యంగా మహామహుల గురించి చెప్పాలనుకున్నప్పుడు ఈ భావన కలుగుతూ ఉంటుంది. డా॥ సామల సదాశివ గురించి మాట్లాడాలన్నా రాయాలన్నా ఇలాంటి ఇబ్బందే ఎదురవుతూ ఉంటుంది.

సంగీత సాహిత్య సమభూషితుడు సామల సదాశివ

పెన్నా శివరామకృష్ణ

కొందరు రచయితల పరిచయం ఏర్పడినప్పుడు వారి వ్యక్తిత్వం కంటే వారి రచనలే గొప్పగా కనిపిస్తుంటాయి. లేదా వారి రచనల మీద తొలుత మనకున్న గౌరవం క్రమంగా తొలగిపోతూ ఉంటుంది. సదాశివతో పరిచయ భాగ్యం కలవారికి వారి రచనల మీద వ్యక్తిత్వం మీద ఆసక్తి, గౌరవమూ పెరుగుతాయి.

ఆసవపాత్ర యట్టడుగునందొక చుక్కయె నిల్చెనేని తె
మ్మా సఖి! దుమ్ము చల్లెద నిహంబు పరంబును రెంటిపైన; నీ
కోసము పిచ్చి వాడటులు క్రుమ్మరుచిట్లు మధువ్రతుండనై
గాసిలు నాకు దుర్యశమె కల్గునుగా కెవడేడ్చె కీర్తికై

అపర సంధ్యారాగ హసితారుణ ప్రభాయుతకర పల్లవంబొక్కసారి
అమిత తేజోర్ధ చంద్రాకృతితో జెలువొందు ఫాలతలంబు నొక్కసారి
కర్ణ భూషా ప్రకీర్ణాంచిత కపోల యుగ్మంబులెలమిమైనొక్కసారి
రదన పంక్తిద్యుతి ప్రతిబింబిత ప్రకాశోష్ఠబింబంబులనొక్కసారి

పై పద్యాల్లో మొదటిది 'సాఖీనామా'లోది కాగా, రెండోది 'నిరీక్షణము' (1952) అనే స్వీయపద్య ఖండికలోనిది. మొదటి పద్యంలో ధారాశుద్ధిని, అలవోకగా పద్యం చెప్పేరీతిని, ఒక విసురును గమనించవచ్చు. రెండోపద్యం ప్రాచీన ప్రబంధకవుల పద్య రచనా శైలిని పుణికి పుచ్చుకుంది. ఈ రెండూ సదాశివ రచనలే. విమర్శకులుగానో, విశ్లేషకులుగానో మనకు తెలిసిన సదాశివ ఇంత ప్రౌఢంగా పద్య రచనలు చేశారంటే ఆశ్చర్యం కలుగుతుంది. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి అన్నట్లు వారి ప్రతి పద్యం 'ప్రతి పద రసస్యంది'.

తొలి దశలో 'సాంబశివ శతకము', 'నిరీక్షణము', 'విశ్రామిత్రము' వంటి లఘు కావ్యాలు, 'నారద గర్వభంగం' వంటి గేయకావ్యాలు రాశారు. మలిదశలో అంటే 1960లలో పారసీ నుంచి జలాలుద్దీన్ రూమీ 'మస్నవీ'ని, ఉర్దూ నుంచి అమ్జద్ హైదరబాదీ రాసిన రుబాయీలను అనువదించారు. ఇవన్నీ లఘుకావ్యాలు కావటం వల్ల, పునర్ముద్రణలు లేకపోవటం వల్ల వారి పద్య రచనలు ఇటీవలి వరకు అందుబాటులో లేవు. 'సదాశివ కావ్యసుధ' (2008) పేర కె.నారాయణగౌడ్ సంపాదకత్వంలో పద్యరచనలు సంపుటిగా ముద్రించారు.

సదాశివ సంభాషణల్లో కానీ, రచనల్లో కానీ ఎక్కడా తమ పద్య

రచనలను ప్రస్తావించరు. పద్య రచనల్లో ముఖ్యంగా అనుసృజనల్లో అమ్జద్ రుబాయీల పట్ల కాస్త మక్కువ ఉన్నట్లు తెలుస్తుంది. అమ్జద్ మీద, 'తసవ్వుఫ్' (సూఫీతత్త్వం) మీద ఆయన అభిమానమే దీనికి

కారణం కావచ్చు.

"సూఫీలనగా సత్యమగు బ్రహ్మము (హఖ్)ను గుర్తించి, మిథ్యయగు దృశ్యమాన ప్రపంచం (కాయెనాత్)ను నిరసించి, 'నేను, నీవు' (మన్-వ-తూ) అను ఎఱుక (అఖత్)ను విస్మరించి, 'సర్వమున్నతని దివ్యకలామయ మంచు' సంభావించు సదాశయులు. మతం నిర్ణయించిన పరిమితుల్లోగాక అణువణువున నాభాసించు పరమాత్మనారసి యాత్మాను సంధాన విధానమున భేదావస్థలో 'సోహమ్మ'ని (అనల్ హఖ్) ఎలుగెత్తి పలుకగల పరమహంసలు" అంటారు సదాశివ (సదాశివ కావ్య సుధ.పుట.166). భారతీయ వేదాంత సారానికి, సూఫీతత్త్వానికి ఒక కొసన అద్వైత భావమేదో ఉండటం వల్లనే కాబోలు అమ్జద్ రుబాయీల అనువాదం వేలూరి శివరామశాస్త్రి వంటి సాహితీ దిగ్గజాల ప్రశంసలందుకుంది.

తంత్రులెటు మ్రోగునంగుళి తాళలేక?
వెన్నెలలు కాయునట్లు రే వెలుగు లేక?
నీవు లేకున్న నెట్లుందు నేను మాత్ర?
బుద్బుదం బెట్లు పొడము నంబువులు లేక?

అతని పదద్యుతి హృదయమున గనుము
గుప్తమణి నశ్రుసిక్త దృక్కులనె గనుము
దివ్యకాంతులీఘటమున దేజరిల్లు
కలవు బూదిలోవిస్ఫులింగములు గనుము

రుబాయీ, గజళ్ళలోని రదీఫ్, కాఫియా పద్ధతిని, తేటగీతి పద్యాల్లో అనుసరించి చూపటం పై పద్యాల్లోని ప్రత్యేకత.

సదాశివ 'నిరీక్షణము' అనే ముద్రిత పద్య ఖండికను చదివి సురవరం ప్రతాపరెడ్డి మెచ్చుకున్నారు. "మీరు పద్యాలు రాసుకుంటే నాకేం అభ్యంతరం లేదు కానీ మీ శ్రద్ధంతా ఉర్దూ, పారసీ సాహిత్యాల మీద పెడితేనే ముందు తరాలకి ఉపయోగం" అన్నారట. ఇక అప్పటి నుంచి పద్యాలు రాయటం మాని ఉర్దూ, పారసీ సాహిత్యాలపై తెలుగులో రాయడం ప్రారంభించారు. "ప్రతాపరెడ్డి సలహా నా సాహిత్యకృషిని మలుపు తిప్పింది" అని సదాశివ చెప్పుకున్నారు. ఈ క్రమంలో వెలువడినవి 'ఉర్దూ కవుల కవితా సామగ్రి' (1970), 'పారసీ కవుల ప్రసక్తి' (1975), 'మీర్జాగాలిబు (జీవితం రచనలు)', 'ఉర్దూ భాషా కవిత్వ సౌందర్యం' (2004), 'ఉర్దూసాహిత్యం' (2007) అనే గ్రంథాలు.

ఉర్దూ కవిత్వ ప్రక్రియల గురించి, కవిత్వ సంప్రదాయాలకు నేపథ్యమైన సంస్కృతి గురించి, కవి సమయాలు, వర్ణనారీతులు గురించి 'ఉర్దూ కవుల కవితా సామగ్రి' లో వివరించారు. గజల్, రుబాయీ రచనా పద్ధతులను తెలుగు వారికి తొలిసారిగా సోదాహరణంగా, విస్పష్టంగా తెలియజెప్పిన గ్రంథమిది. ఉర్దూ కవిత్వంలోని వివిధ కవిత్వ ప్రక్రియలను గురించి, ఆయా ప్రక్రియలకు వన్నె తెచ్చిన కవులూ వారి కవిత్వాన్ని గురించి, లక్నో, ఆగ్రా, ఢిల్లీ మొదలైన ప్రాంతాల నుంచి వచ్చిన కవిత్వాల్లోని స్వల్పభేదాలను గురించి 'ఉర్దూ భాషా కవిత్వ సౌందర్యం'లో విశ్లేషించారు. ఉర్దూ కవిత్వానికి సంబంధించి ప్రామాణికమైన, లోతైన, విస్తృతమైన సమాచారాన్నందించే ఏకైక తెలుగు పుస్తకమిది. స్వయంగా కవులైన కుతుబ్‌షాహి, అసఫ్‌జాహి నవాబులూ వారి సాహిత్య పోషణల గురించి ఆసక్తిదాయకమైన అంశాలెన్నో చెప్పారు. ఉర్దూ సాహిత్యానికి సంబంధించిన సదాశివ రచనలన్నింటిలోకి తలమానికమైన రచన 'ఉర్దూ భాషా కవిత్వ సౌందర్యం'.

'ఉర్దూ సాహిత్యం' వీరి మరో విశిష్ట రచన. 'గీటురాయి' పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన వ్యాసాల సంకలనమిది. రకరకాల పరిమితుల వల్ల ఈ వ్యాసాలు, ఈ పుస్తకం ఎక్కువమంది సాహిత్య పాఠకుల దృష్టికి రాలేదేమోనని అనిపిస్తుంది. ఉర్దూ భాష రూపొందిన క్రమంతో మొదలుపెట్టి ఉర్దూ కథ, నవలలాంటి ఆధునిక ప్రక్రియల వికాసం వరకు ఈ గ్రంథంలో చర్చించారు.

హిందూస్థానీ సంగీత ప్రీతి, శాస్త్రవైదుష్యం సదాశివ వ్యక్తిత్వంలో మరో ప్రధాన పార్శ్వం. సంగీత శాస్త్రజ్ఞానం కలిగి ఉండి, ఆనందించగలిగిన వారు వివిధ కళాకారుల మధ్య తారతమ్యాన్ని నిగ్గు తేల్చగలుగుతారు. అలాంటి వారు తమ అనుభూతికి, ఆలోచనలకు అక్షరరూపమివ్వగలిగితే అవి ప్రామాణిక రచనలుగా రూపొందుతాయి. వీరి 'మలయ మారుతాలు' (2001), 'సంగీత శిఖరాలు' (2006), 'స్వరలయలు' (2009) ధాతువు, మాతువు సమపాళ్లలో జతకలిపిన అద్భుత రచనలు. నిర్దిష్ట స్థలకాల పరిమితుల్లోనే అయినా, హిందూస్తానీ సంగీతం హిందూ-ఇస్లాం మతాల హద్దులను చెరిపేసిందని ఈ రచనల ద్వారా తెలుస్తుంది. వీరు గంభీరమైన అంశాలను కూడా తేలికైన భాషలో చెబుతారు. సరళత, స్పష్టత, సూటిదనం వీరి శైలిలోని సుగుణాలు. రచనలో పాఠకుడిని కూడా భాగస్వామిని చేయడం వల్ల పాఠకుడు ఆత్మీయతను అనుభవిస్తాడు. వాక్యాల వెంట అప్రయత్నంగా పరుగులు తీస్తాడు.

అరబ్బీ, పారసీ, అనేక భారతీయ మాండలికాల కలగలుపుతో రూపొందిన భారతీయ భాష ఉర్దూ. ఇది భారతీయులందరి సమష్టి సంపద. ఏ ఒక్కరి సొంతం కాదు. ఇది కేవలం ముస్లింల భాష అన్నట్టు ఎవరైనా మాట్లాడితే నొచ్చుకుంటారు. మల్లిక్ అన్నట్లు "ఉర్దూ ఆయన రాగం, తాళం, మకుటం, చరణం, పల్లవి! ఉర్దూ ఒడిలో, ఉర్దూ షాయిరీని కావలించుకుని ఉర్దూను ముచ్చటించడం ఆయన వ్యసనం!".

సదాశివ వివిధ కవుల మీద వందలాది వ్యాసాలు రాశారు. అవన్నీ ఆయా కవుల వ్యక్తిత్వాలకు నిర్దిష్ట, నిర్దుష్ట అక్షర చిత్రాలు. 'బయోడేటాలా కాకుండా వ్యక్తిత్వం గురించి చెప్పేదే బయోగ్రఫీ' అంటాడు (శామ్యూల్

జాన్సన్ బయోగ్రఫీ రాసిన) బాస్వెల్. అలంకార శాస్త్రాధారమైన చర్చలు, సాహిత్య విమర్శ పరిభాష, వారి రచనల్లో ఉండవు. అంతఃకరణమే ప్రమాణం. 'నేను సాహిత్య రసజ్ఞుణ్నే కాని విమర్శకుణ్ని కాను' అంటారు. మూల రచనలను చదవాలనే ఆసక్తి రేకెత్తించటం, ఉత్తమ విమర్శ ప్రధాన లక్షణాలనుకుంటే ఆయన రచనలన్నీ అచ్చమైన, అందమైన విమర్శలే.

విమర్శ రాయడం కోసమే అధ్యయనం చేయడం ఒక పద్ధతి. స్వీయ ఆసక్తితో చేసిన అధ్యయనంలో తేలిన సారాన్ని విమర్శలుగా రాయడం రెండో పద్ధతి. ఈ రెండో పద్ధతి రచనల్లోని జీవం, జవం మొదటి పద్ధతి రచనల్లో ఉండే అవకాశం చాలా తక్కువ. సదాశివ ఈ రెండో పద్ధతికి చెందిన వారని వివేకవంతులైన పాఠకులు సులభంగానే గ్రహించగలరు. కవిత్వం వెనుకనున్న కవి వ్యక్తిగత జీవితం, సామాజిక స్థితిగతులను వివరిస్తూ, వాటి మధ్యనున్న సమన్వయాన్ని విశ్లేషిస్తారు. వివిధ కవుల మధ్య తారతమ్యాన్ని సహేతుకంగా విశ్లేషిస్తారు. వ్యాఖ్యాతల, చరిత్రకారుల దోషాలను ఎత్తిచూపి సవరిస్తారు. సరళమైన భాషలో సజాతీయమైన శైలిలో, పాఠకులతో సంభాషిస్తున్న ధోరణిలో ఆయన రచన సాగుతుంది.

సదాశివ వ్యక్తిగత సాహిత్య జీవనయానంలోని నిమ్నోన్నతాలను బహుసుందరంగా ప్రతిఫలించే గ్రంథం 'యాది'. ఈ జీవిత జ్ఞాపకాల్లోని అంశాలు వ్యక్తిగతమైనవని, సాహిత్య సంబంధమైనవని విడదీయడానికి వీలులేనివి. ఆంధ్రప్రాంతానికి చెందిన ఒకనాటి సంప్రదాయ కవి పండితులతో వీరికున్న భావోద్వేగ పూరిత స్నేహబంధాలు అపూర్వమైనవి. సంగీత సాహిత్యాలు వీరి ఉచ్ఛ్వాస నిశ్వాసలు. ఉర్దూ పారసీ భాషల ప్రసక్తిలేని ముచ్చట ఏదీ సాధారణంగా ఉండదు. ఈ గ్రంథం తెలంగాణా ఆంధ్రల మధ్య, సంగీత సాహిత్యాల మధ్య, ఉర్దూ తెలుగు సాహిత్యాల మధ్య, హిందూ ముస్లిం మతాల మధ్య గొప్ప వంతెన లాంటిది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్లు కూడా సంగీత సాహిత్యాలు నాట్యమాడిన ప్రదేశాలేనని ఈ గ్రంథం చదివితే తెలుస్తుంది. తన జీవితంలోని దుర్భర దారిద్ర్యాన్ని, తన లోపాలను, బలహీనతలను ఆయన ఎక్కడా దాచుకోలేదు. 'యాది' ఒక నిత్య విద్యార్థి స్వగతం. ఒక నిత్య కృషీవలుని శ్రమైక జీవన సౌందర్య గీతం. ఒక గొప్ప గురువు వాత్సల్యంతో ప్రియశిష్యునికి చేసే హిత బోధ. ఒక మంచి శిష్యుడు గురుప్రశంసగా కనిపించకుండా చేసే గురుస్మరణ. కళా పిపాసువు యాత్రా చరిత్ర. అన్ని రకాలు బేధ భావాలను జయించిన మహా మనీషి జీవన సంగీతం. మనకే తెలియకుండా మన మనస్సులో వ్యాపించి ఉన్న కల్మషాన్ని క్షాళనం చేసే దివ్య ఔషధం.

డా॥ ఎహతేషామ్ హుస్సేన్ 'ఉర్దూ సాహిత్య కా ఇతిహాస్' అనే హిందీ గ్రంథానికి సదాశివ ఆంధ్రానువాదం 'ఉర్దూ సాహిత్య చరిత్ర' (1963) సరళ గ్రాంథిక భాషలో, తెలుగు నుడికార సహితంగా, మౌలిక రచనగానే భాసించే విధంగా సాగిన అనువాదమిది.

ఉర్దూ చదివితేనే బతుకు తెరువు కనుక ఉర్దూ, పారసీలు చదవడమే గొప్ప అనుకునేవారు ఆ రోజుల్లో. తెలుగు మాధ్యమంలో చదువుకునే అవకాశాలు తక్కువ. తెలుగు సాహిత్యం బోధించేవారు లేని స్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ఆనాటి సామాజిక పరిస్థితులను, ఆయన సామాజిక వర్గాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తే స్వయంకృషితో తెలుగులో కావ్య రచన చేసే స్థాయిని సంపాదించడం సులభమేమి కాదు. సంస్కృత భాషా సాహిత్యాలను గురించిన ప్రాథమిక పరిజ్ఞానమైనా లేకుండా ఎవరూ తెలుగు పండితులు కాలేరు. అదే విధంగా పారసీ, అరబ్బీ భాషల్లో తగిన పరిజ్ఞానం లేకుండా ఎవరూ గొప్ప ఉర్దూ పండితులు కాలేరు. సదాశివ కేవలం ఉర్దూ సాహిత్యంలో మాత్రమే నిష్ణాతులు కాదు. ఉర్దూ భాష రూపొందిన క్రమంలో పారసీ, అరబ్బీ, టర్కీ భాషల, అనేక ఉత్తర భారత మాండలిక భాషల ప్రభావాన్ని సమగ్రంగా అధ్యయనం చేశారు. ఆయన ఎంత సాహిత్యవేత్తో అంత భాషాభిజ్ఞుడు. ఎంత సంగీత శాస్త్ర అవగాహన పరుడో, అంత సంగీత రసికుడు. ఎంత 'దర్దీనో' అంత 'సుర్‌వేద్యా' (స్వరాల ఉన్మాది).

విశ్వనాథ, రాళ్లపల్లి లాంటి ఆ తరం తెలుగు కవులను, రచయితలను గూర్చి ఉర్దూ సాహిత్య పాఠకులకు పరిచయం చేస్తూ 'సియాసత్'లాంటి పత్రికల కోసం ఉర్దూలో అనేక వ్యాసాలు రాశారు. ఉర్దూ, తెలుగు భాషలు తెలిసిన వారు ఎవరైనా ఆ వ్యాసాలు తెలుగులోకి అనువదిస్తే పూర్వ తరం కవులను గురించి సదాశివ విశ్లేషణలు, అంచనాలు తెలుగువారికి తెలుస్తాయి.

మాస్టారి లేఖారచనా విశిష్టమైందే. ముత్యాలకోవ లాంటిది ఆయన చేతిరాత. ఆత్మీయత, నిర్దిష్టత, సమతౌల్యంతో కూడిన విశ్లేషణలు ఆయన లేఖల్లో ప్రతిఫలిస్తాయి. వేటూరి, దీపాల, తల్లావజ్ఝల తదితరుల నుంచి మూడు తరాల కవులు, రచయితలతో ఆయనకు హార్దిక స్నేహబంధాలున్నాయి. సదాశివ లేఖలు సేకరించి అచ్చువేస్తే ఆయన వ్యక్తిత్వంలోని మరిన్ని పార్శ్వాలు వెలుగులోకి వస్తాయి.

ఉర్దూ తెలుగు సాహిత్యాలకు, కర్ణాటక హిందూస్తానీ సంగీతాలకు, ఉత్తర దక్షిణ భారత సంస్కృతులకు, సంప్రదాయక ప్రగతి వాదాలకు, తెలంగాణ ఆంధ్ర రచయితలకు మధ్య పుష్పవారధి లాంటివి వారి రచనలు.

ఆగాజ్‌తో హోతాహై అంజామ్ నహీ హోతా!
జబ్ మేరీ కహానీ మే వో నామ్ నహీ హోతా!

(తన పేరు లేకపోతే నా కథకు ఆరంభమైతే ఉంటుంది కాని అంతముండదు.)

ఇది మీర్జాఖాన్ 'దాగ్' గజల్‌లోని షేర్. ఉర్దూ కవిత్వాభిమానులందరికీ దీనిలోని భావం వర్తిస్తుంది.

కవి, విమర్శకులు, అధ్యాపకులు,
గురుకుల కళాశాల, కల్వకుర్తి,
మహబూబ్‌నగర్.
94404 37200.

ఆది, పునాది

తేనెవాక కన్న, తియ్యమామిడికన్న
పంచదారకన్న, పనసకన్న
మధురమైన భాష మన మాతృభాషరా
తెలుగు నేర్చుకొనగ వెలుగు వచ్చు

తల్లి నేర్పు భాష తరతరాల వెలుగు
మమత పంచుచుండు మాతృభాష
ప్రాణముండు వరకు పరమ మిత్రమయిన
తెలుగు నేర్చుకొనగ వెలుగు వచ్చు

ముచ్చటైనయట్టి ముత్యాలబోలిన
అక్షరముల తోడ నలరుచుండు
అచ్చుతోడ తాను అంతమగుచునుండు
తెలుగు నేర్చుకొనగ వెలుగు వచ్చు

అమ్మయనెడి మాట అన్ని రుచుల మించు
నాన్నయనెడి పలుకు వెన్న సమము
అక్క బావ మామలను పల్కులను చిల్క
తెలుగు నేర్చుకొనగ వెలుగు వచ్చు

కోరి పలుకునట్టి గోరుముద్దల భాష
నరము నరమునందు పరుగులెత్తు
ఇంటిభాషయనుచు నిలలోన వెలుగొందు
తెలుగు నేర్చుకొనగ వెలుగు వచ్చు

విశ్వమందు మిగుల వెలుగులు చిమ్ముచు
గానరీతిలోన ఘనత కెక్కు
తల్లిభాష గొప్ప యెల్లభాషలకును
తెలుగు నేర్చుకొనగ వెలుగువచ్చు

మనసునందు గలుగు మహనీయ భావాలు
వెల్లడించవచ్చు తెల్లముగను
ఆదిభాష మన పునాదియై నిల్చురా
తెలుగు నేర్చుకొనగ వెలుగువచ్చు

ఒక్క మాతృభాష చక్కగా నేర్వంగ
వశములగును పరుల భాషలెల్ల
ముందు, యత్నమదియె ముచ్చటగా జేసి
తెలుగు నేర్చుకొనగ వెలుగువచ్చు

ఈదగలదు కప్ప ఎవ్వరున్ నేర్పక
ఎగురగలదు పక్షి యిట్టెపైకి
కష్టమేమి లేక యిష్టమ్ముగా వచ్చు
తెలుగు నేర్చుకొనగ వెలుగువచ్చు

అలరుచుండె తెలుగు అమెరికా లోపల
వెలుగుచుండె తెలుగు బ్రిటనులోన
ఘనత చాటుచుండె ఖండఖండాలలో
తెలుగు నేర్చుకొనగ వెలుగువచ్చు

- డాక్టర్ గుమ్మా సాంబశివరావు,
విజయవాడ. 98492 65025.

ఇది మన సమయం!



ఏ సాంకేతిక సాధనాలూ లేని రోజుల్లోనే మన గణిత శాస్త్రవేత్తలు సెకనులో 34000వ వంతుని కూడా కనుక్కున్నారు. వారు రూపొందించిన కాలగణనాన్ని పరిశీలిస్తే...

1 క్రాంతి	- 1 సెకనులో 34000 వ వంతు
1 తృటి	- 1 సెకనులో 300 వ వంతు
2 లవాలు	- 1 క్షణం
30 క్షణాలు	- 1 విపలం
60 విపలాలు	- 1 పలం
60 పలములు	- 1 చడి (24 నిమిషాలు)
2.5 చడి	- 1 హోర (1 గంట)
24 హోరలు	- 1 దినం (రోజు)
7 దినములు	- 1 వారం (సప్తాహం)
15 దినాలు	- 1 పక్షం
2 పక్షాలు	- 1 మాసం (నెల)
2 నెలలు	- 1 ఋతువు
2 ఋతువులు	- 1 కాలం
6 ఋతువులు	- 1 సంవత్సరం
10 సంవత్సరాలు	- 1 దశాబ్దం
100 సంవత్సరాలు	- 1 శతాబ్దం
10 శతాబ్దాలు	- 1 సహస్రాబ్దం
432 సహస్రాబ్దాలు	- 1 యుగం
10 యుగాలు	- 1 మహాయుగం (43.20 లక్షల సం॥లు)
100 మహాయుగాలు	- 1 కల్పం (43.23 కోట్ల సం॥లు)
2 కలియుగాలు	- 1 ద్వాపరయుగం
3 ద్వాపరయుగాలు	- 1 త్రేతాయుగం
4 త్రేతాయుగాలు	- 1 కృతయుగం

ఒక అధ్యయనం ముగిసింది

అక్షరాలు సైతం చలించిన భద్రిరాజుగారి మరణం ఒక లోటే! కానీ ద్రవిడ భాషల కోసం ఆయన చేసిన కృషి అమృతంగమయం.

1928 జూన్ 19న ఒంగోలులోని సుబ్రహ్మణ్యం, భారతమ్మ దంపతులకు జన్మించిన కృష్ణమూర్తిది పేద కుటుంబం. చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో పేదరికం, ఆయన చదువుని సైతం అడ్డుకుంది. ఆ సమయంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆచార్యులు గంటి జోగి సోమయాజి ప్రోత్సాహంతో బి.ఎ (ఆనర్సు) పూర్తి చేశారు. అక్కడే అధ్యాపకులుగా నియుక్తులయ్యారు.

భద్రిరాజు కృష్ణమూర్తి



భాషపట్ల తన మక్కువ పద్యరచనలు, పట్టభద్రతతో తీరలేదు. కనిపించే అక్షరాల చరిత్రలని అన్వేషించదల్చారు. అమెరికా వెళ్ళి 1955లో పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి భాషాశాస్త్రంలో స్నాతకోత్తర పట్టా పొందారు. అదే విశ్వవిద్యాలయంలో తెలుగు క్రియా ప్రాతిపదికల మీద పరిశోధన చేసి పి.హెచ్.డిని అందుకున్నారు.

తనలోని పరిశోధనాశీలిని నవ్య పద్ధతులలో మెరుగుపరుచుకుని తిరిగి మన దేశానికి వచ్చారు కృష్ణమూర్తి. 1961-62ల మధ్య శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రీడర్ అయ్యారు. 1961లో రాష్ట్రంలోనే తొలి భాషా శాస్త్ర శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఏర్పడగా వ్యవస్థాపక అధిపతి అయ్యారు. అప్పటికి ఆయన వయసు ముప్పై నాలుగేళ్ళు! వయసు చిన్నదే కానీ ఆయన మేధ దొడ్డది, దేశంలోనే తొలి 'భాష అధ్యయన శాస్త్ర కేంద్రాన్ని' ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్థాపించడమే దీనికి నిదర్శనం. తర్వాత ఎన్నో పదవులను అలంకరించారు, ప్రతి చోటా తన ముద్ర వేశారు. 1993లో హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఉపకులాధిపతిగా పదవీ విరమణ చేశారు. అక్కడ ఆయన ఏర్పాటు చేసిన 'అనువర్తిత భాషాశాస్త్ర అనువాద అధ్యయన కేంద్రం' పరిశోధకులకో స్ఫూర్తి.

నిజమైన పరిశోధకుడు ఇతరులకు దోవ చూపే ముందు స్వయంగా అన్వేషిస్తాడు భద్రిరాజులా! తెలుగు సాహిత్య అకాడమీ రూపకర్తలలో ఒకరిగా మాండలిక వృత్తి పదకోశాలని నిర్మించడం దేశంలోనే తొలి ప్రయత్నం. దీని విధి, విధానాలను కృష్ణమూర్తి శాస్త్రీయంగా రూపొందించారు. తాను వ్యవసాయ, చేనేత వృత్తి పదకోశాలను తయారు చేశారు. తిక్కన పద ప్రయోగకోశానికి సహసంపాదకులు. కొండకూబి అనే గిరిజన తెగకు లిపినీ రూపొందించారు. తెలుగుకు ప్రాచీన హోదా రావడంలో భద్రిరాజు కృషి ఎనలేనిది.

ద్రావిడ భాషా రంగంలో రెండు శతాబ్దాలుగా జరుగుతున్న పరిశోధనలకు, తన అధ్యయనాలను సమన్వయించి రాసిన 'ది ద్రవిడియన్ లాంగ్వేజస్' అనే గ్రంథం భాషా శాస్త్రానికే తలమానికం. ఇదే కాకుండా 'తెలుగు వెర్బల్ బేసెస్ - 1961', 'తెలుగు భాషా చరిత్ర - 1979' వంటి ఇరవైకి పైగా గ్రంథాలతో మాతృ భాషని సత్కరించారు. లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ అమెరికా గౌరవ సభ్యత్వం, ఎడింబరో రాయల్ సొసైటీ పురస్కారం, సీపీ బ్రౌన్ 'తెలుగు భారతి' పురస్కారాలకి తోడుగా డాక్టరేట్లు, మరెన్నో పురస్కారాలు ఆయన్ను వరించాయి.

మార్గదర్శిగా ఎందరో శిష్యులను భాషా శాస్త్రానికి అందించారు. ఆచార్యునిగా దేశ విదేశాలలో ఎందరో విద్యార్థులకు భాషా వైభవాన్ని రుచి చూపారు. ఆయన నిష్క్రమణతో భాషా శాస్త్రంలో ఒక అధ్యాయం ముగిసింది. ఒక అధ్యయనం ముగిసింది.

కొండపల్లి శేషగిరిరావు

గిరి సమాన కీర్తి శేషం

భీష్ముని వంటి సనాతన మూర్తిమత్వంతో తెలుగు చిత్రకళావరణంపై తన పొడవైన రంగులనీడ ప్రసరింపజేసిన కుంచెకాడు కొండపల్లి శేషగిరిరావు. 2012 జూలై 26న పరమపదించారు. తనదైన వర్ణరేఖావిలాసాన్ని ఒక శైలిగా నిలిపి వెళ్ళిపోయారు. ఆయన చిత్రకళ సనాతన భారతీయ సాంప్రదాయపు అడుగుజాడల్లో నడుస్తూనే కొత్త జాడలు వేసింది. పురాణ సన్నివేశాలు, ప్రకృతి దృశ్యాలు, మహాపురుషుల బొమ్మలు... వస్తువు ఏదైనా కావచ్చు; ఆయన కళాదృష్టి వల్ల వీక్షకుని మనసులో నిలిచిపోయే కవళికల్ని సొంతం చేసుకున్నాయి. ఆయన నన్నయ, పోతనల్ని చూశాక వాళ్లను మరోలా ఊహించుకోలేం. రాళ్లనైనా మృదువుగా చిత్రించగలిగే ఆయన కుంచె రమణుల్ని కమనీయంగా చిత్రించగలదు. గోదాదేవి, శకుంతల, దమయంతి, వరూధిని వంటి పురాణ కాంతలెందరో ఆయన చిత్రాల్లో భారతీయ స్త్రీల ముగ్ధత్వాన్ని మనోహరత్వాన్ని పుణికి పుచ్చుకున్నారు. ఆయన గీతలు, రంగులు పరికిస్తే ప్రశాంతత, స్థిరత్వం స్ఫురించే రసభావం కలుగుతుంది. ఈ లక్షణాలు ఆయన వ్యక్తిత్వంలోంచే చిత్రాల్లోకి ప్రవహించి ఉంటాయి.

ఎంతో అలవోకగా కనిపించే ఈ మృదువైన గీతల, మెత్తని రంగుల శైలి వెనుక ఏకోన్ముఖ దీక్ష, అభిరుచి, కఠోర శ్రమ దాగి ఉన్నాయి. శేషగిరిరావు జీవితం సరళరేఖలా సులువుగా సాగిపోలేదు. ఆయన 1924 జనవరి 27న భూస్వాముల కుటుంబంలో జన్మించారు. ఎనిమిదేళ్ల వయస్సులోనే కుటుంబ

రాలిన సిరిమువ్వ

వెంపటి చినసత్యం



వజ్రాలెన్నో ఉన్నా కోహినూర్ కోహినూరే! నాట్య కళా శిఖరాలెన్ని ఉన్నా వెంపటి చినసత్యం చిన సత్యమే. ఆ ప్రయోగశీలత్వం, సామాజిక ప్రయోజనత్వం నిరుపమానం. భరతనాట్యం సరిహద్దుల్ని దాటి మన దేశానికి పేరు తెచ్చింది. కూచిపూడి నృత్య విన్యాసాలు సరిహద్దుల్ని దాటి మన ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిష్ఠ తీసుకొచ్చాయి. దీనికి కారకులు, దిక్సూచి వెంపటి చినసత్యం అనేది... పెద్ద సత్యం.

విశ్వకళారంగంపై కూచిపూడి నృత్య సరస్వతీ దర్శనానికై వెంపటి తపస్సు చేశారు. ఆ తపో ఫలాలే నేడు అంతర్జాతీయంగా కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న ఆరాధకాలు. కూచిపూడిలో పుట్టి కూచిపూడి నృత్య శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో చెన్నై వెళ్లారు. అక్కడ నాట్యాచార్యులు కూచిపూడికి శాస్త్రీయ లక్షణాలు లేనేలేవన్నారు. కాదు ఆ నృత్యానికి శాస్త్రీయ లక్షణాలున్నాయని సకారణంగా నిరూపించారు. అంతే కాదు, మిగిలిన వాటిలో లేని విశిష్ట లక్షణాలూ కలిగిందని నిరూపించారు. 1963లో చెన్నైలోని కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ పెట్టి శక్తికిమించిన సేవలందించిన క్రియాశీలి వెంపటి. ఆ సంస్థకు భవనం రావడంలో ఆయన కృషి మరువలేనిది. కూచిపూడి నృత్యం పురుషులకే పరిమితం కాదని మహిళలకూ స్థానకల్పన చేసిన ఆలోచనశీలి ఆయన.

1947లో చెన్నపురికి వచ్చినప్పటి నుంచీ ఆయన కూచిపూడి నృత్యసేవా తపనే దినచర్య అయ్యింది. వెంపటి పెద సత్యం నృత్య నిర్దేశకత్వంలో మల్లాది రామకృష్ణశాస్త్రి సాహిత్య స్ఫూర్తితో ముందడుగులు వేశారు. దేవదాసు, రోజులు మారాయి, అమెరికా అమ్మాయి, సంపూర్ణ రామాయణం, శ్రీకృష్ణవిజయం, లవకుశ వంటి చిత్రాలకు ఆయన నృత్య దర్శకత్వం వెలుగును పెంచింది. విశ్వవేదికలపై కూచిపూడి ద్వారా తెలుగు వెలుగులు నలుదిశలా విస్తరించాలనేది ఆయన తపన. శ్రీకృష్ణ పారిజాతం, శ్రీనివాస కల్యాణం, రుక్మిణీ కల్యాణం, చండాలిక, అర్ధనారీశ్వరం, హరవిలాసం, రామాయణం, క్షీరసాగరమథనం, కిరాతార్జునీయం వంటి వీరి నృత్య రూపకాలు. సత్యం కొత్త ఆలోచనలకూ, సృజనాత్మకతకూ దర్పణాలే అనొచ్చు.

బ్రిటను, ఫ్రాన్సు, భూటాను, మలేషియా, దక్షిణ అమెరికా, శ్రీలంక, జర్మనీ వంటి దేశాల్లో ఎన్నో ప్రదర్శనలిచ్చి తన ఆదర్శాన్ని ఆచరణ సుగంధాల మధ్య పరిమళింప జేసుకున్న కారణజన్ముడు. వెంపటి 2011లో హైదరాబాద్‌లో 2800 మంది కళాకారులతో ఏకకాలంలో నిర్వహించిన అంతర్జాతీయ కూచిపూడి నృత్య ప్రదర్శన గిన్నిస్ రికార్డులకెక్కింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం కాళిదాస్ సమ్మాన్‌తో, కేంద్ర సంగీత అకాడమీ ఫెలోషిప్‌తో, తమిళనాడు కలైమామణితో, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటుతో గౌరవించాయి. కేంద్రప్రభుత్వం 'పద్మభూషణ్'తో నృత్యభూషణాన్ని గౌరవించుకుంది. ఒక అపూర్వ గౌరవం నృత్య సత్యంకి దక్కింది. 1994లో ఘనా ప్రభుత్వం సెప్టెంబర్ 25న వెంపటి చినసత్యం దినోత్సవంగా ప్రకటించి సంగీత హృదయాలను పులకరింపజేసింది. కూచిపూడి నృత్యం ఆయనకు కళాయాత్ర కాదు. ఒక ఉద్యమం. అది స్థానికోద్యమం కాదు విశ్వ ఉద్యమం.

తగాదాలవల్ల ఆస్తులన్నీ పోయాయి. వారాలపై చదువుకోవాల్సి వచ్చింది. బడిలో మంచి చిత్రలేఖన ఉపాధ్యాయులు దొరికారు. ఆసక్తి కాస్తా వేళ్లూనుకుని ఊడలు వేసింది. చిత్రకళ అభ్యాసానికి హైదరాబాదు చేరుకున్నారు. ఆయన ప్రతిభ చూసి నిజాం ప్రభుత్వ ఆర్థికమంత్రి మెహదీ నవాజ్ గంజ్ శాంతినికేతన్‌లో చేర్చారు. అక్కడ అవనీంద్రనాథ్ ఠాగూర్, నందాలాల్ బోస్ వంటి ప్రముఖుల దగ్గర విద్య నేర్చారు. దేవాలయాల శిల్పకళపై ఆసక్తి మొదలైంది ఈ కాలంలోనే. పాతికేళ్ల వయస్సులో 'హైదరాబాద్ స్కూల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్'లో ఆయన ఉద్యోగాన్ని సంపాదించారు. సాహితీవేత్తల పరిచయాలూ పెరిగాయి. ఆంధ్ర సారస్వత పరిషత్ సభ్యులైన వానమామలై, కాళోజీ, దేవులపల్లి, దాశరథి కృష్ణమాచార్య వంటి సాహితీకారుల ప్రేమ చవిచూశారు. రామాయణ, భారత, భాగవత వ్యాఖ్యలు, అనువాద గ్రంథాలు అనేకం చదివారు. ఫ్రెస్కో, మ్యూరల్ లాంటి ప్రయోగాత్మక చిత్రకళారీతుల్ని అధ్యయనం చేశారు. సాహిత్య చిత్రకళల సమ్మేళనం ఆయన శైలిలో ప్రగాఢ పరిణతి తీసుకువచ్చింది. బొమ్మల్లో ముఖకవళికలే కాదు, వ్యక్తుల ఆత్మలు కనపడేవి. పురాణచిత్రాల్లో పాత్రల భంగిమలతోనే వారి మధ్య రాగవిరాగాల్ని స్ఫురింప జేసేవారు. వానమామలై 'పోతన చరితము'కు వేసిన పోతనబొమ్మ, కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలానికి గీసిన సన్నివేశాలు మనసుల్ని హత్తుకుంటాయి. సాహిత్యం వల్ల కుంచె లాఘవంతో పాటు, కలం మెలకువలూ అలవడ్డాయి. చిత్రకళపై విలువైన వ్యాసాలనేకం రాశారు. పరస్పర విరుద్ధాంశాల సమ్మేళనం ఆయన వ్యక్తిత్వం. పౌరాణిక ప్రపంచాల్ని సృజించిన కుంచెతోనే, సామ్యవాద భావజాలంతో దృశ్యాల్ని చిత్రించారు. కళాకారునికి కళకు మించిన భావజాలమంటూ ఏదీ లేదని నిరూపించే వ్యక్తిత్వం ఆయనది.

భాషకు విలువ గురువు చలువ

డా॥ బూదాటి వెంకటేశ్వర్లు

తెలుగు భాషను, సంస్కృతిని బతికించాలంటే అందుకు ఏదైనా చెయ్యగలిగింది ఒక్క ఉపాధ్యాయుడే. పిల్లలు, ముఖ్యంగా ప్రాథమిక స్థాయి పిల్లలు, ఉపాధ్యాయుణ్ని ఎంతగా ప్రేమిస్తారో మనకు తెలుసు. ఆయన తప్పు చెప్పినా 'మా గురువుగారు చెప్పిందే నిజం' - అని వాదిస్తారు. మరి ఈ లేత బుర్రలకు, ఆ ఆత్మీయత, ఆ గురి ఎలా వచ్చింది? అందుకే మనం ప్రాథమిక స్థాయి నుంచి ఉపాధ్యాయుని కోణంలో ఆలోచిస్తూ రావాలి. మనం అన్నింటికీ అనుసరించే పాశ్చాత్య దేశాల్లో ఎక్కువ అర్హతలుండి, భాషావిషయికంగా బోధనలో శిక్షణ పొందినవాళ్లనే ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులుగా నియమిస్తారు. మన దగ్గర ఏ శిక్షణా లేకపోయినా ఎవరైనా ప్రాథమిక ఉపాధ్యాయుడు కావచ్చు.

రాజకీయ నాయకుడి ప్రభావం ఎన్నికల వరకే! కానీ ఉపాధ్యాయుడి ప్రభావం ఒక తరంపైనే ఉంటుంది. ఈ విషయాన్ని ఉపాధ్యాయులైన ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి.

పిల్లలకు కేవలం పదాలు చెప్పటం, వాళ్ల భాష పెంచటమే కాదు, వాళ్లలోని భావుకత్వాన్ని పెంచాలి. ఇందుకు మొట్ట మొదట ఉపాధ్యాయుడు చెయ్యవలసిన పని... ప్రకృతితో స్నేహం. ప్రకృతిని మించిన పుస్తకం ఏముంది? పిల్లలు, పుస్తకాలు తెరిచి, అక్షరాలు చదివే లోపునే ఈ ప్రకృతి పుస్తకం చదువుతూ అందులో తన్మయత్వం చెందగలగటం అలవాటు చెయ్యాలి.

పిల్లలకు గాలి సౌఖ్యం, వెన్నెల హాయి, పూలగంధం, వాటి అందం, చెట్ల ఆకు పచ్చదనం, నీళ్ల ఇంపు, చందన పరిమళం ఇవన్నీ సహజంగానే తెలుస్తాయి. వాటిని గుర్తుపట్టి ఆనందించటం, అభినందించగల సంస్కారం అలవాటు చెయ్యాలి. పిల్లలకు పాటలంటే ఎంతో ఇష్టం కదా! పాటలు విని, పాడి ఆనందిస్తారు. అటువంటి పిల్లలకు ప్రకృతిలోని సంగీతాన్ని వినటం నేర్పాలి. రావిచెట్టు కింద కూర్చుంటే ఆ వేల ఆకుల గలగలలు, సెలయేటి ఒడ్డున నిలుచుంటే వినిపించే నీటి సవ్వడి, గాలి లోంచి వినిపించే రకరకాల వింత ధ్వనులు, పిట్టల అరుపులు, ఇటువంటి వాటికి పిల్లల్ని దగ్గర చెయ్యాలి. ఇలా చెయ్యటం వల్ల వారిలో భావుకత అభివృద్ధి చెందుతుంది. భావుకత లేకపోతే జీవితంలోగాని, కావ్యజీవితంలో కాని రసాస్వాదన ఎలా? అనంతమైన, అపారమైన తెలుగు సాహిత్య వారసత్వ సంపద ఎవరికోసం? జాతి నిర్వీర్యం కాకుండా ఉండాలంటే సాహిత్య అధ్యయనం తప్పనిసరి! అందుకు మొదటి మెట్టు భావుకత్వం. దాన్ని ఉపాధ్యాయుడు అలవాటు చెయ్యాలి. అప్పుడే సాహిత్యం నిలుస్తుంది. భావుకతే లేకుంటే ఎక్కాల పుస్తకానికి, ఆముక్తమాల్యదకు తేడా ఏమీ లేదు. మనకు అపార గేయ సంపద ఉంది. దేశభక్తి గేయాలు, భావ గేయాలు, లలిత గేయాలు, అభ్యుదయ గేయాలు. వీటిని పరిచయం చేయవలసిన బాధ్యత గురువులదే. ఈ విషయంలో తెలుగు పండితుల బాధ్యతే ఎక్కువ.

పట్టభద్రులూ తెలుగు పద్యాలను చక్కగా చదవలేకపోవటానికి, ఉచ్చారణ దోషాలు దొర్లటానికి కారణం, ఏమిటి? ప్రాథమిక, హైస్కూలు స్థాయి వరకు నేర్చుకుంటున్న మాతృభాషా విషయంలో ఉపాధ్యాయులు శ్రద్ధ చూపకపోవటమే. ఇటువంటి శ్రద్ధ విద్యార్థికి కల్పిస్తే ఆ శ్రద్ధ ఆజన్మాంతం వదలదు.

తల్లిదండ్రుల నుంచి పరిసరాల నుంచి భాష మాట్లాడటం సహజంగా నేర్చుకుంటారు పిల్లలు. కానీ రాయటం అలా అప్ర

గురువులకు... ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

యత్నంగా వచ్చేది కాదు. ప్రయత్నించి నేర్చుకునే ఏ విషయమైనా ఎంత నేర్చుకుం టామన్నది నేర్చుకున్న వ్యక్తి అవసరాన్ని, ఆసక్తిని బట్టి ఉంటుంది. విద్యార్థిలో ఈ సామర్థ్యాన్ని పెంచే బాధ్యత ఉపాధ్యాయుని మీదే ఉంది.

ఎంత మంచి పాఠ్యపుస్తకమైనా ఉపా ధ్యాయునికి దీటురాదు. అయితే ఇప్పటి సంక్లిష్ట రాజకీయ వాతావరణ ప్రభావం విద్యార్థిలోకంలో కూడా వ్యాపించింది. కొందరు పాఠ్యపుస్తకాలకు సంపాదకులైన ప్పుడు ఈ 'విద్యార్థి- ఉపాధ్యాయుడు - బోధనావాచకం' - వీటి మధ్య ఉండవలసిన ఏకసూత్రత దెబ్బతింటోంది. వాళ్ల భావజా లాన్నే నింపుతున్నారు. ఇది గర్హనీయం. ప్రాచీన సాహిత్యం నుండి ఏదైనా ఒక ఖండికను పెడితే తిట్టే తెలుగు పండితులు, ఏమిటీ ఆధునిక కవిత్వం అంటూ నిరసించే ఛాందసులూ మనకు దర్శనమిస్తారు. 'పాత కొత్తల మేలు కలయికను సాధించలేకపోతు న్నారు. అదిగో అలాంటి హృదయపరిపాకం కలిగించటం కోసం మనం శ్రమిద్దాం.

ప్రాథమిక పాఠశాలల్లో ఏ అధ్యాప కుడైనా భాషను బోధించవచ్చునన్న అభిప్రా యాన్ని మార్చుకోవాలి. ప్రాథమిక పాఠ శాలల్లోనే ఎక్కువ సామర్థ్యం ఉన్న, శిక్షణ పొందిన ఉపాధ్యాయుల అవసరం. ఏ బి.యస్.సి. చదివిన విద్యార్థో బి.ఎడ్. చేసి ఎస్.జి.టి. అయి అ - ఆలు దిద్దబెడు తుంటే, ప్రాథమికస్థాయి వాచక బోధన చేస్తుంటే పిల్లల్లో భాషా స్పృహ ఎలా వస్తుంది? మరి ఆంగ్ల భాషాబోధనలో తీసుకునే శ్రద్ధను గమనించండి. ఇతర దేశాలలో, ప్రాథమిక విద్యాబోధనలో ముఖ్యంగా నర్సరీ నుంచి ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారు.

తెలుగు నాట ఆంగ్ల మాధ్యమం బళ్లను కొన్ని చూశాను. అక్కడి పరిస్థితీ నిరాశాజనకమే. ఒక ఉదాహరణ చెపుతాను.

"హమ్‌టీ డమ్‌టీ శాట్ ఆన్ ఎవాల్
హమ్‌టీ డమ్‌టీ హాడ్ ఎ గ్రేట్ ఫాల్
ఆఫ్ ది కింగ్స్‌మెన్ ఎండాల్‌ది కింగ్స్ హార్సెస్"

ఈ గేయాన్ని చెప్పేటప్పుడు 'ఆల్‌ది కింగ్స్ హార్స్' - అని ఉండాలి. 'కింగ్స్ హార్సెస్' - అని బహువచనం వాడుతు న్నారు. పుస్తకాల్లో అలాగే ఉంది. పాఠాలు

చెప్పేవాళ్లూ అలాగే చెపుతున్నారు. హార్స్ అంటే 'కావల్రీ బ్రిగేడ్ ఆఫ్‌ది హౌస్ హోల్డ్ (ట్రూప్స్)' - అని అర్థం అంటే 'గుర్రపు రౌతుల పటాలం' అని అర్థం. అంచేత ఏక వచన ప్రయోగమే ఉండాలి. అచ్చులో కూడా H అన్న అక్షరం పెద్దక్షరమే ఉండాలి. ఇటువంటి తప్పులు ఎన్నో చూపె ట్టవచ్చు. అలాగే.

'హికరి డికరి డాల్
ది మౌస్ రాన్ ఆన్‌ది క్లాక్'-

... గేయాన్ని చెప్పేటప్పుడు టీచరుకు పాతకాలం గడియారాల గురించి తెలి యాలి. 'గ్రాండ్ ఫాదర్స్ క్లాక్స్' - అని వీటినే అంటారు. వీటిని ఇప్పుడు ప్రదర్శనశాల్లో చూడవచ్చు.

'టు మార్కెట్ టు మార్కెట్ టు బై ఏ ఫాట్‌పిగ్', పుస్సీక్యాట్ పుస్సీక్యాట్ - అంటూ ఊహకందని భావచిత్రాలతో చిన్నా రుల మెదళ్లను కలుషితం చేస్తున్న 'ఈ అరువు నాగరికత'ను మార్చటం ఉపాధ్యా యుల వల్లే సాధ్యమవుతుంది. "To Market To Market to buy a fat Pig" - అన్న దానికంటే 'చేతవెన్నముద్ద చెంగల్వ పూదండ' - వంటి మన వారసత్వ గేయ సంపదను ఏం చేసుకుంటున్నామో ఆలోచిం చాలి. ఇప్పటి ఈ తరమే రేపు మన మంచి చెడ్డల్ని బాగోగుల్ని చూసుకోబోతోంది. అందుకే మనం చేతనైన సత్ప్రయత్నం చెయ్యాలి. కనీసం ఈ ప్రయత్నం కూడా చెయ్యకపోతే రేపటి తరం ఏమవుతుంది? ఇది మన ముందున్న ప్రశ్న.

పిల్లలకు బాల్యంలోనే కొన్ని లలితమైన పద్యాలతో, మన సంస్కృతి గరిమను చెప్పే సాహిత్యాన్ని నేర్పితే అవి ఆజన్మాంతం గుర్తుంటాయి. పద్యం తెలుగువాడి ఆస్తి. అది పేదవాడి సంగీతం. అటువంటి పద్యాన్ని హృద్యంగా బోధించే నైపుణ్యం ఉపాధ్యాయుడికి కావాలి. ప్రపంచంలో పద్యాన్ని నిలబెట్టుకొని, నేటికీ బతికుంచు కున్న జాతి తెలుగుజాతే. ఇలాగే గద్య బోధనలో మంచి సామర్థ్యంతో పిల్లల చేత కథలు చెప్పించి, స్ఫుటంగా మాట్లాడించి, వాళ్ల మీద ఉపాధ్యాయుడు ముద్ర వేయగ లిగితే ఎన్ని సాంస్కృతిక వ్యతిరేక పరిణామాలు వచ్చినా ఏమీ చేయలేవు.

'చీకటిని తిడుతూ కూర్చోవటం కంటే చిరుదివ్వెను వెలిగించటం మంచిది.' ■

ఆచార్యులు, తెలుగు
అనువాద అధ్యయనశాఖ
ద్రావిడ విశ్వవిద్యాలయం,
కుప్పం. చిత్తూరు జిల్లా.
94413 30511

రాష్ట్రపతిగా కలాం ఉన్న కాలంలో ఒక సారి ఆయన్ను కొందరు పిల్లలు కలిశారు. ముచ్చట్లలో 'మీకు మార్గదర్శకులు ఎవరండీ'? – అని వాళ్లు అడిగారట.

దానికి ఆయన 'తల్లి – తండ్రి – ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు' – అని చెప్పారు.

రచయితలు, భాషాభిమానులకు విన్నపం...

'ఈనాడు, ఈటీవీ'లకు తోడు భాషా సముద్ధరణకు కృషి చేసే ప్రత్యేక పత్రిక అవసరమన్న ఉద్దేశంతో 'తెలుగు వెలుగు' ప్రారంభమైంది. ఇతర రాష్ట్రీయులు మాతృభాషలపై చూపుతున్న అభిమానంతో పోటీపడి తెలుగుకు పట్టం కట్టేలా చేయడం దీని ధ్యేయం. తెలుగు భాషోద్యమంతో తప్ప మరే వాదాలతో దీనికి నిమిత్తం లేదు. తెలుగు వారికి భాష, సంస్కృతుల మీద అభిరుచిని పెంపొందించడం ప్రధానోద్దేశం. రాష్ట్రేతర తెలుగు వారి మనోభావాలు, ఆకాంక్షలు, కృషికీ సముచిత స్థానం ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు వేడుకకు వేదిక ఇది... ఈ పత్రికకు తెలుగు మీద మక్కువ పెంచే రచనలను ఆహ్వానిస్తున్నాం. కథ, కవిత, పద్యం, వ్యాసం, గల్పిక... ప్రక్రియ ఏదైనా చక్కని తెలుగులో ఉండాలి. కొత్త ప్రక్రియలనూ సృజించవచ్చు.

రచనల ఎంపికకు ప్రమాణాలు

- విషయం, శైలి, భావవ్యక్తీకరణల్లో ఏదోకటి కొత్తగా ఉండాలి.
- రచనలు సూటిగా, క్లుప్తంగా, చిన్న వాక్యాలతో ఉండాలి.
- శిష్ట వ్యావహారికంలోనే రాయాలి. గ్రాంధికం కూడదు.
- జటిల సంస్కృత పదాడంబరం వద్దు.
- అత్యవసరమైతే తప్ప ఆంగ్ల పద వినియోగం కూడదు.
- మాండలికాల్లోనూ రాయవచ్చు. క్లిష్ట పదాలకు అర్థాలను ఇవ్వాలి.
- రచనకు ఉపకరించే ఛాయాచిత్రాలనూ రచయిత పంపవచ్చు.
- పరిశోధనలు, చరిత్రకన్నా వర్తమానానికే ప్రాధాన్యం.
- ఉట్టంకింపులు, గణాంకాలు, చారిత్రక ఆధారాలను పేర్కొనడం తప్పనిసరి.
- ప్రాంతాలు, వ్యక్తులు, సంస్కృతులు, సంప్రదాయాలను, భావాలను, భాషను కించపరిచే వాటికి స్థానం లేదు.
- ప్రతి రచనకూ హామీ పత్రాన్ని జత చేయాలి. ఈ రచన ఇతర పత్రికలు, పుస్తకాలు, బ్లాగులు, వెబ్‌సైట్లలో, మరే ఇతర రూపంలో కానీ ప్రచురితం కాలేదని, పరిశీలనలో లేదనీ అందులో పేర్కొనాలి.
- రచయిత పూర్తి వివరాలు, రంగుల చిత్రాన్ని జోడించాలి.

రచన 1250 పదాలకు మించకూడదు. ఎంపికైన వాటికి పారితోషికం ఉంటుంది. ప్రచురణ నిర్ణయం, అవసరమైన మార్పులు చేసే అధికారం సంపాదకవర్గానివే. రచనలను ఈమెయిల్ ద్వారా పంపవచ్చు. ఎంపిక కానివి తిప్పిపంపడం సాధ్యం కాదు. ప్రతిభను ప్రోత్సహించాలని మా ప్రయత్నం. రచనతో పాటు మీకు ఆసక్తి, నైపుణ్యం ఉండి రాయగలిగిన అంశాలనూ విడిగా తెలియజేయవచ్చు. ఆ అంశంపై కథనం అవసరమైనప్పుడు మిమ్మల్ని సంప్రదిస్తాం.

– తెలుగు వెలుగు సంపాదకవర్గం

పుస్తక రచయితలకు...

తెలుగు భాషోద్యమంలో భాగంగా తేటతెలుగులో వివిధ అంశాలపై పుస్తకాలూ ప్రచురించనున్నాం. ఆసక్తి ఉన్న రచయితలు రచనలను పంపవచ్చు. లేదా ప్రతిపాదనలనూ తెలియజేయవచ్చు. పుస్తకాలైతే రెండు డీటీపీ ప్రతులను పంపాలి. ప్రతిపాదనైతే అంశానికి సంబంధించిన పూర్తి వివరాలు, దానిపై జరిపిన పరిశోధన లేదా కృషి, ఆ అంశంపై పుస్తక ప్రచురణ ఆవశ్యకతలను సమగ్రంగా వివరిస్తూ లేఖ పంపాలి.

భాషాభిమానులకు

ఈ పత్రిక మనందరిదీ. తెలుగువెలుగు ఆదర్శంలో మీరూ పాలుపంచుకోవచ్చు. భాషా సేవా మార్గంలో ఏయే వినూత్న అంశాలను స్పృశిస్తే బాగుంటుందో మీరూ సూచించవచ్చు. భాషకు తమవంతు సేవ చేసి అజ్ఞాతంగా మిగిలిపోయిన ప్రతిభామూర్తుల గురించి సమాచారాన్ని మాకందించండి. వీలు వెంబడి వాటికి కథన రూపం ఇస్తాం.

గురు బ్రహ్మలకు...

తెలుగు పట్ల భావితరాలకు మక్కువ కలిగించడంలో గురువులదే ప్రధాన పాత్ర. ఈ దిశగా రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో ఎన్నో ప్రయోగాలు జరుగుతున్నాయి. మీరు ఏ పాఠ్యాంశాన్ని బోధించే ఉపాధ్యాయులైనా ఫర్వాలేదు. పిల్లలకు దాన్ని తెలుగులో సులభగ్రాహ్యంగా బోధించడంలో అమలు చేస్తున్న సృజనాత్మక పద్ధతులు, వాటి ఫలితాల్ని మాకు తెలియజేయండి. 'తెలుగు వెలుగు' వేదికగా ఆ స్ఫూర్తిని దశదిశలా పంచుదాం.

ఇది తెలుగుయజ్ఞం. ఇందులో పాలుపంచుకోవాలని మేధావులు, సాహితీవేత్తలు, భాషాభిమానులందరికీ ఇదే మా ఆహ్వానం.

మా చిరునామా: తెలుగు వెలుగు, రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్, 501 512
ఫోన్: +91 8415 246999; మెయిల్: teluguvelugu@eenadu.net

www.kalanjali.com

RAMOJI
GROUP

ఫర్నీచర్‌కి సెలవు...
మీ గృహం కళాకృతుల కొలువు...

అద్భుతమైన హస్తకళా నైపుణ్యానికి అపురూపమైన తార్కాణాలు - కళాంజలిలో కొలువు దీరిన ఈ కళాకృతుల సముదాయాలు! చందనం, పాలరాయి, రంగురాళ్ళు, కంచు, ఇంకా వెండితో రూపొందిన కళాత్మక వస్తు శ్రేణి కేవలం కళాంజలిలో మాత్రమే మీకు లభిస్తుంది. కళాంజలి- భారతీయ సంప్రదాయాలకు సంకేతం... కళాత్మక నైపుణ్యానికి నిలువెత్తు సంతకం...

R K SWAMY BBDO 0628

365 రోజులూ తెరిచే ఉంటుంది

*షరతులు వర్తిస్తాయి

- కొయ్య వగిష్టలు
- రాతి వగిష్టలు
- పాలరాతి కళాకృతులు
- చందన కళాకృతులు
- వర్ణచిత్రాలు
- నగలు
- తోలు వస్తువులు
- ఆట బొమ్మలు
- డైనింగ్ టేబుళ్ళు
- ఊయలలు
- మందిరాలు
- దివాన్లు... ఇంకా ఎన్నో... ఎన్నెన్నో...

KALANJALI®
Arts ✤ Crafts
India you'll treasure!!

- 25 కి.మీ. వరకు ఉచిత డెలివరీ*
- రోజ్‌వుడ్ డైనింగ్ టేబుల్స్‌కు 1 ఉచిత సర్వీస్*
- మీ ఫర్నిచర్‌ను డిజైన్ చేసుకోండి... అదనపు డిస్కౌంట్ పొందండి*
- ఫర్నిచర్ శ్రేణి ₹30,000 నుంచి ఆరంభం*

- హైదరాబాదు: సైఫాబాద్: డోర్ నం.5-10-194/195, హిల్ ఫోర్ట్ రోడ్, పబ్లిక్ గార్డెన్ ఎదురుగా, ఫోన్: 040 23231147 / 23423440,
కూకట్‌పల్లి: నం.487 & 488, హెచ్.ఐ.జి., జె.ఎన్.టి.యు. రోడ్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్, ఫోన్: 040 23056813 / 14
- విజయవాడ: డోర్ నం.39-3-51, ఎమ్.జి. రోడ్, లబ్బీపేట్, ఫోన్: 0866 2496464

వివాహం స్వర్గంలో నిశ్చయమవుతుంది
వేడుక భూతలస్వర్గంలో జరుపుకోండి

RAMOJI
F·I·L·M C·I·T·Y

రామోజీ ఫిల్మ్ సిటీ

కళ్లు చాలని కలల రూపం రామోజీ ఫిల్మ్ సిటీ. నలువైపులా పచ్చదనం, కమనీయ ఉద్యానవనాలు, నేత్ర పర్వమైన సుందర కట్టడాలతో ప్రపంచంలోనే పెద్దదైన ఫిల్మ్‌సిటీ ఇపుడు మీ పెళ్లి వేడుకకు విడిది కానుంది. ఇక్కడి పెళ్లి స్వర్గ వైభవాన్ని సమకూర్చుకుంటుంది. మీకే కాదు, హాజరైన ప్రతి వారికీ జీవితాంతం గుర్తుండిపోతుంది.

సంప్రదాయ ఆతిథ్యం

మీ ఆత్మీయులు మాకూ ప్రత్యేక అతిథులే. వైభవోపేతమైన ఇక్కడి హోటళ్లలో మీ అతిథుల దర్జా ఇనుమడిస్తుంది. వారికి ప్రతి క్షణం సౌకర్యంగా గడుస్తుంది. ఎవరి సంప్రదాయాలు, కట్టుబాట్లకు తగిన ఆతిథ్యం వారికి లభిస్తుంది. ప్రతి క్రతువూ మీరు కలగన్నట్టే నిజమవుతుంది.

నిశ్చితార్థం నుంచి హనీమూన్ దాకా...

మీ కలల పెళ్లి వేదిక రామోజీ ఫిల్మ్‌సిటీ

సంప్రదాయమూ వైభవమూ సమపాళ్లలో...

- ముందస్తు అలంకరణ థీమ్స్
- రకరకాల మనోల్లాస వేడుకలు
- కళ్లు చెదిరే ప్రదర్శనలు
- బాచిలర్స్ పార్టీ
- పుష్పాలంకరణలు
- తార, సితార హోటళ్లలో విడిది

మీ పెళ్లి కలల్ని నిజం చేసుకోవటానికి కాల్ చేయండి:

93913 95888

లేదా ఈమెయిల్ చేయండి: marketing@ramojifilmcity.com

www.ramojifilmcity.com